


'ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి శాశ్వత వనరులతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలన్నదే నా స్వప్నం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

ఉద్యోగాలపై ఫోకస్!

2 లక్షల పోస్టుల భర్తీకి సర్కారు కసరత్తు

- అసెంబ్లీ ఉభయ సభల సంయుక్త సమావేశంలో గవర్నర్ తమిళిసై
- హామీలకు కట్టుబడి ఉన్నాం.. త్వరలోనే మరో రెండు గ్యారంటీల అమలు
- అభివృద్ధిని వికేంద్రీకరించేందుకు చర్యలు
- నూతన సంస్కరణలను ప్రవేశపెడతాం
- సార్వజనీన, సమగ్ర డిజిటల్ అక్షరాస్యత కార్యక్రమాన్ని చేపడతాం
- ఇంటింటికీ ఇంటర్నెట్ అందిస్తాం
- 50–100 ఎకరాల్లో కృత్రిమమేధ (ఏఐ) సిటీ ఏర్పాటు చేస్తాం
- వివిధ వర్గాల పరిస్థితులను అంచనా వేయడానికి కులగణన చేస్తాం
- ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తమైంది.. చక్కదిద్దే ప్రయత్నం చేస్తున్నామన్న గవర్నర్
- ఉజ్వల తెలంగాణ దిశగా ప్రయాణం కొనసాగిద్దామంటూ ప్రసంగం ముగింపు



గురువారం అసెంబ్లీలో ప్రసంగిస్తున్న గవర్నర్ తమిళిసై. చిత్రంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో యువతకు 2 లక్షల ఉద్యోగాలు కల్పించడంపై ప్రభుత్వం దృష్టిసారించిందని, దానిపై కసరత్తు మొదలుపెట్టిందని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తెలిపారు. ఆరు గ్యారంటీల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని.. అందులో రెండింటిని ఇప్పటికే అమలు చేశామని, మరో రెండింటి అమలుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని వెల్లడించారు. ఇంటర్నెట్‌ను ఒక ప్రాథమిక హక్కుగా ప్రవేశపెట్టడం ప్రభుత్వ ప్రాధాన్యతల్లో ఒకటని, అన్నివర్గాలకు కనీస ధరకే ఇంటర్నెట్ అందుబాటులోకి తేవడంపై దృష్టి సారిస్తామని చెప్పారు. త్వరలోనే కులగణన చేపడతామన్నారు. రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా శాసనసభ,

మిగతా IIవ పేజీలో ▶

రేపే ఓటాన్ అకౌంట్ బడ్జెట్

- నేడు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానం
- 11న విరామం.. 12న అసెంబ్లీ ఉభయసభల్లో బడ్జెట్‌పై చర్చ
- 13న బిల్లుకు ఆమోదం.. తర్వాత నిరవధిక వాయిదా
- శాసనసభ, మండలి బీఏసీ భేటీలలో తేదీలు ఖరారు - 2లో

దొరికారు దొంగలు..

ఏ–1 చంద్రబాబు, ఏ–2 నారాయణ
ఏ–3 లింగమనేని, ఏ–14 లోకేశ్

- ఇన్నర్ రింగ్‌రోడ్డు కుంభకోణం కేసులో ఏపీ సీఐడీ దూకుడు
- ఏసీబీ న్యాయస్థానంలో చార్జిషీట్ దాఖలు

- వివరాలు 10లో

హస్తం గూటికి పట్నం దంపతులు!

- సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మహేందర్‌రెడ్డి, సునీతారెడ్డి
- చేవెళ్ల ఎంపీ టికెట్ హామీతోనే పార్టీ మారుతున్నట్లు ప్రచారం

2 లో

కేసీఆర్‌కు ఈ చాంబర్ ఏంటి?

- ప్రతిపక్ష నేతకు ఇరుకైన చాంబర్ కేటాయింపుపై రగడ - 2లో

ఉద్యోగాలపై ఫోకస్!

▶ మొదటి పేజీ తరువాయి

మండలి ఉభయ సభల సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించారు. వివరాలు ఆమె మాటల్లోనే..

''తెలంగాణ ప్రజలు నిజమైన స్వాతంత్య్రం, ప్రజాస్వామ్య పరిపాలన కోరుకున్నారు. ఎన్నికల్లో ప్రజాభిప్రాయం స్పష్టంగా ప్రతిధ్వనించింది. వారి తీర్పు పౌరహక్కులకు, ప్రజాస్వామిక పరిపాలనకు నిదర్శనం. తెలంగాణలో ఇప్పుడు ప్రజాపాలన నడుస్తోంది. ప్రజలకు సేవకులుగా ఉంటామన్న సీఎం రేవంత్‌రెడ్డిని అభినందిస్తున్నాను. నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్ష, యువత బలిదానాలు, విద్యార్థుల అలుపెరగని పోరాటాల నుంచి తెలంగాణ ఏర్పడింది. రాష్ట్ర ఏర్పాటులో కీలకపాత్ర పోషించిన అందరికీ కృతజ్ఞతలు. ప్రత్యేకించి అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్, కీలకపాత్ర పోషించిన సోనియాగాంధీకి ఈ ప్రభుత్వం రుణపడి ఉంటుంది.



అసెంబ్లీలోకి గవర్నర్‌ను తోడ్కొని వస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు

గ్యారంటీలన్నీ అమలు చేస్తాం

తెలంగాణ ప్రజలు గత ప్రభుత్వానికి ధనిక రాష్ట్రాన్ని అప్పగిస్తే.. పదేళ్లలో అప్పుల రాష్ట్రంగా మార్చింది. ప్రజలపై భారం మోపకుండా రాష్ట్ర ఆర్థిక స్థితిగతులను మెరుగుపర్చడమే ప్రస్తుత ప్రభుత్వం ముందున్న తక్షణ సవాలు. ఉచిత బస్సు ప్రయాణ సదుపాయంతో 15 కోట్ల మంది మహిళలు ప్రయాణించారు. ప్రజాపాలనలో వివిధ వర్గాల ప్రజల నుంచి 1.28 కోట్లకుపైగా దరఖాస్తులు అందాయి. నిర్దిష్ట సమయంలోపు ఆరు గ్యారంటీలను అమలుచేస్తాం. త్వరలోనే మరో రెండు గ్యారంటీలను అమలుచేస్తాం. మహాలక్ష్మి పథకం కింద అర్హత ఉన్న కుటుంబాలకు రూ.500కే గ్యాస్ సిలిండర్లను, గృహజ్యోతి పథకం కింద అర్హత గల ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తాం. కొత్తగా ఏర్పాటైన టీఎస్‌పీఎస్సీ పాలక మండలి ద్వారా దాదాపు 2 లక్షల ఉద్యోగాల భర్తీ చేపడతాం. ధరణి కమిటీతో భూసమస్యలను పరిష్కరిస్తాం. టీఎస్‌పీఎస్సీ, ఎన్‌హెచ్‌ఆర్సీ, సమాచార కమిషన్, విశ్వవిద్యాలయాలు తదితర సంస్థలు బాగా పనిచేసేలా స్వేచ్ఛ కల్పిస్తాం. రైతు భరోసా, పంట రుణమాఫీ, పంట మార్పిడి కార్యక్రమాలు, ఉద్యానవన అభివృద్ధి, నాణ్యమైన విత్తనాలు, ఆధునిక వ్యవసాయ పద్ధతులతో రైతాంగ సాధికారత లక్ష్యంగా పెట్టుకున్నాం. రాష్ట్రమంతటా అభివృద్ధిని వికేంద్రీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. గత అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై శ్వేతపత్రం విడుదల చేశాం. గత ప్రభుత్వం ఎంత అసమర్థంగా, నిర్లక్ష్యంగా వనరులను వినియోగించిందో స్పష్టంగా పేర్కొన్నాం.

ఆర్థికాభివృద్ధి కోసం నూతన విధానాలు

రాష్ట్ర ఆర్థికాభివృద్ధి కోసం పరిశ్రమలు, సేవా రంగాల్లో నూతన ఒరవడి తీసుకొస్తాం. నూతన విధానాలను ప్రవేశపెడతాం. మౌలిక సదుపాయాల నిర్వహణకు కొత్త వ్యవస్థలను తీసుకువస్తాం. ప్రాంతీయ అసమానతలను తొలగించేందుకు కృషి చేస్తాం. నూతన ఎంఎస్ఎంఈ విధానాన్ని తీసుకువస్తాం. ప్రత్యేక పారిశ్రామిక పార్కులు, అనుకూలమైన వ్యవస్థలను ఏర్పాటు చేస్తాం. ఐటీ, ఫార్మా వంటి ప్రధాన రంగాలకు సహకారం కొనసాగుతుంది. జనావాసాలకు దూరంగా.. ఒక్కోటీ వెయ్యి నుంచి 3వేల ఎకరాల విస్తీర్ణంలో 10–12 ఫార్మా విలేజ్ క్లస్టర్లను ఏర్పాటు చేస్తాం. వ్యర్థాల శుద్ధి, టెస్టింగ్ ల్యాబ్‌లు, లాజిస్టిక్స్, గృహ నిర్మాణం, విద్య, ఆరోగ్య సంరక్షణకు కావలసిన మౌలిక సదుపాయాలను కల్పిస్తాం. దావోస్ వరల్డ్ ఎకానమిక్ ఫోరం సదస్సులో అంతర్జాతీయ కంపెనీలకు చెందిన 50మంది పారిశ్రామికవేత్తలతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. తెలంగాణలో రూ.40,000 కోట్లకుపైగా పెట్టుబడులు పెట్టడానికి వారు సంసిద్ధత వ్యక్తం చేశారు. పునరుత్పాదక ఇంధనం, జీవశాస్త్ర రంగాలు, తయారీ, డేటా సెంటర్లు, ఆహార ప్రాసెసింగ్, ఐటీ వంటి రంగాలలో ఎంఓయూలను కుదుర్చుకోవడం గొప్ప విషయం.

మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి చేస్తాం

రాష్ట్రంలో అన్నిరకాల హరిత ఇంధనాలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం ఒక సమగ్ర 'ఇంధన పాలసీ'తో ముందుకు రానుంది. 205 చారిత్రక కట్టడాలను, పరిసరాలను అద్భుతంగా తీర్చిదిద్దుతాం. రిజర్వాయర్లను పర్యావరణ అనుకూల పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తాం. మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి పనులు చేపడతాం. హైదరాబాద్ నగర తూర్పు, పశ్చిమ భాగాలను అనుసంధానించే రవాణా నెట్‌వర్క్, స్వచ్ఛమైన నీరు ఉండేలా చూడటం, రివర్ ఫ్రంట్ సుందరీకరణ వంటి వాటిని ఈ ప్రాజెక్టులో భాగంగా చేపడతాం. పీపుల్స్ ప్లాజా, పాదచారుల జోన్లు, హాకర్ ప్రాంతాలు, పచ్చని ప్రదేశాలు కూడా ఏర్పాటవుతాయి' అని గవర్నర్ చెప్పారు.

కాళోజీ కవితతో ప్రసంగం ప్రారంభం

అసెంబ్లీని ఉద్దేశించి ప్రసంగించేందుకు గురువారం ఉదయం 11.25కు గవర్నర్ అసెంబ్లీకి చేరుకున్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. జాతీయ గీతాలాపన అనంతరం.. ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు రాసిన కవితను ప్రస్తావిస్తూ గవర్నర్ ప్రసంగాన్ని ప్రారంభించారు. ''అధికారముందని హద్దుపద్దు లేక.. అన్యాయ మార్గాల నార్జింప బూనిన.. అచ్చి వచ్చే రోజులంతమైనాయి.. అచ్చి వచ్చే రోజులంతమైనాయి'' అని పేర్కొన్నారు. సుమారు 25 నిమిషాలపాటు ప్రసంగం కొనసాగింది.

కులగణన చేపడతాం..

''రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల సామాజిక, విద్య, ఆర్థిక, ఉద్యోగ, రాజకీయ అవకాశాలను అంచనా వేయడానికి ప్రభుత్వం కులగణన చేపడుతుంది. సంక్షేమ, అభివృద్ధి కార్యకలాపాలలో భాగంగా రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, పేదలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, రిటైర్డ్ ఉద్యోగులు, అమరవీరుల కుటుంబాలు, ఇతరుల అవసరాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుంది. తెలంగాణలో ప్రాథమిక హక్కులను పరిరక్షిస్తాం. బడ్జెట్ కేవలం ఒక ఆర్థిక పత్రం మాత్రమే కాదు. మనం కోరుకున్న ఉమ్మడి భవిష్యత్తుకి ఒక నమూనా. ప్రముఖ తమిళ కవి సుబ్రమణ్య భారతి చెప్పినట్టుగా 'విత్త వివేక కాంతి పుంజం అవసరం'. ప్రభుత్వం అలాంటి వివేకాన్ని కనబరుస్తుంది. మాటల కంటే చేతలు ముఖ్యం. సంస్కరణలను అమలు చేస్తాం. అభివృద్ధి, సంపద సృష్టిలో తెలంగాణ నూతన శిఖరాలకు చేరుతుందని విశ్వసిస్తున్నాను. ఉజ్వల తెలంగాణ దిశగా మన ప్రయాణం కొనసాగిద్దాం'' అని గవర్నర్ పేర్కొన్నారు. చివరగా జైభారత్ అంటూ ముగించారు.

ఇంటర్నెట్ ప్రాథమిక హక్కు..

'రాష్ట్రంలో ఇంటర్నెట్‌ను ఒక ప్రాథమిక హక్కుగా ప్రవేశపెట్టడం ఈ ప్రభుత్వ కార్యక్రమాలలో ఒకటి. అన్ని వర్గాలకు కనీస ధరలకే ఇంటర్నెట్ అందుబాటులోకి తేవడంపై దృష్టి సారిస్తాం. సార్వజనీన, సమగ్ర డిజిటల్ అక్షరాస్యత కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తుంది. కృత్రిమ మేధ (ఏఐ)ను విస్తృతంగా వాడాలనే దృఢ నిశ్చయంతో ఉన్నాం. దీనికి సంబంధించి అంతర్జాతీయ సంస్థలను రాష్ట్రానికి ఆహ్వానిస్తాం. హైదరాబాద్, తెలంగాణలను దేశంలో కృత్రిమమేధకు ప్రధాన కేంద్రంగా రూపొందిస్తాం. 50–100 ఎకరాల్లో ఏఐ సిటీని ఏర్పాటు చేస్తాం. రాష్ట్రంలో నైపుణ్య విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పుతాం'.

పార్టీ కండువాలతో.. కుశల ప్రశ్నలతో..

అసెంబ్లీకి అధికార, ప్రతిపక్ష సభ్యులు వారి పార్టీల కండువాలు ధరించి వచ్చారు. చాలా మంది ఒకరినొకరు కుశల ప్రశ్నలతో పలకరించుకున్నారు. గవర్నర్ ప్రసంగం సమయంలో ప్రతిపక్షాలు నిరసన తెలపవచ్చని భావించిన ప్రభుత్వం.. అసెంబ్లీ లోపల పెద్ద సంఖ్యలో మార్షల్స్‌ను సిద్ధంగా ఉంచింది. గవర్నర్ మాట్లాడుతుండగా.. పలు సందర్భాల్లో బీఆర్ఎస్ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. గవర్నర్ పలు అంశాలను ప్రస్తావించినప్పుడు అధికార సభ్యులు బల్లలు చరిచారు. మొత్తంగా ప్రసంగం ప్రశాంతంగా ముగిసింది.



ఆమె ఓటే శాసనం!

రాష్ట్రంలో పురుషులకన్నా మహిళా ఓటర్లే అధికం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మహిళల నిర్ణయమే ఇకపై కీలకం కానుంది. చట్టసభల్లో గెలుపోటములు ఇక వారి అభీష్టం మేరకు నిర్ణయించబడనున్నాయి. ఎందుకంటే రాష్ట్రంలోని ఓటర్లలో మహిళలే మెజార్టీగా నిలిచారు. తాజాగా కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక ఓటరు సవరణ జాబితాను రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి (చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్) విడుదల చేశారు. రాష్ట్రంలో మొత్తం 3,30,37,113 ఓటర్లు ఉన్నారు. వీరిలో మహిళలు 1,65,87,244 మంది, పురుషులు 1,64,47,132, థర్డ్ జండర్ 2,737 మంది ఉన్నారు. రాష్ట్రంలో సర్వీసు ఓటర్లు 15,378, ఎన్నారైలు 3,399 మంది ఉన్నట్లు సీఈఓ తెలిపారు. రాష్ట్రంలో మహిళా ఓటర్లు పురుషుల కంటే 1,40,112 మంది ఎక్కువ. ఓటర్ల తుది జాబితా ప్రకటనలో భాగంగా ఈ ఏడాది జనవరి 22వ తేదీ నాటికి వచ్చిన ఓటరు నమోదు, సవరణ దరఖాస్తులను అధికారులు పరిశీలించారు. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఉన్న ఓటర్ల కంటే ప్రస్తుతం 7,19,104 ఓటర్లు పెరిగారు. రాష్ట్రంలో 80 సంవత్సరాలు పైబడిన ఓటర్లు 4,54,230 మంది, దివ్యాంగులు 5,28,405 మంది ఉన్నారు. ప్రస్తుతం ఓటరు తుది జాబితా ప్రచురించబడినప్పటికీ, 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని సీఈఓ వికాస్‌రాజ్ సూచించారు.

స్టేటస్ కో పొడిగింపు

గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకంపై తీర్పు వచ్చే వరకు యథాతథ స్థితి

- హైకోర్టు సీజే ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు
- రాజకీయ నేతలంటూ నాడు తిరస్కరించి.. ఇప్పుడెలా అంగీకరిస్తారని ప్రశ్నించిన పిటిషనర్ల తరపు లాయర్లు
- గవర్నర్‌కు విచక్షణాధికారాలు ఉంటాయి:గవర్నర్ న్యాయవాది
- విచారణ నేటికి వాయిదా



సాక్షి, హైదరాబాద్: గవర్నర్ కోటా కింద కొత్తగా నియమితులైన ప్రొఫెసర్ కోదండరాం, జర్నలిస్ట్ అమేర్ అలీ ఖాన్‌లను ప్రతివాదుల జాబితాలో చేర్చాలంటూ దాఖలైన మధ్యంతర అప్లికేషన్ (ఐఏ)ను అనుమతించిన హైకోర్టు ధర్మాసనం.. వీరి నియామకంపై ఇచ్చిన స్టేటస్‌కో (యథాతథ స్థితి)ను వాదనలు ముగిసి, తుది ఉత్తర్వులు ఇచ్చే వరకు పొడిగించింది. గురువారం ఉభయ పక్షాల వాదనలు విన్న న్యాయస్థానం తదుపరి వాదనల కోసం విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. గవర్నర్ కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులుగా బీఆర్ఎస్ నాయకులు దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ పేర్లను సిఫారసు చేస్తూ గత ప్రభుత్వం గవర్నర్‌కు ప్రతిపాదనలు పంపింది. ఈ సిఫారసులను తిరస్కరిస్తూ 2023 సెప్టెంబర్ 19న గవర్నర్ ఉత్తర్వులిచ్చారు. గవర్నర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ శ్రవణ్, సత్యనారాయణ హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటితో కూడిన హైకోర్టు ధర్మాసనం గురువారం మరోసారి విచారణ చేపట్టింది.

గవర్నర్ ఆర్టికల్ 171(5) పరిధిని మించి వ్యవహరించారు

శ్రవణ్ తరపు న్యాయవాది ఆదిత్య సోంధీ వాదనలు వినిపిస్తూ.. 'గత బీఆర్ఎస్ ప్రభుత్వం బీఆర్ఎస్‌కు అనుబంధంగా ఉన్న శ్రవణ్‌కుమార్‌ను సిఫారసు చేస్తే తిరస్కరించినప్పుడు.. మరో పార్టీకి అధ్యక్షుడిగా ఉండి, రాజకీయ అనుబంధాలున్న ప్రొఫెసర్ కోదండరాంను, అలాగే అమేర్ అలీఖాన్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం సిఫారసు చేస్తే గవర్నర్ ఎలా అంగీకరిస్తారు? శ్రవణ్‌కుమార్‌ను తిరస్కరించినప్పుడు.. వీరిని కూడా తిరస్కరించాలి. గత ప్రభుత్వం, నాటి సీఎంతో గవర్నర్‌కు ఉన్న విచిత్రమైన సంబంధాల నేపథ్యంలో ఆ ప్రభుత్వ సిఫారసుల ను ఆమోదించడానికి గవర్న ర్ నిరాకరించారు. ఈ మేరకు గవర్నర్ స్పీకింగ్ ఆర్డర్ జారీ చేయడం సరికాదు. గత జూలైలో ప్రభుత్వం సిఫార్సు చేస్తే.. సెప్టెంబర్‌లో వాటిని తిరస్కరిస్తూ ఉత్తర్వులిచ్చారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆదేశాలిచ్చి.. తర్వాత వచ్చిన ప్రభుత్వం సిఫారసు చేసిన వారిని వెంటనే ఆమోదించారు. పిటిషనర్లను ఎమ్మెల్సీలుగా తిరస్కరించడం ద్వారా గవర్నర్ ఆర్టికల్ 171(5) పరిధిని మించి వ్యవహరించారు..'అని పేర్కొన్నారు. అనంతరం సత్యనారాయణ తరపు న్యాయవాది మయూర్‌రెడ్డి కూడా వాదనలు వినిపించారు. ప్రభుత్వం చేసిన సిఫారసులే కనుక వాటిని రద్దు చేసే అధికారం ఇప్పుడున్న సర్కార్‌కు ఉంటుందని అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదనల్లో పేర్కొన్నారు.

కోర్టులు విచారించలేవు..

గవర్నర్ కార్యదర్శి తరపు సీనియర్ న్యాయవాది ఎస్.అశోక్ ఆనంద్‌కుమార్ వాదిస్తూ 'గవర్నర్ నిర్ణయాలను కోర్టులు విచారించలేవు. గవర్నర్ విచక్షణాధికారాలకు రాజ్యాంగం రక్షణ కల్పిస్తుంది. ఈ విచక్షణాధికారాలు రెండు రకాలుగా ఉంటాయి. ఒకటి కేబినెట్ సలహా మేరకు ఉండేవి కాగా.. మరొకటి సొంతది. ప్రజాప్రతినిధుల కోటా కింద ఎమ్మెల్సీగా ఎన్నుకునే అవకాశం ఎమ్మెల్యేలకు ఎలా ఉంటుందో.. గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలను నియమించే విచక్షణాధికారాలు గవర్నర్‌కు ఉన్నాయి..'అని పేర్కొన్నారు. తదుపరి విచారణను ధర్మాసనం నేటికి వాయిదా వేసింది.

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 319
శుక్రవారం 9-2-2024
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్య్రానికి అర్థం లేదు'


రాష్ట్రాలపై కేంద్రం పెత్తనం
ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్న కేరళ సీఎం.. ఢిల్లీలో ధర్నా -6లో


ఆరవ 'సారీ'.. తగ్గించేదే లే..!
6.5 శాతంగా రెపోరేటు కొనసాగింపు.. ఆర్‌బీఐ నిర్ణయం -13లో

ప్రేమించట్లేదని.. గొడ్డలితో నరికి..


అలేఖ్య

- నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లో ప్రేమోన్మాది ఘాతుకం!
- ప్రేమ పేరిట వేధింపులు.. తిరస్కరించడంతో ఆమె పెళ్లిని సైతం చెడగొట్టిన వైనం
- తనకు దక్కని యువతి మరెవరికీ దక్కకూడదంటూ గొడ్డలితో నరికి చంపి పరారీ
- అడ్డువచ్చిన మరో మహిళ, మూడేళ్ల బాలుడిపైనా దాడి -5లో

గురుకులంలో కొట్లాట.. విద్యార్థి మృతి

- నిర్మల్ జిల్లా చించోలి (బి) మైనార్టీ గురుకులంలో ఘటన
- కుటుంబసభ్యుల ఆందోళనతో ఉద్రిక్తత -14లో

ప్రొసీజర్ ప్రకారమే...

కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో సరైన దిశలోనే ముందుకు వెళ్తున్నాం

అసెంబ్లీలో మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

- 'కాళేశ్వరం' విచారణకు సిట్టింగ్ జడ్జిని ఇవ్వలేమని సీజే చెప్పారు
- మాజీ న్యాయమూర్తితో విచారణ చేయించుకోవాలని సూచించారు.. దీనిపై కేబినెట్‌లో లేదా అసెంబ్లీలో చర్చించి నిర్ణయం
- మేడిగడ్డపై చర్చను పక్కదారి పట్టించేందుకు కృష్ణాబోర్డు వివాదం
- కేసీఆర్ ఎక్స్‌పైరీ డేట్ పూర్తైన మెడిసిన్.. అధికారం పోవడాన్ని తట్టుకోలేకపోతున్నారు
- ఆయన సభకు రావాలి.. ప్రతిపక్ష నేతగా బాధ్యత నిర్వహించాలి
- అసెంబ్లీలో బీఆర్ఎస్ కార్యాలయం మార్పు నిర్ణయం స్పీకర్‌దే



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణకు సిట్టింగ్ జడ్జిని కేటాయించలేమని హైకోర్టు పేర్కొందని, రిటైర్డ్ న్యాయమూర్తితో విచారణ జరిపించుకోవాలని సూచించిందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి చెప్పారు. దీనిపై మంత్రివర్గంలోగానీ, అసెంబ్లీలోగానీ చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అసెంబ్లీ సమావేశాల్లోనే కులగణనపై తీర్మానం ఉంటుందన్నారు. గురువారం అసెంబ్లీలో గవర్నర్ తమిళిసై ప్రసంగం అనంతరం రేవంత్ తన చాంబర్‌లో మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ''కాళేశ్వరం విషయంలో సరైన దిశలోనే ముందుకు వెళ్తున్నాం. దేనికైనా ఓ ప్రొసీజర్ ఉంటుంది. ఈ ప్రాజెక్టుపై ప్రభుత్వం ఒక ప్రొసీజర్ ప్రకారం పనిచేస్తోంది. పాకిస్తాన్ ఉగ్రవాది కసబ్‌కు ఉరి అమలు కూడా ఓ ప్రొసీజర్ ప్రకారమే జరిగింది. మిషన్ భగీరథలో అక్రమాలపైనా విచారణకు ఆదేశించాం. టీఎస్‌పీఎస్సీ విషయంలోనూ
మిగతా 2వ పేజీలో ▶

'ఇది కర్తవ్య కాలం'

- మోదీ ప్రభుత్వ ఆర్థిక విజయాలపై పార్లమెంట్‌లో శ్వేతపత్రం
- యూపీఏ వదిలిన సవాళ్లను విజయవంతంగా అధిగమించామని వెల్లడి
- 2047కి 'అభివృద్ధి చెందిన భారత్' మన గమ్యం అని స్పష్టీకరణ -6లో

'పదేళ్ల అన్యాయ కాలం'

- నరేంద్ర మోదీ ప్రభుత్వ వైఫల్యాలపై 'బ్లాక్ పేపర్' విడుదల చేసిన కాంగ్రెస్
- సర్కారుపై ఇది చార్జిషీట్ అని పేర్కొన్న మల్లికార్జున ఖర్గే
- దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని ఆందోళన -6లో

కాంగ్రెస్ బ్లాక్ పేపర్ మాకు దిష్టి చుక్క



- ప్రజాస్వామ్యం బలోపేతానికి మన్మోహన్ చక్రాల కుర్చీలో వచ్చారని ప్రధాని మోదీ ప్రశంసలు
- రాజ్యసభలో 68 మంది సభ్యులకు వీడ్కోలు -6లో

హామీలేమయ్యాయి?


మీడియాతో మాట్లాడుతున్న హరీశ్‌రావు. చిత్రంలో ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి

కాంగ్రెస్ సర్కార్‌పై హరీశ్‌రావు ఫైర్

- గవర్నర్ ప్రసంగంలో మేనిఫెస్టోలోని అంశాలేవి?
- రైతుబంధు, రుణమాఫీ ప్రస్తావనేదీ?
- ఇక మిగిలింది 40 రోజులేనని వ్యాఖ్య

సాక్షి, హైదరాబాద్: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చుతారా? లేదా? అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. సీఎం ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని రెండు రోజులు ముందుకు జరపడంలో ఉన్న తొందర, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల మీద లేదని ఎద్దేవా చేశారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఎమ్మెల్యేలు ప్రభాకర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీలు అన్నీ అమలు చేస్తామని ప్రచారం చేసిన కాంగ్రెస్..ఇప్పుడు వాటిని పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర గవర్నర్ ప్రసంగాన్ని విజన్ డాక్యుమెంట్ లాగా చూస్తాం.. కానీ గవర్నర్‌తో అర్ధ సత్యాలు ప్రచారం చేయిస్తున్నారని హరీశ్‌రావు విమర్శించారు. వృద్ధులు, వికలాంగులు, ఆసరా పింఛన్‌దారులు, మహిళలు, వరి పంటకు బోనస్ గురించి మాట్లాడకపోవడం నిరాశ మిగిల్చిందని అన్నారు. గవర్నర్ ప్రసంగం ప్రజలకు ఎలాంటి విశ్వాసం కల్పించలేదని చెప్పారు. పల్లెలు, పట్టణాల అభివృద్ధి గురించి మాట్లాడలేదని, మేనిఫెస్టోలోని అంశాలు, నిరుద్యోగ భృతి గురించి చెప్పలేదని ధ్వజమెత్తారు. పవర్ ప్లాంట్‌లు, మూసీ నది పునరుద్ధరణ ప్రస్తావన లేదని అన్నారు. ఉద్యోగులకు ఒకటో తారీఖున జీతం ఎక్కడ ఇస్తున్నారో చెప్పాలని నిలదీశారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పరిస్థితి దారుణంగా ఉందని పేర్కొన్నారు.

'దావోస్'పై వైట్ పేపర్ విడుదల చేయండి

వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇక మిగిలింది 40 రోజులేనని హరీశ్‌రావు అన్నారు. ఈలోగా పార్లమెంట్ ఎన్నికల కోడ్ వస్తే హామీలు ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు. రూ.2 లక్షల రుణమాఫీ ఎక్కడ అని నిలదీశారు. అధికారంలోకి రాగానే రూ.15 వేల రైతుబంధు ఇస్తామన్న హామీ, వడ్లకు రూ.500 బోనస్ ఏమయ్యాయని ప్రశ్నించారు. రూ.500కు గ్యాస్, 200 యూనిట్ల ఉచిత కరెంటు ఇస్తామని
మిగతా 2వ పేజీలో ▶

నేడు మంత్రివర్గ సమావేశం!

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం మంత్రివర్గ సమావేశం జరగనున్నట్లు సమాచారం. శాసనసభ, మండలిలో శనివారం ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో మంత్రివర్గం సమావేశమై బడ్జెట్‌కు ఆమోదం తెలపనున్నట్లు అధికారవర్గాల సమాచారం. కేంద్రం ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టిన నేపథ్యంలో.. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు సిద్ధమైన విషయం తెలిసిందే. శుక్రవారం గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానం ఆమోదం పొందాక.. మంత్రివర్గ సమావేశం జరుగుతుందని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

లాబీ ముచ్చట్లు

మీలాగే మాకూ ఫ్యామిలీ ఎఫెక్ట్ పడుతోంది

కేటీఆర్‌తో రాజగోపాల్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: శాసనసభ బడ్జెట్ సమావేశాల తొలిరోజు పలు ఆసక్తికర సంఘటనలు చోటు చేసుకున్నాయి. అధికార, విపక్ష ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఎదురుపడిన సందర్భంలో ఒకరిపై ఒకరు చలోక్తులు, వ్యంగ్యోక్తులు విసురుకున్నారు. పార్టీలకు అతీతంగా ఆలింగనాలు, పలకరింపులతో హడావుడి చేశారు.

మీ వల్లే నాకు మంత్రి పదవి రావడం లేదు: కేటీఆర్‌తో రాజగోపాల్‌రెడ్డి

గవర్నర్ ప్రసంగం అనంతరం సభ వాయిదా పడగా.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు పార్టీ శాసనసభా పక్షం కార్యాలయానికి వెళ్లే దారిలో మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఎదురుపడ్డారు. ఈ సందర్భంగా మంత్రి పదవి ఎప్పుడు వస్తుందని రాజగోపాల్‌రెడ్డిని కేటీఆర్ అడిగారు. 'మీలాగే మాకూ ఫ్యామిలీ ఎఫెక్ట్ పడుతోంది. కుటుంబంలో ఎందరికి ఇస్తామని అంటున్నారు'అని రాజగోపాల్‌రెడ్డి సమాధానం ఇచ్చారు. దీనిపై కేటీఆర్ స్పందిస్తూ ఫ్యామిలీ పాలన కాదు.. మంచిగా పని చేస్తే కీర్తి ప్రతిష్టలు వస్తాయని అన్నారు. భువనగిరి ఎంపీగా కుమారుడు సంకీర్త్ పోటీ చేస్తున్నారా లేక కూతురు పోటీ చేస్తున్నారా.. అని కేటీఆర్ ప్రశ్నించారు. ఎవరూ పోటీ చేయడం లేదని రాజగోపాల్ సమాధానం ఇస్తున్న క్రమంలో కేటీఆర్ అక్కడ నుంచి కదిలారు. కాగా తన భార్య లక్ష్మి పోటీ చేస్తే గెలుస్తుందని అయితే పోటీకి ఆమె సిద్ధంగా లేదని, ఇప్పటికే కుటుంబం అంటూ తమపై విమర్శలు వస్తున్నాయని విలేకరుల వద్ద రాజగోపాల్ వ్యాఖ్యానించారు. కేసీఆర్‌ను గద్దె దించేందుకే తాను కాంగ్రెస్‌లోకి వచ్చానని, కేసీఆర్ దగ్గరుండి మరీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను బీజేపీలోకి పంపుతారని అన్నారు. అసెంబ్లీ సమావేశాల తర్వాత కేబినెట్ విస్తరణ ఉంటుందని, కేబినెట్‌లో చోటు కల్పించడంపై తనకు అధిష్టానం హామీ ఇచ్చిందని చెప్పారు. హోంమంత్రి పదవి చేపట్టి బీఆర్ఎస్ నేతలను జైలుకు పంపాలనేది తన కోరిక అని రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యానించారు.



గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాజీ మంత్రి హరీశ్‌రావు మంత్రి కొండా సురేఖతో మాట్లాడుతూ.. ఏంటక్కా మమ్మల్ని గట్టిగా తిడుతున్నావ్ అని సరదాగా అడగ్గా.. మీరు చేసే పనులకు తిట్టొద్దా అంటూ ఆమె నవ్వుతూ బదులిచ్చారు.



పొత్తు మాట వినిపిస్తే ఇలా వచ్చేయడమేనా సార్! మేం మొక్కజొన్న పొత్తుల గురించి మాట్లాడుకుంటున్నాం!

రేపే ఓటాన్ అకౌంట్ బడ్జెట్


గవర్నర్ ప్రసంగంతో ప్రారంభమైన బడ్జెట్ సమావేశాలు
- నేడు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానం
- 11న విరామం.. 12న అసెంబ్లీ ఉభయ సభల్లో బడ్జెట్‌పై చర్చ
- 13న బిల్లుకు ఆమోదం.. తర్వాత నిరవధిక వాయిదా
- శాసనసభ, మండలి బీఏసీ భేటీలలో తేదీలు ఖరారు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను శనివారం (10న) అసెంబ్లీలో ప్రవేశపెట్టనుంది. 11న విరామం ఇచ్చి.. 12న అసెంబ్లీ ఉభయ సభల్లో బడ్జెట్‌పై చర్చించనున్నారు. 13న బడ్జెట్‌ను ఆమోదించి, ఇరు సభలను వాయిదా వేయనున్నారు. ఈ మేరకు శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిల అధ్యక్షతన వేర్వేరుగా సమావేశమైన 'బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ)'సమావేశాల్లో నిర్ణయం తీసుకున్నారు.

గవర్నర్ ప్రసంగం అనంతరం..

తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు గురువారం ఉదయం 11.30కు ప్రారంభమయ్యాయి. శాసనసభ సమావేశ మందిరంలో అసెంబ్లీ, శాసన మండలిల సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ప్రసంగించారు. తర్వాత సభలను వాయిదా వేశారు. శుక్రవారం శాసనసభ, శాసనమండలి వేర్వేరుగా సమావేశమై.. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరిపి, ఆమోదిస్తాయి. శనివారం శాసనసభలో డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క.. శాసనమండలిలో శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు '2024–25 ఓటాన్ అకౌంట్ బడ్జెట్'ను ప్రవేశపెడతారు. 11న ఆదివారం విరామం. 12న అసెంబ్లీ, మండలి వేర్వేరుగా సమావేశమై బడ్జెట్ అంశాలపై చర్చిస్తాయి. 13న ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చించి, ఆమోదిస్తారు. దీనితో అసెంబ్లీ సమావేశాలు ముగియనున్నాయి. ఈ సమావేశాల్లోనే.. కొందరు మంత్రులు తమ శాఖలకు సంబంధించిన తీర్మానా లు, అంశాలు చర్చకుపెడతారని సీఎం రేవంత్‌రెడ్డి బీఏసీ భేటీలో సూచనప్రాయంగా వెల్లడించారు. అయితే ఆయా అంశాలను సభ ముందు పెట్టే అంశంపై మరోమారు బీఏసీ సమావేశం ఏర్పాటు చేయాలని సభ్యులు కోరారు. మరోవైపు గుత్తా సుఖేందర్‌రెడ్డి అధ్యక్షతన భేటీ అయిన శాసనమండలి బీఏసీ కూడా.. శాసనసభ తరహాలోనే ఈ నెల 13 వరకు సమావేశం కావాలని నిర్ణయించింది.



బీఏసీలలో ఎవరెవరు?

శాసన మండలి, శాసనసభల నిర్వహణ షెడ్యూల్, చర్చించాల్సిన అంశాలను ఖరారు చేయడానికి.. అధికార, ప్రతిపక్షాల సభ్యులతో 'బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ)'లను ఏర్పాటు చేస్తారు. సమావేశాల ప్రారంభం రోజున ఈ బీఏసీలు స్పీకర్/చైర్మన్ అధ్యక్షతన సమావేశమై.. అసెంబ్లీ, మండలి సమావేశాలు కొనసాగే తేదీలు, చర్చించే అంశాలను నిర్ణయిస్తాయి. రాష్ట్ర కొత్త శాసనసభ ఏర్పాటైన నేపథ్యంలో 'బీఏసీ'ని ఏర్పాటు చేశారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్ అధ్యక్షతన జరిగిన అసెంబ్లీ బీఏసీ భేటీలో అధికార పక్షం నుంచి సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మంత్రి పొన్నం ప్రభాకర్, చీఫ్ విప్ ఆది శ్రీనివాస్, విప్ బీర్ల అయిలయ్యకు చోటు కల్పించారు. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ నుంచి కె.చంద్రశేఖర్‌రావు, మాజీ మంత్రి కడియం శ్రీహరికి చోటు దక్కింది. ఏలేటి మహేశ్వర్‌రెడ్డి (బీజేపీ), అక్బరుద్దీన్ ఒవైసీ (ఎంఐఎం), కూనంనేని సాంబశివరావు (సీపీఐ)లకూ అవకాశం కల్పించారు. బీజేపీ శాసనసభాపక్ష నేతను ఎన్నుకోనందున ఆ పార్టీ విజ్ఞప్తి మేరకు మహేశ్వర్‌రెడ్డికి చోటు దక్కింది. మరోవైపు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన బీఏసీ సమావేశంలో.. డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీలు జీవన్‌రెడ్డి (కాంగ్రెస్), మహమూద్ అలీ (బీఆర్ఎస్), ఏవీఎన్ రెడ్డి (బీజేపీ), ఎఫెండీ (ఎంఐఎం), అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు పాల్గొన్నారు.

ప్రొసీజర్ ప్రకారమే..

▶ మొదటి పేజీ తరువాయి

పక్కా ప్రొసీజర్‌తో వెళుతున్నాం. భవిష్యత్‌లో నిరుద్యోగులకు ఇబ్బందులు ఎదురవకుండా నియామకాల విషయంలో స్పష్టతతో వ్యవహరిస్తున్నాం. విధానపరమైన లోపాలు చోటుచేసుకోకుండా పాలన సాగిస్తాం..'' అని రేవంత్ తెలిపారు.

కేసీఆర్ చిత్తశుద్ధి ఏమిటో అర్థమవుతోంది!

అధికారం కోల్పోవడాన్ని కేసీఆర్ జీర్ణించుకోలేకపోతున్నారని, అసహనంతో మాట్లాడుతున్నారని రేవంత్ విమర్శించారు. కానీ కేసీఆర్, బీఆర్ఎస్‌ల గురించి ప్రజలు ఆలోచించడం మానేశారని వ్యాఖ్యానించారు. ''కేసీఆర్ బేషరం మనిషి.. కేసీఆర్ ఓ ఎక్స్‌పైరీ మెడిసిన్. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి హాజరుకాలేదు. సభలో చర్చించాల్సిన అంశాలపై ఏర్పాటు చేసిన బీఏసీ సమావేశానికి రాలేదు. అంటే ప్రతిపక్ష నేత ఏమిటో, ఆయన చిత్తశుద్ధి ఏమిటో, ఎంత బాధ్యతతో వ్యవహరిస్తున్నారో అర్థమవుతోంది. అసెంబ్లీ సమావేశాల మొదటి రోజే రాలేదు. తర్వాతైనా వస్తారా లేదా..''అని రేవంత్ పేర్కొన్నారు. కేసీఆర్ రావాలని, ప్రతిపక్ష నేతగా బాధ్యతలను నిర్వర్తించాలని తాను కోరుకుంటున్నానని చెప్పారు.

హరీశ్‌రావుది అవగాహన రాహిత్యం

బీఏసీ సమావేశంలో తాము హరీశ్‌రావును అడ్డుకోవడం ఏమిటని రేవంత్ పేర్కొన్నారు. పదేళ్లు శాసనసభా వ్యవహారాల మంత్రిగా పనిచేసినా కూడా హరీశ్‌రావు అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారని.. అసెంబ్లీ స్పీకర్ తీసుకునే నిర్ణయానికి మమ్మల్ని బాధ్యుల్ని చేస్తామంటే ఎలాగని నిలదీశారు. బీఏసీ భేటీకి హాజరయ్యేందుకు కేసీఆర్, కడియం శ్రీహరి పేర్లను బీఆర్ఎస్ ఇచ్చిందని.. వారు కాకుండా వేరేవారిని సమావేశానికి అనుమతించాలా, లేదా అనేది స్పీకర్ నిర్ణయమని స్పష్టం చేశారు. వివిధ అంశాలపై చర్చించాల్సిన అవసరం ఉందనుకుంటే సమావేశాలను స్పీకర్ పొడిగించవచ్చని చెప్పారు. రాబోయే రోజుల్లో కేసీఆర్ మనవడు హిమాన్షు కూడా బీఏసీ భేటీకి వస్తానంటే కుదురుతుందా? అని ప్రశ్నించారు. తన వద్దకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే కాదు కేసీఆర్ వచ్చినా కలుస్తానని చెప్పారు. గతంలో తాను కేసీఆర్ దగ్గరికి వెళ్లి కలసినప్పుడు జరగని చర్చ.. ఆ పార్టీ ఎమ్మెల్యేలు వచ్చి తనను కలిస్తే ఎందుకొచ్చిందని ప్రశ్నించారు.

చాంబర్ కేటాయింపు స్పీకర్ నిర్ణయం..

అసెంబ్లీలో ప్రతిపక్ష నేతకు చాంబర్ కేటాయింపు, బీఆర్ఎస్ కార్యాలయం మార్పు అనేవి స్పీకర్ నిర్ణయానికి అనుగుణంగా జరుగుతాయని రేవంత్ చెప్పారు. ''చాంబర్ ఇవ్వాలి కాబట్టి ఇచ్చారు. కానీ ఇక్కడే ఇవ్వాలి.. అక్కడ ఇవ్వద్దు అనేవేమీ ఉండదు కదా!''అని పేర్కొన్నారు. ఇప్పటికైతే నాలుగు రోజులు సభను నిర్వహించాలని అనుకున్నామని.. దీనిపై స్పీకర్ తర్వాత నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. అసెంబ్లీలో నీటిపారుదల ప్రాజెక్టులపై శ్వేతపత్రం విడుదల అంశాన్ని మీడియా ప్రస్తావించగా.. సంబంధిత శాఖ మంత్రి ఆ వివరాలు చెప్తారని రేవంత్ బదులిచ్చారు. మేడిగడ్డపై చర్చను పక్కదారి పట్టించేందుకు కృష్ణాబోర్డు అంశాన్ని కేసీఆర్ ముందుకు తెస్తున్నారని విమర్శించారు. ఏపీ నాగార్జునసాగర్‌పైకి పోలీసులను పంపి లాక్కునే ప్రయత్నం చేస్తే కేసీఆర్ ఏం చేశారని ప్రశ్నించారు. బేసిన్లు లేవు, భేషజాలు లేవని కేసీఆర్ అన్నారంటే.. ఆయనకున్న నిబద్ధత ఏమిటో ప్రజలకు అర్థమైందని వ్యాఖ్యానించారు. కృష్ణా బేసిన్ పరిధిలో బీఆర్ఎస్‌కు వచ్చిన అసెంబ్లీ సీట్లను చూస్తే ఇది స్పష్టమవుతుందన్నారు. పార్టీ అధిష్టానం నిర్ణయానికి అనుగుణంగా రాజ్యసభ ఎన్నికల్లో ఎంతమందిని పోటీకి దింపాలనే నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

బస్సులో బల్మూరి.. ఆటోలో కౌశిక్

సాక్షి, హైదరాబాద్: శాసనసభ బడ్జెట్ సమావేశాల ప్రారంభం రోజున కరీంనగర్ జిల్లాకు చెందిన ఇద్దరు ప్రజా ప్రతినిధులు వినూత్న రీతిలో అసెంబ్లీకి రావడం ఆసక్తిని కలిగించింది. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం అంశాన్నే ఈ ఇద్దరు ఎంచుకోవడం విశేషం. ఇటీవలే ఎమ్మెల్సీగా బాధ్యతలు స్వీకరించిన బల్మూరి వెంకట్ నాంపల్లిలో ఆర్టీసీ బస్ ఎక్కి అసెంబ్లీ గేట్ వరకు వచ్చారు. ఈ సందర్భంగా బస్‌లో మహిళా ప్రయాణికులతో ముచ్చటిస్తూ ఉచిత ప్రయాణం అనుభవాలను తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఇక హుజూరాబాద్ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచిన పాడి కౌశిక్ రెడ్డి ఆటో డ్రైవర్లకు మద్దతుగా ఆటోలో అసెంబ్లీకి వచ్చే ప్రయత్నం చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటోడ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితి దాపురించిందంటూ ఆయన ఆటోలో అసెంబ్లీ గేటు వద్దకు వచ్చారు. అయితే ఆటోకు పాస్ లేకపోవడంతో పోలీసు అధికారులు ఆటోను అసెంబ్లీలోకి అనుమతించలేదు. దీంతో ఆయన ఆటో దిగి కాలినడకన అసెంబ్లీలోకి వచ్చారు. అనంతరం ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం వల్ల గిరాకీ తగ్గి ఇప్పటివరకు 21 మంది ఆటోడ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారని, సుమారు ఆరు లక్షల ఆటో డ్రైవర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కౌశిక్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

కృష్ణా జలాలపై కాంగ్రెస్, బీఆర్ఎస్ రాజకీయం

బీజేపీ ఎమ్మెల్యేలు

పార్లమెంట్ ఎన్నికల్లో రాజకీయ లబ్ధి కోసం కృష్ణా జలాలపై కేఆర్ఎంబీ పేరుతో కాంగ్రెస్, బీఆర్ఎస్ పక్షాలు నాటకాలు ఆడుతున్నాయని బీజేపీ ఎమ్మెల్యేలు ఆరోపించారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో బీజేపీ ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, పాల్వాయి హరీశ్ మాట్లాడారు. కృష్ణాజలాల విషయంలో రెండు పక్షాల మధ్య లోపాయికారీ ఒప్పందం జరిగిందని ఆరోపించారు. ఎన్నికల ముందు బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతిపై సీబీఐ విచారణ కోరిన రేవంత్ రెడ్డి సీఎం కాగానే మౌనంగా ఎందుకు ఉన్నారని ప్రశ్నించారు. సీబీఐ విచారణకు కాంగ్రెస్ ఎందుకు వెనక్కి తగ్గిందో అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ కాంగ్రెస్‌లు ఒక్కటేనని, ఎన్నికల సమయంలోనే ఇరుపార్టీలు తిట్టుకుంటాయని ఆరోపించారు.

బడ్జెట్ సమావేశాల్లో ప్రాజెక్టులపై శ్వేతపత్రం

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ప్రస్తుత అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా...నీటిపారుదల ప్రాజెక్టులపై శ్వేతపత్రం విడుదల ఉంటుందని ఆ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. గురువారం అసెంబ్లీ లాబీలో విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన స్పందిస్తూ...గత పదేళ్లలో నీటిపారుదల రంగానికి సంబంధించి అసలు ఏమి జరిగింది? ఎంత ఖర్చు చేశారు? ఎన్ని ఎకరాలకు ఆయకట్టు ఇచ్చారు? వాస్తవ పరిస్థితులు ఏమిటి తదితర వివరాలను అందులో పొందుపరుస్తామని మంత్రి చెప్పారు.

హస్తం గూటికి పట్నం దంపతులు!

- సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మహేందర్‌రెడ్డి, సునీతారెడ్డి
- చేవెళ్ల ఎంపీ టికెట్ హామీతోనే పార్టీ మారుతున్నట్లు ప్రచారం



రేవంత్‌ను కలిసిన మహేందర్‌రెడ్డి, సునీతారెడ్డి

వికారాబాద్: మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి దంపతులు కాంగ్రెస్ గూటికి చేరనున్నారు. గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి శాలువా, బొకేలతో సన్మానించారు. సీఎం తన సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో త్వరలో నిర్వహించనున్న బహిరంగ సభలో వీరు హస్తం కండువా వేసుకోనున్నట్లు సమాచారం. మహేందర్‌రెడ్డి మద్దతుదారులు చాలా మంది ఇప్పటికే కాంగ్రెస్‌లో చేరారు. తాండూరు నియోజకవర్గంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న, సీనియర్ నాయకులు రవి గౌడ్, కరణం పురుషోత్తంరావ్ తదితరులు పట్నం వెంట వెళ్లనున్నట్లు తెలుస్తోంది.

ఎన్నికలకు ముందే వెళ్లాలని భావించినా..

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు ముందే పట్నం మహేందర్‌రెడ్డి దంపతులు కాంగ్రెస్‌లో చేరతారని జోరుగా ప్రచారం సాగింది. అప్పట్లో కేసీఆర్ నేరుగా రంగంలోకి దిగి బుజ్జగించటంతో పాటు చివరి నిమిషంలో మంత్రి పదవి కట్టబెట్టడంతో ఆ నిర్ణయాన్ని వాయిదా వేసుకున్నారు. మాజీ ఎమ్మెల్యేలు పైలెట్ రోహిత్‌రెడ్డి, మెతుకు ఆనంద్‌తో నెల కొన్న విభేదాలు తీవ్రరూపం దాల్చడంతో కొద్ది నెలలుగా బీఆర్ఎస్‌కు అంటీముట్టనట్లు ఉంటున్నారు.

చేవెళ్ల ఎంపీ సీటు కమిట్‌మెంటుతోనే..?

మరో నాలుగు నెలల్లో జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి పదవీ కాలం పూర్తి కానున్న నేపథ్యంలో ఆమె చేవెళ్ల పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ తరపున పోటీ చేసేందుకు హామీ లభించినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు సమాచారం. కాగా, మహేందర్‌రెడ్డి సోదరుడు, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి మాత్రం తాను బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని 'సాక్షి'కి తెలిపారు.

హామీలేమయ్యాయి?

▶ మొదటి పేజీ తరువాయి

మాత్రమే చెప్పారని, తద్వారా మిగతా హామీలు వచ్చే ఏడాదిలో చేయలేమని చెప్పకనే చెప్పారని అన్నారు. 24 గంటల కరెంట్ ఇస్తామని చెప్పి మాట తప్పారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో రైతులు కరెంట్ కోతలు ఎదుర్కొంటున్నారంటూ.. యాదాద్రి విద్యుత్ ప్లాంట్ చివరి దశలో ఉందని, దాన్ని పూర్తి చేస్తే కొంతమేర విద్యుత్ కొరత నుంచి గట్టెక్కవచ్చునని అన్నారు. దావోస్ పర్యటన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిన రూ.40 వేల కోట్ల పెట్టుబడులపై వైట్ పేపర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ప్రతిరోజూ ప్రజావాణి ఎక్కడ?

ప్రతిరోజూ ప్రజావాణి నిర్వహిస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి మాటలు ఏమయ్యాయని హరీశ్‌రావు ప్రశ్నించారు. ప్రజావాణిలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామన్నారని.. తొలుత సీఎం, తర్వాత మంత్రులు, ఆ తర్వాత అధికారులు, చివరకు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు దరఖాస్తులు తీసుకునే పరిస్థితి వచ్చిందని ఎద్దేవా చేశారు. దీనిపై గవర్నర్‌తో కూడా అసత్యాలు చెప్పించారని అన్నారు.

బీఏసీకి హరీశ్ రాకపై అభ్యంతరం



గురువారం బీఏసీ సమావేశానికి హాజరైన సీఎం రేవంత్, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, భట్టి, శ్రీధర్ బాబు,పొన్నం, అక్బరుద్దీన్ ఒవైసీ, కడియం శ్రీహరి తదితరులు

- జాబితాలో ఉన్న వారే రావాలన్న మంత్రులు
- కేసీఆర్‌కు బదులు తాను పాల్గొనడంపై సమాచారం ఇచ్చామన్న మాజీ మంత్రి
- దీనిపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్న శ్రీధర్‌బాబు
- సర్దుకు పోవాలంటూ స్పీకర్ చెప్పడంతో బయటకు వచ్చిన హరీశ్

సాక్షి, హైదరాబాద్: శాసనసభ నిర్వహణ తేదీలు, ఎజెండా ఖరారు కోసం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అధ్యక్షతన జరిగిన బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశంలో మంత్రులు, మాజీ మంత్రి హరీశ్‌రావు మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. బీఆర్ఎస్ శాసనసభా పక్ష నేత కేసీఆర్‌కు బదులు హరీశ్‌రావు బీఏసీ భేటీకి హాజరు కావడంపై మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. గురువారం ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం అనంతరం స్పీకర్ చాంబర్‌లో బీఏసీ తొలి సమావేశం ప్రారంభమైంది. అధికార పార్టీ తరపున శ్రీధర్‌బాబు, పొన్నంతో పాటు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ప్రతిపక్ష బీఆర్ఎస్ తరపున హరీశ్‌రావు, కడియం శ్రీహరి హాజరయ్యారు. తాను అనారోగ్యంతో బాధపడుతున్నందున తనకు బదులుగా హరీశ్‌రావు బీఏసీ సమావేశంలో పాల్గొంటారంటూ మాజీ సీఎం కేసీఆర్ బుధవారం స్పీకర్‌కు సమాచారం ఇచ్చినట్లు బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి. అయితే శ్రీధర్‌బాబు, పొన్నం అభ్యంతరం వ్యక్తం చేయడంతో వాగ్వాదం జరిగింది. కేసీఆర్‌కు బదులుగా తాను హాజరయ్యేందుకు స్పీకర్ అంగీకరించారని హరీశ్ చెప్పారు. అయితే ఈ అంశంపై తాము ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, కాబట్టి హరీశ్‌రావు హాజరయ్యేందుకు వీలు లేదని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.

అలా హాజరయ్యేందుకు వీలు లేదు: శ్రీధర్‌బాబు

తాము ఎవరిని బీఏసీ సమావేశం నుంచి బయటకు వెళ్లమని చెప్పలేదని శాసన సభా వ్యవహారాల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. గురువారం అసెంబ్లీ లాబీల్లో ఆయన మీడియాతో మాట్లాడారు. స్పీకర్ నిర్ణయం మేరకు బీఏసీ సమావేశంలో పాల్గొనేందుకు బీఆర్ఎస్ నుంచి ఇద్దరు సభ్యులకు అవకాశం కల్పించారని చెప్పారు. దీంతో బీఆర్ఎస్ తరపున మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కడియం శ్రీహరి పేర్లు ఇచ్చారని తెలిపారు. కానీ బీఏసీ భేటీకి కేసీఆర్ రావడం లేదు కాబట్టి తాను వస్తానని హరీశ్‌రావు తెలిపారని, అయితే ఒక సభ్యుడు సమావేశానికి రావడం లేదని చెప్పి అతడి స్థానంలో మరో సభ్యుడికి అనుమతినివ్వడం కుదరదని పేర్కొన్నారు. ఈ మేరకు బీఆర్ఎస్ నుంచి ఎలాంటి లేఖ కూడా ఇవ్వలేదని తెలిపారు. కాగా అసెంబ్లీని ఎన్నిరోజులైనా నిర్వహించేందుకు తాము సిద్ధమని శ్రీధర్‌బాబు చెప్పారు. దీనిపై స్పీకర్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని అన్నారు.

గతంలో అనేకసార్లు మేం అనుమతించాం: హరీశ్

గతంలో తాము బీఏసీ జాబితాలో లేని వారిని కూడా పార్టీ శాసనసభా పక్ష నేత వినతి మేరకు అనుమతించిన విషయాన్ని హరీశ్ గుర్తు చేశారు. ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ బదులుగా ఎమ్మెల్యే బలాలను పలు సందర్భాల్లో అనుమతించామని, అవసరమైతే బీఏసీ మినిట్స్‌ను పరిశీలించాలని అన్నారు. తాము అలా అనుమతించలేదని నిరూపిస్తే రాజీనామా చేసి అసెంబ్లీ నుంచి బయటకు వెళ్తానని హరీశ్ స్పష్టం చేశారు. దీంతో మినిట్స్ పరిశీలించేందుకు సమయం పడుతుందని, అభ్యంతరం వ్యక్తమైన నేపథ్యంలో సర్దుకుపోవాలని స్పీకర్ ప్రసాద్‌కుమార్ కోరారు. దీంతో మీ విచక్షణకే వదిలివేస్తున్నానంటూ హరీశ్‌రావు బీఏసీ భేటీ నుంచి బయటకు వచ్చారు. దీంతో కడియం ఒక్కరే బీఆర్ఎస్ తరపున బీఏసీ భేటీలో పాల్గొన్నారు.

కేసీఆర్‌కు ఈ చాంబర్ ఏంటి?

- ప్రతిపక్ష నేత చాంబర్ కేటాయింపుపై రగడ
- కేసీఆర్‌కు ఔటర్ లాబీలో ఇరుకైన గది
- స్పీకర్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు.. వచ్చే సమావేశాల్లోగా పరిష్కరిస్తామని హామీ

సాక్షి, హైదరాబాద్: శాసనసభ ఇన్నర్ లాబీలో అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడికి ఏళ్ల తరబడి కేటాయిస్తూ వస్తున్న చాంబర్‌ను తొలగించి తాజాగా కె.చంద్రశేఖరరావుకు ఔటర్ లాబీలో ఇరుకైన చిన్న గదిని కేటాయించడంపై బీఆర్ఎస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. శాసనసభ సమావేశాల తొలిరోజున గురువారం గవర్నర్ ప్రసంగం ముగిసిన తర్వాత బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు స్పీకర్ చాంబర్‌కు వెళ్లి తమ నిరసన తెలిపారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, హరీశ్‌రావు, సీనియర్ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి తదితరులు కేసీఆర్ చాంబర్‌ను మార్చడాన్ని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. 39 మంది ఎమ్మెల్యేలకు నేతృత్వం వహిస్తున్న ప్రధాన ప్రతిపక్షం నేత కార్యాలయాన్ని ఇన్నర్ లాబీ నుంచి ఔటర్ లాబీకి మార్చడాన్ని ప్రస్తావించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుంచీ ఇన్నర్ లాబీలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడికి ప్రత్యేక చాంబర్‌ను కేటాయించడం ఆనవాయితీగా వస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ప్రతిపక్ష నేతకు కేటాయించిన చాంబర్‌ను ఔటర్ లాబీకి తరలించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రొటోకాల్ ఉల్లంఘనలపైనా ఫిర్యాదు

ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల హక్కులను కాలరాసేలా కాంగ్రెస్ నేతలు వ్యవహరిస్తూ నియోజకవర్గాల్లో ప్రొటోకాల్ ఉల్లంఘనలకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఫిర్యాదు చేశారు. ప్రొటోకాల్ ఉల్లంఘనలకు సంబంధించిన పలు సంఘటలను కూడా స్పీకర్ దృష్టికి తీసుకెళ్లారు. సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అనారోగ్యంతో బాధపడుతున్నా ఓటమి పాలైన కాంగ్రెస్ అభ్యర్థి జగ్గారెడ్డి భార్య వచ్చేంత వరకు సుమారు రెండు గంటల పాటు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని అధికారులు నిలిపివేశారన్నారు. నర్సాపూర్, దుబ్బాక, జహీరాబాద్ తదితర నియోజకవర్గాల్లోనూ ప్రొటోకాల్ ఉల్లంఘనలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఓటమి పాలైన కాంగ్రెస్ అభ్యర్థులను పోలీసులు ఎస్కార్ట్ వాహనంతో అనుసరిస్తున్నారని స్పీకర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రొటోకాల్ ఉల్లంఘనలు జరగకుండా అధికారులను ఆదేశించాలని స్పీకర్‌ను కోరారు.

పని చేయని టీవీ.. డోర్ హ్యాండిల్ లేని బాత్‌రూం

గతంలో ఐదుగురు సభ్యులున్న కాంగ్రెస్‌కు కూడా చాంబర్‌ను కేటాయించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇన్నర్ చాంబర్‌లోని ప్రతిపక్ష నేత చాంబర్‌ను తాను వాడుకుంటానని స్పీకర్ కోరడంతో ఔటర్ లాబీకి తన కార్యాలయాన్ని తరలించేందుకు కేసీఆర్ సుముఖత వ్యక్తం చేశారన్నారు. అయితే ఔటర్ లాబీలో ఇరుకైన చిన్న గది కేటాయించారని, అందులోని మూత్రశాలకు కనీసం డోర్ హ్యాండిల్ లేదనీ, టీవీ పనిచేయడం లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్పీకర్‌కు తెలిపారు. ఇది ప్రతిపక్ష నేతను అవమానించడం లాంటిదేనని, విశాలమైన చాంబర్‌ను కేటాయించాలని కోరారు. వచ్చే సెషన్‌లోగా ప్రతిపక్ష నేత చాంబర్‌ను విశాలంగా తీర్చిదిద్ది అన్ని వసతులు కల్పిస్తామని స్పీకర్ హామీ ఇచ్చారు.

కొత్తగా ముళ్ల కంచెలేంటి?: హరీశ్

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనేందుకు వచ్చిన మాజీ మంత్రి హరీశ్‌రావు.. ఆ పరిసరాల్లో కొత్తగా మరిన్ని ముళ్ల కంచెలు ఏర్పాటు చేయడంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ప్రగతిభవన్ వద్ద ముళ్ల కంచెలు తొలగించామని ప్రచారం చేసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం, అసెంబ్లీ పరిసరాల్లో కొత్తగా మరిన్ని కంచెలు వేసిందని మీడియా ప్రతినిధులతో అన్నారు. కాగా, కొత్త కంచెలు వేసిన విషయం వారికి కనిపించదు అంటూ మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి వ్యాఖ్యానించారు.

ప్రజల తరఫున కొట్లాడుతాం: కడియం

సాక్షి, హైదరాబాద్: నాలుగు రోజుల్లోనే బడ్జెట్ సమావేశాలు ముగిస్తున్నారని, మేము ప్రజల తరపున ఉండి కొట్లాడుమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ...క్వశ్చన్ అవర్, జీరో అవర్ మీద ఎలాంటి స్పష్టత ఇవ్వలేదన్నారు. ఎన్నికల్లో ఓడిపోయిన కాంగ్రెస్ అభ్యర్థులు ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటారని సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలతో ప్రొటోకాల్ ఉల్లంఘనలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

కడియంను బీఆర్ఎస్ పక్ష నేతగా ఎన్నుకోవాలి

మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు



సాక్షి, హైదరాబాద్: అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ పార్టీకి బడుగులు, దళితులు గుర్తుకు రాలేదని బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘునందన్‌రావు మండిపడ్డారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ శాసనసభా పక్షనేతగా సీనియర్ నాయకుడు, దళితనేత కడియం శ్రీహరిని ఎన్నుకోవాలని ఆయన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సూచించారు. 'కేసీఆర్‌కు ఎలాగూ ఆరోగ్యం బాగోలేదు కాబట్టి ఫ్లోర్ లీడర్‌గా దళితుడిని, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఒక బీసీని చేయాలని సూచించారు. అమరుడు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మకు రాజ్యసభ సీటు ఇచ్చి పాపాలు కడుక్కోవాలన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కవితకు ఇప్పుడు జ్యోతిబా పూలే గుర్తుకు వచ్చారా? అని ప్రశ్నించారు. కవిత ఉన్నా లేకపోయినా పూలే గుర్తుంటారని, ఇందుకోసం వారు కొత్తగా ఏమీ చేయాల్సిన అవసరం లేదని హితవు పలికారు. కవితకు, ఆమె ఫ్యామిలీకి పబ్లిసిటీ అంటే అంత పిచ్చి ఎందుకని అన్నారు. శాసనసభలో కేటీఆర్, హరీశ్ కనపడాలని, తెలంగాణ భవన్‌లో కేసీఆర్, మండలిలో కవిత కనపడాలంటే ఎలా అని ప్రశ్నించారు.

నేడు ప్రధానితో ఏపీ సీఎం జగన్ భేటీ

- ఏపీకి రావాల్సిన నిధులు, అభివృద్ధిపై చర్చ
- అమిత్ షా, నిర్మలతోనూ భేటీ



సాక్షి, న్యూఢిల్లీ/గన్నవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం సమావేశం కానున్నారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు, పలు అభివృద్ధి అంశాలపై చర్చించేందుకు సీఎం జగన్ గురువారం రాత్రి ఢిల్లీ వచ్చారు. శుక్రవారం ఉదయం 11గంటలకు ప్రధాని మోదీతో సీఎం జగన్ సమావేశమయ్యే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను సత్వరమే పూర్తి చేసేందుకు కేంద్రం తగిన సహాయ సహకారాలను అందించాలని, తెలంగాణ డిస్కంల నుంచి రావాల్సిన విద్యుత్తు బకాయిలు, విభజన సమయంలో పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీల అమలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై సీఎం జగన్ ప్రధానితో చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను సైతం కలిసి రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై చర్చించనున్నట్లు సమాచారం.

ఎస్‌జీటీలుగా 2008-డీఎస్సీ అభ్యర్థులు

- బీఎడ్ వారిని నియమించే అంశాన్ని పరిశీలించాలి: హైకోర్టు
- ఏపీ సర్కార్ నిర్ణయం భేష్ అన్న కోర్టు

సాక్షి, హైదరాబాద్: డీఎస్సీ–2008 అభ్యర్థులను ఎస్‌జీటీలుగా నియమించే అంశాన్ని పునఃపరిశీలించాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. ఉమ్మడి రాష్ట్రంలో ఈ సమస్యకు ఏపీ సర్కార్ కొంత ఉపశమన నిర్ణయం తీసుకుందని అభిప్రాయపడింది. 2008– డీఎస్సీ నోటిఫికేషన్‌లో తమ కంటే తక్కువ అర్హత ఉన్న డీఎడ్ అభ్యర్థులకు 30 శాతం ఎస్‌జీటీ పోస్టులను రిజర్వు చేయడాన్ని వ్యతిరేకిస్తూ బీఎడ్ అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లపై జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలీ, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం గురువారం మరోసారి విచారణ చేపట్టింది. ఒకే రకమైన పోస్టులకు అర్హత ఎక్కువున్న వారిని కాదని.. తక్కువ ఉన్న వారిని నియమించడం చట్టప్రకారం సరికాదని పిటిషనర్ తరఫు న్యాయవాదులు వాదించారు. 'ప్రభుత్వ ఉద్యోగాల్లో నియామకాలు చేసేటప్పుడు రాజ్యాంగంలోని ఆర్టికల్ 16(4)కు లోబడి క్లాసిఫికేషన్ చేయాలిగానీ.. ఇష్టం వచ్చినట్లు నిర్ణయం తీసుకోవడం చెల్లదు. ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ–2008 బీఎడ్ అభ్యర్థుల విషయంలో ఆ ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుంది. వారికి 60 ఏళ్లు వచ్చే వరకు కాంట్రాక్టు ఉద్యోగాల్లో కొనసాగిస్తామని హామీ ఇవ్వడమే కాకుండా అమలు చేస్తోంది. తెలంగాణ ప్రభుత్వం కారణంగానే వివాదం ఏళ్లుగా కొనసాగుతోంది. కనీసం ఖాళీగా ఉన్న పోస్టుల్లో నాటి బీఎడ్ అభ్యర్థులను నియమిస్తే అందరికీ ఉపశమనం లభిస్తుంది'అని పేర్కొన్నారు. ఏపీ ప్రభుత్వం తరఫున ప్రత్యేక న్యాయవాది గోవిందరెడ్డి వాదనలు వినిపిస్తూ.. 'ఏపీ ప్రభుత్వం సంక్షేమ రాష్ట్రం. ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసమే ఏ నిర్ణయమైనా తీసుకుంటుంది. ఇందులో భాగంగానే మానవతా దృక్పథంతో ఆలోచించి అర్హులైన డీఎస్సీ 2008 అభ్యర్థులను కాంట్రాక్టు ఉద్యోగులుగా నియమించింది'అని నివేదించారు. వాదనలు విన్న ధర్మాసనం.. బీఎడ్ అభ్యర్థులను ఉద్యోగాల్లో నియమించే అంశాన్ని పునః పరిశీలించాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ, విచారణను 6 వారాలకు వాయిదా వేసింది.

సీఎంకు క్రికెట్ టోర్నీ ఆహ్వానం

సాక్షి, హైదరాబాద్: సేవాలాల్ మహారాజ్ క్రికెట్ టోర్నమెంట్‌కు హాజరుకావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, ఎమ్మెల్యే బాలు నాయక్ ఆహ్వానించారు. కాగా, గురువారం ప్రజాభవన్‌లోని నల్ల పోచమ్మ దేవాలయంలో డిప్యూటీ సీఎం భట్టి పూజలు నిర్వహించారు. ఆయనకు మంత్రి సీతక్క, సమ్మక్క సారలమ్మ జాతర ఆహ్వాన పత్రిక అందజేశారు.

కూలడానికి ప్రభుత్వం కాళేశ్వరం కాదు

హరీశ్‌రావుతో బీఆర్‌ఎస్‌లో అంతర్యుద్ధం వస్తుంది: జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: కూల్చితే కూలడానికి కాంగ్రెస్ ప్రభుత్వమేమైనా మీరు కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు అనుకుంటున్నారా అని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీలో ఎలాంటి అంతర్యుద్ధం రాదని, బీఆర్‌ఎస్ పార్టీలోనే వస్తుందని, కేసీఆర్‌కి వెనక నుంచి గడ్డపార గుచ్చడానికి హరీశ్‌రావు సిద్ధంగా ఉన్నాడని మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి వ్యాఖ్యలకు జగ్గారెడ్డి బదులిచ్చారు. కామారెడ్డిలో తోపు అనుకున్న కేసీఆర్ ఎందుకు తుస్సుమన్నాడో ప్రశాంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని ఎద్దేవా చేశారు. గాంధీభవన్‌లో గురువారం ఆయన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చరణ్ కౌశిక్ యాదవ్, అధికార ప్రతినిధి లింగం యాదవ్‌లతో కలిసి మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడేస్తామని మీరు అంటున్నందుకే 20 మంది ఎమ్మెల్యేలు వస్తున్నారని, మల్లారెడ్డి కూడా రావచ్చని వ్యాఖ్యానించారు. ఉత్తమ్, జగ్గారెడ్డి, రేవంత్, శ్రీధర్, జీవన్‌రెడ్డి లాంటి వాళ్లం టార్గెట్ లీడర్స్‌గా ఉన్నాం కాబట్టే , తమను ఓడించేందుకు ఒక్కో చోట రూ.60 కోట్లు బీఆర్‌ఎస్ ఖర్చు పెట్టిందని జగ్గారెడ్డి ఆరోపించారు.

టీఎస్‌పీఎస్సీ నుంచి మహేందర్‌రెడ్డిని తప్పించాలి

టీఎస్‌పీఎస్సీ సభ్యుడిగా ఆంధ్రా వ్యక్తిని ఎలా నియమిస్తారు?: ఎమ్మెల్సీ కవిత



సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డిని ఆ పదవి నుంచి తక్షణమే తొలగించాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఆయనపై అవినీతి ఆరోపణలు ఉన్నాయని, దీనిపై త్వరలో గవర్నర్‌ను కలుస్తామని తెలిపారు. గురువారం ఆమె తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్సీ సభ్యుడిగా నియమించిన వై.రామ్మోహన్‌రావు ఆంధ్రాకు సంబంధించిన వ్యక్తి అని, తెలంగాణ బిడ్డలకు ఉద్యోగాలిచ్చే సంస్థలో ఆంధ్ర వ్యక్తిని నియమిస్తే న్యాయం జరుగుతుందా అని ఆమె ప్రశ్నించారు. రాజకీయాల్లో ఉన్న వారిని సభ్యులుగా నియమించబోమని చెప్పిన సీఎం, టీడీపీలో పనిచేసిన రజనీకుమారిని ఎలా నియమించారని నిలదీశారు. విద్యుత్ సంస్థలో నలుగురు డైరెక్టర్లను ప్రభుత్వం నియమిస్తే అందులో ముగ్గురు ఆంధ్రా అధికారులే ఉన్నారని చెప్పారు. ప్రభుత్వానికి సలహాదారులే ఉండవద్దని కోర్టుల్లో బీఆర్‌ఎస్ హయాంలో కేసులు వేసిన రేవంత్‌రెడ్డి ఇవాళ ఎంతమందిని సలహాదారులుగా నియమించుకున్నారో చెప్పాలని కవిత డిమాండ్ చేశారు. వ్యక్తిగత కేసులు, ఓటుకు కోట్లు కేసులో వాదించిన దేవనా సైగల్‌ను సుప్రీంకోర్టులో ప్రభుత్వ న్యాయవాదిగా, తేర రజినీకాంత్‌రెడ్డిని అదనపు అడ్వొకేట్ జనరల్‌గా నియమించడంతో పాటు కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులను ఆపడానికి దొంగ కేసులు వేసిన ఒక న్యాయవాదిని సుప్రీంకోర్టులో అడ్వొకేట్ ఆన్ రికార్డుగా నియమించారన్నారు.

ప్రధాని మోదీ బీసీ అని చెప్పుకుంటే సరిపోతుందా?

బీసీలకు చేసిన మంచి పని ఏంటో చెప్పండి: జాజుల




మహాధర్నాలో వీహెచ్, జాజుల తదితరులు

సాక్షి, న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ బీసీ అని చెప్పుకుంటే సరిపోతుందా.. ఈ పదేళ్ల పాలనలో బీసీలకు చేసిన మంచి పనేంటో చెప్పాలంటూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ప్రశ్నించారు. 'బీసీల సమరభేరి'పేరుతో గురువారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద చేపట్టిన మహాధర్నాలో ఆయన మాట్లాడారు. పదేళ్ల పాలనలో ఓబీసీల సంక్షేమంపై కేంద్ర ప్రభుత్వం శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీసీల సమస్యలపై ఏళ్ల తరబడి నిరసనలు, ధర్నాలు చేస్తున్నా పట్టించుకోకపోగా తమపై కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేయడం దారుణమన్నారు. బీసీలపై కేంద్రప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తుందని మాజీ ఎంపీ వి.హనుమంతరావు ఆరోపించారు. తాము పార్లమెంట్‌లో బీసీ సమస్యలపై గట్టిగా పోరాడుతున్నా కేంద్రం లెక్కచేయడం లేదని ఎంపీ బీబీ పాటిల్ అన్నారు. బీసీ కులగణనకు తమ పార్టీ కట్టుబడి ఉందని సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేశ్‌చారి, ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ పాల్గొన్నారు.

సెలవు దినంగా సేవాలాల్ మహారాజ్ జయంతి

- 12లోగా నిర్ణయం తీసుకోకుంటే 13న అసెంబ్లీ ముట్టడి
- లంబాడీ హక్కుల పోరాట సమితి హెచ్చరిక



అభివాదం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

పంజగుట్ట (హైదరాబాద్): లంబాడీల ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ జయంతి ఫిబ్రవరి 15వ తేదీన సెలవు దినంగా ప్రకటిస్తూ ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే జీవో తీసుకురావాలని లంబాడీ హక్కుల పోరాట సమితి డిమాండ్ చేసింది. ఈ నెల 12వ తేదీ సాయంత్రంలోపు నిర్ణయం తీసుకోకపోతే 13వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా లంబాడీలను ఐక్యపరచి అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో లంబాడీ హక్కుల పోరాట సమితి జాతీయ, రాష్ట్ర కార్యవర్గాలను రద్దుచేసి నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ బంజారా, లంబాడీ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు పి.శ్రీనివాస్ నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు ధరావత్ గణేశ్ నాయక్‌లు మాట్లాడుతూ.. 15వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంటిముందు సేవాలాల్ మహారాజ్ చిత్రపటాన్ని ఉంచి భోగ్ భండార్ కార్యక్రమం నిర్వహిస్తామని స్పష్టం చేశారు. కాగా, సమితి జాతీయ అధ్యక్షునిగా శ్రీనివాస్ నాయక్, ఉపాధ్యక్షులుగా నెనావత్ బాలు నాయక్, నాగరాజు నాయక్ ప్రధాన కార్యదర్శులుగా కృష్ణ జాదవ్, దేశ్యానాయక్, హరిలాల్ నాయక్, రాష్ట్ర అధ్యక్షునిగా ధరావత్ గణేష్ నాయక్, రాష్ట్ర ఇన్‌చార్జిగా రంజిత్ నాయక్, కార్యనిర్వాహక అధ్యక్షునిగా బాగావత్ శంకర్ నాయక్‌లను ఎంపిక చేశారు.

ఎవరైతే నమాజ్‌ను స్థాపించి విధిదానం (జకాత్) ఇస్తారో,
పరలోక జీవితం మీద దృఢమైన నమ్మకం కలిగి ఉంటారో:
అలాంటివారే, అలాంటివారే సాఫల్యం పొందేవారు.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 9 ఫిబ్రవరి 2024

లీకు వీరులకు బ్రేక్!

దశాబ్దాలుగా దాదాపు దేశవ్యాప్త జాడ్యంగా వున్న సమస్యకు సమగ్ర పరిష్కారం కోసం తొలి అడుగు పడింది. పోటీపరీక్షల్లో ప్రశ్నపత్రాన్ని లీక్ చేసేవారిపై కఠిన చర్యలు తీసుకొనే బిల్లును పార్లమెంటు ఆమోదించింది. నేరగాళ్లని తేలితే రూ. కోటి వరకూ జరిమానా, అయిదేళ్ల వరకూ శిక్ష ఉంటాయని బిల్లు చెబుతోంది. కొన్ని రాష్ట్రాల్లో ఇప్పటికే లీకుల్ని అరికట్టేందుకు చట్టాలున్నాయి. అయితే వాటివల్ల పెద్దగా ప్రయోజనం ఉన్నట్టులేదు. కేంద్రం తెచ్చిన చట్టం దాని పరిధిలో జరిగే యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, స్టాఫ్ సెలక్షన్ కమిషన్, ఎన్‌టీఏ, ఆర్‌ఆర్‌బీ, ఐబీపీఎస్, నీట్, జేఈఈ తదితర పోటీ పరీక్షల్లో అక్రమాలకు పాల్పడేవారికి వర్తిస్తుంది. ఈ నమూనాలో రాష్ట్రాలు కూడా చట్టాలు చేయాలని కేంద్రమంత్రి జితేంద్రసింగ్ చేసిన సూచన మంచిదే. పోటీ పరీక్షల చుట్టూ వేలాదికోట్ల వ్యాపారం నడుస్తోంది. ఒకప్పుడు ప్రధాన నగరాలు కొన్నిటిలో తర్ఫీదిచ్చే సంస్థలు కొలువుదీరేవి. అక్కడ వేలకు వేలు ఖర్చుపెట్టిన లక్షలాదిమంది విద్యార్థులు దర్శనమిచ్చేవారు. ఈమధ్య ఇది చిన్న నగరాలకూ, పట్టణాలకూ కూడా పాకింది. సివిల్ సర్వీసులు మొదలుకొని రాష్ట్రాల్లోని సర్వీసు కమిషన్‌లు, ప్రభుత్వరంగ సంస్థలు, ఆర్మీ, పోలీసు విభాగాలు నిర్వహించే పరీక్షల కోసం పల్లెసీమల నుంచి సైతం వేలమంది తరలివస్తున్నారు. ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగాలు సాధిస్తే జీవితాంతం చీకూ చింతా లేకుండా బతికేయొచ్చని నిరుద్యోగులు కలలు కంటున్నారు. కానీ ప్రశ్నపత్రాలతో వందలకోట్లు దండుకునే ముఠాలు ఈ కలల్ని కొల్లగొడుతున్నాయి. ప్రభుత్వోద్యోగాల భర్తీని ప్రహసన ప్రాయం చేస్తున్నాయి. విజేతలవుతున్నవారిలో ఎవరు సచ్ఛీలురో, ఎవరు కాదో తెలియని అయోమయ స్థితి ఏర్పడుతోంది.

పోటీ పరీక్షల్లో అక్రమాలను అరికట్టే అంశంపై 90వ దశకంనుంచి ప్రభుత్వాలు ఎక్కువగా దృష్టి పెట్టడం మొదలెట్టాయి. కానీ అవి ఆగిన జాడ లేదు. ఐఐటీ జేఈఈ ప్రశ్నపత్రాలు లీకయినట్టు తొలిసారి 1997లో మీడియాలో కథనాలొచ్చాయి. లక్నోలోని ఒక సంస్థ ఆ ఏడాది ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్ పరీక్షలకు 12 గంటల ముందు తమ విద్యార్థులకు ఆ ప్రశ్నలు అందించినట్టు ఆ కథనాలు తెలిపాయి. 'ఆఖరి నిమిషం టిప్స్' ప్రోగ్రాం మాటున తమ దగ్గరున్న 700 మందిలో వందమంది విద్యార్థుల దగ్గర అదనంగా సొమ్ము వసూలు చేసి వారిచేత బట్టీపట్టించిన వైనం అప్పట్లో సంచలనం కలిగించింది. మొదటిరోజున ఒక విద్యార్థి తండ్రి జేఈఈ చైర్మన్‌కు ఈ సంగతి ఫిర్యాదుచేసినా కుమారుడి వైఫల్యంపై వేదనతో ఆధారం లేని ఆరోపణ చేశారని ఆయన కొట్టిపారేశారు. తమ నిర్వాకంపై ఆయనకు అంత నమ్మకం మరి! కానీ మరుసటి రోజు మ్యాథ్స్ పేపర్‌ను ఫాక్స్ చేశాక ఆయనకు తత్వం బోధపడింది. కావాలని అక్కడక్కడ చేసిన కొద్దిపాటి మార్పులు మినహా అది తమ ప్రశ్నపత్రాన్నే పోలివుందని గ్రహించి చివరి నిమిషంలో ఆ పరీక్షను రద్దుచేశారు. ఆ లీకేజీకి అప్పటి కాన్పూర్ ఐఐటీ డైరెక్టర్‌కు వున్న పుత్రప్రేమే కారణమని కథనాలొచ్చాయి. ఆ ఏడాది రూర్కీ ఇంజనీరింగ్ కళాశాల ప్రవేశపరీక్షపై సైతం ఇలాంటి కథనాలే వెలువడినా అది రద్దు కాలేదు. ప్రశ్నపత్రాలు కైంకర్యం చేసి కోట్లాది రూపాయలు వెనకేస్తున్న మాఫియాతోపాటు కొన్ని సందర్భాల్లో ఉన్నతస్థాయి వ్యక్తులకుండే స్వప్రయోజనాలు, అవతలివారిని రాజకీయంగా దెబ్బతీసే ఉద్దేశాలు కూడా ఈ లీకులకు కారణమైన ఉదంతాలు లేకపోలేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీఆర్ కేబినెట్‌లో పాఠశాల విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన గాలి ముద్దు కృష్ణమనాయుడు అప్పట్లో పదో తరగతి ప్రశ్నపత్రాల లీకుకు నైతిక బాధ్యతవహిస్తూ తప్పుకున్నారు. చిత్తూరు జిల్లాలో తనను రాజకీయంగా దెబ్బతీసేందుకు పార్టీ ప్రముఖ నాయకుడే ఈ లీకేజీకి ఒడిగట్టారని ఆయన ఆరోపించటం ఎవరూ మరిచిపోరు. ప్రశ్నపత్రాలు సంపాదించే ఉద్యోగార్థుల్లో కొందరు గప్‌చిప్‌గా ఉండక సొమ్ము చేసుకోవాలని కక్కుర్తిపడిన సందర్భాల్లో లేదా తమ సన్నిహితులకు అందజేసినప్పుడు మీడియాకు వెల్లడై చాలాసార్లు చౌర్యం బయటపడుతుంటుంది. ఇలాంటివేమీ లేనప్పుడు అంతా సజావుగా సాగిపోతుంది.

నిజాయితీపరులైన ఉద్యోగార్థులను లీకేజీ దెబ్బతీస్తుంది. ప్రపంచ దేశాల్లో మనం నవ్వుల పాలవుతాం. గత అయిదేళ్లలో 15 రాష్ట్రాల్లో లక్షా నాలుగువేల ఉద్యోగాల భర్తీకోసం నిర్వహించిన ప్రవేశ పరీక్షల ప్రశ్నపత్రాలు లీకయ్యాయనీ, ఇందువల్ల కోటి 40 లక్షలమంది ఉద్యోగార్థుల భవిష్యత్తు దెబ్బతిందనీ ఒక ఆంగ్ల దినపత్రిక కథనం. ఈ లీకుల పర్యవసానంగా పరీక్ష రద్దు చేసినా, నిరవధిక వాయిదా వేసినా, పట్టించుకోకుండా వదిలేసినా దెబ్బతినేది నిరుద్యోగులే. నిరుడు తెలంగాణ, రాజస్థాన్‌లలో ప్రశ్నపత్రాల లీకు నిరుద్యోగ ప్రపంచాన్ని ఎంత కలవరపరిచిందో ఎవరూ మరిచిపోరు. అయితే లీకులకు కొన్ని సంస్థలు, వ్యకులను మాత్రమే బాధ్యులుగా చేయడంతో సరిపెట్టక రాజకీయ నాయకులు, ఏజెంట్లు, పోటీ పరీక్షల విభాగాల్లోవుండే అవినీతి అధికారులు వగైరాలతో కూడిన మాఫియా ముఠాలున్నాయని గుర్తిస్తే తాజా చట్టం మరింత కఠినతరం చేయటానికి అవకాశం వుంటుంది. లీకు సంగతి వెల్లడికాగానే రంగప్రవేశం చేసేలా ఈడీ, సీబీఐ తరహాలో ప్రత్యేక దర్యాప్తు సంస్థలను ఏర్పరచటంవల్ల బాధ్యులను గుర్తించటం వేగవంతమవుతుంది. ఈ కేసుల్లో నిందితుల విచారణకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ఏర్పాటు కూడా అవసరమే. ఇక లీకులవల్ల లబ్ధి పొందే ఉద్యోగార్థులను ఈ చట్టం పరిధినుంచి తప్పించటం ఎంతవరకూ సబబో ఆలోచించాలి. ఈ లీకుల లబ్ధిదారుల్లో సైతం భయభక్తులుంటేనే సమస్యను అరికట్టడం సాధ్యమవుతుంది.

వైద్యంలో ఏఐ తప్పులకు బాధ్యులెవరు?

విశ్లేషణ



దినేశ్ సి. శర్మ

అన్ని రంగాల మాదిరిగానే ఆరోగ్య రంగంలోనూ కృత్రిమ మేధ (ఏఐ) వాడటం మొదలైంది. వ్యాధి నిర్ధారణ, క్లినికల్ కేర్, చికిత్స, రోగుల వైద్య చరిత్రను అక్షరబద్ధం చేయడం, మందుల అభివృద్ధి వంటి పనులకు తగు జాగ్రత్తలతో 'ఎల్ఎంఎం'లను వాడొచ్చునని ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచిస్తోంది. ఆ మేరకు ఆరోగ్య సిబ్బందిపై భారం తగ్గుతుంది. మనిషి మాదిరిగానే స్పందించాలన్నది ఎల్ఎంఎంల తయారీ ఉద్దేశమన్నది తెలిసిందే. అలాంటప్పుడు వీటి ద్వారా తప్పులు జరిగితే బాధ్యత ఎవరిది? ఆరోగ్య సేవలు, ఉత్పత్తులకు అన్వయిస్తున్న నైతిక, మానవ హక్కుల ప్రమాణాలను ఏఐ టెక్నాలజీలు, టూల్స్‌కు కూడా విస్తరించాలి. భారీ స్థాయిలో ఎల్ఎంఎంలు విడుదలైన ప్రతిసారీ వీటిని కచ్చితంగా ఆడిట్ చేసే ఏర్పాట్లు చేసుకోవాలి.

ఛాట్‌జీపీటీ వంటి కృత్రిమ మేధ(ఏఐ) టూల్స్ వాడకం ఇటీవల బాగా పెరిగింది. అన్ని రంగాల్లో మాదిరిగానే ఆరోగ్య రంగంలోనూ కృత్రిమ మేధ టెక్నాలజీలను వాడటం మొదలుపెట్టారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ఈ విషయమై ఒక హెచ్చరిక జారీ చేసింది. ఛాట్‌జీపీటీ, బార్డ్ వంటి ఎల్ఎంఎం (లార్జ్ మల్టీ-మోడల్ మోడల్స్)లు అందించిన సమాచారం, వీడియోలకు మాత్రమే పరిమితం కాకుండా... అంతకంటే ఎక్కువ విషయాలపై వ్యాఖ్యానించగలవు. మనిషి మాదిరిగానే స్పందించాలన్నది ఎల్ఎంఎంల తయారీ ఉద్దేశమన్నది తెలిసిందే. పరిస్థితులకు తగ్గట్టుగా కొత్త విషయాలను ఎప్పటికప్పుడు నేర్చుకోవడం ఇవి చేసే పని. ఆరోగ్య రంగంలో వీటిని ఉపయోగించడం వల్ల తప్పుడు సమాచారం, ఏకపక్ష లేదా అసంపూర్తి సమాచారం అందే ప్రమాదాలు ఉంటాయనీ, ఇది మన ఆరోగ్యంపై ప్రభావం చూపవచ్చుననీ డబ్ల్యూహెచ్ఓ హెచ్చరించింది. శిక్షణ ఇచ్చేందుకే తప్పుడు సమాచారాన్ని ఉపయోగిస్తే పరిస్థితి మరింత అధ్వాన్నమవుతుందన్నది ఈ హెచ్చరిక సారాంశం. ముఖ్యంగా జాతి, కులం, మతం వంటి విషయాల్లో ఏఐ టెక్నాలజీలు వివక్షతో కూడిన సమాచారాన్ని తయారు చేసే ప్రమాదముంది.

ఏఐ వాడకం పెరిగిపోతున్న నేపథ్యంలో డబ్ల్యూహెచ్ఓ 2021లో సాధారణ మార్గదర్శకాలు కొన్నింటిని జారీ చేసింది. అదే సమయంలోనే ఆరోగ్య రంగంలో ఏఐ వాడకంతో రాగల ప్రయోజనాలనూ గుర్తించింది. నైతికత విషయంలో కొన్ని స్థూల మార్గదర్శకాలను సిద్ధం చేసింది. వాటి ప్రకారం... ఏఐ టెక్నాలజీలు స్వయం ప్రతిపత్తిని కాపాడేలా ఉండాలి. మానవ సంక్షేమం, భద్రత, ప్రజాప్రయోజనాలు, పారదర్శకతలకు పెద్దపీట వేయాలి. తెలివిగా ప్రవర్తించడంతోపాటు వివరించేలా ఉండాలి. బాధ్యత స్వీకరించాలి. అందరినీ కలుపుకొని పోవాలి. వివక్ష లేకుండా చూసుకోవాలి. వివరించేలా ఉండటం అంటే... ఏఐ తాలూకూ డిజైన్, వినియోగం విషయాల్లో దాపరికం లేకుండా తగినంత సమాచారం అందరికీ అందుబాటులో ఉంచడం!

పారదర్శకత ఆశించగలమా?

ఆరోగ్య రంగంలో ఏఐ వాడకంపై డబ్ల్యూహెచ్ఓ ఇటీవల మరి కొన్ని మార్గదర్శకాలను జారీ చేసింది. ఎల్ఎంఎంల ఆవిష్కరణతో ఇవి అనివార్యమయ్యాయి. ఎల్ఎంఎంల వాడకం గురించి అర్థం చేసుకోవాలంటే ఏఐ టెక్నాలజీని సమగ్రంగా తెలుసుకోవాల్సి ఉంటుంది. ఇది ఎల్ఎంఎం టూల్‌ను అభివృద్ధి చేయడంతో మొదలవుతుంది. అభివృద్ధి చేసేది కార్పొరేట్ కంపెనీ, యూనివర్సిటీ, స్టార్టప్ ఏదైనా కావచ్చు. ఇవన్నీ ఆధారపడేది సమాచార లభ్యత, నైపుణ్యాల పైనే.

తరువాతి దశలో అభివృద్ధి చేసిన ఎల్ఎంఎంకు ఓ ప్రోగ్రామింగ్ ఇంటర్ఫేస్ అందిస్తారు. లోటుపాట్లను సరిచేయడం, విస్తృత సమాచారంతో శిక్షణ ఇవ్వడం అన్నమాట. ఎల్ఎంఎంను భారీ సాఫ్ట్‌వేర్



వ్యవస్థలో భాగం చేయడం కూడా ఈ ప్రోగ్రామింగ్ ఇంటర్ఫేస్‌ను సిద్ధం చేసే థర్డ్ పార్టీ బాధ్యతే. ఈ పని చేసిన తరువాత ఈ కృత్రిమ మేధ ద్వారా సేవలు అందుతాయి. లేదా ఒక అప్లికేషన్ రెడీ అవుతుంది. ఏఐ టెక్నాలజీ అభివృద్ధి దశల్లో మూడోది వినియోగదారుడికి దీన్ని అందించే డిప్లాయర్. ఆరోగ్య రంగంలో ఈ డిప్లాయర్ ఎక్కువ సందర్భాల్లో ఆసుపత్రి, ప్రభుత్వ ఆరోగ్య సంస్థ లేదా ఫార్మా కంపెనీ అయివుంటుంది.

ఈ మూడు దశల్లో నైతికత, నియంత్రణకు సంబంధించిన చాలా ప్రశ్నలు, అంశాలు ఎదురవుతాయి. చాలాసార్లు డెవలపర్ పెద్ద టెక్ కంపెనీ అయి ఉంటుంది. ఎల్ఎంఎంల తయారీకి కావాల్సినన్ని నిధులు, టెక్నాలజీ నైపుణ్యాలు వీరి వద్దే ఉంటాయి. వీటి అభివృద్ధిలో వాడే అల్గారిథమ్స్, వాటి వల్ల రాగల ప్రమాదాల గురించి సామాన్యులకు తెలిసే అవకాశాలు తక్కువే. కార్పొరేట్ కంపెనీ కాబట్టి పారదర్శకత, నిబద్ధతలను కూడా ఆశించలేము.

నియంత్రణ ఎలా?

ఈ నేపథ్యంలోనే ప్రపంచవ్యాప్త ప్రభుత్వ నియంత్రణ సంస్థలకు ఒక బెంగ పట్టుకుంది. కొత్తగా అందుబాటులోకి వస్తున్న ఏఐ టూల్స్ ప్రస్తుత న్యాయ, చట్ట వ్యవస్థల్లోకి ఇముడుతాయా? మానవ హక్కులకు సంబంధించిన అంశాలతోపాటు దేశాల డేటా పరిరక్షణ చట్టాల విషయంలోనూ ఈ సందేహముంది. ఎల్ఎంఎంల ప్రవేశం ఒక రకంగా ప్రభుత్వ, నియంత్రణ సంస్థలు ఏమరుపాటుగా ఉన్న సమయంలో జరిగిందని చెప్పాలి. యూరోపియన్ యూనియన్ విషయాన్నే తీసుకుందాం. ఎల్ఎంఎంలను చేర్చేందుకే వీరు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ చట్టాన్ని చివరి దశలో మార్చాల్సి వచ్చింది.

డబ్ల్యూహెచ్ఓ నివేదిక ప్రకారం అల్గారిథమ్స్ ప్రస్తుత చట్ట, న్యాయ వ్యవస్థల పరిధిలోకి చేరే అవకాశం లేదు. మరోవైపు ఎల్ఎంఎంలు కూడా మనుషుల్లా చిత్తభ్రమలకు గురై తప్పుడు సమాచారాన్ని ఇవ్వవచ్చునని ఇప్పటికే పలు అధ్యయనాలు స్పష్టం చేశాయి. ఇంకో ఆందోళన ఏమిటంటే... ఈ ఎల్ఎంఎంల ద్వారా తప్పులు జరిగితే వాటికి బాధ్యత ఎవరిది? ఇలాంటి తప్పుల కారణంగా జరిగే నష్టం, కలిగే హాని, దుర్వినియోగాలకు ఎవరు బాధ్యులన్న విషయంపై కూడా పెద్ద ఎత్తున చర్చలు జరుగుతున్నాయి. పైగా ఈ ఎల్ఎంఎంలు సైబర్ సెక్యూరిటీ ముప్పులకు అతీతమేమీ కాదు. ఆరోగ్య రంగంలో వీటిని వాడితే రోగుల సమాచారం దుర్వినియోగమయ్యే అవకాశాలు ఎక్కువ.

ఆరోగ్య రంగంలో ఏఏ అంశాలకు ఎల్ఎంఎంలను వాడవచ్చునన్న విషయంపై డబ్ల్యూహెచ్ఓ ఒక స్థూల అంచనాకు వచ్చింది. వ్యాధి నిర్ధారణ, క్లినికల్ కేర్, లక్షణాలను పరిశీలించడం, చికిత్స, పరిపాలన, రోగుల వైద్య చరిత్రను అక్షరబద్ధం చేయడం వంటి పనులు... వైద్య, నర్సింగ్ శిక్షణ, శాస్త్రీయ పరిశోధన, మందుల అభివృద్ధి అన్న అంశాలకు మాత్రమే తగు జాగ్రత్తలతో ఎల్ఎంఎంలను వాడవచ్చునని సూచిస్తోంది. ఈ పనులన్నింటినీ ఎల్ఎంఎంలు చేస్తే ఆరోగ్య సిబ్బందిపై భారం అంతమేరకు తగ్గుతుంది. మరోవైపు ఓ కంపెనీ మెడికల్ ఎల్ఎంఎంను అభివృద్ధి చేసే పనిలో ఉంది. ఇది ప్రశ్నలకు సమాధానాలు చెప్పడం, వైద్యపరమైన సమాచారాన్ని సంక్షిప్తీకరించడం, అన్నింటినీ కలిపి వైద్యులకు స్థూల నివేదిక ఇవ్వడం వంటి పనులు చేస్తుంది. ఇలాంటివి ఎక్కువైన కొద్దీ వైద్యుడికి, రోగికి మధ్య ఉన్న సంబంధాలు దెబ్బతింటాయి.

మరి ఏం చేయాలి? ఎల్ఎంఎంల వాడకాన్ని పూర్తిగా అడ్డుకోవడమైతే కాదు. వీటిని అభివృద్ధి చేసే సమయంలో వీలైనంత ఎక్కువ పారదర్శకత తీసుకురావడం ఒకటైతే... వాడకం కూడా బాధ్యతాయుతంగా ఉండేలా చూసుకోవడం మరొకటి. ఈ దిశగా ముందు ప్రభుత్వాలు ఆరోగ్య రంగంలో వినియోగానికి తలపెట్టిన ఎల్ఎంఎంల మదింపు, అనుమతుల కోసం నియంత్రణ సంస్థలను ఏర్పాటు చేసుకోవాలి. అలాగే ఏఐ వ్యవస్థల అభివృద్ధికి లాభాపేక్ష లేకుండా అందరికీ అందుబాటులో ఉండేలా మౌలిక సదుపాయాలను సమకూర్చాలి. శక్తిమంతమైన కంప్యూటింగ్ వ్యవస్థలు, డేటా సెట్స్ అటు ప్రభుత్వ, ఇటు ప్రైవేట్ వ్యక్తులూ వాడుకోగలిగితే తప్పు ఒప్పుల గురించి ఒక స్పష్టమైన అంచనా ఏర్పడుతుంది. ఆరోగ్య సేవలు, ఉత్పత్తులకు ప్రస్తుతం అన్వయిస్తున్న నైతిక, మానవ హక్కుల ప్రమాణాలను ఏఐ టెక్నాలజీలు, టూల్స్‌కు కూడా విస్తరించాలి. ఆరోగ్య, వైద్య అంశాలకు సంబంధించి భారీ స్థాయిలో ఎల్ఎంఎంలు విడుదలైన ప్రతిసారి ఏఐ టూల్స్, టెక్నాలజీలను కచ్చితంగా ఆడిట్ చేసేలా ఏర్పాట్లు చేసుకోవాలి. ఏఐతో వచ్చే లాభాలపై అతిగా అంచనాలూ పెట్టుకోవద్దు; రాగల ముప్పులను తక్కువ చేసి చూడనూ వద్దు.

వ్యాసకర్త సైన్స్ అంశాల వ్యాఖ్యాత
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

కానిచ్చేద్దురూ!



పాకిస్తాన్ సాధారణ ఎన్నికల్లో, కాదు ఎంపికల్లో ఎటూ జనాన్ని ఓట్లు వేయనీయడం లేదు. అలాంటప్పుడు ఆ 'ఫలితాలు' ఏవో వెల్లడించేస్తే పోతుంది గదా! అనవసరంగా వాటికోసం ఎదురు చూడటం మాని, ఏవో 'విశ్లేషణలు' కానిచ్చేసి, ఇంకేదో పనికొచ్చే పనిలో పడిపోతాం కదా!

– సుశాంత్ సరీన్, ఫెలో

వెనక్కి వెళ్తున్నామా?



ఇప్పుడు ప్రభుత్వం మన పడక గదుల్లోకి రావొచ్చు. దాని అనుమతి లేకుండా కలిసి ఉంటున్నందుకు మనల్ని జైల్లో వేయొచ్చు. ఉత్తరాఖండ్ ఉమ్మడి పౌరస్మృతి బిల్లు తాలిబనీకరణ వైపుగా మనం ఎలా జారుతున్నామో చూపుతోంది. మన వ్యక్తిగత జీవితాలు ఇంకే మాత్రమూ మనవి కావు. అవి ప్రభుత్వానివి.

– వీర్ సంఘ్వీ, జర్నలిస్ట్


అదీ ఉద్దేశం



వాస్తవానికి, స్త్రీరాజ్యపు చట్టాలు రావడానికి కారణం 'సెలబ్రిటీ ఫెమినిస్టులు'. వాళ్లే సహజీవనాలను రిజిస్టర్ చేయాల్సిన పరిస్థితి తెచ్చారు. 'పెళ్లి పేరు మీద జరిపే శృంగారం = అత్యాచారం' కాబట్టే, రిజిస్టర్ చేసుకొమ్మని చెబుతున్నారు.

– అభిజిత్ అయ్యర్ మిత్రా, వ్యాఖ్యాత

దిద్దుబాటు అవసరం



ఒకవేళ ముస్లింలు తమను తాము సరిదిద్దుకుని, నిఖార్సయిన వాస్తవ ఇస్లాం ముఖాన్ని మనుషులకు చూపగలిగితే, మానవులందరూ ఇస్లాం వైపు ఆకర్షితులవుతారు.

– అయాతుల్లా అలీ ఖామేనీయా
ఇరాన్ సుప్రీం లీడర్

దూరంగా, దగ్గరగా!



బాలీవుడ్‌లో ఒక రకమైన దశ నడుస్తోంది. పాపులర్ సినిమాలను చాలామంది జనాలు తమకు అన్వయించుకోవడంలో ఇబ్బంది పడుతున్నారు. ఆ కథలన్నీ ఇంకేదో సమాంతర ప్రపంచంలో జరుగుతున్నట్టు అనిపిస్తున్నాయి. ఫలితంగా, జనాలు తమను తాము చూసుకోగలిగే కంటెంట్ ఉంటున్న ఓటీటీల వైపు మళ్లుతున్నారు.

– పర్మీందర్ సింగ్, వ్యాపారవేత్త

అంబేడ్కరుని విగ్రహం స్ఫూర్తితో...

ఇవ్వాళ ప్రపంచంలో ఎక్కువగా వినిపిస్తున్న పేర్లలో డా॥ బాబాసాహెబ్ అంబేడ్కర్ పేరొకటి. ప్రపంచ రాజ్యాంగాలను చదివిన వ్యక్తిగా, ప్రపంచ మహా మేధావుల్లో ఒక్కరిగా, మహిళల హక్కుల ప్రదాతగా, ప్రపంచంలో ఎక్కువ విగ్రహాలు కలిగిన వ్యక్తిగా అంబేడ్కర్‌ను ఈ రోజు ప్రపంచం గుర్తిస్తోంది, చూస్తోంది. ఆధునిక భారత రాజ్యాంగ నిర్మాతగా, ప్రతి మనిషికీ స్వేచ్ఛ, హక్కులు కల్పించిన వ్యక్తిగా, ప్రతి వ్యక్తికీ ఓటు హక్కు కోసం బ్రిటిష్ ప్రభుత్వంతోనే పోరాడిన మహనీయునిగా; దళిత, బహుజన, మైనారిటీ శూద్రుల హక్కుల కోసం నిరంతరం పోరాడిన నాయకునిగా మన దేశంలో ఆయనకు పేరుంది. ఇలా బాబాసాహెబ్ అంబేడ్కర్ గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది.



అంబేడ్కర్ ఆలోచనా విధానం నుంచి స్ఫూర్తి పొందిన ఏపీ ముఖ్యమంత్రి తన పరిపాలనలో ఆయన సూత్రాలను పొందుపరచారు. అలాగే ఇచ్చిన మాటకు కట్టుబడి రాష్ట్ర నడిబొడ్డున విజయవాడ పీడబ్ల్యూడీ గ్రౌండ్‌లో మొత్తం 206 అడుగులు ఎత్తు ఉన్న బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేశారు. దీనికి అదనంగా ఒక పెద్ద లైబ్రరీ, ఆయన చిత్ర పటాల ప్రదర్శనశాల, ఇంకా పార్క్ ఏర్పాటవుతున్నాయి.

రోజు రోజుకూ దేశంలో బాబా సాహెబ్ అంబేడ్కర్ స్ఫూర్తి మరింత విస్తరిస్తోంది. ఇది శుభ పరిణామం. ముఖ్యంగా విజయవాడలో నెలకొల్పిన భారీ అంబేడ్కర్ విగ్రహ స్ఫూర్తితో 100 మంది తెలుగు కవులు బాబా సాహెబ్ అంబేడ్కర్‌పై అద్భుతమైన కవిత్వం రాశారు. ప్రతి కవితలో అంబేడ్కర్ వ్యక్తిత్వం తొణికిసలాడుతోంది. ఈ కవితలతో 'అన్‌టచ్‌బుల్ వారియర్' పేరుతో ఒక బృహత్ సంకలనం రూపుదిద్దుకొంది. దీంట్లో మహాకవులుగా కీర్తిపొందిన వారి నుంచి ఇప్పుడిప్పుడే రాస్తున్న కవుల వరకూ ఉన్నారు. ఇంతమంది కవులు బాబాసాహెబ్ అంబేడ్కర్‌పై రాసిన మొదటి పుస్తకం ఇదే అని నేను అనుకుంటున్నాను.

ఈ కార్యానికి శ్రీకారం చుట్టింది తంగిరాల సోని. ఒకసారి కలిసి విజయవాడలో నెలకొల్పుతున్న ప్రపంచంలోనే ఎత్తైన విగ్రహం స్ఫూర్తితో 100 కవితల సంకలనం తీసుకుని వద్దాం అని నాకు చెప్పాగానే సరే అన్నాను. నా వంతుగా బాబాసాహెబ్ అంబేడ్కర్‌కు ఈ సంకలనం ద్వారా కొంతైనా రుణం తీర్చుకున్నానని అనుకుంటున్నాను. ఇదిగో ఇప్పుడు ఈ 100 కవితల 'అన్‌టచ్‌బుల్ వారియర్' మన ముందుకు వచ్చింది. ఈ పుస్తకం ఈ రూపంలోకి తీసుకురావడానికి కారకులైన ప్రతి ఒక్కరికీ అభినందనలు.

– డా॥ మొండితోక అరుణ్ కుమార్, ఏపీ శాసనమండలి సభ్యులు
('అన్‌టచ్‌బుల్ వారియర్'కు రాసిన ముందుమాట సంక్షిప్త రూపం)

అంతర్జాల విద్వేష క్రీడ

అభిప్రాయం



కాత్యాయనీ విద్మహే

భిన్న మత, తాత్విక జీవన విధానాల పట్ల, భిన్నాభిప్రాయాల పట్ల సమాజంలో అసహనం నానాటికీ వ్యవస్థీకృతం అవుతూ హేయమైన రీతులలో వ్యక్తమవుతోంది. ఫాసిజం, అన్ని జీవితపార్శ్వాలనూ, మానవ సంబంధాలనూ విషపూరితం చేయడానికి కొన్ని సాంకేతిక సాధనాలను సమకూర్చుకుంటున్నది. అలాంటి వాటిలో ట్రోలింగ్ ఒకటి. సంప్రదాయ స్కాండినేవియా కథలలో 'ట్రోల్' అనేమాట కొండల మీదనో గుహలలోనో అసహ్యకరమైన చిత్రరూపాలతో ఉండే మాంత్రికశక్తి గల చిన్నా పెద్దా జీవులకు పేరు. జానపద మానవుల భావనాత్మక ఊహాత్మక సృజనశక్తి మూలం 'ట్రోల్'. మానవులలోని బలహీనతలతో ఆడుకొనే ఆ జీవులను వీరోచితంగా ఎదుర్కొని విజయం సాధించటం గురించిన కథలు అక్కడినుండే పుట్టాయి.

అదేమాట మానవ జీవితంలో నిశ్శబ్ద విప్లవాన్ని తెచ్చిన అంతర్జాలంలో వినియోగదారుల మధ్య మొదలైన వెక్కిరింపులు, వేధింపులతో కూడిన సంభాషణకు– దాని ప్రత్యేక స్వభావాన్ని బట్టి ట్రోల్ అనేమాట 1980ల నుండి వాడుకలోకి వచ్చింది. అల్లరి, దురుద్దేశం, తప్పుడు సమాచారం, ఆధార రహిత ఆరోపణలు, విద్వేషం, విధ్వంసం వంటి వాటితో రాను రాను హానికర ప్రక్రియగా మారిపోయింది. అసాంఘిక చర్య అయింది. అహం కేంద్రీకృత భావాలు, మోసం, విషయాలను తారుమారు చేసే ధోరణి, సానుభూతి రాహిత్యం, మొహమాటం లేకపోవటం; ఇతరులను మాటలతో, చేతలతో బాధపెట్టి ఆనందపడే తత్వం, విధ్వంసంలో సంతృప్తి– ట్రోలింగ్ కారకాలుగా గుర్తించబడ్డాయి.

పేరును, ముఖాన్ని దాచుకొని అంతర్జాలం వేదికగా ఆడే విద్వేష క్రీడ ట్రోలింగ్. ఇంటర్నెట్– మనిషి జీవితంలో, చదువులలో, వృత్తి, వ్యాపార వ్యవహారాలలో విడదీయరాని భాగమయిన తరువాత పిల్లల నుండి పెద్దల వరకూ ఏదొక సమయంలో, సందర్భంలో ట్రోల్ అవ్వడానికి అవకాశాలు ఎక్కువని ప్రపంచ వ్యాప్తంగా అధ్యయనాలూ, పరిశోధనలూ చెప్తున్నాయి. అందువల్ల భయానికి, మానసిక ఒత్తిడికి, అనారోగ్యాలకు గురవుతూ, ఒక్కొకసారి తమ జీవనరంగాల నుండి దూరమవుతూ ఒంటరితనంలోకి కుంగిపోతున్న వాళ్ళ గురించి ఆందోళన పడుతూనే... దానిని ఎదుర్కొని నిలబడటం గురించి హెచ్చరించాయి. వాటిని పట్టించుకోకపోవటం, స్పందించకపోవటమే మంచిదని చెప్పాయి. 'డోంట్ ఫీడ్ ది ట్రోల్' అన్నది సుప్రసిద్ధ ఉపదేశ వాక్యం.

ట్రోల్ మీద జరిగిన అధ్యయనాలలో ప్రత్యేకంగా చెప్పుకోవలసినవి ఉన్నాయి. ఒకటి, భారతదేశపు పాత్రికేయురాలు స్వాతి చతుర్వేది వ్రాసిన 'ఐ యామ్ ఎ ట్రోల్; ఇన్‌సైడ్ ది సీక్రెట్ వరల్డ్ ఆఫ్ ది బీజేపీస్ డిజిటల్ ఆర్మీ' (జనవరి 2017). రెండవది, ఆస్ట్రేలియా దేశపు పాత్రికేయురాలు జింజర్ గొర్మన్ రాసిన ట్రోల్ హంటింగ్; ఇన్‌సైడ్ ది వరల్డ్ ఆఫ్ ఆన్‌లైన్ హేట్ అండ్ ఇట్స్ హ్యూమన్ ఫాల్‌ఔట్' (ఫిబ్రవరి 2019). ఇద్దరూ స్వీయానుభవం నుండి విస్తృతంగా పరిశోధన చేసి రాసిన పుస్తకాలివి. ఈ పాత్రికేయులు ఇద్దరూ తమపై జరిగిన ట్రోలింగ్ గురించి చెప్పుకొనటంతో పాటు, దానికి కారణమైన వ్యవస్థల ఉనికిని గుర్తించి వివరించటంపై శ్రద్ధ పెట్టారు. అంతర్జాల గుండాల వెనుక, అశ్లీల రాతగాళ్ల వెనుక, అసత్యాలను సత్యాలుగా ప్రచారం చేసేవాళ్ళ వెనుక కేంద్ర అధికార రాజకీయపార్టీ ఉన్న దనీ, అది ముస్లిముల



పట్ల విద్వేషాన్నీ; ప్రభుత్వ రాజకీయార్థిక విధానాల పట్ల, భిన్నాభిప్రాయం ఉన్నవాళ్ళ పట్ల అసహనాన్ని వెళ్లగక్కటానికీ అంతర్జాల సైన్యంతో ట్రోలింగులు జరిపిస్తున్నదని స్వాతి చతుర్వేది అనేక ఆధారాలతో నిర్ధారించి చెప్పింది.

జింజర్ గొర్మన్ ట్రోల్ చేయటానికి ప్రపంచమంతా విస్తరించిన వ్యవస్థీకృత సిండికేట్లు అంతర్జాతీయ నేరవ్యవస్థలతో కలగలిసి ఉన్నాయని నిరూపించింది. ట్రోలింగ్ వ్యక్తులనూ, భావాలను సమూహాలనూ ఉద్దేశించింది మాత్రమే కాదు. కార్పొరేట్ ప్రయోజనాలకు అంతర్జాలం నిర్మించిన విస్తృతమైన మార్కెట్ వ్యవస్థ కూడా ట్రోల్ వేదిక. అక్కడ ఆ యా ఉత్పత్తుల గురించి వినియోగదారులు చేసే సమీక్షలు, వ్యక్తం చేసే సందేహాలు, ఎగతాళి చేస్తూ చేసే వ్యాఖ్యలు కొనుగోలు దారులను పెంచటానికో, తగ్గించటానికో ఉపయోగపడతాయి. మార్కెట్ స్పర్థ ఇలాంటివాటిని పెంచి పోషిస్తుంది.

రాజకీయ అధికారం కోసం ట్రోల్ సాధనం అవుతున్నది మరిచిపోరాదు. ప్రతిపక్షపార్టీల ప్రతినిధులు కూడా ట్రోల్స్‌కు మినహాయింపు కాదు. అందువల్ల ట్రోల్ అన్నది నిరపేక్ష విషయం కాదని, రాజకీయ ప్రయోజనాలతో నిర్వహించబడుతూ ఆర్థిక ఆధిపత్యాన్ని కూడా స్థాపించగల వ్యవస్థ అని భావించవచ్చు. నానాటికీ సంక్లిష్టమవుతున్న ఆర్థిక, రాజకీయ ఆధిపత్య సంబంధాల, సంఘర్షణల నేపథ్యంలో ట్రోల్ ఒక అనివార్య సాధనంగా ముందుకు రావటం చూస్తాం. ఈ క్రమంలోనే సామాజిక రంగంలోకి విస్తరిస్తున్న స్వతంత్ర భావాలు గల మహిళలు ట్రోల్ అవుతున్నారు. మగవాళ్లు మత, జాతి, రాజకీయ విశ్వాసాలకు ట్రోల్ అవుతుంటే... స్త్రీలకు తరచు లైంగిక వేధింపులు, అవాంఛిత సెక్స్ మెసేజులు ఎదురవుతూ ఉంటాయి. లైంగిక ప్రతీకలతో అవమానించటం, అగౌరవపరచటం జరుగుతుంది. అదనపు అవమానాలకు గురిచేయబడుతుంది. ట్రోల్స్ వాటంతట అవి పుట్టవని, మనం నివసిస్తున్న సమాజ లక్షణాలే వాటిని ఉత్పత్తి చేస్తాయని జింజర్ అభిప్రాయపడటంలో ఆశ్చర్యం ఏముంది? ఈ నేపథ్యంలో 'ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక' (ప్రరవే), 'మలుపు ప్రచురణలు' కలిసి – ప్రశ్నించే స్త్రీల అనుభవ కథనాలతో 'ట్రోల్' పుస్తకాన్ని తీసుకు వస్తున్నాయి.

వ్యాసకర్త ప్రరవే తెలంగాణ కార్యదర్శి
(2024 ఫిబ్రవరి 10–11 తేదీలలో ఖమ్మంలో జరుగనున్న ప్రరవే ఏడవ మహాసభల సందర్భంగా)

జపమాల చేతబూని...

ఆంధ్రప్రదేశ్‌లోని విజ యవాడ నడిబొడ్డున గుణదల కొండపై 1923లో సిలువ, మేరీ మాత గుహలు నిర్మితమయ్యాయి. దక్షిణ భారతావనిలో తమిళనాడులో మహా ప్రసిద్ధమైన 'వెలాంగాణి మాత' పుణ్యక్షేత్రం తరువాత, ఈ గుణదల మాత పుణ్య క్షేత్రమే అంతటి ప్రసిద్ధి చెందినదిగా భావిస్తారు. ప్రతి ఏడాదీ ఫిబ్రవరి 9వ తారీఖు నుంచి 11వ తారీఖు వరకూ ఇక్కడ మేరీమాత ఉత్సవాలు జరుగుతాయి. దాదాపు అన్ని రాష్ట్రాల నుంచీ లక్షలాది భక్తులు వస్తారు.



మేరీ మాత అంటే కతోలిక (కేథలిక్) క్రైస్తవులే గుర్తుకు వస్తారు. క్రీస్తును తన కన్యత్వంలో నుంచి పవిత్రాత్మ ప్రభావంతో కన్నట్టి ఒక తల్లిలా వారు మేరీ మాతను గౌరవిస్తారు. క్రీస్తును గానీ, శిష్యుల్ని గానీ జీవితాంతం అంటి పెట్టుకొని వారికి తోడుగా నీడగా నిలిచిన ఒక మహా స్త్రీమూర్తి, మేరీ మాత! సాక్షాత్తు దేవాది దేవుడే సాతానుతో 'స్త్రీ సంతానానికి నీకు మధ్య వైరం జరుగుతూనే ఉంటుంది' అని సూచించిన ఆ స్త్రీమూర్తి ఈ మేరీ మాతయే. ఈ కారణాల వల్ల ఒక తల్లిలా మేరీ మాతను అత్యున్నతంగా గౌరవిస్తారు భక్తులు. మరియ మాత ముందు మోకరిల్లి జపం చేస్తారు. 53 పూసలతో జపదండలు చేతిలో ఉంచుకొని పూజకు ముందు జపాలు చేస్తారు. ప్రతి పూసలోనూ క్రీస్తు జీవన సంఘటనల్ని స్మరించుకొంటారు. మోకరిల్లినది మరియమాత ముందు! స్మరించేది మాత్రం క్రీస్తు సంఘటనలు!! ఇవేవీ పూజలు మాత్రం కావు. అయితే దేవునికి గురువులు దివ్య బలి పూజలు సమర్పిస్తారు. ఈ పూజలో క్రీస్తు జీవనం, ఆయన లక్ష్యం పూర్తిగా మరోసారి దర్శింపబడతాయి. ఏ మతానికైనా ఒక విశ్వాసం అనేది ఆత్మ బలం. అటువంటి ఆత్మ, ఆత్మీయతలతోనే పూజలూ, మతోత్సవాలూ జరుగుతూ ఉంటాయి. ప్రజలకు ఒకానొక ప్రశాంతత కలిగిస్తాయి.

– డా॥ బెర్నార్డ్ రాజు డి. । 98667 55024
(నేటి నుంచి గుణదల మాత శత వసంతోత్సవాలు)

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్య మాసం, తిథి: బ.చతుర్దశి ఉ.7.48వరకు, తదుపరి అమావాస్య తె.5.43 వరకు, తదుపరి మాఘ శు.పాడ్యమి, నక్షత్రం: శ్రవణం రా.12.30 వరకు, తదుపరి ధనిష్ఠ, వర్జ్యం: తె.4.17 నుండి 5.46 వరకు (తెల్లవారితే శనివారం), దుర్ముహూర్తం: ఉ.8.51 నుండి 9.34 వరకు, తదుపరి ప.12.35 నుండి 1.21 వరకు, అమృతఘడియలు: ప.2.40 నుండి 4.10 వరకు; రాహుకాలం: ఉ.10.30 నుండి 12.00 వరకు, యమగండం: ప.3.00 నుండి 4.30 వరకు, సూర్యోదయం: 6.35, సూర్యాస్తమయం: 5.54.



నాగోబా ప్రతిమ

నేటి నుంచి నాగోబా జాతర

- మెస్రం వంశీయుల ఆరాధ్య దైవానికి మహాపూజ
- ఆదిలాబాద్ జిల్లా కేస్లాపూర్‌లో సందడి..
- 12న గిరిజన దర్బార్

సాక్షి, ఆదిలాబాద్: నాగోబా జాతరకు వేళయింది. ఆదివాసీలైన మెస్రం వంశీయుల ఆరాధ్య దైవం సర్ప దేవుడికి శుక్రవారం మహాపూజలు చేయడం ద్వారా జాతరకు అంకురార్పణ జరగనుంది. రాష్ట్రంలో గిరిజన పండుగల పరంగా సమ్మక్క–సారలమ్మ జాతర తర్వాత అతిపెద్దదిగా ఈ జాతర గుర్తింపు పొందింది. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో కొలువైన నాగోబాకు మెస్రం వంశీయులు సొంతగా రూ.5 కోట్లకు పైగా నిధులు సమకూర్చుకుని రెండేళ్ల క్రితం నూతన ఆలయాన్ని నిర్మించారు. అధికారికంగా ఐదు రోజులపాటు నిర్వహించే ఈ జాతర అనధికారికంగా మరికొద్ది రోజులు కొనసాగుతుంది. రాష్ట్రం నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల నుంచి కూడా గిరిజనులు పెద్దసంఖ్యలో తరలివస్తారు. ప్రభుత్వం జాతర కోసం రూ.20 లక్షలు కేటాయించింది. భక్తుల కు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేసింది. కాగా, నాగోబా జాతర సందర్భంగా కేస్లాపూర్‌లో నిర్వహించే గిరిజన దర్బార్‌కు ప్రాముఖ్యం ఉంది. ఇది 12న నిర్వహించనున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఇతర మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకానున్నారు.

ఇసుక అమ్మకాలకు కొత్త పాలసీ

- అక్రమాలను అరికట్టేలా, ప్రజల అవసరాలు తీరేలా రూపొందించాలి... గనులు, ఖనిజ వనరులశాఖపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
- ప్రస్తుత ఇసుక విధానమంతా అవినీతికి ఆలవాలం
- ఒకే నంబర్, పర్మిట్‌తో ఐదారు లారీలు తిరుగుతున్నాయి.. ఆకస్మిక తనిఖీలు చేయించాం.. 25శాతం ఇసుక అక్రమంగా తరలుతోంది
- ఇసుక క్వారీయింగ్, అక్రమ రవాణాను వెంటనే అరికట్టాలి... అన్నిస్థాయిల్లో అవినీతి..
- అధికారులు తీరు మార్చుకోవాలని హెచ్చరిక
- అన్ని జిల్లాల్లో ఏసీబీ, విజిలెన్స్ తనిఖీలకు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇసుక విధానం అవినీతికి ఆలవాలంగా మారిందని.. అక్రమాలను అరికట్టేందుకు కొత్త విధానం తీసుకువస్తామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చటంతోపాటు ప్రజల అవసరాలకు అనుగుణంగా కొత్త పాలసీని రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని సూచించారు. ఇసుక రవాణా, టీఎస్ఎండీసీ కార్యకలపాలపై విజిలెన్స్, ఏసీబీ విభాగాలతో తనిఖీలు చేయాలని ఆదేశించారు. గురువారం సచివాలయంలో భూగర్భ గనులు, ఖనిజ వనరుల శాఖపై మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, సీఎస్ శాంతికుమారి, ఆ శాఖ అధికారులతో రేవంత్ సమీక్షించారు.



అన్ని స్థాయిల్లో అవినీతి

ఇసుక క్వారీయింగ్, రవాణాకు సంబంధించి అన్నిస్థాయిల్లో అక్రమాలు జరుగుతున్నాయని.. వాటిని వెంటనే అరికట్టాలని అధికారులను సీఎం హెచ్చరించారు. 48 గంటల్లోగా అన్నిస్థాయిల అధికారులు తమ పద్ధతి మార్చుకోవాలన్నారు. రెండు రోజుల తర్వాత ఏసీబీ, విజిలెన్స్ విభాగాలను రంగంలోకి దింపాలని.. అన్ని జిల్లాల్లో వెంటనే తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. అక్రమాలకు బాధ్యులైన ఏ ఒక్కరినీ వదిలిపెట్టవద్దని స్పష్టం చేశారు. అన్నిరూట్లలో ఉన్న టోల్‌గేట్ల వద్ద నమోదైన డేటా ఆధారంగా లారీల్లో ఇసుక అక్రమ రవాణా వ్యవహారాన్ని బయటికి తీయాలని సూచించారు. ఇసుక రీచ్‌లు, డంపులను తనిఖీ చేయాలని.. అక్రమాలకు పాల్పడినవారికి జరిమానాలు విధిస్తే సరిపోదని, కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఆకస్మిక తనిఖీలు చేయించి..: ఇసుక రీచ్‌లన్నింటా సీసీ కెమెరాలు ఉన్నాయని అధికారులు చెప్పడంపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఏడాది మార్చి 1న తాను కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో పాదయాత్ర చేసినప్పుడు మానేరు వాగులో తనుగుల ఇసుక క్వారీకి వెళ్లానని.. అక్కడ సీసీ కెమెరాలు లేవని చెప్పారు. ఈనెల 3న రవాణా విభాగంతో నిజామాబాద్, వరంగల్ రూట్లలో ఆకస్మిక తనిఖీలు చేయించామన్నారు. 83 ఇసుక లారీలను తనిఖీ చేస్తే.. అందులో 22 లారీలకు అనుమతి లేదని.. ఒకే పర్మిట్, ఒకే నంబర్‌తో నాలుగైదు లారీలు ఇసుక రవాణా చేస్తున్నాయని తేలిందని స్పష్టం చేశారు. అంటే 25శాతం ఇసుక అక్రమంగా తరలిపోతోందన్నారు.

అనుమతిలేని క్రషర్స్ సీజ్ చేయండి

హైదరాబాద్ చుట్టుపక్కల అనుమతి లేకుండా నిర్వహిస్తున్న స్టోన్ క్రషర్లను సీజ్ చేయాలని సీఎం ఆదేశించారు. భారీ భవన సముదాయాలు నిర్మించేటప్పుడు రోడ్లపై కంకర, బిల్డింగ్ మెటీరియల్ వేయకుండా అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. సెల్లార్ల కోసం ఆరు మీటర్ల కంటే లోతుగా తవ్వితే నిబంధనల ప్రకారం పన్ను వసూలు చేయాలని ఖనిజ వనరుల శాఖను ఆదేశించారు. అలాంటి భవన నిర్మాణాలకు అనుమతులు ఇచ్చేప్పుడే.. వాటి వివరాలు ఖనిజ వనరుల శాఖకు చేరేలా సమీకృత ఆన్‌లైన్ విధానం అమలు చేయాలన్నారు. గ్రానైట్, ఖనిజ తవ్వకాలు, అక్రమ రవాణాను అరికట్టేందుకు జియో ట్యాగింగ్, జీపీఆర్ఎస్‌ను వినియోగించాలని సూచించారు. గ్రానైట్‌తో పాటు ఇతర క్వారీలకు సంబంధించిన కేసులు ఏమేం ఉన్నాయి, ఏయే ఏజెన్సీల వద్ద ఉన్నాయి, వాటి పురోగతిపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

కులగణన ప్రక్రియకు పీపుల్స్ కమిటీ సూచనలు

సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించిన కమిటీ ప్రతినిధులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న కులగణన నిర్ణయం హర్షనీయమని పీపుల్స్ కమిటీ ఆన్ క్యాస్ట్ సెన్సెస్ పేర్కొంది. కులగణన ప్రక్రియలో భాగంగా పలువురు ఐఏఎస్ అధికారులు, ప్రొఫెసర్లు, ఉద్యమకారులు రాష్ట్ర ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరిన సంగతి తెలిసిందే. ఈ మేరకు 10 రకాల సూచనలతో వినతిని గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని పీపుల్స్ కమిటీ కలిసి అందజేసింది. సీఎంను కలిసిన వారిలో ప్రొఫెసర్ మురళీమనోహర్, మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి, ప్రొఫెసర్ ఎస్.సింహాద్రి, పద్మజాషా తదితరులున్నారు.

ఆర్ఎల్‌సీల నియామకాన్ని రద్దు చేయాలి

పీఆర్‌టీయూటీఎస్ నేతల డిమాండ్

సాక్షి, హైదరాబాద్: మైనార్టీ రెసిడెన్షియల్ విద్యా సంస్థల సొసైటీ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా జరిగిన ప్రాంతీయ కో–ఆర్డినేటర్ (ఆర్ఎల్‌సీ)ల నియామకాన్ని తక్షణమే రద్దు చేయాలని ప్రొగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్, తెలంగాణ (పీఆర్‌టీయూటీఎస్) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సంఘం అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ నేతృత్వంలోని బృందం గురువారం టీఎంఆర్ఈఐసీ కార్యదర్శి ఐషా మస్రత్ ఖానంను కలిసి ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు.

ప్రేమించట్లేదని... గొడ్డలితో నరికి...

పట్టపగలే నడిరోడ్డుపై యువతి హత్య

- ఖానాపూర్‌లో ప్రేమోన్మాది ఘాతుకం!
- ప్రేమ పేరిట వేధింపులు
- కాదన్న ఆ యువతి పెళ్లిని చెడగొట్టి... తనకి దక్కని ఆ యువతి మరెవరికీ దక్కకూడదంటూ గొడ్డలితో నరికి చంపి పరారీ
- అడ్డువచ్చిన మరో మహిళ, మూడేళ్ల బాలుడిపై దాడి... నిందితుడిని త్వరగా పట్టుకోవాలని మంత్రి సీతక్క ఆదేశం



నిందితుడు శ్రీకాంత్

ఖానాపూర్: నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లో ప్రేమోన్మాది ఘాతుకానికి యువతి బలైంది. ప్రేమించానని వెంట పడ్డాడు. కాదని ఆమె వేరే యువకుడితో నిశ్చితార్థం చేసుకుంటే ఆ పెళ్లిని చెడగొట్టాడు. తనకు దక్కని యువతి ఎవరికీ దక్కకూడదంటూ వెంటపడి నడిరోడ్డుపై దారుణంగా నరికి చంపాడు. పోలీసులు, మృతురాలి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. పట్టణంలోని అంబేద్కర్‌నగర్ కాలనీకి చెందిన షెట్పెల్లి గంగవ్వ–గంగారాం దంపతుల కుమార్తె అలేఖ్య (23), కోడలు జయశీల, మనుమడు రియాన్స్‌తో కలిసి గురువారం ఉదయం స్థానికంగా టైలరింగ్ శిక్షణకు వెళ్లారు. మధ్యాహ్నం ఇంటికి తిరిగి వస్తుండగా అదే కాలనీకి చెందిన యువకుడు జుంకింది శ్రీకాంత్ వారిని వెంబడించాడు. దిలావర్‌పూర్‌కు వెళ్లే ప్రధాన రహదారిపైకి రాగానే పదునైన ఆయుధంతో ముందుగా అలేఖ్యపై దాడిచేశాడు. దీంతో ఆమె అక్కడే కుప్పకూలింది. తర్వాత అందరూ చూస్తుండగానే గొడ్డలితో విచక్షణారహితంగా నరకడంతో అక్కడికక్కడే ఆమె మృతి చెందింది. అడ్డుకోబోయిన అలేఖ్య వదిన జయశీల, ఆమె కుమారుడు రియాన్స్‌పైనా దాడి చేసి అక్కడి నుంచి పరారయ్యాడు. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో గాయపడ్డ జయశీలను నిర్మల్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. రియాన్స్‌కు స్థానిక ఆస్పత్రిలోనే చికిత్స అందించారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ప్రేమ పేరిట ఏడాదిగా వేధింపులు

యువతి ఇంటర్ పూర్తి చేసి ఇంటి వద్దే ఉంటోంది. స్థానికంటే టైలరింగ్ శిక్షణ తీసుకుంటోంది. ఇటీవల గ్రూప్–4 పరీక్ష కూడా రాసింది. డిగ్రీ పూర్తి చేసిన శ్రీకాంత్ ఇటీవల కానిస్టేబుల్ పరీక్ష రాశాడు.సెలెక్ట్ కాకపోవడంతో ఖాళీగా ఉంటున్నాడు. ఇద్దరూ ఒకే సామాజిక వర్గానికి చెందినవారు. ఏడాదిగా శ్రీకాంత్ తనను ప్రేమించాలని ఆమె వెంట పడుతుండటం, మూడు నెలలుగా వేధింపులు పెరగడంతో బాధితురాలు ఈ విషయాన్ని తల్లిదండ్రులకు తెలిపింది. పోలీసులు అతన్ని పిలిపించి కౌన్సెలింగ్ చేశారు. అయినా అతనిలో మార్పు రాలేదు.

ఖాయమైన పెళ్లి చెడకొట్టి..

ఈ క్రమంలో యువతి తల్లిదండ్రులు జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలానికి చెందిన అబ్బాయితో ఇటీవల నిశ్చితార్థం జరిపించారు. ఈ విషయం తెలుసుకున్న శ్రీకాంత్.. అబ్బాయి వివరాలు తెలుసుకుని, ఆ యువతి తాను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని చెప్పాడు. దీంతో ఆ పెళ్లి సంబంధం చెడిపోయింది. దీంతో యువతి తండ్రి శ్రీకాంత్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు నిందితుడిని పిలిపించి మందలించారు. దీంతో పొరపాటైందని, ఇంకోసారి ఆమె జోలికి వెళ్లనని చెప్పాడు. కానిస్టేబుల్ పోస్టుకు సిద్ధమవుతున్నందున వదిలేయాలని కుటుంబ సభ్యులు వేడుకోవడంతో పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి వదిలేశారు.

పోలీసులకు ఫిర్యాదుతో పగ పెంచుకుని

పోలీసుల ఫిర్యాదు తర్వాత శ్రీకాంత్ ఉన్మాదిలా మారాడు. తనకు దక్కని యువతి ఎవరికీ దక్కకూడదని భావించాడు. ఈమేరకు ప్రణాళిక ప్రకారం.. ఆమె టైలరింగ్‌కు వెళ్లి వస్తుండగా దాడిచేసి దారుణహత్యకు పాల్పడ్డాడు. కాగా, యువతి తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినప్పుడే శ్రీకాంత్‌ను అరెస్ట్ చేసి ఉంటే.. ఈ ఘటన జరిగి ఉండేది కాదని స్థానికులు అంటున్నారు.

గాలింపు చేపట్టాం: డీఎస్పీ గంగారెడ్డి

నిందితుడిని పట్టుకునేందుకు గాలింపు చేపట్టామని నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి తెలిపారు. యువతి హత్యపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క డీఎస్పీ గంగారెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. నిందితుడిని త్వరగా పట్టుకోవాలని ఆదేశించారు.

బాలుడిపై వీధికుక్కల దాడి

తీవ్రగాయాలు.. హైదరాబాద్‌కు తరలింపు

నర్మెట: అయిదేళ్ల బాలుడిపై వీధికుక్కలు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. బాలుడి పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించారు. జనగామ జిల్లా నర్మెట మండలం మల్కపేటలో గురువారం జరిగిన ఈ సంఘటనపై గ్రామస్తులు తెలిపిన వివరాలివి. గ్రామానికి చెందిన బానోత్ హుస్సేన్ నాయక్ జనగామలో నివసిస్తుండగా.. బుధవారం కుటుంబ సభ్యులతో కలిసి గ్రామానికి వచ్చాడు. గురువారం ఇంటిముందు ఆడుకుంటున్న అతని కుమారుడు బీజన్‌పై వీధికుక్కలు దాడి చేయడంతో ముఖం, శరీరంపై తీవ్ర గాయాలయ్యాయి. దీంతో బాలుడిని కుటుంబ సభ్యులు జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.

హనీట్రాప్ చేసి.. కత్తులతో పొడిచి

- యూసుఫ్‌గూడలో రియల్ ఎస్టేట్ వ్యాపారి దారుణహత్య..50 కత్తిపోట్లు
- మర్డర్ దృశ్యాలతో స్నేహితుడికి వీడియోకాల్..
- వ్యాపార లావాదేవీలే హత్యకు కారణం



మృతుడు పుట్టా రాము

బంజారాహిల్స్ (హైదరాబాద్): పాత కక్షల నేపథ్యంలో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారిని 10 మంది కలిసి దారుణంగా హత్య చేశారు. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం సింగోటం గ్రామానికి చెందిన పుట్టా రాము (36) గతంలో ఆటోడ్రైవర్‌గా పనిచేశాడు. ఇటీవల రియల్ ఎస్టేట్ రంగంలోకి దిగాడు. కొద్ది రోజులు కాంగ్రెస్ పార్టీలో పనిచేసిన రాము ఇటీవల బీజేపీలో చేరి వివిధ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నాడు. హైదరాబాద్ చుట్టుపక్కల రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న సమయంలో రాముకు జీడిమెట్లకు చెందిన మణికంఠ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఇద్దరూ కలిసి రియల్ ఎస్టేట్ లావాదేవీలు చేసేవారు. అయితే వారి మధ్యలో వ్యాపారం విషయంలో గొడవలు జరిగి ఒకరిపై ఒకరు పోలీసు కేసులు కూడా పెట్టుకున్నారు. పరిస్థితులు ముదిరిపోవడంతో రాము హత్యకు మణికంఠ పథకం వేశాడు. గత రెండు రోజుల నుంచి రెక్కీ నిర్వహిస్తున్నాడు. ఈ నెల 5వ తేదీన రాము యూసుఫ్‌గూడలోని ఎల్ఎన్‌నగర్‌లో ఉంటున్న విషయం తెలుసుకున్న మణికంఠ బుధవారం రాత్రి 10 గంటల సమయంలో ఓ యువతితో ఫోన్ చేయించి హనీట్రాప్ చేయించాడు. ఆ యువతి ఫోన్‌కాల్ నమ్మిన రాము రాత్రి 10 గంటల సమయంలో ఎల్ఎన్‌నగర్‌లోని తన ఇంటికి వచ్చాడు. సరిగ్గా 11.15 గంటలకు మణికంఠతో పాటు బోరబండకు చెందిన జిలానీ అనే రౌడీషీటర్, మరో ఎనిమిది మంది కలిసి ఇంట్లోకి చొరబడి రామును కత్తులతో 50 పోట్లు పొడిచారు. అరగంట పెనుగులాడిన అనంతరం రాము కన్నుమూశాడు. రామును మర్డర్ చేసిన తరువాత ఆ దృశ్యాలను మణికంఠ ఓ స్నేహితుడికి వీడియో కాల్ చేసి చూపించాడు. రామును హనీట్రాప్ చేసిన యువతిని జూబ్లీహిల్స్ పోలీసులు విచారిస్తున్నారు. మణికంఠతో పాటు పారిపోయిన మిగతా నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మర్డర్ జరిగిన సమయంలో అక్కడ ఇద్దరు యువతులు కూడా ఉన్నట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుని భార్య, ఇద్దరు పిల్లలు స్వగ్రామంలో ఉంటుండగా, విషయం తెలియగానే ఆమె గురువారం జూబ్లీహిల్స్‌పోలీస్‌స్టేషన్‌కు చేరుకుంది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

కోరుట్లలో దారుణ హత్య!

- అందరూ చూస్తుండగానే బాధితుడికి కత్తిపోట్లు
- వివాహేతర సంబంధమే కారణమా?



వెంకటరమణ



నిందితుడు రఘు

కోరుట్ల: జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని అర్బన్ కాలనీలో అనుమల్ల వెంకటరమణ (54) అనే వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం...కోరుట్ల పట్టణంలోని గాంధీ రోడ్‌లో నివాసముండే అనుమల్ల వెంకటరమణ డైలీ ఫైనాన్స్ నిర్వహిస్తాడు. పట్టణ శివారులోని అర్బన్ కాలనీలోనూ వెంకటరమణకు ఓ ఇల్లు ఉండటంతో అక్కడివాళ్లకు ఇచ్చిన రుణాల వసూలుకు ప్రతిరోజూ సాయంత్రం కాలనీకి వెళ్తాడు. ఎప్పటిలాగే గురువారం సాయంత్రం 5 గంటల సమయంలో కాలనీలో డబ్బులు వసూలు చేసుకుని మోటార్ సైకిల్‌పై వెళుతుండగా, అదే కాలనీలో ఉంటున్న వాసాల రఘు (32) అనే యువకుడు వెంటపడి కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఛాతీ, వీపు భాగాల్లో గాయాలతో వెంకటరమణ కింద పడిపోయాడు. కిందపడిపోయిన వెంకటరమణపై రఘు మరోసారి కత్తితో దాడి చేయడంతో అక్కడిక్కడే ప్రాణాలు విడిచాడు. అనంతరం రఘు మోటార్‌సైకిల్‌పై పరారయ్యాడు. దాడికి పాల్పడిన సమయంలో రఘును అడ్డుకోవాలని వెంకటరమణ స్థానికులను ప్రాధేయపడినా.. రఘు బెదిరింపులతో వారు దగ్గరకు రాలేకపోయారు. కాగా, హత్యకు గురైన వెంకటరమణకు కాలనీలో ఉన్న ఓ మహిళతో పరిచయం ఉన్నట్లు సమాచారం. అనంతరం సదరు మహిళ బంధువుతోనూ సాన్నిహిత్యం పెంచుకునే ప్రయత్నం చేసినట్టు.. ఈ క్రమంలోనే వెంకటరమణకు, రఘుకు మధ్య గతంలో పలుమార్లు గొడవలు జరిగినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే వెంకటరమణను హత్యచేసినట్లుగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సింగూరుపై కొత్త ఎత్తిపోతల!

- మంతూరు వద్ద నిర్మాణానికి నీటి పారుదల శాఖ యోచన

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: హైదరాబాద్ జంట నగరాలకు తాగునీరు, సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు సాగునీరు అందిస్తున్న సింగూరు ప్రాజెక్టుపై ఓ కొత్త ఎత్తిపోతల నిర్మాణం చేపట్టాలని నీటిపారుదల శాఖ యోచిస్తోంది. వాస్తవానికి సింగూరు కింద 40 వేల ఎకరాల ఆయకట్టుకు కాళేశ్వరం నీళ్లు ఇవ్వాల్సి ఉంది. కాళేశ్వరం పనులు ఆగిపోవడంతో ప్రత్యామ్నాయంగా సింగూరు నుంచి ఇచ్చే ఆలోచన చేస్తోంది. సింగూరు ప్రాజెక్టు బ్యాక్ వాటర్ నుంచి నీటిని ఎత్తిపోసుకుని సుమారు 40 వేల ఎకరాలకు సాగు నీరందించేలా ఈ పథకానికి రూపకల్పన చేస్తోంది. సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం మంతూరు సమీపం నుంచి సింగూరు బ్యాక్ వాటర్‌ను పంప్ చేయాలని సూత్రప్రాయంగా నిర్ణయించింది. రెండు నుంచి నాలుగు టీఎంసీల నీటిని ఎత్తిపోసేలా ఈ పథకాన్ని డిజైన్ చేయాలని భావిస్తోంది. ఈ పథకం ద్వారా ఐదు మండలాల పరిధిలో ఆయకట్టు రైతులకు సాగునీరు అందించవచ్చని ప్రతిపాదించింది. నీటిపారుదల శాఖపై ఇటీవల ఉన్నత స్థాయిలో వరుస సమీక్షలు జరుగుతున్నాయి. ఈ సమావేశాల సందర్భంగా నూతన ఎత్తిపోతల పథకం తెరపైకి వచ్చినట్టు తెలిసింది.

సర్వేకు శ్రీకారం..

నూతన ఎత్తిపోతల పథకం నిర్మాణానికి అవసరమైన సర్వే కోసం త్వరలో టెండర్లు పిలిచేందుకు నీటిపారుదల శాఖ సిద్ధమైంది. ఈపథకం డిజైన్, పంప్ హౌస్‌ల నిర్మాణం, కాలు వలు.. తదితర అంశాలతో పాటు భూసేకరణపై డీపీఆర్‌లను తయారు చేసి నివేదిక ఇచ్చేలా ప్రైవేటు ఏజెన్సీకి బాధ్యతలు అప్పగించే యోచనతో నీటిపారుదల శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. కొద్ది రోజుల్లో ఈ సర్వే కోసం టెండరు నోటిఫికేషన్ విడుదల చేయనున్నారని సమాచారం.

సంగమేశ్వర, బసవేశ్వరలకు ప్రత్యామ్నాయం?

బీఆర్ఎస్ సర్కారు హయాంలో ఇదే సింగూరు ప్రాజెక్టుపై సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాలు నిర్మించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఉమ్మడి మెదక్ జిల్లాలో 3.84 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా రూ.4,427 కోట్లతో ఈ రెండు భారీ ఎత్తిపోతల పథకాలను నిర్మించాలని తలపెట్టింది. ఇంత భారీ మొత్తంలో నిధుల కోసం గత ప్రభుత్వం కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి, బ్యాంకుల నుంచి రుణాలు తీసుకునే ప్రయత్నం చేసింది. అయితే అనుకున్న మేరకు నిధుల సమీకరణ జరగకపోవడంతో పనులు ముందుకు సాగలేదు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వం మారిన నేపథ్యంలో సింగూరుపై కొత్త ఎత్తిపోతల పథకానికి కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టడం ఆసక్తి కరంగా మారింది. సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాలకు ప్రత్యామ్నాయంగానే ఈ కొత్త పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఈఎన్‌సీ మురళీధర్‌రావు రాజీనామా

- నేడు బాధ్యతలు అప్పగించనున్న వెంకటేశ్వర్లు
- కొత్త ఈఎన్‌సీల నియామకంపై నేడు నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ (జనరల్) సి.మురళీధర్ రావు గురువారం తన పదవికి రాజీనామా చేశారు. కృష్ణా ప్రాజెక్టుల అప్పగింత వివాదంతో పాటు పలు అంశాల నేపథ్యంలో రాజీనామా చేయాల్సిందిగా ప్రభుత్వం బుధవారం ఆదేశించింది. దాంతో గురువారం సచివాలయానికి చేరుకున్న మురళీధర్ రావు.. నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జాకు రాజీనామా పత్రాన్ని అందజేశారు. మరోవైపు రామగుండం ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లును విధుల నుంచి తొలగిస్తూ బుధవారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈయన నాలుగేళ్ల కిందటే పదవీ విరమణ చేయగా..ప్రభుత్వం ఆయన్ను పునర్నియమించింది. కాగా ఆయన పదవీ కాలం రానున్న మార్చి 31వ తేదీతో ముగియనుంది. అయితే అన్నారం బ్యారేజీ లోపాలపై 2డీ కోసం పుణేలో ఉన్న వెంకటేశ్వర్లు శుక్రవారం దిగువశ్రేణి అధికారులకు బాధ్యతలు అప్పగించనున్నారు. మరోవైపు 2011 ఆగస్టు 1వ తేదీ నుంచి ఈఎన్‌సీ (జనరల్)గా పనిచేస్తున్న మురళీధర్ 2013లో పదవీ విరమణ చేశారు. అయితే అప్పటి కిరణ్‌కుమార్ రెడ్డి ప్రభుత్వం.. ఆయన సర్వీసును కొనసాగించింది. మురళీధర్ పదేళ్ల పాటు కీలక పాత్ర పోషించారు. అయితే వయో భారం కారణంగా తనకు విశ్రాంతినివ్వాలని మూడేళ్లుగా కోరుతున్నారు. తాజాగా కృష్ణా ప్రాజెక్టుల వివాదంతో ఆయన్ను విధిగా తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

నేడు కొత్త ఈఎన్‌సీల నియామకం: కొత్త ఈఎన్‌సీల నియామకంపై శుక్రవారం ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. దీంతో పలువురికి స్థానచలనం కలుగనుంది. అయితే సీనియారిటీ పరంగా ఈఎన్‌సీ (జనరల్) పోస్టును ఈఎన్‌సీ (అడ్మిన్)గా పనిచేస్తున్న గుమ్మడి అనిల్‌కుమార్‌కు కట్టబెడతారనే ప్రచారం జరుగుతోంది. శ్రీరాంసాగర్ పునరుజ్జీవన పథకం అంచనా వ్యయాలపై అభ్యంతరాలు వ్యక్తం చేసినందుకు గాను.. గత ప్రభుత్వం ఆయన్ను ప్రాధాన్యం లేని ఈఎన్‌సీ (అడ్మిన్) పోస్టులో కూర్చోబెట్టింది. మరోవైపు ఈఎన్‌సీ (జనరల్) పోస్టు కోసం ఈఎన్‌సీ ఓ అండ్ ఎం గా పనిచేస్తున్న బి.నాగేంద్రరావు కూడా పోటీలో ఉన్నారు. అయితే ఆయన పదవీకాలం మూడు నెలల్లోనే ముగియనుంది. ఇక అనిల్‌కుమార్ 2025 అక్టోబర్‌లో పదవీ విరమణ చేయనున్నారు. పదవీ కాలం 20 నెలల దాకా ఉండటం, గత ప్రభుత్వంలో వేధింపులకు గురయ్యారనే సానుభూతి కూడా ఈయన నియామకానికి అనుకూలతలుగా అధికారులు భావిస్తున్నారు. ఇక ఈఎన్‌సీ (రామగుండం)గా ప్రస్తుతం సీఈగా పనిచేస్తున్న శంకర్ నాయక్ లేదా ఆదిలాబాద్ చీఫ్ ఇంజనీర్ (సీఈ)గా పనిచేస్తున్న టి. శ్రీనివాస్ నియమితులయ్యే అవకాశం ఉన్నట్టు సమాచారం.

రాష్ట్రాలపై కేంద్రం పెత్తనం ప్రమాదంలో ప్రజాస్వామ్యం

కేరళ సీఎం విజయన్ వ్యాఖ్య ● ఢిల్లీలో నిరసనకు ఆప్, డీఎంకే మద్దతు

న్యూఢిల్లీ: కేంద్రం పెత్తందారీ పోకడలు మన ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రమాదకరంగా మారాయని కేరళ సీఎం పినరయి విజయన్ ఆరోపించారు. కేంద్రం వైఖరిని వ్యతిరేకిస్తూ కేరళలోని వామపక్ష కూటమి(ఎల్డీఎఫ్) గురువారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసన చేపట్టింది. కేంద్రం తీరుతో ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు ఆర్థిక సమస్యలతోపాటు, పరిపాలనా వ్యవహారాల్లో గవర్నర్ జోక్యం ఇబ్బందికరంగా మారిందని విజయన్ చెప్పారు. రుణాలను, గ్రాంట్లను సరిగా ఇవ్వడం లేదన్నారు. తమది రాజకీయ పోరాటమెలా అవుతుందని ప్రశ్నించారు. రాష్ట్రాలకు సమాన గౌరవాన్ని, న్యాయమైన వాటాను ఇవ్వాలన్న పోరాటానికి ఇది ఆరంభమని విజయన్‌తో పాటు ఈ కార్యక్రమంలో మాట్లాడిన ఢిల్లీ, పంజాబ్ సీఎంలు కేజ్రీవాల్, భగవంత్‌మాన్, నేషనల్ కాన్ఫరెన్స్ చీఫ్ ఫరూక్ అబ్దుల్లా అన్నారు. కార్యక్రమంలో సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మాట్లాడారు. సీపీఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా, రాజ్యసభ సభ్యుడు సిబల్, డీఎంకే నేతలు పాల్గొన్నారు. కాగా, కాంగ్రెస్ ఈ కార్యక్రమానికి దూరంగా ఉంది. రాష్ట్రాలు ఎదుర్కొంటున్న అన్ని రకాల ఆర్థిక సమస్యలకు కేంద్రమే కారణమన్న ఎల్డీఎఫ్ వాదనను తాము అంగీకరించడం లేదని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది.



నిరసన కార్యక్రమంలో కేజ్రీవాల్, ఏచూరి, విజయన్, భగవంత్ మాన్, డి.రాజా

ఢిల్లీలో రైతుల నిరసన ర్యాలీలో ఉద్రిక్తత

- పార్లమెంట్‌ను ముట్టడించేందుకు యత్నం
- సరిహద్దుల్లో అడ్డుకున్న పోలీసులు

నోయిడా: వేలాది మంది రైతుల ర్యాలీ, నిరసన హోరుతో ఢిల్లీ శివార్లు గురువారం దద్దరిల్లాయి. ఉత్తర ప్రదేశ్‌లోని నోయిడా, గ్రేటర్ నోయిడా ప్రాంతాలకు చెందిన రైతులు ఢిల్లీలో పార్లమెంట్‌ను ముట్టడించేందుకు ప్రయత్నించారు. పార్లమెంట్ దిశగా దూసుకెళ్తుండగా పోలీసులు ఎక్కడికక్కడ బారికేడ్లు ఏర్పాటు చేసి వారిని అడ్డుకున్నారు. అభివృద్ధి ప్రాజెక్టుల కోసం సేకరించిన తమ భూములకు పరిహారం పెంచాలని రైతులు చాలా ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. భూములు తీసుకొని అభివృద్ధి చేసిన ప్లాట్లలో పది శాతం రెసిడెన్షియల్ ప్లాట్లు తమకు ఇవ్వాలని లేదా వాటికి సమానమైన పరిహారం చెల్లించాలని 2019 నుంచి ఉద్యమం కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం స్పందించకపోవడంతో పోరాటం ఉధృతం చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా, అఖిల భారతీయ కిసాన్ సభ ఆధ్వర్యంలో గురువారం పార్లమెంట్ వరకు ర్యాలీ తలపెట్టారు. దాదాపు 100 గ్రామాల నుంచి వేలాది మంది రైతులు తరలివచ్చారు. వీరిలో వృద్ధులు, మహిళలు సైతం ఉన్నారు. గురువారం మధ్యాహ్నం మహామాయ ఫ్లైఓవర్ నుంచి ర్యాలీగా బయలుదేరారు. చిల్లా సరిహద్దు వద్ద పోలీసులు భారీగా మోహరించారు. స్థానికంగా 144 సెక్షన్ విధించారు. నిరసనకారులను అడ్డుకున్నారు. ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఉద్రిక్తత నెలకొంది. దీంతో నోయిడా–గ్రేటర్ నోయిడా ఎక్స్‌ప్రెస్ రహదారితోపాటు పలు మార్గాల్లో భారీగా ట్రాఫిక్ స్తంభించింది.



మంచు పాన్పు

చలికాలపు రాత్రి నిద్రొస్తే మనమంతా బిర్రుగా ముసుగు తన్నిపడుకుంటాం. కానీ ఈ మంచు ఎలుగుబంటి మాత్రం సుఖమనిన ఇదియెగాద అనుకుంటూ మంచుపాన్పుపై హాయిగా నిద్రపోయింది. ఐస్‌బర్గ్‌పై ఎలుగు నిద్రపోతున్న ఫొటోను బ్రిటిష్ ఫొటోగ్రాఫర్ నీమా సరిఖానీ తీశారు. ఈ ఫొటో.. పీపుల్స్ ఛాయిస్ సంస్థ చేపట్టిన ఓటింగ్‌లో పాల్గొన్న వేలాది మందికి తెగ నచ్చేసింది. దీంతో నీమాను పీపుల్స్ ఛాయిస్ వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్ ఆఫ్ ది ఇయర్ పురస్కారంతో సత్కరించారు. నార్వేకు చెందిన స్వాల్‌బార్డ్ ద్వీపసమూహంలో ఉత్తర ధృవానికి అత్యంత సమీప ఐస్‌బర్గ్‌ల వద్ద ఈ ఫొటోను తీశారు.



అగ్ని పూలు

ఐస్‌లాండ్ దేశంలోని గ్రాండావ్ సిటీ సమీపంలోని అగ్నిపర్వతం బద్దలై భారీ ఎత్తున దుమ్ము, ధూళి, లావాలను వెదజల్లుతున్న దృశ్యం. డిసెంబర్ నుంచి ఈ సిలింగర్‌ఫెల్ అగ్నిపర్వతం బద్దలవడం వరసగా ఇది మూడోసారి. దీంతో దగ్గర్లోని బ్లూ లాగూన్ స్పా పరిసర ప్రజలను అక్కడి నుంచి ఖాళీచేయించారు. గత శుక్రవారం నుంచి ఇక్కడ వందలాది చిన్నపాటి భూకంపాలు సంభవించాయి. తర్వాత ఇలా ఒక్కసారిగా అగ్నిపర్వత బిలం బద్దలై వందల మీటర్ల ఎత్తుకు దుమ్ము, ధూళిని ఎగజిమ్మింది. దీంతో తీరనగరం గ్రాండావ్ లోని స్థానికులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

‘ఇది కర్తవ్య కాలం’

- మోదీ ప్రభుత్వ ఆర్థిక విజయాలపై పార్లమెంట్‌లో శ్వేతపత్రం
- యూపీఏ వదిలిపెట్టిన సవాళ్లను విజయవంతంగా అధిగమించామని వెల్లడి
- ‘అభివృద్ధి చెందిన భారత్’ మన గమ్యం అని స్పష్టీకరణ



న్యూఢిల్లీ: ''కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం వదిలిపెట్టిన సవాళ్లను ఎన్డీయే ప్రభుత్వం గత పదేళ్లలో విజయవంతంగా అధిగమించింది. దేశాన్ని అభివృద్ధి మార్గంలో నడిపించడానికి కఠిన నిర్ణయాలు తీసుకుంది'' అని కేంద్ర ప్రభుత్వం తమ శ్వేతపత్రం(వైట్ పేపర్)లో వెల్లడించింది. దేశ ఆర్థిక వ్యవస్థపై రూపొందించిన 59 పేజీల ఈ శ్వేతపత్రాన్ని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. యూపీఏ సర్కారు హయాంలో దేశ ఆర్థిక పరిస్థితి, మోదీ ప్రభుత్వ పాలనలో సాధించిన ఆర్థిక ప్రగతిని వైట్ పేపర్‌లో ప్రస్తావించారు. దీనిపై శుక్రవారం లోక్‌సభలో చర్చ జరిగే అవకాశం ఉంది. చర్చ అనంతరం మంత్రి నిర్మలా సీతారామన్ సమాధానమిస్తారు. ''2014లో నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన సమయానికి దేశ ఆర్థిక వ్యవస్థ అత్యంత బలహీనంగా ఉంది. ఆర్థిక నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఆర్థిక క్రమశిక్షణ మచ్చుకైనా లేదు. అవినీతి విచ్చలవిడిగా పెరిగిపోయింది. నిజంగా అదొక సంక్షోభ పరిస్థితి. యూపీఏ ప్రభుత్వ నిర్వాకాల వల్ల ఆర్థిక వ్యవస్థ వెనక్కిపోయింది. ఆర్థిక కార్యకలాపాల నిర్వహణలో అప్పటి ప్రభుత్వం దారుణంగా విఫలమైంది. యూపీఏ పాలనలో భారత్ ప్రపంచంలో అత్యంత బలహీన ఐదు ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఉండేది. యూపీఏ హయాంలో లెక్కలేనన్ని కుంభకోణాలు జరిగాయి. అప్పటి అవినీతి వ్యవహారాలు దేశ ప్రజల విశ్వాసాన్ని బలహీనపర్చాయి. 2013లో విదేశీ మారక నిల్వలు కనిష్ట స్థాయికి పడిపోయాయి. దానివల్ల మనం పెద్ద మూల్యమే చెల్లించాల్సి వచ్చింది. అప్పటి బలహీన నాయకత్వం వల్ల రక్షణ రంగం సైతం సన్నద్ధత కోల్పోయింది. 2014లో దారుణంగా దెబ్బతిన్న దేశ ఆర్థిక వ్యవస్థ యూపీఏ నుంచి ఎన్డీయే ప్రభుత్వానికి వారసత్వంగా వచ్చింది. ఆర్థిక వ్యవస్థను, పరిపాలనా వ్యవస్థను గాడిలో పెట్టే పనికి ఎన్డీయే ప్రభుత్వం పూనుకుంది. ఒక క్రమపద్ధతిలోకి తీసుకొచ్చింది. ఆర్థికంగా దేశానికి మంచి జరగాలంటే కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన ఆవశ్యకతను మోదీ ప్రభుత్వం గుర్తించింది. దేశ ఆర్థిక వ్యవస్థ పునాదులను పటిష్టంగా మార్చింది. ఇప్పుడు అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా మారింది. ప్రపంచంలో పెట్టుబడులకు ఆకర్షణీయమైన గమ్యస్థానంగా భారత్ అవతరించింది. మోదీ నాయకత్వంలో మన దేశం ప్రస్తుతం ప్రపంచంలో మొదటి ఐదు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా మారింది. మోదీ ప్రభుత్వం చేపట్టిన సంస్కరణల వల్ల కేవలం పదేళ్లలోనే ఈ ఘనత సాధ్యమైంది. ప్రపంచవ్యాప్తంగా ప్రతికూల పరిణామాలు, సవాళ్లు ఉన్నప్పటికీ మన ఆర్థిక వ్యవస్థ పురోగమనంలో కొనసాగుతోంది. చేయాల్సింది ఇంకా మిగిలే ఉంది. నిద్రించేలోగా చేరాల్సిన మైళ్లు, ఎక్కాల్సిన పర్వతాలు ఎన్నో ఉన్నాయి. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దుకోవాలి. అదే మన గమ్యం. ఇది మనందరి కర్తవ్య కాలం'' అని శ్వేతపత్రంలో ఎన్డీయే ప్రభుత్వం పిలుపునిచ్చింది.

మాకది దిష్టి చుక్క!

- కాంగ్రెస్ బ్లాక్ పేపర్‌పై ప్రధాని వ్యాఖ్య
- ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి మన్మోహన్ సింగ్ చక్రాల కుర్చీలో వచ్చారు
- మోదీ ప్రశంసలు
- రాజ్యసభలో 68 మంది సభ్యులకు వీడ్కోలు

సాక్షి, న్యూఢిల్లీ: ఎన్డీయే ప్రభుత్వ పదేళ్ల పాలనా వైఫల్యాలను ప్రస్తావిస్తూ కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన బ్లాక్ పేపర్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిష్టి చుక్కగా అభివర్ణించారు. దేశం అభివృద్ధి తాలూకు సరికొత్త శిఖరాలను అధిరోహిస్తోందని చెప్పారు. ఈ సమయంలో కాంగ్రెస్ సభ్యులు ధరించిన నల్ల దుస్తులు, ఆ పార్టీ విడుదల చేసిన బ్లాక్ పేపర్ దేశ పురోగతి యాత్రకు దిష్టి తగలకుండా పెట్టిన ‘దిష్టి చుక్క’గా భావించవచ్చని పేర్కొన్నారు. రాజ్యసభ నుంచి 68 మంది ఎంపీల పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో వారి వీడ్కోలుపై గురువారం సభలో జరిగిన చర్చలో ప్రధాని మోదీ మాట్లాడారు.

దారిచూపే దీపం మన్మోహన్ సింగ్

దేశానికి మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ అందించిన సేవలను ప్రధాని మోదీ ప్రత్యేకంగా కొనియాడారు. ఆయన ఆరుసార్లు రాజ్యసభ సభ్యులయ్యారని గుర్తుచేశారు. ''మన్మోహన్ సింగ్ సుదీర్ఘ కాలం పాటు దేశ ప్రజలకు అందించిన సహకారం, చేసిన మార్గదర్శకత్వం ఎప్పటికీ గుర్తుంటుంది. మన్మోహన్ వంటి విశిష్ట వ్యక్తులు దారి చూపే దీపం లాంటివారు. ఆయన నడవడిక నుండి సభ్యులంతా ఎన్నో విషయాలు నేర్చుకోవాలి'' అని సూచించారు. కొన్ని రోజుల క్రితం రాజ్యసభలో ఓ బిల్లుపై ఓటు వేసేందుకు మన్మోహన్ చక్రాల కుర్చీలో వచ్చిన విషయాన్ని మోదీ గుర్తు చేశారు. ''పార్లమెంట్ సభ్యుడిగా తన కర్తవ్యాన్ని ఎంత బాధ్యతగా నిర్వహించారో చెప్పడానికి ఇదొక స్ఫూర్తిదాయకమైన ఉదాహరణ. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు ఆయన చక్రాల కుర్చీలో వచ్చారు. ప్రజాస్వామ్యం గురించి ఎక్కడ చర్చ జరిగినా మన్మోహన్ పేరు ప్రస్తావనకు రావాల్సిందే'' అని ప్రశంసించారు. మన్మోహన్ సింగ్‌కు దీర్ఘాయుస్సు కలగాలని, ఆయన ఆరోగ్యప్రదమైన జీవనం సాగించాలని ప్రధాని మోదీ ఆకాంక్షించారు. పదవీ విరమణ చేస్తున్న ఇతర సభ్యులు పార్లమెంట్‌లో నేర్చుకున్న అంశాలను దేశ నిర్మాణం కోసం జరుగుతున్న కృషిని బలోపేతం చేయడానికి ఉపయోగించాలని కోరారు. రాజ్యసభ సభ్యులుగా పదవీకాలం పూర్తి చేసుకుంటున్న సభ్యులకు మోదీ శుభాకాంక్షలు తెలియజేశారు. మన్మోహన్ రాజ్యసభ పదవీ కాలం ఏప్రిల్ 3న ముగియనుంది.

ఏడాదంతా భూతాపం 1.5 డిగ్రీల పెరుగుదల

న్యూఢిల్లీ: కాలుష్యం, భూతాపం కారణంగా భూమిపై ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయన్నది తెలిసిన సంగతే. కానీ, 2023 ఫిబ్రవరి నుంచి 2024 జనవరి దాకా ఏడాదంతా భూసగటు ఉష్ణోగ్రత 1.52 డిగ్రీల సెల్సియస్ అధికంగా నమోదైనట్లు యూరోపియన్ యూనియన్‌కు చెందిన కోపర్నికస్ క్లైమేట్ చేంజ్ సర్వీసు(సీ3ఎస్) గురువారం వెల్లడించింది. 1850–1900 నాటి ఉష్ణోగ్రతల సగటుతో పోలిస్తే ఏడాది పొడవునా 1.52 డిగ్రీలు అధికంగా నమోదు కావడం ఇదే మొదటిసారి అని పేర్కొంది. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు ఇంకా పెరుగుతాయని చెప్పడానికి ఇదొక సంకేతమని తెలియజేసింది. ఈ ఏడాది జనవరి నెల అత్యంత వేడి జనవరిగా రికార్డుకెక్కిందని వివరించింది. 1850–1900 నాటి కంటే ఈ జనవరిలో 1.66 డిగ్రీల అధిక ఉష్ణోగ్రత నమోదైనట్లు తెలిపింది. వాతావరణంలో ఎల్‌నినో పరిస్థితులే ఇందుకు కారణమని అభిప్రాయపడింది. వాతావరణ మార్పులతోపాటు సెంట్రల్ పసిఫిక్ సముద్రంలో ఉపరితల జలాలు వేడెక్కడం వల్ల భూఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని కోపర్నికస్ క్లైమేట్ చేంజ్ సర్వీసు స్పష్టం చేసింది.

బుజ్జగింపు రాజకీయాలకు దారి తీస్తుంది

ఉప కోటాను రాష్ట్రాలు నిర్ణయించడంపై సుప్రీం

న్యూఢిల్లీ: వెనుకబడిన తరగతుల రిజర్వేషన్ కోటాను రాష్ట్రాలు నిర్ణయించడం ప్రమాదకరమైన బుజ్జగింపు రాజకీయాలకు దారి తీస్తుందని సుప్రీం కోర్టు పేర్కొంది. ఎస్సీలు, ఎస్టీల్లో ఉప వర్గీకరణ చేపట్టే అధికారం రాష్ట్రాలకు ఉంటుందా అనే అంశంపై గురువారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ సారథ్యంలోని ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ధర్మాసనం..అత్యంత వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్ ప్రయోజనాలను అందజేసే క్రమంలో రాష్ట్రాలు ఇతరులను వదిలేయరాదని తెలిపింది. ఎస్సీలు, ఎస్టీలు సజాతీయ సమూహాలు అయినందున వీరిలో వెనుకబడిన, బలహీన కులాలకు కోటా కోసం వారిని మళ్లీ వర్గీకరించలేమంటూ 2004లో ఈవీ చిన్నయ్య వర్సెస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఈ సందర్భంగా ధర్మాసనం గుర్తు చేసింది.

మావోయిస్టు నేత మృతి

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా – దంతెవాడ జిల్లాల సరిహద్దు అటవీప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మూడు దశాబ్దాలుగా క్రియాశీలకంగా పనిచేస్తున్న సీనియర్ మావోయిస్టు నేత ఒకరు చనిపోయారు. అతడిని మావో డివిజినల్ కమిటీ మాజీ సభ్యుడు చంద్రన్న అలియాస్ సత్యంగా గుర్తించారు. సుక్మా – దంతెవాడ జిల్లాల సరిహద్దు ప్రాంతంలో గురువారం రాష్ట్ర పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బృందాలు జరిపిన ఎదురుకాల్పుల్లో ఇతను మరణించారు. ఈయనపై రూ.8 లక్షల రివార్డు ఉంది. ఘటనా స్థలం నుంచి మందుగుండు సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నాయి.


‘పదేళ్ల అన్యాయ కాలం’

- ప్రభుత్వ వైఫల్యాలపై ‘బ్లాక్ పేపర్’ విడుదల చేసిన కాంగ్రెస్
- సర్కారుపై ఇది చార్జిషీట్ అని పేర్కొన్న మల్లికార్జున ఖర్గే

న్యూఢిల్లీ: కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వ పదేళ్ల వైఫల్యాలను ఎండగడుతూ ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ గురువారం ‘బ్లాక్ పేపర్’ విడుదల చేసింది. మోదీ పాలనా కాలంలో ప్రజలకు వాటిల్లిన సామాజిక, రాజకీయ, ఆర్థిక అన్యాయాన్ని ఇందులో ప్రముఖంగా ప్రస్తావించింది. మోదీ హయాంలో దేశ ఆర్థిక వ్యవస్థ దిగజారిందని, నిరుద్యోగం విపరీతంగా పెరిగిపోయిందని, నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, వ్యవసాయ రంగం విధ్వంసానికి గురైందని, మహిళలపై నేరాలు పెరిగాయని పేర్కొంది. పెద్ద నోట్లను రద్దు చేయడం అతిపెద్ద తప్పు అని స్పష్టం చేసింది. ఈ బ్లాక్ పేపర్‌కు ‘10 సంవత్సరాల అన్యాయ కాలం’గా పేరుపెట్టారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన వైట్ పేపర్‌కు పోటీగా ఈ బ్లాక్ పేపర్‌ను కాంగ్రెస్ తీసుకొచ్చింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే 54 పేజీల ఈ బ్లాక్ పేపర్‌ను నరేంద్ర మోదీ ప్రభుత్వంపై ‘చార్జిషీట్’గా అభివర్ణించారు. గత పదేళ్ల కాలమంతా అన్యాయ కాలమేనని విమర్శించారు. ఆయన ఢిల్లీలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోదీపై నిప్పులు చెరిగారు. పార్లమెంట్‌లో ఎన్నో మాటలు చెప్పే ప్రధానమంత్రి వైఫల్యాలను మాత్రం నిస్సిగ్గుగా దాచిపెడుతున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వ అసమర్థత గురించి తాము మాట్లాడితే దానికి ప్రాధాన్యం ఇవ్వడం లేదన్నారు. అందుకే సర్కారు వైఫల్యాలను ప్రజలకు తెలియజేయడానికి బ్లాక్ పేపర్ తీసుకొచ్చామన్నారు. ఉత్తరం, దక్షిణం పేరిట దేశాన్ని విచ్ఛిన్నం చేయడానికి కాంగ్రెస్ కుట్రలు పన్నుతోందని మోదీ చేసిన విమర్శలపై ఖర్గే స్పందించారు. గతంలో మాట్లాడిన మాటలను అబద్ధాలకోరులు మర్చిపోయారని ఎద్దేవా చేశారు. మోదీ గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు గుజరాత్ పన్ను హక్కులు అంటూ మాట్లాడారని గుర్తుచేశారు.

బీజేపీయేతర పాలిత రాష్ట్రాలపై వివక్ష

ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను కూల్చడానికి బీజేపీ కుట్రలు సాగిస్తోందని, దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని మల్లికార్జున ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీయేతర పాలిత రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, కేరళ, ఆంధ్రప్రదేశ్ నిర్లక్ష్యానికి గురవుతున్నాయని, వాటిపై వివక్ష కొనసాగుతోందని చెప్పారు. ఆయా రాష్ట్రాలకే కేంద్రం నిధులు ఇవ్వడంలేదని, పైగా నిధులిస్తే ఖర్చు చేయడం లేదంటూ అబద్ధాలు చెబుతోందని విమర్శించారు. ఇది కుట్ర కాదా? అని ప్రశ్నించారు. ఎలక్టోరల్ బాండ్ల ముసుగులో మోదీ ప్రభుత్వం లూటీకి పాల్పడుతోందని, ప్రజాస్వామ్యాన్ని అంతం చేయడానికి ఈ సొమ్మును వాడుకుంటోందని ఆరోపించారు. దేశవ్యాప్తంగా 411 మంది ఎమ్మెల్యేలను బీజేపీ వైపు తిప్పుకున్నారని, పలు రాష్ట్రాల్లో ప్రభుత్వాలను పడగొట్టారని ఆక్షేపించారు.



బ్లాక్ పేపర్‌ను విడుదల చేస్తున్న ఖర్గే

దళితుడిని లక్ష్యంగా చేసుకుంటున్నారు

తనను దూషిస్తూ కొన్నిరోజులుగా ఫోన్‌కాల్స్ వస్తున్నాయని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశానని ఖర్గే తెలిపారు. 53 ఏళ్లుగా ప్రజా జీవితంలో కొనసాగుతున్నానని, దళితుడినైన తనను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఖర్గే ఆవేదన వ్యక్తం చేశారు. ధరల పెరుగుదల గురించి తాము నిలదీసినప్పుడల్లా ప్రధాని మోదీ.. జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ గురించి మాట్లాడుతున్నారని తప్పుపట్టారు.

ఇంటర్నెట్ బంద్..ఉగ్ర దాడులు

- పాకిస్తాన్‌లో ఎట్టకేలకు ముగిసిన సాధారణ ఎన్నికలు
- మొదలైన ఓట్ల లెక్కింపు ప్రక్రియ

ఇస్లామాబాద్: పొరుగుదేశం పాకిస్తాన్‌లో హింసాత్మక ఘటనల మధ్య సాధారణ ఎన్నికలు ఎట్టకేలకు ముగిశాయి. మొత్తం 12.8 కోట్ల మంది ఓటర్ల కోసం 6.50 లక్షల మంది భద్రతా సిబ్బంది బందోబస్తు విధులు నిర్వహించారు. పోలింగ్ నేపథ్యంలో గురువారం ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించింది. ఉదయం 8 గంటలకు మొదలైన పోలింగ్ సాయంత్రం 5 గంటలకు ముగిసింది. ఆ వెంటనే అధికారులు ఓట్ల లెక్కింపు ప్రక్రియను మొదలుపెట్టారు. శుక్రవారం ఉదయాని కల్లా ఫలితాల సరళిపై స్పష్టత వస్తుందని భావిస్తున్నారు.

ఉగ్రదాడుల్లో ఆరుగురు మృతి

ఖైబర్ ఫంక్తున్వా ప్రావిన్స్‌లో జరిగిన వేర్వేరు ఘటనల్లో ఆరుగురు భద్రతా సిబ్బంది చనిపోయారు. డేరా ఇస్మాయిల్ ఖాన్‌లోని కలాచి వద్ద భద్రతా సిబ్బంది వాహనాన్ని బాంబుతో పేల్చిన ఉగ్రవాదులు విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఘటనలో నలుగురు జవాన్లు చనిపోయారు. మరో ఘటన..బలోచిస్తాన్‌లోని ఖరాన్‌లో మందుపాతర పేలి ఇద్దరు పోలీసులు చనిపోగా మరో ఏడుగురు గాయపడ్డారు. భద్రతా కారణాలు చూపుతూ అధికారులు ఇరాన్, అఫ్గానిస్తాన్ సరిహద్దులను గురువారం మూసివేశారు. సరుకు రవాణా వాహనాలతోపాటు పాదచారులను సైతం అనుమతించలేదు. పోలింగ్ ప్రారంభమైన వెంటనే మొబైల్, ఇంటర్నెట్ సర్వీసులను దేశవ్యాప్తంగా నిలిపివేశారు. అయితే, రిగ్గింగ్‌ను యథేచ్ఛగా కొనసాగించేందుకే ఇంటర్నెట్ సేవలను ప్రభుత్వం నిలిపివేసిందని ప్రతిపక్షాలు ఆరోపించాయి. దీనిపై ఎన్నికల కమిషనర్ సికందర్ సుల్తాన్ రజా స్పందిస్తూ ఉగ్రదాడులు జరిగితే బాధ్యతెవరిదని ప్రశ్నించారు. ఎన్నికలకు, ఇంటర్నెట్‌తో ఎటువంటి సంబంధం లేదన్నారు.



కరాచీలో సిరా గుర్తు చూపిస్తున్న మహిళా ఓటర్లు

మద్దతుదారుల మధ్య ఘర్షణ

అటోక్ నియోజకవర్గంలో రెండు చోట్ల పీఎంఎల్–ఎన్, పీటీఐ పార్టీ మద్దతుదారుల మధ్య ఘర్షణతో పోలింగ్ 5 గంటలపాటు ఆగిపోయింది. కొన్ని ప్రాంతాల్లో సిబ్బంది విధులకు రాకపోవడం, బ్యాలెట్ పేపర్లు చాలినన్ని అందకపోవడం, బ్యాలెట్ పేపర్లలో తప్పులు వంటి కారణాలతో చాలా చోట్ల పోలింగ్ ఆలస్యమైంది. బలోచిస్తాన్, ఖైబర్ ఫంక్తున్వా ప్రావిన్స్‌ల్లో వర్షం, అతిశీతల వాతావరణ పరిస్థితుల మధ్య చాలా చోట్ల ఓటేసేందుకు జనం బయటకు రాలేదు.

48 గంటలపాటు అంటిపెట్టుకొని ఉంది

సిమ్లా: ట్రెక్కింగ్‌లో భాగంగా పర్వతారోహణకు వెళ్లి ప్రాణాలు కోల్పోయిన యువతీ యువకుల జాడను కనిపెట్టడంతో వారి పెంపుడు శునకం ఎంతగానో సాయపడింది. దాదాపు 48 గంటలపాటు అది అక్కడే ఉండి అరుస్తూ సాయం కోసం ఎవరైనా వస్తారేమోనని ఎదురుచూసింది. హిమాచల్ ప్రదేశ్‌లోని బిర్ బిల్లింగ్‌లో ఈ ఘటన జరిగింది. పంజాబ్‌లోని పఠాన్‌కోట్‌కు చెందిన 30 ఏళ్ల అభినందన్ గుప్తా, మహారాష్ట్రకు చెందిన 26 ఏళ్ల ప్రణీత వాలా సోమవారం బిర్ బిల్లింగ్ వద్ద ట్రెక్కింగ్‌కు బయల్దేరారు. ట్రెక్కింగ్ చేసి తిరుగుపయనంలో కిందకు దిగి వస్తూ ప్రమాదవశాత్తు లోయలో పడిపోయారు. అపస్మారకస్థితిలో గంటలకొద్దీ సమయం మంచులో కూరుకుపోవడంతో ప్రాణాలు కోల్పోయారు. ట్రెక్కింగ్ వేళ వీరితోపాటు పెంపుడు శునకం వెంట వచ్చింది. వీరు పడిపోవడంతో గమనించి ఘటనాస్థలికి పరుగున వచ్చింది. 48 గంటలపాటు అక్కడే సాయం కోసం అరుస్తూ నిల్చుంది. గాలిస్తున్న సహాయక బృందాలు ఎట్టకేలకు వీరి జాడను గుర్తించాయి. ఆ ప్రాంతంలో జర్మన్ షెపర్డ్ జాతి శునకం ఒకటి ఆపకుండా అరుస్తుండటంతో అటుగా వెళ్లి వీరి జాడను కనిపెట్టగలిగామని సహాయక బృందం తెలిపింది.

ప్రధాని మోదీ జన్మతః ఓబీసీ కాదు

కాంగ్రెస్ నేత రాహుల్ వ్యాఖ్య

ఝార్సుగూడ(ఒడిశా): ప్రధాని మోదీ జన్మతః ఇతర వెనుకబడిన వర్గం(ఓబీసీ)వ్యక్తి కాదని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. తనను తాను ఓబీసీ అని చెప్పుకుంటూ ప్రజలను మోదీ తప్పుదోవ పట్టిస్తున్నారని వ్యాఖ్యానించారు. మోదీ ఘాంచి కులంలో పుట్టారని, 2000 సంవత్సరంలో గుజరాత్‌లోని బీజేపీ ప్రభుత్వం ఈ కులాన్ని ఓబీసీ జాబితాలో చేర్చిందని వివరించారు. భారత్ జోడో న్యాయ్ యాత్రలో భాగంగా గురువారం రాహుల్ గాంధీ ఒడిశాలోని ఝార్సుగూడలో జరిగిన సభలో మాట్లాడారు. గుజరాత్‌కు ముఖ్యమంత్రి అయ్యాక మోదీయే ఈ కులాన్ని ఓబీసీలో చేర్చారు. ఈ దృష్ట్యా, మోదీ పుట్టుకతోనే ఓబీసీకి చెందిన వ్యక్తి కారని పేర్కొన్నారు. అంతకు ముందు, మోదీది తెలి కులమని పేర్కొన్న రాహుల్ ఆ తర్వాత తన ఉద్దేశం ఘాంచి కులమంటూ వివరణ ఇచ్చారు. దేశంలో సామాజిక న్యాయం సాధించకుండా ప్రధాని మోదీ కులగణనను ఎప్పటికీ చేపట్టలేరని రాహుల్ చెప్పారు. ఓబీసీలతో కరచాలనం చేయని మోదీ బిలియనీర్లను మాత్రం ఆలింగనం చేసుకుంటారని విమర్శించారు. ‘ఒడిశాలోని గిరిజనుల భూములను లాగేసుకునేందుకు కుట్ర జరుగుతోంది. రాష్ట్రంలోని అధికార బీజేడీ, బీజేపీల మధ్య పీ, డీ తేడా మాత్రమే ఉంది. మిగతాదంతా సేమ్ టూ సేమ్. ఒకే నాణేనికి ఈ పార్టీలు రెండు పార్శ్వాలు’అని రాహుల్ పేర్కొన్నారు. ఒడిశాలో సుమారు 200 కిలోమీటర్ల మేర సాగిన జోడో యాత్ర గురువారం ఛత్తీస్‌గఢ్‌లోకి ప్రవేశించింది.

భారత్-మయన్మార్ సరిహద్దుల్లో స్వేచ్ఛా సంచారం బంద్

న్యూఢిల్లీ: భారత్–మయన్మార్ మధ్య ఫ్రీం మూమెంట్ రెజీమ్(ఎంఎంఆర్)ను రద్దు చేయనున్నట్లు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. దేశ అంతర్గత భద్రత, ఈశాన్య రాష్ట్రాల జనాభా నిర్మాణ పరిరక్షణ కోసం కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. ఎఫ్ఎంఆర్‌ను తక్షణమే రద్దు చేయాలంటూ హోం శాఖ అందజేసిన ప్రతిపాదనపై అంతర్గత వ్యవహారాల విభాగం చర్యలు తీసుకుంటోందని అమిత్ షా చెప్పారు. ఎఫ్ఎంఆర్ ఫలితంగా రెండు దేశాల సరిహద్దుల్లోని 16 కిలోమీటర్ల భూభాగంలో ఎటువంటి పత్రాలు అవసరం లేకుండా సంచరించే వెసులుబాటు ఉంది. భారత్–మయన్మార్‌లు సుమారు 1,643 కిలోమీటర్ల పొడవైన సరిహద్దును కలిగి ఉన్నాయి. యాక్ట్ ఈస్ట్ విధానంలో భాగంగా 2018 నుంచి తీసుకువచ్చిన ఎఫ్ఎంఆర్ విధానం ప్రస్తుతం మిజోరం, మణిపూర్, నాగాలాండ్, అరుణాచల్‌ప్రదేశ్‌లలో అమల్లో ఉంది. సరిహద్దుల్లో కంచె నిర్మించాలంటూ ఇంఫాల్ లోయలో ఉండే మైతీలు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నారు. ఎఫ్ఎంఆర్‌ను అవకాశంగా తీసుకుని ఉగ్రవాదులు దేశంలోకి యథేచ్ఛగా ప్రవేశిస్తున్నారని, డ్రగ్స్ వ్యాపారం సాగుతోందని వారు ఆరోపిస్తున్నారు.

సాక్షి హైదరాబాద్

శుక్రవారం । 9 । ఫిబ్రవరి । 2024



ఈవీఎంల పనితీరుపై పరిశీలన

సాక్షి, సిటీబ్యూరో: లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కమిషనర్ రోనాల్డ్ రాస్ గురువారం విక్టరీ ప్లేగ్రౌండ్‌లో ఈవీఎంలను ఫస్ట్ లెవల్ చెకింగ్ (ఎఫ్ఎల్‌సీ) చేశారు.

నగరంలో ఉష్ణోగ్రత @ 35 డిగ్రీలు

సాక్షి, సిటీబ్యూరో: వేసవి వచ్చేసింది. నాలుగు రోజులుగా ఎండలు ముదురుతున్నాయి. నగరంలో గురువారం 35 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. సాధారణ ఉష్ణోగ్రతల కంటే 3.5 డిగ్రీలు అధికంగా నమోదయ్యాయి. ఎండాకాలం ప్రారంభంలోనే పరిస్థితి ఇలా ఉంటే మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఎండలు దంచి కొట్టే అవకాశాలున్నాయి.

'ఈఎస్‌సీఐ'కి గోల్డెన్ పీకాక్ అవార్డు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఈఎస్‌సీఐ).. 2024 సంవత్సరానికి గాను 'గోల్డెన్ పీకాక్ నేషనల్ ట్రైనింగ్ అవార్డు'కు ఎన్నికైంది. మాజీ జస్టిస్ ఎం.ఎన్. వెంకటాచలయ్య అధ్యక్షతన అవార్డ్స్ జ్యూరీ ఈ విషయాన్ని ప్రకటించింది. మార్చి 5న అబుదాబీలో గోల్డెన్ పీకాక్ అవార్డ్స్ ట్రోఫీ, సర్టిఫికెట్‌లను ఈఎస్‌సీఐ డైరెక్టర్ డాక్టర్ జి. రామేశ్వర్ రావు అవార్డు అందుకోనున్నారు.

న్యూస్‌రీల్

ప్రోత్సాహంతోనే ఉత్తమ ఫలితాలు

ఆర్టీసీ ఈడీ వెంకటేశ్వర్లు

కాచిగూడ: ఉద్యోగులకు ప్రోత్సాహం అందించడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఆర్టీసీ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. ఆర్టీసీలో ఉత్తమ ఫలితాలు సాధించిన ఉద్యోగులకు గురువారం ఆర్టీసీ కాచిగూడ డిపోలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రీజినల్ స్థాయిలో ఆర్టీసీ ప్రగతి చక్రం పేరుతో త్రైమాసిక పురస్కారాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఈడీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకాన్ని విజయవంతం చేయడంలో ఆర్టీసీ ఉద్యోగుల పాత్ర మరువలేనిదన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ రీజినల్ మేనేజర్ వరప్రసాద్, డిప్యూటీ రీజినల్ మేనేజర్లు విజయభాను, సుచరిత, జగన్, కాచిగూడ డిపో మేనేజర్ టి.రఘు తదితరులు పాల్గొన్నారు. అత్యధిక ఆదాయం సాధించిన కండక్టర్‌లకు, ఇంధన పొదుపు చేసిన డ్రైవర్‌లను ఈ సందర్భంగా సత్కరించి బహుమతులు ప్రదానం చేశారు.

జీహెచ్ఎంసీకి రూ. 200 కోట్లు

- భూ సేకరణల నిమిత్తం
- బడ్జెట్ రిలీజ్ ఉత్తర్వు జారీ

సాక్షి, సిటీబ్యూరో: భూ సేకరణల కోసం ప్రభుత్వం జీహెచ్ఎంసీకి రూ. 200 కోట్ల బడ్జెట్‌ను విడుదల చేసింది. ఈ మేరకు మున్సిపల్ పరిపాలన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్ ఉత్తర్వు జారీ చేశారు. 2023– 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ బడ్జెట్ రిలీజ్ ఆర్డర్ (బీఆర్‌ఓ)ను జారీ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జీహెచ్ఎంసీకి ఈ నిధులు విడుదల చేసింది. గతంలో బీఆర్ఎస్ హయాంలో ప్రత్యేకంగా భూసేకరణల కోసమంటూ నిధులు విడుదల కాలేదు. జీహెచ్ఎంసీలో ఎస్సార్‌డీపీ, తదితర పథకాల కింద చేపట్టిన పనులు పురోగతిలో ఉన్నాయి. అప్పట్లో టౌన్‌ప్లానింగ్ టీడీఆర్‌ల ద్వారానే భూసేకరణల పరిహారం ఎక్కువగా చెల్లించారు. గత కొంతకాలంగా టీడీఆర్‌లకు డిమాండ్ తగ్గిపోయింది. కొన్ని ప్రాంతాల్లో భూసేకరణలు పూర్తికాక పనులు ముందుకు సాగడం లేదు. జూపార్క్ నుంచి ఆరాంఘర్ వరకు జరుగుతున్న ఫ్లై ఓవర్‌తో సహ మరికొన్ని ప్రాంతాల్లో భూసేకరణ సమస్యలున్నాయి. జీహెచ్ఎంసీ ఖజానాలో నిధులు లేనందున భూసేకరణలో జాప్యం జరుగుతోంది. ఈ విషయాన్ని వివరిస్తూ జీహెచ్ఎంసీ ప్రభుత్వానికి లేఖ రాసింది. ఇటీవల కమిషనర్ ప్రభుత్వంతో జరిపిన సంప్రదింపుల్లో ఈ విషయాన్ని దృష్టికి తెచ్చినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం భూసేకరణల కోసం ఈ నిధులు విడుదల చేసింది. ఈ మేరకు జీహెచ్ఎంసీ కమిషనర్‌కు పరిపాలన అనుమతులు మంజూరు చేసింది.

అన్నను చంపిన తమ్ముడు

మైలార్‌దేవ్‌పల్లి: అన్నపై ఓ తమ్ముడు దారుణానికి పాల్పడ్డాడు. కత్తితో దాడి చేసి హత్య చేశాడు. ఈ ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ మధు తెలిపిన వివరాల ప్రకారం.. శాస్త్రీపురం కింగ్స్ కాలనీలో నివసిస్తున్న రెహమాన్ (35), సబావున్నిసా దంపతులు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. రెహమాన్‌తో పాటు అయిదుగురు అన్నదమ్ములు, ఓ సోదరి ఒకే కాలనీలో ఉంటున్నారు. రెహమాన్ వెల్డింగ్ పని చేస్తుండగా.. ఇతని తమ్ముడు ఇస్మాయిల్ (22) వీరితోనే ఉంటూ చదువుకుంటున్నాడు. బుధవారం రాత్రి జగ్నేకీ రాత్ ఉండడంతో అందరూ కలిసి ఉన్నారు. అన్న రెహమాన్‌కు కొంత మతిస్థిమితం లేకపోవడంతో తమ్ముడు ఇస్మాయిల్‌ను చంపుతానంటూ తరచూ బెదిస్తుండేవాడు. నిత్యం మద్యం తాగి వస్తున్న అన్నను ఇస్మాయిల్ ప్రశ్నించేవాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి సోదరులిద్దరి మధ్య ఘర్షణ జరిగింది. తమ్ముడిని రెహమాన్ కొట్టడంతో కోపోద్రిక్తుడైన ఇస్మాయిల్.. అన్నపై కత్తితో దాడి చేసి హత్య చేశాడు. అనంతరం పోలీసుల ఎదుట లొంగిపోయాడు.

కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ నేత

హస్తం గూటికి చేరిన బాబా ఫసియుద్దీన్



సాక్షి, సిటీబ్యూరో: అధికార కాంగ్రెస్‌లోకి వలసలు మొదలయ్యాయి. ఈ పార్టీలో బీఆర్ఎస్ నేతలు ఒక్కొక్కరుగా చేరుతున్నారు. తాజాగా జీహెచ్ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్, బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపా దాస్‌మున్షీ సమక్షంలో గురువారం కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బుక్ ఫెయిర్‌లో స్టాళ్ల ఏర్పాటు పనులు చకచకా..

చదువరి చెంతకు పుస్తకం

- హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శన
- 365 స్టాళ్లలో కొలువుదీరనున్న విభిన్న భాషల గ్రంథాలు

నేటినుంచి ఎన్టీఆర్ స్టేడియం వేదికగా..

సాక్షి, సిటీబ్యూరో: పుస్తక ప్రియులకు పండగే. చదువరులకు ఇక వరమే. ప్రతి సంవత్సరం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శన వచ్చేసింది. ఏటా డిసెంబర్ చివరి 10 రోజుల పాటు నిర్వహించే ప్రదర్శన ఈసారి ఎన్నికలు, ఇతరత్రా కారణాలతో రెండు నెలలు ఆలస్యమైంది. నగరంలోని ఎన్టీఆర్ స్టేడియంలో శుక్రవారం సాయంత్రం పుస్తక ప్రదర్శన ప్రారంభం కానుంది. ఈ నెల 19 తేదీ వరకు కొనసాగనుంది. 'చదువరి చెంతకు పుస్తకం'అనే లక్ష్యంతో హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ గత ఏడేళ్లుగా ఈ పుస్తక ప్రదర్శనను నిర్వహిస్తోంది. ఏటా 6 నుంచి 7 లక్షల మందికి పైగా పుస్తకప్రియులు ప్రదర్శనలో పాల్గొంటున్నారు. నచ్చిన పుస్తకాలను కొనుగోలు చేస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ సమకాలీన అంశాలతో పాటు చరిత్ర, సామాజిక, తత్వశాస్త్రాలు, విజ్ఞాన గ్రంథాలకు పాఠకాదరణ పెరిగింది. మరోవైపు పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థుల కోసం కొన్ని ప్రచురణ సంస్థలు ప్రతి సంవత్సరం ప్రత్యేకంగా పుస్తకాలను ముద్రించి అందుబాటులోకి తెస్తున్నాయి. ఒక్క హైదరాబాద్‌లోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా పుస్తకాలకు ఆదరణ పెరిగిందని పలు సర్వేలు పేర్కొంటున్నాయి. కోల్‌కతాలో గత జనవరిలో నిర్వహించిన పుస్తక ప్రదర్శనలో సుమారు 29 లక్షల మంది పాల్గొన్నట్లు అంచనా. హైదరాబాద్ పుస్తక ప్రదర్శనకు సైతం ప్రతి సంవత్సరం పాఠకుల నుంచి అనూహ్యమైన స్పందన లభిస్తోంది. ఏటా లక్షలాది పుస్తకాలు అమ్ముడవుతున్నాయి.

డిజిటల్ మీడియా వెల్లువలోనూ..

సోషల్ మీడియా, డిజిటల్ మీడియా వెల్లువలోనూ పుస్తకానికి విశేషమైన ఆదరణ లభిస్తోంది. 'సామాజిక చింతనకు, ప్రాపంచిక దృక్పథాన్ని అలవర్చుకొనేందుకు సాహిత్య అధ్యయనం ఒకటే మార్గం. సాహిత్యాన్ని జీవితంలో భాగంగా చేసుకున్నవాళ్లే గొప్ప విజేతలుగా నిలుస్తారు. అలాంటి అభిరుచి కలిగిన పాఠకులు కోట్లాది మంది ఉన్నారు' అని హైదరాబాద్ బుక్ ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్ అభిప్రాయపడ్డారు. సామాజిక మాధ్యమాలు ఉద్ధృతంగా వెల్లువెత్తినా గత ఏడేళ్లుగా పుస్తక ప్రదర్శనలు విజయవంతంగా కొనసాగడం, లక్షలాది పుస్తకాలు అమ్ముడు కావడమే ఇందుకు నిదర్శనమని చెప్పారు. మరోవైపు ప్రతి సంవత్సరం వందల కొద్దీ కొత్త పుస్తకాలు కూడా అందుబాటులోకి వస్తున్నాయి. పుస్తక ప్రదర్శన స్ఫూర్తితో ఎంతోమంది రచయితలు తమ సృజనాత్మకతకు పదును పెట్టుకుంటున్నారు. ఈసారి పుస్తక ప్రదర్శనలో సదస్సులు, చర్చలు, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నారు. కవులు, రచయితలు, కళాకారులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ సంవత్సరం 365 స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఉత్తర, దక్షిణాది రాష్ట్రాలకు చెందిన వందలాది పుస్తక ప్రచురణ సంస్థలు ప్రదర్శనలో పాల్గొననున్నాయి.



ఎన్టీఆర్ స్టేడియంలో గద్దర్ ప్రాంగణం

పిల్లలకు ప్రత్యేక పోటీలు..

బాల వికాస్ కార్యక్రమాల్లో భాగంగా పిల్లలకు వివిధ అంశాలలో పోటీలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు, శని, ఆదివారాల్లో మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ పోటీలు ఉంటాయి. జానపద నృత్యాలు, ఫ్యాన్సీడ్రెస్ పోటీలు, క్విజ్, మాట్లాడే బొమ్మ, పిల్లల గ్రంథాలయాల ఆవశ్యకతపై చర్చ, హస్తకళల వర్క్‌షాపు, గ్రూప్‌డ్యాన్స్, సోలోడ్యాన్స్, పాటలు, పద్యాలు, పెయింటింగ్, స్టోరీ టెల్లింగ్ తదితర అంశాలలో పోటీలు నిర్వహించనున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు ప్రవేశం ఉచితం. ఇతరులకు ప్రవేశ రుసుము రూ.10. పుస్తక మహోత్సవంలో భాగంగా సాంస్కృతిక, కళా రూపాలను ప్రదర్శించనున్నారు. పుస్తక ప్రదర్శన ప్రతిరోజూ మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8.30 గంటల వరకు, శని, ఆదివారాల్లో మధ్యాహ్నం 1 నుంచి రాత్రి 9 గంటల వరకు ఉంటుంది.

దూసుకొచ్చిన మృత్యువు

- తొమ్మిదేళ్ల బాలుడిని ఢీకొన్న డీసీఎం వాహనం
- ఆస్పత్రిలో తండ్రిని చూసి వస్తుండగా ప్రమాదం
- అల్వాల్‌లోని రిలయన్స్ ఫ్రెష్ వద్ద ఘటన

అల్వాల్: తల్లితో కలిసి ఆస్పత్రిలో ఉన్న తండ్రిని చూసి వస్తున్న తొమ్మిదేళ్ల బాలుడిని విధి బలి తీసుకుంది. అనూహ్యంగా జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడు. అదుపు తప్పి వచ్చిన డీసీఎం వాహనం ఢీకొని మృతి చెందాడు. ఈ ఘటన గురువారం సాయంత్రం అల్వాల్‌లో చోటుచేసుకుంది. అప్పటి వరకూ తన వెంట వచ్చిన కుమారుడు కళ్లెదుటే కన్నుమూయడంతో ఆ తల్లి రోదనలు మిన్నంటాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్వాల్‌కు చెందిన భరత్‌కు భార్య లత, కుమారులు తిరుపాల్ (9), నానీ ఉన్నారు. పెద్ద కుమారుడు తిరుపాల్ స్థానికంగా ఉన్న ఓ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. మూడు రోజుల క్రితం భరత్ రోడ్డు ప్రమాదంలో గాయపడి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో లత తన ఇద్దరు పిల్లలు తిరుపాల్, నానీలను తీసుకుని గురువారం సాయంత్రం ఆస్పత్రికి వెళ్లి భరత్‌ను చూసి తిరిగి వస్తుండగా.. అల్వాల్‌లోని రిలయన్స్ ఫ్రెష్ వద్ద సరుకులను దించడానికి వచ్చిన డీసీఎం వాహనం ఒక్కసారిగా వీరిపైకి దూసుకొచ్చింది. ఈ సమయంలో లత, నానీ పక్కకు వెళ్లి ప్రమాదం నుంచి తప్పించుకోగా.. బాలుడు తిరుపాల్‌ను డీసీఎం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా తిరుపాల్ మృతి చెందాడు. దుకాణం వద్ద ఆగి ఉన్న డీసీఎం వాహనానికి బ్రేక్ వేయకపోవడం వల్లే ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



గాయపడిన కుమారుడిని ఒడికి చేర్చుకుని రోదిస్తున్న తల్లి లత



తిరుపాల్ (ఫైల్)

ఇస్తారో.. ఇవ్వరో!

ఉచిత విద్యుత్.. వంట గ్యాస్



- ఆరు గ్యారంటీల దరఖాస్తుదారుల్లో ఉత్కంఠ
- అధికారుల సర్వేతో అంతటా ఇదే చర్చ
- అర్హతలు.. తీసివేతలు.. కూడికలపై సందిగ్ధత
- గ్యారంటీకి 'రేషన్ కార్డు' అర్హత తప్పనిసరి
- గ్రేటర్‌లో 17.21 లక్షల కుటుంబాలకు లబ్ధి
- సరిహద్దు జిల్లా కార్డుదారులు ఐదు లక్షలపైనే
- కార్డు లేని కుటుంబాలు మరో పది లక్షలు



కుటుంబాలు 40 లక్షల పైనే

మహా నగరం మొత్తమ్మీద సుమారు 40 లక్షల పైగానే కుటుంబాలు ఉన్నట్లు అంచనా. విద్యుత్ కనెక్షన్లు 56 లక్షలపైనే ఉన్నాయి. వంట గ్యాస్ కనెక్షన్లు సుమారు 30 లక్షల వరకు ఉన్నట్లు ఆయిల్ కంపెనీల గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మొత్తం కుటుంబాల్లో ఆదాయ వర్గాలకు సంబంధించిన 10 లక్షలు మినహా మిగిలిన 30 లక్షల కుటుంబాలు పేద, మధ్య తరగతి వర్గాలు ఉన్నట్లు సమాచారం.

సాక్షి, సిటీబ్యూరో: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయనున్న గ్యారంటీ పథకాలన్నింటికి తెల్ల రేషన్ కార్డు అర్హతగా తయారైంది. తాజాగా ఉచిత విద్యుత్, రూ.500కు వంట గ్యాస్ సిలిండర్ల లబ్ధిదారుల ఎంపికకు అధికారులు కసరత్తు ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో గ్రేటర్‌లో ఈ రెండు గ్యారంటీలపై చర్చలు మొదలయ్యాయి. వీటికోసం దరఖాస్తు చేసుకున్న వారంతా తమకు పథకం వర్తిస్తుందా? లేదా? అని ఆరా తీస్తున్నారు. కొందరు ఆఫీసులు చుట్టూ తిరుగుతున్నారు. మరికొందరు తెలిసిన వాళ్ల ద్వారా వివరాలు సేకరిస్తున్నారు. ముఖ్యంగా విద్యుత్ పథకం ఇళ్ల ఓనర్లు, అద్దెకున్న వాళ్లకు ఎలా ఇస్తారో తెలియక అయోమయానికి గురవుతున్నారు. ఈ పథకాలకు రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకోనున్నారు. ఇటీవల ఉచిత విద్యుత్ కోసం ఇంటింటికీ వెళ్లి ఆధార్ కార్డుతో పాటు రేషన్ కార్డు నంబర్ తప్పనిసరిగా సేకరించడం ఇందుకు బలం చేకూర్చుతోంది. అదేవిధంగా త్వరలో గ్యాస్ సిలిండర్ల కోస కూడా రేషన్‌కార్డు నంబర్ స్వీకరించనున్నారు. రేషన్‌కార్డులు లేని కుటుంబాల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. మరోవైపు ఇతర జిల్లాలో రేషన్‌కార్డులు కలిగి నగరంలో అద్దె ఇళ్లలో నివాసం ఉంటున్న కుటుంబాలపై కూడా స్పష్టత కరువైంది.

ఇదీ పరిస్థితి..

హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా, మేడ్చల్‌- మల్కాజిగిరి జిల్లాలో ఆహార భద్రత (రేషన్ కార్డు) కలిగిన కుటుంబాలు 17.21 లక్షల వరకు ఉన్నట్లు పౌర సరఫరాల శాఖ అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. సరిహద్దు జిల్లాల నుంచి వచ్చి నగరంలో నివాసం ఉంటున్న మరో ఐదు లక్షల వరకు కుటుంబాలు రేషన్ కార్డులు కలిగి ఉన్నాయి.

కొత్త రేషన్ కార్డుల కోసం..

గ్రేటర్ పరిధిలో కొత్త రేషన్ కార్డుల కోసం ప్రజాపాలనలో సుమారు 5,73,069 దరఖాస్తులు వచ్చాయి. వాస్తవంగా గత పదేళ్లలో కేవలం 1.27 లక్షల కొత్త రేషన్ కార్డులు మాత్రమే మంజూరయ్యాయి. పెళ్లిలతో కొత్తగా ఏర్పాటై చాలా కుటుంబాలకు రేషన్ కార్డులు లేవు. అలాంటి కుటుంబాలు సుమారు 10 లక్షల వరకు ఉండవచ్చని అంచనా. అందులో సగం కుటుంబాల వరకు కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నట్లు తెలుస్తోంది.

ప్రజాపాలనలో..

హైదరాబాద్ మహానగర పరిధిలోని సుమారు 24 లక్షల 74 వేల 325 కుటుంబాలు దరఖాస్తు చేసుకున్నాయి. అందులో ఐదు పథకాల కోసం సుమారు 19,01,256 కుటుంబాలు, రేషన్ కార్డు, ఇతరత్రా కోసం 5,73,069 కుటుంబాలు దరఖాస్తు చేసుకున్నట్లు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

కనిష్టం.. అంతా మా ఇష్టం!



నగరంలో రోడ్ల విస్తీర్ణం అరకొరే

- అవకాశమున్నా చర్యలు సున్నా
- కనిష్టం కంటే 3 శాతం తక్కువ
- పెంచే అవకాశమున్నా పట్టని యంత్రాంగం

ట్రాఫిక్ HOT టాపిక్-4

సాక్షి, సిటీబ్యూరో: 'పెత్తనం ఒకరి చేతిలో.. బెత్తం మరొకరి చేతిలో' అన్నట్లు నగరంలో రోడ్లపై ఉండి స్థితిగతులను పర్యవేక్షించేది ట్రాఫిక్ పోలీసులైతే... వాహనశ్రేణులు సవ్యంగా సాగడానికి అవసరమైన మౌలిక వసతులు కల్పించాల్సింది మాత్రం జీహెచ్ఎంసీ. ఈ రెండింటి మధ్యా సిటీలో సమస్యలు తీరడం మిథ్యగా మారిపోతోంది. నగరంలోని రోడ్ల విస్తీర్ణం, కనిష్టానికంటే తక్కువగా ఉన్న వైనం, పెండే అవకాశం ఉన్నా పట్టించుకోని యంత్రాంగం వెరసీ.. నగరవాసికి మాత్రం నిత్యం నరకమే కనిపిస్తోంది. అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం నగర విస్తీర్ణంలో కనిష్టంగా 12 శాతం రోడ్లు ఉండాలి. హైదరాబాద్ పురాతన నగరం కావడం, అన్‌ప్లాన్డ్‌గా విస్తరించడం తదితర కారణాలతో ఇక్కడ కేవలం 9 శాతం మాత్రమే రోడ్లు విస్తరించి ఉన్నాయి. ఫలితంగానే ట్రాఫిక్ జామ్‌లు, నడిచేవీ నత్తతో పోటీ పడటం జరుగుతోంది. తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్న ఆరు అడ్డంకులు తొలగిస్తే ఈ విస్తీర్ణాన్ని 15.5 శాతానికి పెంచుకునే అవకాశం ఉంది. దీనికి సంబంధించి ట్రాఫిక్ పోలీసులు పంపిన ప్రతిపాదనలపై జీహెచ్ఎంసీ సహా ఇతర శాఖలు ఏళ్లుగా శీతకన్ను వేస్తున్నాయి.

ఫ్లై'ఓవర్ లుక్'...

ముంబై మహా నగరంలో ఉన్న వాహనాల సంఖ్య 45 లక్షలైనా (2022-23) లెక్కల ప్రకారం అక్కడున్న ఫ్లైఓవర్ల సంఖ్య మాత్రం 42. మన సిటీలో మాత్రం వాహనాలు కోటికి చేరుతున్నా ఫ్లైఓవర్లు మాత్రం 34. మనతో పాటు పురాతన నగరమైన కోల్‌కతా సైతం గతంలో అస్తవ్యస్త ట్రాఫిక్‌తో ఎన్నో ఇబ్బందులు పడేది. అక్కడి రోడ్ల విస్తీర్ణం కేవలం ఆరు శాతం ఉండటమే అందుకు కారణం. దీనికి విరుగుడుగా ఫ్లైఓవర్లను తెరపైకి తెచ్చారు. అవసరమైన స్థాయిలో వీటిని నిర్మించడం ద్వారా రోడ్ల విస్తీర్ణాన్ని 12 శాతానికి పెంచుకోగలిగారు. నగర ట్రాఫిక్ విభాగం అధికారులు 2007లో సర్వే నిర్వహించి జీహెచ్ఎంసీకి నివేదిక పంపారు. దీని ప్రకారం నగరంలోని 30 ప్రాంతాల్లో 17.83 కిలో మీటర్ల మేర ఫ్లైఓవర్లు నిర్మిస్తే రోడ్ల విస్తీర్ణాన్ని 1.5 శాతం పెంచవచ్చని తేల్చారు. వీటిలో ఇప్పటికే అత్యధిక ప్రతిపాదనలు పెండింగ్‌లోనే ఉండపోవడం గమనార్హం.

'మెడ'కు చుట్టుకునేంత సున్నితం...

సిటీ రోడ్లకు మరో ఇబ్బందికరమైన పరిణామం బాటిల్‌నెక్స్. నగర వ్యాప్తంగా 200 ప్రాంతాల్లో ఈ అడ్డంకులు ఉన్నాయి. రిలీజియస్ బాటిస్ నెక్స్ తర్వాత ఆ స్థాయిలోనే ఇబ్బందులు కలిగిస్తున్నవి నేచురల్ బాటిల్‌నెక్స్. భౌగోళిక పరిస్థితుల నేపథ్యంలో ఏర్పడిన వీటి వల్లా ఎన్నో ప్రాంతాల్లో ట్రాఫిక్ నగరం ఏర్పడుతోంది. రాణిగంజ్‌లోని సయిదానిమ సమాధి సమీపంలో, ఎస్సానగర్‌-ఈఎస్ఐ మార్గంలో, చాదర్‌ఘాట్‌-మలక్‌పేట్ రూట్‌లో ఇలాంటివి అనేకం ఉన్నాయి. నగర వ్యాప్తంగా ఇలాంటి బాటిల్‌నెక్స్ సంఖ్య 26 ఉన్నాయి. బేగంపేట ప్రాంతంలో ఏళ్లుగా పెండింగ్‌లో ఉండిపోయిన శ్యామ్‌లాల్ నాలా సమస్య ట్రాఫిక్ విభాగం అధికారులు, జీహెచ్ఎంసీ కలిసి పని చేయడంతో 2010లో తీరింది. మిగిలిన ప్రాంతాల్లోనూ ఇవే ఫలితాలు రావాలంటే అంతా సమష్టిగా ముందుకు వెళ్లాలి. 26 న్యాచురల్ బాటిల్‌నెక్స్‌ను క్లియర్ చేయడం ద్వారా అదనంగా 2 శాతం రోడ్లు పొందవచ్చన్నది నిపుణుల మాట.



సమన్వయం లేక కరెంట్ 'షాక్'..

రాజధానిలోని అనేక ప్రాంతాల్లో రోడ్ల విస్తరణ పూర్తయినా ఫలితం లేకుండా పోయింది. ఆయా చోట్ల రోడ్ల విస్తీర్ణం పూర్తి కావచ్చినా.. ఒకప్పుడు రోడ్డు పక్కన ఉండి, విస్తరణతో రోడ్లపైకి వచ్చిన కరెంట్ స్తంభాలతో ఈ పరిస్థితి తలెత్తింది. టీఎస్ఎస్పీడీసీఎల్, జీహెచ్ఎంసీ సమన్వయంతో పని చేయడంపోవడమే దీనికి కారణం. వీటితో పాటు నగరంలోని వివిధ ప్రాంతాల్లో కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు అడ్డదిడ్డంగా ఉంటున్నాయి. విద్యుత్, టెలిఫోన్ తదితర అధికారుల నిర్లక్ష్యంతో 51 మార్గాలు కుచించుకుపోయాయి. జీహెచ్ఎంసీతో పాటు వీరూ స్పందిస్తే మరో 2 శాతం రోడ్ల విస్తీర్ణం పెరుగుతుంది.

33,286

హైదరాబాద్ జిల్లాలో పెరిగిన ఓటర్ల సంఖ్య ఇది..

- స్పెషల్ సమ్మరీ రివిజన్‌-2024 జాబితా విడుదల
- ప్రస్తుతం 45,70,138 మంది ఓటర్లు
- మొత్తం ఓటర్లలో అత్యధికంగా జూబ్లీహిల్స్‌లో..
- చార్మినార్‌లో అత్యల్పం..

సాక్షి, సిటీబ్యూరో: గత అసెంబ్లీ ఎన్నికల నాటికి హైదరాబాద్ జిల్లా పరిధిలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 45,36,852 మంది ఓటర్లుండగా, ప్రస్తుతం వారి సంఖ్య 45,70,138కి చేరింది. అంటే పెరిగిన ఓటర్లు 33,286 మంది. స్పెషల్ సమ్మరీ రివిజన్‌-2024లో భాగంగా 2024 జనవరి ఒకటో తేదీ నాటికి ఓటుహక్కు కలిగిన వారితో కూడిన తుది జాబితాను జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ విడుదల చేశారు. ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో ఓటర్లు చూసుకోవచ్చని తెలిపారు. ఈఆర్‌ఓ కార్యాలయాల్లో కానీ ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో కానీ ఓటర్స్ హెల్ప్ లైన్ యాప్‌లో కానీ చూసుకోవచ్చని తెలిపారు. ఏవైనా అభ్యంతరాలుంటే ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ఓటరు నమోదు, చిరునామా మార్పులు, తొలగింపుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఏవైనా సందేహాలుంటే సంబంధిత అసెంబ్లీ నియోజకవర్గం ఈఆర్‌ఓను లేదా బూత్ లెవెల్ అధికారిని సంప్రదించవచ్చని పేర్కొన్నారు. మొత్తం ఓటర్లలో అత్యధికంగా జూబ్లీహిల్స్‌లో 3,87,206 మంది ఉండగా, అత్యల్పంగా చార్మినార్‌లో 2,28,498 మాత్రమే ఉన్నారు.



నియోజకవర్గాల వారీగా ఓటర్లు

నియోజకవర్గం	ఓటర్లు
ముషీరాబాద్	3,06,381
మలక్‌పేట	3,15,634
అంబర్‌పేట	2,78,675
ఖైరతాబాద్	2,96,383
జూబ్లీహిల్స్	3,87,206
సనత్‌నగర్	2,52,530
నాంపల్లి	3,22,967
కార్వాన్	3,63,017
గోషామహల్	2,74,668
చార్మినార్	2,28,498
చాంద్రాయణగుట్ట	3,47,614
యాకుత్‌పురా	3,55,979
బహదూర్‌పురా	3,21,244
సికింద్రాబాద్	2,67,282
కంటోన్మెంట్	2,52,060
మొత్తం	45,70,138

పురుషులు: 23,30,574
మహిళలు: 22,39,240
థర్డ్‌జెండర్: 324

ల్యాండ్‌మైన్స్ నిర్మూలనకు అన్ని దేశాలు ముందుకు రావాలి


మాట్లాడుతున్న బాలకృష్ణ తుర్వే

హిమాయత్‌నగర్: మానవ వినాశనానికి కారణమవుతున్న మందు పాతరలను (ల్యాండ్ మైన్స్) ప్రపంచ దేశాలన్ని నిషేధించాల నవభారత్ నిర్మాణ సంగ్, భారతీయ శాంతి పర్యావరణ పరిరక్షణ సంస్థల ప్రతినిధులు కోరారు. ఈ మేరకు గురువారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో 'ఇండియన్ క్యాంపెయిన్ టు బ్యాన్ ల్యాండ్ మైన్స్ అండ్ క్లస్టర్ మున్స్, ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సూరేపల్లి రవికుమార్, డాక్టర్ బాలక్రిష్ణ తుర్వే మాట్లాడారు. 1997లో కెనడాలో జరిగిన ప్రపంచ దేశాల సదస్సుల్లో 95 శాతం దేశాలు మందు పాతర్ల వినాశనానికి ఒప్పంద పత్రాలపై అంగీకారాన్ని తెలిపాయన్నారు. యూరప్ దేశాలు ఇప్పటికే మానవ వినాశకర మందు పాతరల విధ్వంసానికి అంగీకారం తెలిపాయని గుర్తు చేశారు. భారతదేశం మాత్రం పాకిస్తాన్, చైనా, బంగ్లాదేశ్ వంటి ఉగ్రవాద ప్రేరేపిత దేశాల కారణంగా వీటి విధ్వంసానికి ముందడుగు వేయలేక పోతుందన్నారు. మందు పాతరలను సమూలంగా అరికట్టాల్సిన అవసరం అన్ని దేశాలపై ఉందని స్పష్టం చేశారు. సమావేశంలో సంస్థ ప్రధాన కార్యదర్శి సుధాకర్, ప్రొఫెసర్ దీక్షిత్, ప్రొఫెసర్ ఆర్కే స్వామి, ఎవరెస్టు పర్వతారోహకుడు కొండ సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకటనల్లోనే ఉపకులాల అభివృద్ధి


సదస్సులో పాల్గొన్న మేడిపాపయ్య తదితరులు

హబ్సిగూడ: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ నిధులను దారి మళ్లించి ఏ ఒక్క మాదిగ, ఉప కులాల కుటుంబాలకు ప్రయోజనాలు దక్కకుండా చేశారని, ఎస్సీల అభివృద్ధి ప్రకటనలకే పరిమితమైందని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య అన్నారు. గురువారం హబ్సిగూడలోని సుప్రభాత్ హోటల్‌లో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ మాదిగ ఉప కులాలకు చెందిన మహిళలు ఎంతో సేవ చేసినా ఇంకా ఊరుకు, పట్టణాలకు దూరంగా ఉన్నారన్నారు. ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందినా కులాన్ని అంటగట్టి అవకాశాలు అందకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వరాష్ట్రంలో మాదిగ, ఉపకులాలకు చెందిన మహిళలకు విద్య, ఉద్యోగ, రాజకీయ, సంక్షేమ, ఆర్థిక రంగంలో తీరని నష్టం జరిగిందన్నారు. మాదిగ మహిళలంతా సంఘటితంగా రాజ్యాధికార సాధనకు ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అన్నపూర్ణ, పోశాని, రేణుక, లత, మహాలక్ష్మి, కోమల, అమృత, జ్యోతి, అంజమ్మ, చామంతి, జయ తదితరులు పాల్గొన్నారు.

ఫెడరలిజాన్ని రక్షించుకోవాలి


అభివాదం చేస్తున్న సీపీఎం నేతలు

కవాడిగూడ: కేరళ ప్రభుత్వంపై కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ అనుసరిస్తున్న విధానాలపై వామపక్ష వాదులంతా సమైక్యంగా ఉద్యమించి రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు కృషి చేయాలని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు అన్నారు. కేంద్ర ప్రభుత్వం మతోన్మాద విద్వేశాలు రెచ్చగొడుతూ సమైక్య వాదాన్ని ధ్వంసం చేసేందుకు కుట్ర పన్నుతోందన్నారు. వామపక్ష వాదులు ఈ కుట్రలను తిప్పికొట్టి దేశంలో ఫెడరలిజాన్ని రక్షించుకోవాలన్నారు. గురువారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో కేరళ ప్రభుత్వంపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని నిరసిస్తూ సీపీఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, ఎస్.వీరయ్య, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, డిజి నర్సింహారావు, టి.జ్యోతి, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహ్మారెడ్డి, పాలడుగు భాస్కర్, టి.సాగర్, జాన్‌వెస్లీ, సీపీఎం నగర కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీవీ రాఘవులు మాట్లాడుతూ దేశ సమైక్యత, ఫెడరల్ వ్యవస్థ దేశ అభ్యున్నతికి ఎంతో అవసరమన్నారు. ఫెడరల్ వ్యవస్థను పరిరక్షిస్తున్న కేరళలోని ప్రజా ప్రభుత్వాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కేరళ ప్రభుత్వం పట్ల కేంద్రంలోని బీజేపీ సర్కార్ రాజకీయంగా, ఆర్థికంగా వివక్ష చూపుతోందని ఆరోపించారు. కేంద్రం దేశ వ్యాప్తంగా వసూలు చేస్తున్న పన్నుల్లో 60 శాతం రాష్ట్రాలకు 40 శాతం కేంద్రానికి వాటా ఉండాలని కేరళ ప్రభుత్వం డిమాండ్ చేయడం సమంజసమే అన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం కేంద్రం బోగస్ పథకాలను ప్రవేశ పెడుతుందని ఎద్దేవ చేశారు. తెలంగాణ ఆవిర్భావం తరువాత కేంద్రం రాష్ట్రానికి సహాయం చేసిందా, నష్టం చేసిందా తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి లెక్కలతో సహా బయట పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో కేంద్రం వివక్షపై తీర్మానం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం గవర్నర్ వ్యవస్థను పాలేరు వ్యవస్థగా మార్చిందన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని ఓడించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు వామపక్ష వాదులందరూ సంఘటితం కావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు స్కైల్యాబ్‌బాబు, అరుణజ్యోతి, కామేష్‌బాబు, తూటి మధు, మహేందర్, దశరథ్, భూపాల్, అజయ్‌బాబు పాల్గొన్నారు.

10న విశ్వవిశ్వాని ఆధ్వర్యంలో జాబ్ ఫెయిర్

సాక్షి, సిటీబ్యూరో: విశ్వవిశ్వాని కళాశాల ఆధ్వర్యంలో ఈ నెల 10 జాబ్ ఫెయిర్ నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తూంకుంటలోని కాలేజీ ఆవరణలో జరిగే ఈ కార్యక్రమంలో డిగ్రీ, పీజీ విద్యార్థులు, బీబీఏ, బీటెక్, ఎంబీఏ,ఎంటెక్,.బీఫార్మసీ, తదితర కోర్సులకు చెందిన విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చు. 50 కంపెనీలు ఈ జాబ్ ఫెయిర్‌లో పాల్గొనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆసక్తిగలవారు ఫోన్ :9989 229 333, 9989 142 333 నంబర్‌లను సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

విద్యార్థిని ఆత్మహత్య

అడ్డగుట్ట: ఓ విద్యార్థిని ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన తుకారాంగేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై మాన్‌సింగ్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చేగుంట మండలం, పోతుపల్లి గ్రామానికి చెందిన స్వామి కుమార్తె తరుణి (17) తుకారాంగేట్ నార్త్ లాలాగూడలోని తన అమ్మమ్మ యాదమ్మ ఇంట్లో ఉంటూ వేస్ట్‌మారేడ్‌పల్లిలోని ఓ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. గత రెండేళ్లుగా ఆమె ఓ యువకుడిని ప్రేమిస్తోంది. అతనికి అప్పటికే పెళ్లై ఉండటంతో కుటుంబ సభ్యులు అతడితో తిరగరాదని ఆంక్షలు విధించారు. అంతేగాక పెద్ద మనుషులు పంచాయతీ చేసి ఇద్దరిలో ఎవరు ఫోన్ చేసి మాట్లాడినా రూ. 5 లక్షలు జరిమానా చెల్లించాలని తీర్మానించారు. దీంతో మనస్తాపానికి లోనైన తరుణి బుధవారం సాయంత్రం ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని అత్మహత్యకు పాల్పడింది. మృతురాలి పిన్ని సబిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిలోఫర్ ఘటనపై ఉన్నతాధికారుల ఆరా


నిలోఫర్ వైద్యాధికారులతో చర్చిస్తున్న ఉన్నతాధికారులు

నాంపల్లి: ప్రముఖ చిన్న పిల్లల ఆసుపత్రి నిలోఫర్‌లో బుధవారం సంభవించిన అగ్ని ప్రమాద ఘటనపై ఉన్నతాధికారులు ఆరా తీశారు. ఈ మేరకు రాష్ట్ర ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్‌కు చెందిన పలువురు అధికారులు, ఇంజినీరింగ్ విభాగం అధికారులు ఆసుపత్రిని సందర్శించారు. పాత నిలోఫర్ భవనం మొదటి అంతస్తులో ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణితో కలిసి పరిశీలించారు. సుమారు రెండు గంటల పాటు ఆసుపత్రిలో జరిగిన అభివృద్ధి పనులపై సమీక్షించారు.

పద్మశ్రీ అవార్డు గ్రహీతకు సన్మానం



సాక్షి,సిటీబ్యూరో: బంజారాల జాగృతికి చేసిన కృషికి గుర్తింపుగా పద్మశ్రీ అవార్డుకు ఎంపికైన కేతావత్ సోమ్లా నాయక్‌ను గురువారం టీపీసీసీ ఉపాధ్యక్షులు చామల కిరణ్ కుమార్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. భగవద్గీతను బంజారాలకు చేరువ చేయాలనే సంకల్పంతో బంజారా భాషలోకి అనువాదం చేసినందుకు ఆయనకు పద్మశ్రీ అవార్డు దక్కింది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

అల్వాల్: రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహన దారుడు మృతి చెందిన సంఘటన నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్. శ్రీనివాస్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి...ముంబైలో నివాసముండే తంగుళ్లపల్లి కిషోర్(41) కొద్ది రోజుల క్రితం మల్కాజిగిరి గౌతంనగర్‌లో ఉంటున్న బంధువుల ఇంటికి వచ్చాడు. గురువారం బైక్‌పై నేరేడ్‌మెట్‌లోని మల్కాజిగిరి సబ్ రిజిస్టార్ కార్యాలయానికి వెళ్తుండగా వినాయక్‌నగర్ చౌరస్తావద్ద ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. ఆర్టీసీ బస్సు వెనుక చక్రం కిషోర్‌పై మీదుగా వెళ్లడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దొంగతనం కేసులో నిందితుడి అరెస్టు

అల్వాల్: దొంగతనం జరిగిన మూడు గంటల్లోనే నిందితుడిని అరెస్టు చేసిన సంఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బుధవారం గుర్తుతెలియని వ్యక్తి వెంకటాపురం జేజేనగర్‌లోని మహిళ కంట్లో కారం చల్లి ఆమె మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడు లాక్కెళ్లిన విషయం తెలిసిందే. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడు ప్రేమ్‌కుమార్‌ను గుర్తించి అరెస్టు చేశారు. అతడి నుంచి 2.5 తులాల బంగారు పుస్తెల తాడు, బైక్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేయడంలో చాకచక్యంగా వ్యవహరించిన డీఐ ప్రమోద్‌కుమార్, సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

ఆయుర్వేద మందులు తయారు చేస్తానని..

బంగారంతో పరారీ

వెంగళరావునగర్: బంగారంతో ఆయుర్వేద మందులు తయారు చేస్తానని నమ్మించి ఓ నకిలీ వైద్యుడు బంగారం తీసుకుని పరారైన సంఘటన మధురానగర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కోకాపేట ప్రాంతానికి చెందిన సచిన్ గుప్తా తన తండ్రి రామావతార్ గుప్తా వెన్నెముక సంబంధిత వ్యాధితో బాధపడుతుండటంతో కొంతకాలంగా మణికొండలో ఫిజియోథెరపీ చేయిస్తున్నాడు. అక్కడ అతనికి సుధాకర్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. మాటల సందర్భంగా ఆయుర్వేద మందుల ద్వారా మీ తండ్రి జబ్బును నయం చేయవచ్చని చెప్పిన అతను భరత్‌ముని అనే వ్యక్తిని పరిచయం చేశాడు. భరత్‌ముని ప్రతిరోజు రామావతార్ గుప్తా ఇంటికి వెళ్లి వైద్యం చేశాడు. అనంతరం మధురానగర్ సమీపంలోని బాలాజీ ఆయుర్వేద స్టోర్‌లో మంచి మందులు దొరుకుతాయని చెప్పడమేగాకుండా అక్కడికి తీసుకెళ్లి కొన్ని రోజుల పాటు మందులు ఇప్పించాడు. అక్కడ ఆనంద్ అనే వ్యక్తి పరిచయం అయ్యాడు. తాను ఆయుర్వేద వైద్యుడినని, మందులను తయారు చేస్తానని చెప్పాడు. పక్షవాతం, వెన్నునొప్పితో బాధపడే వారు బంగారాన్ని కలిపిన ఆయుర్వేద మందులు వాడితే తప్పకుండా నయం అవుతుందని, ఇందుకోసం కొంత బంగారాన్ని మందుల్లో కలపాల్సి ఉంటుందని నమ్మించాడు. ఈ మందులతో వ్యాధి నయం కాకపోతే 80 శాతం నగదు తిరిగి ఇస్తానని చెప్పాడు. అది నిజమని నమ్మిన సచిన్‌గుప్తా దాదాపు రూ.3.80 లక్షల ఖరీదు చేసే బంగారాన్ని కొనుగోలు చేసి ఆనంద్‌కు ఇచ్చాడు. నెల రోజులు గడుస్తున్నా ఆనంద్ ఆచూకీ లేకపోవడంతో పాటు ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుంది. దీంతో అతను ఆయుర్వేద స్టోర్‌కు వెళ్లి చూడగా అక్కడ ఆయుర్వేద స్టోర్‌కూడా లేదు. తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డ్రగ్స్ విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తుల అరెస్ట్

21 గ్రాముల ఎండీఎంఏ, 874 గ్రాముల గంజాయి స్వాధీనం


వివరాలను వెల్లడిస్తున్న మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్

గచ్చిబౌలి: మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను మాదాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం గచ్చిబౌలిలోని మాదాపూర్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్ వివరాలు వెల్లడిచారు. కొండాపూర్‌లో నివాసం ఉంటున్న మారం పవన్ కుమార్ అలియాస్ మచ్చ పవన్, అదర్శ్ కుమార్‌సింగ్ కొంత కాలంగా డ్రగ్స్ దందా చేస్తున్నారు. వీరి కదలికలపై నిఘా ఏర్పాటు చేసిన ఎస్ఓటీ పోలీసులు మాదాపూర్ పోలీసులతో కలిసి బుధవారం వారిని అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.8 లక్షల విలువైన 21.7 గ్రాముల ఎండీఎంఏ, 874 గ్రాముల గంజాయి, కారు, రెండు సెల్‌ఫోన్లు, డిజిటల్ వేయింగ్ మిషన్లు స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్‌కు బానిసలైన వీరు విలాసవంతమై జీవితానికి అలవాటు పడి ఎండీఎంఏ డ్రగ్స్‌ను బెంగళూర్ నుంచి, గంజాయిని ఒడిశా సరిహద్దు నుంచి తీసుకొస్తున్నట్లు డీసీపీ వివరించారు. ఎవరైనా డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు, కొనుగోలు చేస్తున్నట్లు తెలిస్తే 942099100, 9490617444 ఫోన్ నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు. డ్రగ్స్‌కు బానిసైన వారు తమను సంప్రదిస్తే రిహాబిలిటేషన్ సెంటర్‌కు పంపిస్తామని, వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో మాదాపూర్ ఏడీసీపీ ఎస్.నర్సింహా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య


మహ్మద్ (ఫైల్)

కుత్బుల్లాపూర్: ఓ బీటెక్ విద్యార్థి అనుమానాస్పద స్థితిలో హాస్టల్ గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం వెలుగులోకి వచ్చింది.. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. వనపర్తి జిల్లా, పెబ్బేరు మండలం, అయ్యవారిగూడెం గ్రామానికి చెందిన ఎం.డి.మహ్మద్(21) గండిమైసమ్మలోని మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చివరి సంవత్సరం చదువుతూ అక్కడే హాస్టల్‌లో ఉంటున్నాడు. బుధవారం అతను కాలేజీకి వెళ్లకుండా హాస్టల్‌లోనే ఉన్నాడు. సాయంత్రం కాలేజీ నుంచి వచ్చిన తోటి విద్యార్థులు తలుపులు తట్టగా తెరవలేదు. దీంతో హాస్టల్ గది కిటికీలో నుంచి చూడగా మహ్మద్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. విద్యార్థుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పేట్‌బషీరాబాద్ పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఇటీవల జరిగిన కళాశాల ప్లేస్‌మెంట్స్‌లో సెలెక్ట్ కాకపోవడంతో గత వారం రోజులుగా మహ్మత్ కాలేజీకి సరిగా వెళ్లడం లేదని, తిండి కూడా తినడం లేదని తెలిసింది. ఉద్యోగానికి ఎంపిక కాలేదనే మనస్తాపంతోనే అతను ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు.

భవనం పైనుంచి పడి కార్మికుడి మృతి

సైదాబాద్: హోటల్ భవనం పైనుంచి కింద పడి కార్మికుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన సంఘటన సైదాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చత్తీస్‌ఘడ్‌కు చెందిన లలిత్ (25) చంపాపేట రోడ్డులోని ఓహోటల్‌లో కార్మికుడిగా పని చేస్తూ హోటల్ భవనం పై ఉన్న పెంట్ హౌస్‌లో కుటుంబంతో సహా నివాసం ఉంటున్నాడు. బుధవారం రాత్రి మద్యం మత్తులో ఇంటికి వచ్చిన అతను భార్యతో గొడవ పడినట్లు తెలిసింది. గురువారం ఉదయం అతని భార్య ఇంట్లో లలిత్ లేకపోవడంతో పరిసర ప్రాంతాల్లో వెతకగా భవనాన్ని ఆనుకుని ఉన్న ఫంక్షన్‌హాల్ స్థలంలో లలిత్ విగతజీవుడై పడి ఉండటాన్ని గుర్తించింది. దీంతో హోటల్ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. భార్యతో గొడవపడి మనస్తాపంతో భవనం పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చునని భావిస్తున్నారు. లలిత్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించిన పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్లాట్ల పేరుతో నగదు వసూలు

రియల్ ఎస్టేట్ వ్యాపారి పరారీ

వెంగళరావునగర్: ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి ప్లాట్ల పేరుతో కస్టమర్ల వద్ద నగదు వసూలు చేసి పరారైన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక వెస్ట్ శ్రీనివాస్‌నగర్‌లో శ్రీధర్ డెవలపర్స్ పేరుతో రియల్ ఎస్టేట్ కార్యాలయం కొనసాగుతోంది. ఈ సంస్థ ప్రతినిధులు మహేశ్వరం వద్ద ఓపెన్ ప్లాట్స్ తక్కువ ధరకు ఇప్పిస్తామని ప్రచారం చేసుకున్నారు. దీంతో అమీన్‌పూర్ దుర్గానగర్ ప్రాంతానికి చెందిన గాజుల దేవ ప్రసాద్ సదరు సంస్థ చైర్మన్ వర్ల కాశీంకు రూ. 4.86 లక్షలు చెల్లించాడు. త్వరలోనే రిజిస్ట్రేషన్ చేయిస్తానని చెప్పిన సంస్థ యజమాని ఏడాది దాటినా పట్టించుకోకుండా కాలయాపన చేస్తున్నాడు. దీంతో అతను గురువారం వెస్ట్ శ్రీనివాస్‌నగర్‌కు వెళ్లి చూడగా శ్రీధర్ డెవలపర్స్ రియల్ ఎస్టేట్ సంస్థ కనిపించలేదు. బోర్డు తిప్పేసి వెళ్లినట్టు స్థానికులు తెలిపారు. తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుగు మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి ముఠా ఆటకట్టు

ముగ్గురు నిందితుల రిమాండ్


పోలీసుల అదుపులో నిందితులు

అత్తాపూర్: గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తుల ముఠాను గురువారం శంషాబాద్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేసి వారి నుంచి 1.38 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జి.దేవేందర్ రావు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శంషాబాద్ ఎక్సైజ్ పోలీసులు బుధవారం సాయంత్రం శాతంరాయి ధర్మకాంట సర్వీసు రోడ్డుపై వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో బైక్‌పై వెళుతున్న కాటేదాన్ ప్రాంతానికి చెందిన రాజు సింగ్‌ను ఆపి తనిఖీ చేయగా 440 గ్రాముల గంజాయి లభించింది. దీంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా మరో ఇద్దరి కలిసి ఈ దందా చేస్తున్నట్లు తెలిపాడు. అతడు ఇచ్చిన సమాచారంతో పోలీసులు రాజేంద్రనగర్ దానమ్మ జోపిడీ లో ఉంటున్న శివశంకర్ షా, వికాస్ కుమార్ ఇళ్లల్లో సోదాలు చేసి 940 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. తాము బీహార్‌కు చెందిన వ్యక్తి నుంచి కిలో రూ.10 వేల చొప్పున కొనుగోలు చేసి నగరంలో అవసరమైన రూ.18 వేలకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL-I, MINISTRY OF FINANCE, GOVERNMENT OF INDIA, 3rd Floor at Triveni Complex, Abids, Hyderabad.

O.A.NO.291 OF 2023

SUMMONS UNDER SUB-SECTION (4) OF SECTION 19 OF THE ACT, READ WITH SUB RULE (2A) OF RULE 5 OF THE DEBT RECOVERY TRIBUNAL (PROCEDURE) RULE, 1993.

The Karur Vysya Bank Ltd., Asset Recovery Management Branch, Abids, Hyderabad.
Vs.
M/s Zenith Import and Export and others

To
01. M/s Zenith Import and Export Represented by its Managing Partner Jain Hitesh Ramesh Kumar @ Hitesh Ramesh Jain
02. Jain Hitesh Ramesh Kumar @ Hitesh Ramesh Jain, S/o Ramesh Kumar Ottarmal Jain, Managing Partner of M/s Zenith Import and Export
03. Ramesh Kumar Ottarmal Jain, S/o Late Sri Otramal Jain Partner of M/s Zenith Import and Export
All are at: Survey No.223, Rampally Village, Keesara Mandal, Ranga Reddy District-501301.
Also at: Plot No.43, Survey No.156/1, Jawahar Rail Colony, Sikh Village, Hyderabad-500009.
Also at: D.No.23-14, Assessment No.2615, RS No.106/2/A, Kondapalli Village & Panchayat, Ibrahimpatnam, Krishna District.
Also at: D.No.1-8-503/10 & 11/B, Plot No.43, Sai Vatika, P.G.Road, Street No.11, Sindhi Colony, Secunderabad-500010.
Also at: H.No.2-3-450, Flat No.303, B-Block, Sri Sai Residency, Gayadeen Bagh, MG Road, Nallagutta, Secunderabad-500010.

SUMMONS/SUBSTITUTED SERVICE BY WAY OF PAPER PUBLICATION

Whereas the O.A. No.291 OF 2023 was listed before the Registrar on 05-02-2024.

Whereas, this Hon'ble Tribunal is pleased to issue Summons / Notice on the said Application under Section 19 (4) of the Act, (OA) filed against you for recovery of debts of **Rs.26,88,82,115.69 Ps.**

In accordance with sub-section (4) of Section 19 of the Act, you the defendants are directed as under: -
(i) to show cause within 30 days of the service of summons as to why relief prayed for should not be granted;
(ii) to disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application;
(iii) you are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties;
(iv) you shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of your business any of the assets over which security interest is created and / or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal;
(v) you shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the Bank or financial institutions holding security interest over such assets.

You are also directed to file the written statement with a copy thereof furnished to the applicant and to appear before the Registrar, on **11-03-2024 at 10:30 A.M.** failing which the application shall be heard and decided in your absence.

Given under my hand and seal of this Tribunal on this the day of **05-02-2024.**

(BY ORDER OF HON'BLE REGISTRAR, DEBTS RECOVERY TRIBUNAL-I, HYDERABAD)

THE REGISTRAR,
DEBTS RECOVERY TRIBUNAL-I,
3rd Floor, Triveni Complex, Abids, Hyderabad-500001.

నేడు టెన్త్ విద్యార్థులకు మోటివేషన్ క్లాస్‌లు

ఫిలింనగర్: ఫిలింనగర్ 23 బస్తీల్లో పదో తరగతి చదువుకుంటున్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు పరీక్షలంటే భయం పోగొట్టడం, జీవితం అంటే ఏమిటి, భవిష్యత్తును ఎలా తీర్చిదిద్దుకోవాలనే అంశాలపై స్థానిక ఫైవ్ ఫింగర్స్ అనే సంస్థ మోటివేషన్ క్లాసులు ఏర్పాటుచేసింది. శుక్రవారం ఉదయం 10 గంటలకు ఫిలింనగర్‌లోని గౌతమ్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు వేణు కళ్యాణ్ ముఖ్య అతిథిగా విచ్చేసి ఈ మోటివేషన్ క్లాసులు తీసుకుంటారని ఫైవ్ ఫింగర్స్ సంస్థ అధ్యక్షుడు సలాది శ్రీనివాస్ తెలిపారు. క్లాసుల అనంతరం విద్యార్థులకు పరీక్షల కిట్లు కూడా అందజేస్తామని తెలిపారు. ప్రతియేటా ఈ బస్తీలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు అంటే భయం పోగొట్టేలా నిపుణులతో మోటివేషన్ క్లాసులు ఇప్పించడం జరుగుతుందని, ఏయేటికాయేడు ఈ క్లాసులు విజయవంతంగా సాగుతున్నాయని, విద్యార్థులు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు.

సోమాజిగూడలో సమస్యల పరిష్కారానికి కృషి



దానంకు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ సంగీతాయాదవ్

పంజగుట్ట: సోమాజిగూడ డివిజన్‌లో పరిధిలోని వివిధ కాలనీల్లో, బస్తీల్లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డివిజన్ కార్పొరేటర్ వనం సంగీతాయాదవ్ ఆధ్వర్యంలో గురువారం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు వినతిపత్రం ఇచ్చారు. రెండు రోజుల్లో అధికారులతో మాట్లాడి, అధికారులతో కలిసి డివిజన్‌లో సమస్యలు ఉన్న ప్రాంతాల్లో పర్యటించి అన్ని సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. బీఆర్ఎస్ నేత శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్–47లోని సి.హెచ్.కృష్ణమూర్తి నివాసిత కాలనీలో కొత్తగా సీసీ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలని ఇటీవల కాలనీవాసులతో పాటు తాను చేసిన విజ్ఞప్తి మేరకు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పందించారని, ఆ మేరకు సంబంధిత అధికారులకు రోడ్డు నిర్మాణం కోసం సిఫారసు లేఖను కూడా పంపించామని జూబ్లీహిల్స్ మాజీ కార్పొరేటర్ కాజ సూర్యనారాయణ తెలిపారు. దీంతో పాటు ఫిలింనగర్‌లో విగ్రహాల రోడ్డులో కూడా సీసీ రోడ్డు వేయాల్సిందిగా తాము కోరామన్నారు. ఇక ఫిలింనగర్ సాయిబాబా టెంపుల్ నుంచి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే రోడ్డులో దిగబడిపోయిన వరదనీటి కాలువ ఎత్తు పెంచి ఇక్కడ కూడా సీసీ రోడ్డు నిర్మించాలని తాము విజ్ఞప్తి చేశామన్నారు. తమ వినతులను ఎమ్మెల్యే స్వీకరించి తక్షణమే స్పందించారని ఫిలింనగర్, జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్–47 కాలనీవాసుల తరుపున కృతజ్ఞతలు తెలిపారు.

'శాంతిశిఖర' అభివృద్ధికి కట్టుబడి ఉన్నా: ఎమ్మెల్యే దానం

పంజగుట్ట: తమ కాంప్లెక్స్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సోమాజిగూడ శాంతి శిఖర అపార్ట్‌మెంట్ (ఎస్ఎస్ఏ) కార్యవర్గ సభ్యులు గురువారం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఏ గౌరవాధ్యక్షుడు రమేష్ హజారి ఆధ్వర్యంలో బృందం దానం నాగేందర్‌ను ఘనంగా సత్కరించారు. గతంలో ఎన్నికల సమయంలో దానం నాగేందర్ తమ అపార్ట్‌మెంట్‌కు వచ్చి ఇచ్చిన హామీలు, అభివృద్ధి కార్యక్రమాల గూర్చి చర్చించి వారిని పూర్తి చేయాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారు. శాంతి శిఖర కాంప్లెక్ అభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నానని, త్వరలోనే అపార్ట్‌మెంట్‌కు వచ్చి సమస్యలన్నీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ధని ఏలే, కార్యదర్శి అనిల్‌కుమార్, ఉపాధ్యక్షుడు ప్రభాత్, కోశాధికారి మాధవ్‌రెడ్డి, సభ్యురాలు పద్మజ తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరనగర్‌లో బెల్టు షాపులతో పరేషాన్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–14లోని వెంకటేశ్వరనగర్ లంబడా బస్తీలో బెల్టుషాపులు స్థానికుల పాలిట శాపంగా మారాయి. రాత్రిపూట వివిధ ప్రాంతాల నుంచి చీప్ లిక్కర్, కల్లు తీసుకువస్తూ కొంతమంది ఇక్కడ విక్రయాలు జోరుగా చేపడుతున్నారు. అర్ధరాత్రి నుంచి తెల్లవారుజామువరకు చీప్ లిక్కర్‌తో పాటు కల్లు విక్రయిస్తుండడంతో బీహార్‌కు చెందిన దినసరి కూలీలు మద్యం సేవిస్తూ న్యూసెన్స్‌కు పాల్పడడమే కాకుండా మద్యం మత్తులో ఇళ్లలోకి చొరబడుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. సుమారు 20 మంది వరకు తమ ఇళ్లల్లో గుట్టుచప్పుడు కాకుండా మద్యం విక్రయిస్తున్నారని, దీని వల్ల తీవ్ర పరిణామాలు ఎదురవుతున్నాయని, ప్రశాంత వాతావరణం దెబ్బతింటుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్ పోలీసులు స్పందించి అనధికారికంగా నిర్వహిస్తున్న బెల్టు షాపులపై చర్యలు తీసుకోవాలని మహిళలు కోరుతున్నారు.

అతివేగంగా డివైడర్‌ను ఢీ కొట్టిన కార్లు

వెంగళరావునగర్: అతి వేగంగా వచ్చిన కారు డివైడర్‌ను ఢీకొట్టిన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరు ప్రాంతానికి చెందిన టి.ప్రసాద్ క్యాబ్ డ్రైవర్‌గా పని చేస్తూ యూసుఫ్‌గూడ హాస్టల్‌లో ఉంటున్నాడు. గురువారం తెల్లవారుజామున యూసుఫ్‌గూడ బస్తీవైపు నిద్రమత్తులో అతి వేగంగా కారు డ్రైవింగ్ చేసుకుంటూ వచ్చిన ప్రసాద్ తన కారుతో డివైడర్‌ను ఢీ కొట్టాడు. దాంతో అతనికి స్వల్ప గాయాలు కాగా, కారు ముందు భాగాలు ధ్వంసం అయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నో ఎంట్రీ సమయంలో వచ్చిన డీసీఎం డ్రైవర్‌పై కేసు

నో ఎంట్రీ సమయంలో నగరంలోకి వచ్చిన డీసీఎం డ్రైవర్‌పై మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. నగరంలో సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు లారీలు, ఇతర భారీ వాహనాలకు నో ఎంట్రీ సమయం ఉంటుంది. ఆ సమయంలో ఎలాంటి వాహనాలకు అనుమతి ఉండదు. అయితే తిమ్మాపూర్ ప్రాంతానికి చెందిన డ్రైవర్ నర్సింహా డీసీఎం వాహనంలో స్క్రాబ్ (వేస్ట్ మెటీరియల్) లోడుతో తిమ్మాపూర్ నుంచి మూసాపేటకు వస్తున్నాడు. మార్గమధ్యలో అమీర్‌పేట వద్ద మధురానగర్ పోలీసులు తనిఖీ చేసి నిబంధనలకు వ్యతిరేకంగా నగరంలోనికి వచ్చానందుకు కేసు నమోదు చేశారు.

నేత్రపర్వం.. సత్యహరిశ్చంద్ర నాటకం

చిక్కడపల్లి: బలిజేపల్లి లక్ష్మీకాంతం రచించిన సత్యహరిశ్చంద్ర నాటక డాక్టర్ శూలపాణి ఆధ్వర్యంలో రసభరితంగా ప్రదర్శించారు. త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణాచారి జన్మదిన వేడుకల సందర్భంగా జరుగుతున్న కళాసప్తాహమ్‌లో భాగంగా సత్యహరిశ్చంద్ర నాటకంలోని ఘట్టాలను ప్రదర్శించారు.

రూ. 10 కోట్లు @ నియోజకవర్గ అభివృద్ధి నిధులు

ఖైరతాబాద్‌లో మొదలైన వినతుల స్వీకరణ

ప్రాధాన్యతాక్రమంలో అభివృద్ధి పనులు

ఎమ్మెల్యే నుంచి కలెక్టర్‌కు వినతులు

గత ప్రభుత్వాల హయాంలో నియోజకవర్గంలో ఏదైనా అభివృద్ధి జరగాలంటే పాదయాత్రలు, పర్యటనల్లో ఎమ్మెల్యే గుర్తించినవి, ప్రజల నుంచి వచ్చిన అర్జీలు, బస్తీలు, కాలనీల సంక్షేమ సంఘాలు ఇచ్చిన ప్రతిపాదనలను ఎమ్మెల్యే తీసుకుని సంబంధిత శాఖల అధికారులకు పంపించి రూపొందించేవారు. ఆ తర్వాత నిధులు మంజూరై పనులు మొదలయ్యేవి. కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టాక ఈ ప్రక్రియకు ఫుల్‌స్టాఫ్ పెట్టారు. ఇప్పుడు నేరుగా ఎమ్మెల్యే నుంచి కాకుండా వివిధ దశల్లో అభివృద్ధి పనులకు సంబంధించిన వినతులు తిరుగుతూ చివరగా ఇన్‌చార్జి మంత్రి ఆమోదంతో పనులు ప్రారంభం కానున్నాయి. ఈ క్రమంలో ప్రతి నియోజకవర్గానికి రూ. 10 కోట్లు నియోజకవర్గ అభివృద్ధి నిధులు మంజూరు చేశారు.

బంజారాహిల్స్: ఖైరతాబాద్ నియోజకవర్గానికి వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం రూ. 10 కోట్లు మంజూరయ్యాయి. ఆయా అభివృద్ధి పనులు ఎక్కడెక్కడ చేపట్టాలో ఆయా ప్రాంతాల బస్తీ నేతలు, సంక్షేమ సంఘాల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నారు.

- కాలనీ, బస్తీ, అపార్ట్‌మెంట్ సంక్షేమ సంఘాలు సమావేశాలు ఏర్పాటుచేసుకుని తమ ప్రాంతంలో ఏమి అభివృద్ధి కావాలో, ఏయే పనులు చేపట్టాలో చర్చించుకుంటారు. చర్చించిన ఆయా అభివృద్ధి పనులకు సంబంధించి వెల్ఫేర్ కమిటీ లెటర్‌హెడ్‌పై వాటి వివరాలు రాసి స్థానిక ఎమ్మెల్యేకు అందజేస్తారు.
- ఎమ్మెల్యే బస్తీ, కాలనీ, అపార్ట్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీలు అందించిన అర్జీలను హైదరాబాద్ కలెక్టర్‌కు పంపిస్తారు.
- జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేల ద్వారా వచ్చిన ఈ అర్జీలను విభజించి దేనికదే ఆయా శాఖలకు పంపించి ప్రతిపాదనలను రూపొందించాల్సిందిగా ఆదేశిస్తారు.
- ఆయా శాఖలు ఆ పనులకు సంబంధించి రూపొందించిన ప్రణాళికలను నేరుగా జిల్లా కలెక్టర్‌కు తిరిగి అందజేస్తారు. కలెక్టర్ వాటన్నింటినీ జిల్లా ఇన్‌చార్జి మంత్రికి పంపిస్తారు.
- ఇన్‌చార్జి మంత్రి ఆమోదముద్ర వేయగానే ఆయా పనులు ప్రారంభమవుతాయి.
- ఇలా ఎమ్మెల్యే నేరుగా నిధులు విడుదల చేసే ప్రక్రియను పక్కనపెట్టి బస్తీ, కాలనీ, సంక్షేమ సంఘాలకే పెద్ద పీట వేశారు. గత ప్రభుత్వాల హయాంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ ఈ నిధులను విడుదల చేసేవారు. ఇప్పుడు ఇన్‌చార్జి మంత్రి ఆమోదముద్ర పడితేనే పనులకు మోక్షం కలగనుంది.



ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు వినతులు అందజేస్తున్న బస్తీల ప్రతినిధులు

నీటి ఎద్దడి నివారణకు రూ. కోటి

- నియోజకవర్గాల అభివృద్ధి నిధులు రూ. 10 కోట్లు మంజూరు కాగా ఇందులో రూ. 2 కోట్లను నేరుగా ఖైరతాబాద్ నియోజకవర్గంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన కోసం ఖర్చు చేయాల్సి ఉంటుంది.
- రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని నీటి ఎద్దడి నివారణకై ఈ నిధుల నుంచి రూ. కోటి ఖర్చు చేస్తారు. సీసీ కెమెరాల నిమిత్తం రూ. 50 లక్షలు ఖర్చు చేయాల్సి ఉంటుంది. మిగతా నిధులన్నీ డ్రైనేజీ, మంచినీరు, అంగన్‌వాడీ, కమ్యూనిటీ హాళ్లు, మహిళాభవన్‌లు, ఇతర పనుల కోసం ఖర్చు చేస్తారు.

ఫిలింనగర్ నుంచి పెద్ద ఎత్తున వినతులు...

- జూబ్లీహిల్స్‌లోని ఫిలింనగర్‌లోని 23 బస్తీలకు చెందిన వెల్ఫేర్ ప్రతినిధులు గురువారం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను కలిసి తమ బస్తీల్లో చేపట్టాల్సిన పనులపై వినతిపత్రాలు అందజేశారు. ఫిలింనగర్ 23 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగరావు ఆధ్వర్యంలో వీరంతా ఆయా బస్తీల లెటర్ హెడ్స్‌పై ఎక్కడెక్కడ ఏయే పనులు చేపట్టాలో వాటి వివరాలు అందజేశారు. ఫిలింనగర్ బస్తీల్లో విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఇంటర్మీడియెట్ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. వేసవి నీటి ఎద్దడి నివారణ కోసం బోర్‌వెల్స్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. బసవతారకంనగర్ బస్తీలో అంగన్‌వాడీ స్కూల్‌తో పాటు ఉర్దూ మీడియం స్కూల్ భవనంపై మరో రెండు స్లాబ్‌లు, రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్లు నిర్మించాలని కోరారు. బంగారుబాల్‌రెడ్డినగర్‌లో నిరుపయోగంగా ఉన్న స్కూల్ బిల్డింగ్‌ను, దీన్‌దయాళ్‌నగర్ బస్తీలో అంగన్‌వాడీ కేంద్రాన్ని, బాబునాయుడునగర్‌లో కమ్యూనిటీ హాల్‌ను నిర్మించాలని కోరారు. దుర్గాభవానీనగర్ కమ్యూనిటీ హాల్, బీజేఆర్‌నగర్‌లో ప్రభుత్వ ఆస్పత్రి, మినీ ఫంక్షన్ హాల్, దీన్‌దయాళ్‌నగర్ బస్తీలో మెయిన్‌రోడ్డు నిర్మాణం, ఛత్రపతి శివాజీనగర్ బస్తీలో కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కోరారు.
- స్పందించిన ఎమ్మెల్యే అసెంబ్లీ సమావేశాల తర్వాత ఈ పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

వైద్యరత్న అవార్డులు అభినందనీయం

మంత్రి దామోదర రాజనర్సింహ


శ్రీనగర్‌కాలనీ: వైద్యరంగంలో విశిష్ట సేవలు అందించిన వైద్యులకు వైద్యరత్న అవార్డులు ఇచ్చి సత్కరించిడం శుభపరిణామమని, ఇప్పటికే నాలుగు పర్యాయాలు వైద్యరత్న అవార్డులను అందించిన జేఎంజీ గ్రూప్స్ కృషి ప్రశంసనీయమని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. గురువారం ఆయన కార్యాలయంలో 2024 సంవత్సరానికిగాను వైద్యరత్న అవార్డుల పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. కరోనా సమయంలో వైద్యుల సేవలు మరువలేనివని, అలాంటి వైద్యులకు ఇలాంటి అవార్డులను అందించడం అభినందనీయమన్నారు. జేఎంజీ గ్రూప్స్ సీఈఓ ఎం.జగన్ మాట్లాడుతూ... 2015 నుంచి వైద్యరత్న అవార్డులను అందిస్తున్నామని, 5వసారి ఈ అవార్డుల ప్రక్రియను కొనసాగిస్తున్నామన్నారు. కరోనాలో విశిష్ట సేవలు చేసిన డాక్టర్లను ఘనంగా సత్కరించామని, ఇప్పటికే నామినేషన్ల ప్రక్రియను మొదటుపెట్టామని, ఫిబ్రవరి 29 వరకు నామినేషన్లను స్వీకరిస్తామన్నారు. మార్చి 21న వైద్యరత్న అవార్డులను మంత్రి దామోదర రాజనర్సింహ చేతులమీదుగా అందజేస్తామన్నారు. జేఎంజీ గ్రూప్స్ డైరెక్టర్ నీలిమ, పవన్, యూఆర్ఆర్ గ్రూప్స్ ఎండీ పరుపాటి శ్రీనివాసరెడ్డి, ఐకానిక్ ఎండీ శ్రీనివాసగౌడ్, వెరోనిక ఈవెంట్స్ ఎండీ సుమన్ పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

ఇష్టపడి చదివితేనే అత్యధిక మార్కులు

హైదరాబాద్ డీఈఓ రోహిణి



మాట్లాడుతున్న డీఈఓ రోహిణి

రహమత్‌నగర్: ఇష్టపడి చదివితే పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించవచ్చని హైదరాబాద్ జిల్లా విద్యాశాఖాధికారి రోహిణి విద్యార్థులకు సూచించారు. బోరబండ డివిజన్‌లోని నాట్కో పాఠశాలను ఆమె శుక్రవారం సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఈఓ మాట్లాడుతూ... తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదివానని గుర్తుచేశారు. పరీక్షలంటే భయం చాలా మంది విద్యార్థుల్లో ఉంటుందని, ముందు దానిని దూరం చేసుకోవాలని సూచించారు. ఇన్‌స్పెక్టర్ ఆదిరెడ్డి మాట్లాడుతూ... ఆరోగ్యమే మహా భాగ్యం అని పెద్దలు సూచించారని, అలాంటి ఆరోగ్యం ఆటల ద్వారా కూడా సాధ్యమవుతుందని తెలిపారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని వారు సందర్శించారు. హెచ్ఎం గీత, గాంధేయవాది, సంఘ సేవకుడు సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలి



షబ్బీర్‌అలీకి వినతిపత్రం సమర్పిస్తున్న వడ్డెర సంఘం నేతలు

చిక్కడపల్లి: దీర్ఘకాలికంగా ఉన్న డిమాండ్ ప్రకారం వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలని వడ్డెర సంఘం నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్య సలహాదారు షబ్బీర్ అలీని సచివాలయంలో గురువారం వడ్డెర ఆత్మగౌరవ భవన సముదాయ ట్రస్ట్ చైర్మన్ జరిపేటి సత్యనారాయణ, వైస్‌చైర్మన్ ఎత్తరి అంతయ్య తదితరులు కలసి వినతిపత్రం సమర్పించారు. వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చేలా ప్రభుత్వానికి నివేదించాలని షబ్బీర్‌అలీని కోరారు. నేతలు డాక్టర్ ఓర్సు కృష్ణయ్య, బండారి శ్రీరాములు, ముక్కలి వెంకటేష్, గుంజ సాయికృష్ణ, దండుగుల రాములు, వెంకటకృష్ణ పాల్గొన్నారు.

వెంకటేశ్వరనగర్‌లో రేషన్‌షాపు ఏర్పాటు

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–14లోని వెంకటేశ్వరనగర్‌లో కొత్తగా రేషన్‌షాపు తెరిచారు. బస్తీవాసుల డిమాండ్ మేరకు గురువారం బస్తీలో రేషన్ షాపును అందుబాటులోకి తీసుకువచ్చి వినియోగదారులకు సరుకులు పంపిణీ చేశారు. స్థానిక కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి ఈ షాపును సందర్శించి వినియోగదారులతో మాట్లాడారు. ఎన్నోసార్లు ఇక్కడ షాపును తెరిపించాల్సిందిగా బస్తీవాసులు ఆమెకు విన్నవించగా పలుమార్లు పౌరసరఫరాల శాఖ అధికారులతో కార్పొరేటర్ సంప్రదింపులు జరిపారు. ఆమె విజ్ఞప్తి మేరకు ఇక్కడ ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని షాపును తెరిచారు. బస్తీవాసులకు అందుబాటులో రేషన్‌షాపు తెరవడం పట్ల కార్పొరేటర్ సంతృప్తి వ్యక్తం చేశారు.

యువకుడిని బెదిరించి నగదు దోపిడీ

వెంగళరావునగర్: షాపు ముగించుకుని ఇంటికి వెళుతున్న యువకుడిని ఆపి దారి దోపిడీకి పాల్పడిన సంఘన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... ఎర్రగడ్డ శివాజీనగర్‌కు చెందిన రాథోడ్ సురేష్ ఛాట్ బండి నిర్వహిస్తుంటాడు. బుధవారం అర్ధరాత్రి షాపును మూసి వేసి ద్విచక్ర వాహనంపై తన సోదరుని ఇంటికి వెళుతున్నాడు. మార్గమధ్యలో ఆలీనగర్ సమీపంలోకి రాగానే 30–35 ఏళ్ల వయసున్న అగంతకుడు వచ్చి సురేష్ నడుపుతున్న ద్విచక్ర వాహనాన్ని ఆపాడు. అనంతరం డబ్బులు ఇవ్వాలని బెదిరించాడు. అంతేగాకుండా సురేష్‌ను తీవ్రంగా అసభ్య పదజాలంతో దూషిస్తూ కొట్టాడు. అనంతరం అతని వద్ద ఉన్న రూ. 1600 తీసుకుని పారిపోయాడు. బాధితుడు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వెంగళరావునగర్‌లో రోడ్లపై మురుగునీరు



వెంగళరావునగర్: వెంగళరావునగర్‌కాలనీలోని ఏ-టైపు పార్కుకు మూడు వైపులా మురుగునీరు నిత్యం పారుతూ నదులను తలపిస్తున్నాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం కాలనీవాసులు కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం (ఓఆర్‌జీ) జాతీయ కార్యదర్శి డాక్టర్ పి.వి.రవిశేఖర్‌రెడ్డికి తెలియజేశారు. ఆయన ఆ ప్రాంతాన్ని సందర్శించి మురుగునీటిపై జలమండలి అధికారులకు ఫోన్ల ద్వారా సమాచారం అందించారు. కొంతకాలంగా పార్కుకు మూడు వైపులా మురుగునీరు ప్రవహిస్తున్నందు వల్ల కాలనీవాసులు ఉండలేకపోతున్నారని తెలియజేశారు. దీని కారణంగా దుర్వాసనతో పాటుగా దోమలు కూడా వ్యాప్తి చెందుతున్నాయని అన్నారు. తక్షణమే మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. దీనికి స్పందించిన జలమండలి అధికారులు సిబ్బందిని పంపి మురుగునీరు రోడ్లపై పారకుండా మ్యాన్‌హోల్స్‌ను శుభ్రం చేసి క్లియర్ చేశారు.

రెండు వేర్వేరు ఘటనల్లో చోరీలు

వెంగళరావునగర్: రెండు వేర్వేరు ఘటనల్లో ద్విచక్ర వాహనం, ఐ ఫోన్ చోరీకి గురైన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సనత్‌నగర్‌కు చెందిన షేక్ వాజీద్ ఆలీ ఫాస్ట్‌ఫుడ్ స్టాల్ నడుపుతుంటాడు. గురువారం తన ద్విచక్ర వాహనాన్ని మధురానగర్ రత్నదీప్ వద్ద నిలిపి షాపులోనికి వెళ్ళి దాదాపు ముప్పావుగంట తర్వాత వచ్చి చూశాడు. బయట తన ద్విచక్ర వాహనం కనిపించలేదు. మధురానగర్‌లో నివసించే రిటైర్డ్ ఎంప్లాయి వెంకటేశ్వరరావు అదే ప్రాంతంలోని తన మరదలు ఇంటికి వెళ్ళాడు. అక్కడ ఆమెకు చెందిన ఐ ఫోన్ తనకు ఇచ్చాడు. అది టీ పాయ్ మీద పెట్టిన ఆమె కిచెన్‌లోని వెళ్ళింది. కొద్దిసేపటి తర్వాత వచ్చి చూడగా కనిపించలేదు. ఈ రెండు ఘటనల్లో బాధితులు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సమయపాలనతోనే పోటీ పరీక్షల్లో సత్ఫలితాలు



12వ తరగతి విద్యార్థులకు విద్యాజ్యోతిని అందజేస్తున్న జూనియర్ విద్యార్థులు



ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న ప్రిన్సిపాల్ అరుణశ్రీ

ఫిలింనగర్: ఈ నెల 15వ తేదీ నుంచి సీబీఎస్ఈ 12వ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులు పాఠశాలలను వీడే క్రమంలో సీనియర్లకు జూనియర్లు ఇచ్చే వీడ్కోలు కార్యక్రమం జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యాభవన్ పబ్లిక్ స్కూల్ విద్యాశ్రమంలో ఒక ఉత్సవంలా నిర్వహించారు. సీనియర్లకు జూనియర్లు ఘనంగా వీడ్కోలు పలికే ఈ ఘట్టాన్ని కనులపండువగా నిర్వహించారు. విద్యాజ్యోతి అనే థీమ్‌తో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన 11వ తరగతి విద్యార్థులు వెలిగించిన జ్యోతిని 12వ తరగతి విద్యార్థులకు అందజేసి భవిష్యత్తులో ఇలాగే వెలగాలంటూ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ అరుణశ్రీ మాట్లాడుతూ... పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలన్నారు. అంకితభావం, చిత్తశుద్ధి, శ్రద్ధ.. ఇవన్నీ చదువులపై కేంద్రీకరించాలన్నారు. క్రమశిక్షణ చాలా ముఖ్యమైనదని, ఎక్కడికి వెళ్లినా తాము భారతీయ విద్యాభవన్ స్కూల్ విద్యార్థులమని గర్వంగా చెప్పుకునే రీతిలో ప్రవర్తించాలని తెలిపారు. బాగా చదువుకుని మంచి పదవులు సంపాదించి ఇదే పాఠశాలకు ముఖ్య అతిథిగా విచ్చేసే రీతిలో తయారుకావాలని సూచించారు. పరీక్షల సమయంలో మొబైల్ ఫోన్లను పక్కనబెట్టి సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని వెల్లడించారు. ఏదైనా సందేహం ఉంటే అప్పటికప్పుడు టీచర్లను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని, ఎప్పుడూ టీచర్లు అందుబాటులో ఉంటారని చెప్పారు. 12వ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు ఆమె ప్రశంసాపత్రం అందజేశారు.

ఉచిత విద్యుత్ అర్హుల గుర్తింపు ముమ్మరం



వెంకటగిరిలో పర్యటిస్తున్న టీఎస్ఎస్‌పీడీసీఎల్ అధికారులు

బంజారాహిల్స్: ఉచిత విద్యుత్ పథకం కింద అర్హులను గుర్తించే ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. బంజారాహిల్స్, ఫిలింనగర్, ఎల్లారెడ్డిగూడ, జూబ్లీహిల్స్, అమీర్‌పేట సబ్‌స్టేషన్ల పరిధిలో సుమారు 75 మంది వరకు సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ అర్హులకు సంబంధించిన ఆధార్ కార్డు నెంబర్, రేషన్‌కార్డు నెంబర్, మొబైల్ ఫోన్ నెంబర్ నమోదు చేస్తున్నారు. అలాగే ప్రజాపాలన దరఖాస్తు నెంబర్‌ను కూడా నమోదు చేస్తున్న సిబ్బంది, ఒకవేళ దరఖాస్తు చేసుకోనిపక్షంలో ఆ వివరాలను కూడా నమోదు చేస్తున్నారు. త్వరితగతిన ఈ ప్రక్రియను పూర్తిచేసే దిశగా టీఎస్ఎస్‌పీడీసీఎల్ డీఈ నరేందర్ రెడ్డి, అమీర్‌పేట ఏడీఈ ప్రేమ్‌కుమార్, బంజారాహిల్స్ ఏడీఈ హైమానందలు నిత్యం పరిశీలిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో ఈ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న అధికారులు అక్కడికక్కడే తగిన సూచనలు కూడా జారీ చేస్తున్నారు. తెల్లరేషన్‌కార్డు కలిగి ఉండి 200 యూనిట్ల లోపు కరెంటు వినియోగిస్తున్న నివాసితులకు గృహజ్యోతి పథకం కింద ఉచిత కరెంటుకు అర్హులు కానున్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికి కృషి



రామకృష్ణానగర్‌లో పర్యటిస్తున్న ఖైరతాబాద్ డీసీ జగన్

బంజారాహిల్స్: రోజూ ఒక్కో బస్తీలో పర్యటించి ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకోనున్నట్లు జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్–17 డీఎంసీ జగన్ తెలిపారు. గురువారం ఆయన ఖైరతాబాద్ డివిజన్ బాలాపుర బస్తీ సమీపంలోని రామకృష్ణానగర్‌లో పర్యటించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. రోజూ ఒకటి, రెండు బస్తీల్లో ఇలాగే పర్యటించడం జరుగుతుందని, స్థానికులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుంటామన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

ఖైరతాబాద్: ఉరి వేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఖైరతాబాద్ పోలీసుల సమాచారం మేరకు... మారుతీనగర్‌లో నివాసముండే కోమాల అశోక్(32) పంజగుట్ట పరిధిలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో వార్డు బాయిగా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు. భార్య శ్రవంతి ప్రైవేటు జాబ్ చేస్తుంది. గురువారం డ్యూటీకని వెళ్లిన అతను తిరిగి ఇంటికి వచ్చి స్థానికంగా నివాసముండే తల్లి ఇంటికి వెళ్లి అక్కడి నుంచి తాను నివాసముండే ఇంటికి వెళ్తున్నాని చెప్పి వెళ్లాడు. ఆ తరువాత ఫోన్ చేసిన లిఫ్ట్ చేయకపోవడంతో అశోక్ సోదరి ఇంటికి వచ్చి చూడగా ఇంట్లో ఉరి వేసుకున్నట్లు కనిపించడంతో వెంటనే చుట్టుపక్కల వారికి, అశోక్ భార్యకు సమాచారమిచ్చి తలుపు తొలగించి చూడగా చున్నీతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని చనిపోయినట్లు గుర్తించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అధిక లాభాల పేరుతో రూ. 32 లక్షలు స్వాహా


హిమాయత్‌నగర్: ఆన్‌లైన్‌లో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించి ఓ వ్యక్తి నుంచి రూ. 32 లక్షలను కాజేశారు సైబర్ నేరగాళ్లు. నగర సైబర్ క్రైమ్ ఏసీపీ శివమారుతి సమాచారం మేరకు... నగరానికి చెందిన ఓ వ్యక్తికి టెలిగ్రామ్ ద్వారా ఆన్‌లైన్‌లో పెట్టుబడులు పెట్టాలని మెసేజీలు పంపారు. మొదట కొంత డబ్బు పెట్టుబడి పెడితే లాభాలు ఇచ్చి నమ్మించారు. వివిధ టాస్కులు పూర్తి చేయడం ద్వారా తక్కువ కాలంలో ఇంటి వద్దనే ఉంటూ లక్షలాది రూపాయలు సంపాదించవచ్చని తెలిపారు. లాభాలు విత్ డ్రా చేసుకోవాలంటే అధిక మొత్తంలో పెట్టుబడి పెట్టాలని ఒత్తిడి చేశారు. ఈ విధంగా పెట్టుబడులు పెడితే లక్షల రూపాయలు లాభాలు వచ్చాయని సైబర్ కేటుగాళ్లు సృష్టించిన నకిలీ అకౌంట్లలో లక్షల రూపాయలు ఉన్నట్లు బాధితుడిని నమ్మిస్తూ.. టెలిగ్రామ్‌లో సందేశాలు పంపారు. ఈ విధంగా మూడు నెలల కాలంలో విడతల వారీగా 32 లక్షల రూపాయలు కాజేశారు. అనంతరం వారు స్పందించకపోవడంతో మోసపోయానని బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు, ఈ తరహా సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏసీపీ శివమారుతి సూచించారు.

దొరికారు దొంగలు

ఏ-1 చంద్రబాబు, ఏ-2 నారాయణ, ఏ-3 లింగమనేని, ఏ-14 లోకేశ్

- ఐఆర్ఆర్ కుంభకోణం కేసులో సీఐడీ దూకుడు
- ఏసీబీ న్యాయ స్థానంలో చార్జ్‌షీట్ దాఖలు
- కన్సల్టెన్సీ ముసుగులో భూ దోపిడీ
- తద్వారా పచ్చ ముఠా భూముల విలువ అమాంతం పెంపు
- రూ.2 వేల కోట్లకుపైగా దోపిడీ

సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు యథేచ్ఛగా సాగించిన కుంభకోణాలపై సీఐడీ దూకుడు పెంచింది. ఇన్నర్ రింగ్ రోడ్ కేసులో విజయవాడ ఏసీబీ న్యాయస్థానంలో గురువారం చార్జ్‌షీట్ దాఖలు చేసింది. ఈ కేసులో ఏ-1గా చంద్రబాబు, ఏ-2గా పొంగూరి నారాయణలను పేర్కొంది. లింగమనేని కుటుంబంతో కలిసి సాగించిన ఈ క్విడ్ ప్రో కో కుంభకోణంలో హెరిటేజ్ ఫుడ్స్ డైరెక్టర్‌గా వ్యవహరించిన నారా లోకేశ్‌ను ఏ-14గా, లింగమనేని రమేశ్ తదితరులను కూడా నిందితులుగా పేర్కొంది. వారిపై ఐపీసీ 120(బి), 409, 420, 34, 35, 37.. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 13(2), రెడ్‌విత్ 13(1)(సి),(డి)ల ప్రకారం వారిపై కేసు నమోదు చేసినట్టు ఆ చార్జ్‌షీట్‌లో వెల్లడించింది.తద్వారా ఈ భారీ భూ కుంభకోణంపై న్యాయ విచారణ ప్రక్రియకు రంగం సిద్ధమైంది. కాగితాల మీదే ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో ఇష్టానుసారం మార్పులు చేసి, వేల కోట్ల రూపాయలు కొల్లగొట్టిన చంద్రబాబు ముఠా అవినీతి బాగోతం విభ్రాంతి పరుస్తోంది. టీడీపీ ప్రభుత్వంలో సీఆర్‌డీఏ చైర్మన్‌గా అప్పటి సీఎం చంద్రబాబు, వైస్ చైర్మన్‌గా అప్పటి మంత్రి పొంగూరు నారాయణ బరితెగించి ఇలా అవినీతికి పాల్పడ్డారు. ఇందుకోసం లింగమనేని రమేశ్‌తో క్విడ్ ప్రో కో కు తెరలేపారు. ఈ తతంగంలో నారా లోకేశ్ కూడా ప్రధాన పాత్ర పోషించారు. చంద్రబాబు బినామీ, సన్నిహితుడు లింగమనేని భూముల మార్కెట్ విలువ రూ.177.50 కోట్ల నుంచి రూ.877.50 కోట్లకు.. రాజధాని నిర్మాణం అనంతరం ఏకంగా రూ.2,130 కోట్లకు చేరేలా ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్‌ను ఖరారు చేయడం భారీ దోపిడీకి నిదర్శనం.



సింగపూర్ కన్సల్టెన్సీ ముసుగు

సింగపూర్‌కు చెందిన సుర్బాన జ్యూరాంగ్ కన్సల్టెన్సీ ముసుగులో చంద్రబాబు ముఠా ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్ పేరిట భూ దోపిడీకి పాల్పడింది. సీఆర్‌డీయే ఏకంగా సింగపూర్ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నట్టుగా టీడీపీ ప్రభుత్వం భ్రమింపజేసింది. కానీ ఆ పేరుతో సింగపూర్‌లోని ప్రైవేట్ కన్సల్టెన్సీ సుర్బాన జ్యూరాంగ్ కన్సల్టెన్సీని తీసుకువచ్చి పక్కాగా అవినీతి కథ నడిపించింది. అమరావతిలో ఇన్నర్ రింగ్ రోడ్ కోసం సీఆర్‌డీయే అధికారులు 94 కిలోమీటర్ల పొడవుతో అలైన్‌మెంట్ రూపొందించారు. ఆ ప్రకారం అమరావతిలోని చంద్రబాబు, లింగమనేని, నారాయణ కుటుంబాలకు చెందిన భూములకు 3 కిలోమీటర్ల దూరం నుంచి పెద్ద మరిమి, నిడమర్రు, చిన వడ్లపూడి, పెద వడ్లపూడి మీదుగా ఇన్నర్ రింగ్ రోడ్ నిర్మించాలి. దాంతో తమ భూముల విలువ పెరగదని గ్రహించిన చంద్రబాబు, నారాయణ.. సీఆర్‌డీయే అధికారులపై మండి పడ్డారు. వారిద్దరి ఆదేశాలతో సీఆర్‌డీయే అధికారులు ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో మార్పులు చేశారు. అలైన్‌మెంట్‌ను 3 కిలోమీటర్లు దక్షిణానికి జరిపి.. తాడికొండ, కంతేరు, కాజాలలోని చంద్రబాబు, లింగమనేని కుటుంబాలకు చెందిన 355 ఎకరాలు, హెరిటేజ్ ఫుడ్స్‌కు చెందిన 13 ఎకరాలను ఆనుకుని నిర్మించేలా ఖరారు చేశారు. ఆ విషయాన్ని గోప్యంగా ఉంచి.. చంద్రబాబు, నారాయణ తమ కుటుంబ సంస్థలు హెరిటేజ్, రామకృష్ణ హౌసింగ్ లిమిటెడ్‌లతోపాటు తమ బినామీ లింగమనేని రమేశ్ సంస్థల పేరిట ఇన్నర్ రింగ్ రోడ్డుకు అటూ ఇటూ భారీగా భూములు కొన్నారు. అనంతరం సింగపూర్‌కు చెందిన సుర్బాన జ్యూరాంగ్ కన్సల్టెన్సీని రంగంలోకి తెచ్చారు. అప్పటికే ఖరారు చేసిన ఇన్నర్ రింగ్ రోడ్ డిజైన్‌ను అమరావతి మాస్టర్ ప్లాన్‌లో చేర్చారు. అనంతరం ఎస్టీయూపీ అనే కన్సల్టెన్సీని నియమించారు. కానీ మాస్టర్ ప్లాన్‌లో పొందు పరిచిన అలైన్‌మెంట్‌కు అనుగుణంగానే ఉండాలని షరతు విధించారు. అంటే అప్పటికే సీఆర్‌డీయే అధికారుల ద్వారా తాము ఖరారు చేసిన అలైన్‌మెంట్‌నే ఎస్టీయూపీ కన్సల్టెన్సీ ద్వారా ఆమోదించేలా చేశారు.

ఇదిగో అడ్డగోలు దోపిడీ ఇలా..

- ఐఆర్ఆర్ అలైన్‌మెంట్ కుంభకోణం ద్వారా చంద్రబాబు ముఠా లింగమనేని కుటుంబంతో క్విడ్ ప్రో కోకు పాల్పడింది. లింగమనేని కుటుంబానికి కల్పించిన ప్రయోజనానికి ప్రతిగా చంద్రబాబు తమ హెరిటేజ్ ఫుడ్స్‌కు భూములు పొందారు. ఈ ప్రక్రియలో అప్పటి హెరిటేజ్ ఫుడ్స్ డైరెక్టర్ హోదాలో లోకేశ్ కీలక భూమిక పోషించారు. ఐఆర్ఆర్ అలైన్‌మెంట్‌ను ఆనుకుని ఉన్న కంతేరు గ్రామంలో హెరిటేజ్ ఫుడ్స్‌కు 10.4 ఎకరాలు పొందారు.
- 2014 జూన్ - సెప్టెంబర్ మధ్య ఈ భూములను హెరిటేజ్ ఫుడ్స్ కొనుగోలు చేసినట్టు చూపించారు. అంతే కాకుండా లింగమనేని కుటుంబం నుంచి మరో 4.55 ఎకరాలు కొనుగోలు పేరిట హెరిటేజ్ ఫుడ్స్ దక్కించుకుంది. కానీ అప్పటికే ఈ కుంభకోణం గురించి బయటకు పొక్కడంతో ఆ సేల్ డీడ్‌ను రద్దు చేసుకున్నారు. ఐఆర్ఆర్ అలైన్‌మెంట్‌ను ఆనుకుని లింగమనేని కుటుంబానికి చెందిన 355 ఎకరాలతోపాటు హెరిటేజ్ ఫుడ్స్ భూములు ఉండటం గమనార్హం.
- క్విడ్ ప్రో కో లో భాగంగా లింగమనేని రమేశ్ కృష్ణా నది కరకట్ట మీద ఉన్న తమ బంగ్లాను చంద్రబాబుకు ఇచ్చారు. దీనిపై కేసు నమోదు కావడంతో ఈ వ్యవహారానికి మసి పూసేందుకు చేసిన యత్నాలు బెడిసికొట్టాయి. ఆ బంగ్లాను అద్దెకు ఇచ్చానని లింగమనేని రమేశ్ చెప్పారు. కానీ ఆయన అద్దె వసూలు చేసినట్టుగానీ, చంద్రబాబు చెల్లించినట్టుగానీ ఆదాయ పన్ను వివరాల్లో లేవు.
- తర్వాత ఆ ఇంటిని ప్రభుత్వానికి ఉచితంగా ఇచ్చానని చెప్పారు. మరి అప్పటి ప్రభుత్వం నుంచి చంద్రబాబు హెచ్ఆర్ఏ ఎందుకు పొందారని ప్రశ్నించేసరికి ఆయన వద్ద నుంచి జవాబే లేదు. దాంతో ఆ బంగ్లాను చంద్రబాబుకు వ్యక్తిగతంగా క్విడ్ ప్రో కో కింద ఇచ్చారన్నది స్పష్టమైంది.

ఐఆర్ఆర్ కేసులో నిందితులు
ఏ-1: చంద్రబాబు, ఏ-2: నారాయణ, ఏ-3: లింగమనేని రమేశ్
ఏ-4: లింగమనేని వెంకట సూర్య రాజశేఖర్
ఏ-5: కేపీవీ అంజని కుమార్ (రామకృష్ణ హౌసింగ్ కార్పొరేషన్)
ఏ-6: హెరిటేజ్ ఫుడ్స్, ఏ-7: ఎల్ఈపీఎల్ ప్రాజెక్ట్స్, ఏ-14: లోకేశ్

లోకేశ్ అరెస్టుకు ప్రతిబంధకం కాదు

ఐఆర్ఆర్ కేసులో సీఐడీ చార్జ్‌షీట్ దాఖలు ఇప్పటికే విచారణలో ఉన్న 'రెడ్‌బుక్' కేసును ప్రభావితం చేయదని నిపుణులు చెబుతున్నారు. ఐఆర్ఆర్ కుంభకోణం కేసు, రెడ్‌బుక్ బెదిరింపులు వేర్వేరు కేసులు. కాబట్టి ఐఆర్ఆర్ కేసులో చార్జ్‌షీట్ దాఖలు చేసినప్పటికీ రెడ్‌బుక్ పేరిట బెదిరింపు కేసులో లోకేశ్‌ను అరెస్ట్ చేసేందుకు ఎలాంటి అడ్డంకి ఉండదని నిపుణులు స్పష్టం చేశారు.

మ్యాప్‌ను చుట్టూ తిప్పేశారు..

- లింగమనేని కుటుంబంతో క్విడ్ ప్రో కో ద్వారా పొంగూరు నారాయణ.. తమ బంధువులు, బినామీల పేరిట 58 ఎకరాలు పొందారు. చంద్రబాబు, నారాయణ కుటుంబాలు అక్రమంగా దక్కించుకున్న భూముల సమీపంలోనే ప్రభుత్వ నిధులతో సీడ్ క్యాపిటల్ ఏరియా, స్టార్టప్ ఏరియాను అభివృద్ధి చేయాలని టీడీపీ ప్రభుత్వం ప్రణాళికను ఆమోదించింది. అందుకోసం ఏకంగా ప్రభుత్వ నిధులు రూ.5,500 కోట్లు వెచ్చించాలని నిర్ణయించింది. తద్వారా తమ భూముల ధరలు అమాంతం పెరిగేలా చేసేందుకు కుట్ర పన్నింది.
- సీఆర్‌డీఏ అధికారులు మొదట రూపొందించిన అలైన్‌మెంట్ ప్రకారం గుంటూరు జిల్లాలోని నూతక్కి - కృష్ణా జిల్లా పెద్దపులిపర్రు మధ్య కృష్ణా నదిపై వంతెన నిర్మించాలి. అక్కడి నుంచి తాడిగడప - ఎనికేపాడు మీదుగా నున్న వరకు ఇన్నర్ రింగ్ రోడ్డు కొనసాగుతుంది. అలా నిర్మిస్తే ఆ ప్రాంతంలోని నారాయణ విద్యా సంస్థల భవనాలను భూ సేకరణ కింద తొలగించాల్సి వస్తుంది. దాంతో నారాయణ ఆదేశాలతో ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను 3 కి.మీ. తూర్పు దిశగా మార్చారు.
- ఆ ప్రకారం గుంటూరు జిల్లాలో రామచంద్రాపురం - కృష్ణా జిల్లా చోడవరం మధ్య వంతెన నిర్మించాలని నిర్ణయించారు. అక్కడి నుంచి పెనమలూరు మీదుగా నిడమనూరు నుంచి నున్న వరకు ఇన్నర్ రింగ్ రోడ్డును నిర్మిస్తారు. దాంతో నారాయణ కుటుంబానికి చెందిన 9 విద్యా సంస్థల భవనాలను ఆనుకుని ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను ఖరారు చేశారు.

పవన్ కళ్యాణ్‌కూ 2.40 ఎకరాల ప్యాకేజీ

జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు కూడా ఈ ఇన్నర్ రింగ్ రోడ్డు అవినీతి పాపంలో పిడికెడు వాటా ఇచ్చారు. ఈ రోడ్డు అలైన్‌మెంట్‌కు సమీపంలోనే ఆయనకు 2.4 ఎకరాల భూమి ఉంది. లింగమనేని కుటుంబం నుంచి ఆ భూములను ప్రభుత్వ ధర ప్రకారం ఎకరా రూ.8 లక్షలు చొప్పున కొనుగోలు చేసినట్టు చూపించారు. ల్యాండ్ పూలింగ్ నుంచి మినహాయింపు కల్పించిన భూమినే పవన్ కళ్యాణ్‌కు ఇవ్వడం గమనార్హం.



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలుపుతున్న వైవీ సుబ్బారెడ్డి, గొల్ల బాబూరావు, మేడా రఘునాథరెడ్డి

వైఎస్సార్‌సీపీ రాజ్యసభ అభ్యర్థులు ఖరారు

అభ్యర్థులుగా గొల్ల బాబూరావు, వైవీ సుబ్బారెడ్డి, మేడా రఘునాథ రెడ్డి

సాక్షి,అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ రాజ్యసభ అభ్యర్థులను గురువారం ఖరారు చేశారు. పార్టీ అభ్యర్థులుగా గొల్ల బాబూరావు, మేడా రఘునాథరెడ్డి, వైవీ సుబ్బారెడ్డిని ఎంపిక చేశారు. ముగ్గురు అభ్యర్థులను సీఎం జగన్ అభినందించారు. గురువారం అసెంబ్లీలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో ముగ్గురు అభ్యర్థులు సీఎం జగన్‌ను కలిశారు. తమకు రాజ్యసభ అభ్యర్థులుగా అవకాశం కల్పించినందుకు వారు సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సీ-ఓటర్ నేతి బీర సర్వే

- 2019లోనూ ఇదే రీతిలో సర్వే.. తప్పిన లెక్కలు
- గత ఎన్నికల్లో చారిత్రక విజయం సాధించిన వైఎస్సార్‌సీపీ
- తాజాగా ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లోనూ సీ-ఓటర్ అంచనాలు గల్లంతు
- ప్రజల నాడి పట్టలేక విశ్వసనీయత కోల్పోయిన సర్వే సంస్థ

సాక్షి, అమరావతి: ప్రజల మనోగతం పేరుతో సీ-ఓటర్ సంస్థ నిర్వహిస్తున్న సర్వేలకు ఏమాత్రం విశ్వసనీయత లేదనేందుకు ఇటీవల జరిగిన పలు రాష్ట్రాల ఎన్నికలతోపాటు 2019 ఎన్నికల్లో ఆ సంస్థ లెక్కలు తప్పడమే నిదర్శనమని రాజకీయ విశ్లేషకులు ఉదహరిస్తున్నారు. గత నవంబర్‌లో మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు జరిగిన ఎన్నికల్లో సీ-ఓటర్ అంచనాలు గల్లంతయ్యాయి. టైమ్స్ నౌ లాంటి దిగ్గజసంస్థలకుపైగా జాతీయ మీడియా సంస్థలు నిర్వహించిన సర్వేలు రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించడం తథ్యమని, టీడీపీ ఉనికి కోల్పోవడం ఖాయమని ఇప్పటికే వెల్లడించాయి. ఎలాంటి విశ్వసనీయత లేని సీ-ఓటర్ మాత్రం తనకు అలవాటైన రీతిలో సర్వే చేసినట్లు పేర్కొనగా దాన్ని పట్టుకుని టీడీపీ, ఎల్లో మీడియా చంకలు గుద్దుకోవడంపై విస్మయం వ్యక్తమవుతోంది. కోతికి కొబ్బరి చిప్ప మాదిరిగా సీ-ఓటర్ సర్వే పేరుతో హడావుడికి తెర తీశారని పేర్కొంటున్నారు. 2019లో ఎన్నికల్లో టీడీపీ 14 లోక్‌సభ, 90-100 శాసనసభ స్థానాల్లో విజయం సాధిస్తుందని తన సర్వేలో వెల్లడైనట్లు సీ-ఓటర్ ప్రకటించింది. చివరకు ఫలితాలను చూస్తే 151 శాసనసభ, 22 లోక్‌సభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ చారిత్రక విజయాన్ని నమోదు చేయగా టీడీపీ 23 శాసనసభ, 3 ఎంపీ స్థానాలకే పరిమితమైంది.

చెప్పిందంటే.. జరగదంతే!

దేశంలో ఇప్పటిదాకా జరిగిన అధిక శాతం ఎన్నికల్లో సీ-ఓటర్ నిర్వహించిన ప్రీ-పోల్, ఎగ్జిట్ పోల్ సర్వేలు లెక్కలు తప్పాయి. ఏదైనా ఓ పార్టీ అధికారంలోకి వస్తుందని సీ-ఓటర్ తేల్చిందంటే కచ్చితంగా మరో పార్టీనే అధికారంలోకి వస్తుందని పలు సందర్భాల్లో రుజువు కావటాన్ని బట్టి ఆ సంస్థ విశ్వసనీయత ఎంతన్నది వెల్లడవుతోంది.

ఇదీ.. 'సీ ఓటర్' విశ్వసనీయత!

ఏ ఎన్నిక?	సీ ఓటర్ అంచనా/ సీట్లు	ఎన్ని సీట్లు వచ్చాయి?	అంతిమ విజేత/సీట్లు
2019 ఎన్నికలు	టీడీపీ 14 ఎంపీ, 90-100 అసెంబ్లీ	3 ఎంపీ, 23 అసెంబ్లీ	వైఎస్సార్ సీపీ 22 ఎంపీ, 151 అసెంబ్లీ
మధ్యప్రదేశ్ 2023 నవంబర్	కాంగ్రెస్ 118 - 130 (ప్రీ పోల్) కాంగ్రెస్ 113 -137 (ఎగ్జిట్ పోల్)	కాంగ్రెస్ (66)	బీజేపీ (163)
ఛత్తీస్‌గఢ్ 2023 నవంబర్	కాంగ్రెస్ 45-51(ప్రీ పోల్) కాంగ్రెస్ 41-53 (ఎగ్జిట్ పోల్)	కాంగ్రెస్ (35)	బీజేపీ (54)

నగర వార్తలు

జాతి హక్కుల సాధనకు పోరాడాలి

ముషీరాబాద్: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన పోరాటంలో మాదిగ విద్యార్థులు కీలక పాత్ర పోషించారని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ అన్నారు. వారు మాదిగ జాతి హక్కుల సాధనకు మరో పోరాటం చేయాలన్నారు. గురువారం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయం విద్యానగర్‌లో జరిగిన మాదిగ విద్యార్థుల ముఖ్య కార్యకర్తల సమావేశంతో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధనలో విద్యార్థుల పాత్ర మరువలేనిదన్నారు. ఎస్సీ వర్గీకరణ సాధనకు నాడు ప్రాణాలకు తెగించి అసెంబ్లీ ఎక్కిన చరిత్ర మాదిగ విద్యార్థులదేనన్నారు. పార్లమెంటులో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలని కోరుతున్నా కాంగ్రెస్ పార్టీ పదేళ్ళ, బీజేపీ మరో పదేళ్లు మాదిగలను వంచించాయని ఆరోపించారు. సుప్రీం కోర్టులో ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రముఖ రచయిత శ్రీపతి ఇక లేరు



సాక్షి, సిటీబ్యూరో: విరసం వ్యవస్థాపకుల్లో ఒకరైన ప్రముఖ రచయిత శ్రీపతి బుధవారం రాత్రి ఏడు గంటలకు కన్నుమూశారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన నగరంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బంధువులు, కుటుంబ సభ్యులు తెలిపారు. గురువారం మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించారు. సాహిత్య రంగంలో పెను సంచలనం సృష్టించిన శ్రీపతి అసలు పేరు పుల్లట చలపతిరావు. కానీ ఆయన శ్రీపతిగా సుప్రసిద్ధులయ్యారు. మంచుపల్లకి-మరి తొమ్మిది, సత్యజిత్ రాయ్ ఎవరు, బెనారస్ చిత్రాలు వంటి కథా సంపుటాలు వెలువరించారు. కాటుక కళ్లు - కథలు మూడు ఆయన రచించిన చివరి కథా సంపుటం. తన గ్రామం భైరిపురం నేపథ్యంతో శ్రీపతి రాసిన 'మామిడి పళ్ల ఊరు కథ' ఆయన చివరి రచన. ఏ కథాంశం చెప్పినా పూదోటలా సౌందర్యంగా చెప్పడం ఆయన ప్రత్యేకత. ఆయనకు ఇరువురు సంతానం. పెద్దబ్బాయి గుండెపోటుతో కొన్నాళ్ల క్రితం చనిపోగా, చిన్నబ్బాయి సంగ్రామ్ అమెరికాలో వుంటున్నారు. గతేడాది జీవన సహచరి శారద అనారోగ్యంతో చనిపోయారు. శ్రీకాకుళం జిల్లా కవిటి మండలం భైరిపురం ఆయన సొంతూరు. హైదరాబాద్‌లోనే స్థిరపడ్డారు.

చేతులకు పనిచెప్పు.. గుండెపోటుకు చెక్ పెట్టు..

గాంధీ ఆస్పత్రి : గాంధీ మెడికల్ కాలేజీ అలుమ్ని అసోసియేషన్, గ్లోబల్ అలియన్స్ (ఓవర్సీస్ ఓల్డ్ స్టూడెంట్స్ ఆఫ్ జీఎంసీ) సంయుక్త ఆధ్వర్యంలో గాంధీ ప్రాంగణంలోని అలుమ్ని ఎడ్యుకేషన్ సెంటర్‌లో ఈ నెల 9, 10వ తేదీల్లో రెండు రోజుల పాటు కమ్యూనిటీ హ్యాండ్స్ ఆన్ కార్డియో పల్మనరీ రిసక్టేషన్ (సీపీఆర్), బేసిక్ లైఫ్ సపోర్ట్ (బీఎల్ఎస్) అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. దేశ వ్యాప్తంగా ఏటా లక్ష మందిలో 4280 మంది సడెన్ కార్డియాక్ అరెస్ట్ కారణంగా మరణిస్తుండగా, గుండెపోటుకు గురై ఆస్పత్రికి వెళ్లేలోగా 92 శాతం మంది మృతి చెందుతున్నారని, ఇటువంటి మరణాల శాతాన్ని తగ్గించేందుకు సీపీఆర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గాంధీ అలుమ్నీ అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ జీఆర్ లింగమూర్తి, డాక్టర్ ఏపీ రత్నం తెలిపారు.

- హఠాత్తుగా కుప్పకూలడం, అపస్మారక స్థితి, శ్వాస అందకపోవడం, నాడీ కొట్టుకోకపోవడం, ఛాతీలో నొప్పి, తల తిప్పడం తదితర లక్షణాలు గుండెపోటుకు దారితీయవచ్చు.
- సడెన్ కార్డియాక్ అరెస్ట్ అయితే అంబులెన్స్ వచ్చేలోగా మృతి చెందే అవకాశం ఉంటుంది, దీనిని నివారించేందుకు చేతులతో సీపీఆర్ ప్రక్రియ చేపట్టి బ్రతికించవచ్చు.
- బలంగా, వేగంగా ఛాతీ మధ్యలో నిమిషానికి వంద నుంచి 120 సార్లు, 5 సెంటీమీటర్ల లోతులో మర్దన చేయడాన్నే సీపీఆర్ అంటారు. బేసిక్ లైఫ్ సపోర్ట్, సీపీఆర్ లపై సుమారు 35 వేల మందికి శిక్షణ ఇచ్చినట్లు గాంధీ అలుమ్ని అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు లింగమూర్తి, ఏపీరత్నం తెలిపారు.
- ఈ నెల 9న శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు రోజుల పాటు నిర్వహించే ఉచిత శిక్షణ తరగతుల్లో ఐదు వేల మందికి అవగాహన కల్పించేందుకు తగిన ఏర్పాట్లు చేశారు.
- గుండెపోటుకు గురై ప్రాణాపాయస్థితిలో ఉన్నవారికి సీపీఆర్ ప్రక్రియ ద్వారా ప్రాణాలు కాపాడిన ఘటనల్లో ట్రాఫిక్, పోలీసులు సిబ్బంది ముందు వరుసలో ఉన్నారు. ప్రాణం పోసిన సిబ్బందిని ఆయా విభాగ ఉన్నతాధికారులు అవార్డులు, రివార్డులతో అభినందించారు.
- నగరంతోపాటు శివారు ప్రాంతాల్లోని పాఠశాల, కళాశాలల విద్యార్థులు, ట్రాఫిక్, పోలీస్, జీహెచ్ఎంసీ, హెల్త్ తదితర విభాగాలకు చెందిన ఉద్యోగులు, సిబ్బంది, స్వచ్ఛంధసంస్థలు, సామాజిక కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొంటారు.
- గతేడాది నిర్వహించిన ఉచిత శిక్షణ శిబిరంలో తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సీపీఆర్ ప్రక్రియలో ప్రత్యక్షంగా పాల్గొని, నిర్వాహకులను అభినందించారు.
- సుమారు 30 నిమిషాల పాటు కొనసాగే ఉచిత శిక్షణలో ప్రతిఒక్కరు పాల్గొని, ఈ అవకాశాన్ని వినియోగించుకుని గుండెపోటుకు గురై ప్రాణాపాయస్థితిలో ఉన్నవారికి పునర్జన్మ ప్రసాదించాలని నిర్వాహకులు కోరారు.

ప్రాణాలు నిలబెట్టు

- నేటినుంచి 2 రోజుల పాటు సీపీఆర్ అవగాహన కార్యక్రమాలు
- గాంధీ అలుమ్ని, గ్లోబల్ అలియన్స్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ



సీపీఆర్ శిక్షణ పొందుతున్న పోలీస్ సిబ్బంది (ఫైల్)

'ఐఎన్‌టీయూసీలో విలీనం చేసే హక్కు లేదు'

సాక్షి,సిటీబ్యూరో: జలమండలిలో బీఆర్‌టీయూకు అనుబంధంగా ఉన్న గుర్తింపు కార్మిక సంఘాన్ని ఐఎన్‌టీయూసీలో విలీనంచేసే హక్కు సస్పెన్షకు గురైన రాజిరెడ్డికి లేదని వాటర్ వర్క్ ఎంప్లాయీస్ యూనియన్ తెలంగాణ (2873) అధ్యక్షుడు జీ రాంబాబు యాదవ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. జలమండలిలో రెండేళ్ల క్రితం జరిగిన గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో బీఆర్‌టీయూకు అనుబంధంగా ఉన్న వాటర్ వర్క్ ఎంప్లాయీస్ యూనియన్ తెలంగాణ సంఘం ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైందని పేర్కొన్నారు. గుర్తింపు సంఘం అధ్యక్షుడిగా తాను, ప్రధాన కార్యదర్శిగా జయరాజ్, కొనసాగుతున్నట్లు తెలిపారు. జలమండలిలో గుర్తింపు కార్మిక సంఘానికి కాల పరిమితి ఈ ఏడాది ఏప్రిల్ 26తో ముగుస్తుందని. అప్పటి వరకు తమ సంఘానికి గుర్తింపు సంఘంగా అధికారం ఉంటుందన్నారు. సంఘం నుంచి సస్పెన్షన్‌కు గురైన రాజిరెడ్డికి కార్మిక చట్టాలపై అవగాహన లేదన్నారు. బీఆర్‌టీయూకు అనుబంధంగా ఉన్న గుర్తింపు సంఘాన్ని ఐఎన్‌టీయూసీలో చేరుస్తున్నట్లు ప్రకటించిన రాజిరెడ్డి, జహంగీర్లపై చర్యలు తీసుకోవాలని జలమండలి ఎండీ, కార్మికశాఖ జాయింట్ కమిషనర్లకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ నెల 17న సంఘం సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసి కార్మిక సమస్యలపై భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని ఆయన ప్రకటించారు.

కనీస వేతనాలు అమలు చేయాలి

ముషీరాబాద్: కనీస వేతనాలను అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఐఎఫ్‌టీయూ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మజ్దూర్ అధికార్ సంఘర్ష అభియాన్, ఐఎఫ్‌టీయూ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం విద్యానగర్‌లో కార్మికులు నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం సెంట్రల్ రీజనల్ లేబర్ కమిషనర్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు ఆరెళ్లి కృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జాతీయ అధ్యక్షులు ఎస్.వెంకటేశ్వర్‌రావు, ఎం.శ్రీనివాస్ తదితరులు మాట్లాడుతూ లాభాల బాటలో నడుస్తున్న ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటీకరించడం దారుణమన్నారు. ఎల్ఐసీ, బీఎస్ఎన్ఎల్, రైల్వే, ఓడరేవులు, విమానయానం, ఆయిల్ కంపెనీలు, బ్యాంకులు, పోల్ మైన్స్ తదితర ప్రభుత్వ రంగ పరిశ్రమలను కారు చౌకగా స్వదేశీ, విదేశీ బడా కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. ఉద్యోగ, కార్మికుల పెన్షన్ విధానంలో మార్పులు తీసుకువచ్చి నూతన పెన్షన్ విధానాన్ని అములులోకి తెచ్చిందన్నారు. కార్మికుల, ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలు, సామాజిక భద్రతను దెబ్బతీసే ఈ విధానాన్ని తక్షణమే రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సభలో జె.సీతారామయ్య, ఎండి రాషుద్దీన్, జి.అనురాధా, కె.విశ్వనాథ్, వరదయ్య, శ్రీధర్ ప్రసంగించారు.

ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలి



ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని ప్రైవేటు వర్సిటీల్లో ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. ఫీజు నియంత్రణ చట్టంతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతూ న్యూ ఢిల్లీలోని అఖిల భారత సాంకేతిక విద్య మండలి అధికారులకు వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు. ప్రైవేటు వర్సిటీల్లో ఫీజు నియంత్రణ చట్టం లేనందున యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయ ని ఆరోపించారు. అడ్మిషన్లు మొదలు ఫీజుల నిర్ణయం, పరీక్షల నిర్వహణలో యూజీసీ నిబంధనలను తుంగలో తొక్కి సొంత విధానాల అమలు చేస్తున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్లు పాటించనందున ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఉన్నత విద్య అందని ద్రాక్షగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ విద్యార్థులకు న్యాయం చేసేందుకు ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో మహేష్‌యాదవ్, వంశీముదిరాజ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వచ్చి సమాధానం చెప్పాలి

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మల్లారెడ్డి యూనివర్సిటీ ఎదుట విద్యార్థుల ఆందోళన

మేడ్చల్ రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీ బాలికల హాస్టల్‌లో ఆహారంలో పురుగులు రావడంతో విద్యార్థినులు బుధవారం రాత్రి ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. వారికి మద్దతుగా గురువారం ఉదయం యూనివర్సిటీ వద్ద ఎస్ఎఫ్ఐ నాయకులు ఆందోళనకు దిగారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకుని వారిని అడ్డుకున్నారు. వారం రోజులుగా ఆహారంలో పురుగులు వస్తున్నాయని హాస్టల్ వార్డెన్, అధికారులు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని పలువురు విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ ప్రతి సమావేశంలో మల్లారెడ్డి యూనివర్సిటీ, కళాశాలలు నావే అని చెప్పుకునే ఎమ్మెల్యే మల్లారెడ్డి దీనిపై స్పందించాలని కోరారు. యూనివర్సిటీ డైరెక్టర్ ప్రవీణ్‌రెడ్డి, యాజమాన్యం స్పందించి మరోమారు ఇలాంటి సంఘటన పునరావృతం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినా విద్యార్థి సంఘం నాయకులు వినకపోవడంతో చివరకు ఎమ్మెల్యే మల్లారెడ్డి ఫోన్‌లో ఎస్ఎఫ్ఐ నాయకులతో మాట్లాడి శుక్రవారం యూనివర్సిటీకి వచ్చి సమస్యను పరిశీలిస్తానని, విద్యార్థులతో మాట్లాడతానని చెప్పడంతో వారు ఆందోళన విరమించారు.

ఫుడ్ శాంపిల్స్ సేకరణ..

మల్లారెడ్డి యూనివర్సిటీ హాస్టల్‌లోని ఆహారంలో పురుగులు వస్తున్నట్లు విద్యార్థి సంఘాలు, విద్యార్థుల ఫిర్యాదు చేయడంతో ఫుడ్ సేఫ్టీ అధికారులు హాస్టల్‌లో విద్యార్థులకు అందిస్తున్న ఆహారపు శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపించారు. ఆహారంలో పురుగులు వచ్చినట్లు ఫిర్యాదుదారులు పంపించిన ఫొటోల ఆధారంగా వారికి నోటీసులు జారీ చేయనున్నామని ల్యాబ్ రిపోర్టులు వచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఏబీవీపీ ఆందోళన ఉద్రిక్తం

మల్లారెడ్డి ఇంజినీరింగ్ ఉమెన్స్ హాస్టల్‌లో గురువారం మధ్యాహ్నం భోజనంలో పురుగులు రావడంతో విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న ఏబీవీపీ విద్యార్థి సంఘం నాయకులు హాస్టల్ వద్దకు చేరుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. విద్యార్థి నేతలు మృత్యుంజయ, నగేశ్, నాగేంద్ర, నాయక్ తదితరులు హాస్టల్‌లోకి వెళ్లేందుకు యత్నించగా హాస్టల్ సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో ఇరు వర్గాల మధ్య తోపులాట చోటు చేసుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఏబీవీపీ నాయకులపై సెక్యూరిటీ సిబ్బంది రాళ్లతో దాడి చేశారని ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



యూనివర్సిటీ యాజమాన్యంతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

హైటెక్స్‌లో గిఫ్ట్ అండ్ స్టేషనరీ ఇండియా ఎక్స్‌పో ప్రారంభం

మాదాపూర్: హైదరాబాద్ కేంద్రంగా కార్పొరేట్ గిఫ్టింగ్ ఇండస్ట్రీ గణనీయమైన ప్రగతిని సాధిస్తోందని తెలంగాణ టీఎఫ్ఎంసీ అధ్యక్షుడు సత్యనారాయణ అన్నారు. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో మూడు రోజుల పాటు నిర్వహించనున్న గిఫ్ట్ అండ్ స్టేషనరీ ఇండియా ఎక్స్‌పో- 2024ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ తెలంగాణలో 500కు పైగా ఐటీ కంపెనీలు, వందలాది ఎంఎన్‌సీ కంపెనీలతో పాటు 2400 ఫార్మా కంపెనీలు ఉండడంతో గిఫ్టింగ్ సంస్కృతి పెరిగిందన్నారు. వీటితో పాటు బ్యాంకింగ్, ఫార్మా, అగ్రికల్చరల్ బిజినెస్ పురోగాభివృద్ధిలో ఉందన్నారు. వరల్డ్ తెలుగు ఐటీ సెల్ ప్రెసిడెంట్ సందీప్ మాట్లాడుతూ కార్పొరేట్ ఇండస్ట్రీలో ఎంప్లాయిస్‌కు గిఫ్టింగ్ సంస్కృతి పెరిగిందన్నారు. ఇది ఐటీ రంగంలోని ఉద్యోగుల్లో ఉత్సాహాన్ని పెంపొందిస్తుందన్నారు. ఫలితంగానే ప్రతి యేటా ఐటీ ఎక్స్‌పోర్ట్స్ పెరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎక్స్‌పో ఇన్‌చార్జి రాఖీ ముఖర్జీ, డిప్లొమాటిక్ క్లబ్ డీజీఎం డాక్టర్ ఉషా ఎనమండ్రా పాల్గొన్నారు.



ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న టీఎఫ్ఎంసీ అధ్యక్షుడు సత్యనారాయణ తదితరులు



ఫ్యాషన్





దుస్తుల డిజైన్స్‌లో కొత్త మోడల్ కోసం ఎప్పుడూ వెతుకుతూనే ఉంటాం అలాగే ఆభరణాల్లోనూ వైవిధ్యం కోరుకుంటాం. అది బంగారమైనా, ఇమిటేషన్ జ్యువెలరీ అయినా సంప్రదాయ వేడుకల్లోనూ స్టైలిష్‌గా కనిపించడానికి నాలుగువేళ్లను కలుపుతూ ఈ రింగ్ కలెక్షన్ కొత్తగా మెరుస్తోంది. హెయిర్ క్లిప్ మోడల్‌లో అడ్జస్టబుల్ రింగ్‌గా అందంగా ఆకట్టుకుంటోంది. కలిసి ఉండే బంధాలకు ప్రతీకగానూ కనిపిస్తోంది.



* ఆభరణం

క్లిప్ స్టైల్ రింగ్స్

హెయిర్ క్లిప్ స్టైల్

శిరోజాల్లో విరివిగా కనిపించే క్లిప్స్ స్టైల్ మోడల్ రింగ్స్ వేళ్లకు కొత్తగా మెరుస్తున్నాయి. వీటిలో పూసలు, స్టోన్స్ ప్రధానంగా కనిపిస్తాయి.

అడ్జస్టబుల్ రింగ్

మధ్యవేలికి, అటు ఇటు వేళ్లకు రింగ్స్ అమరికతో ఉన్న బార్ డిజైన్స్ వీటిలో ప్రత్యేకంగా కనిపిస్తాయి. డ్రెస్ డిజైన్‌ని బట్టి కూడా వీటిని ఎంపిక చేసుకోవచ్చు. వెస్టన్ స్టైల్ డ్రెస్‌కి ప్లెయిన్ అడ్జస్టబుల్ రింగ్స్, సంప్రదాయ వేడుకలకైతే ముత్యాలు, పూసలు, కుందన్స్, టెంపుల్ జ్యువెలరీ రింగ్‌ను ఎంచుకోవచ్చు.

కుందన్స్‌తోనూ..

వీటిలో ఇమిటేషన్ జ్యువెలరీ రింగ్స్ మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. రాజస్థానీ, గుజరాతీ కళతో కుందన్ రింగ్స్ కనిపిస్తుంటాయి.





బంగారం, వజ్రాలు

ప్లెయిన్ బార్ రింగ్స్‌గా బంగారంతో తయారైనవి అందుబాటులో ఉంటున్నాయి. వీటిలో పొదిగిన వజ్రాలూ రత్నాలు నాలుగువేళ్లనూ కలుపుతూ అందంగా చూపుతుంటాయి.



కొందరు సంపాదించింది దాచుకుంటారు. కొందరు కొద్దిగా పంచుతారు. మరికొందరు ప్రతిదీ సమాజహితం కోసం ధారబోస్తారు. పేద పిల్లల స్కూల్ కోసం 7 కోట్ల విలువైన భూమిని దానం చేసింది తమిళనాడుకు చెందిన పూరణం. గత నెలలో మొదటిసారి ఆ పని చేస్తే ఇప్పుడు మరో 3 కోట్ల రూపాయల విలువైన భూమిని దానం చేసింది. సామాన్య క్లర్క్‌గా పని చేసే పూరణం ఎందరికో స్ఫూర్తి కావాలి.

విద్యాదాత



రెండోసారి స్థలం పత్రాలను అప్పగిస్తున్న పూరణం

చదువుల తల్లీ నీకు వందనం

ప్రభుత్వం అన్నీ చేయాలని కోరుకోవడం సరికాదు. సమాజం తన వంతు బాధ్యత వహించాలి. ప్రజాప్రయోజన కార్యక్రమాలలో తన వంతు చేయూతనివ్వాలి. విమర్శించే వేయినోళ్ల కంటే సాయం చేసే రెండు చేతులు మిన్న అని నిరూపించింది తమిళనాడు మధురైకు చెందిన 52 సంవత్సరాల పూరణం అలియాస్ ఆయి అమ్మాళ్. ఆమె ఒక నెల వ్యవధిలో దాదాపు పది కోట్ల రూపాయల విలువైన భూమిని పేద పిల్లల చదువు కోసం దానం చేసింది.

కెనెరా బ్యాంక్ క్లర్క్

మదురైలో కెనెరా బ్యాంక్‌లో క్లర్క్‌గా పని చేసే పూరణంతో పెళ్లయిన కొద్దిరోజులకే భర్తను కోల్పోయింది. మానవతా దృక్పథంతో అతని ఉద్యోగం ఆమెకు ఇచ్చారు. నెలల బిడ్డగా ఉన్న కుమార్తెను చూసుకుంటూ, కొత్తగా వచ్చిన ఉద్యోగం చేస్తూ జీవితంలో ఎన్నో కష్టాలు పడింది. కుమార్తె భవిష్యత్తు కోసం ఆమె కొని పెట్టిన స్థలాలు ఖరీదైనవిగా మారాయి.

హటాత్ సంఘటన

పూరణం కుమార్తె జనని రెండేళ్ల క్రితం అనారోగ్య కారణాలతో మరణించింది. జననికి సమాజ సేవ చాలా ఇష్టం. అంతేకాదు పేదపిల్లల చదువుకు కృషి చేసేది. ఒక్కగానొక్క కూతురు మరణించడంతో కూతురు ఆశించిన విద్యావ్యాప్తికి తాను నడుం బిగించింది పూరణం. తన సొంతవూరు కొడిక్కులంలోని 1.52 ఎకరాల స్థలాన్ని ఆ ఊరి స్కూలును హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేసి భవంతి కట్టేందుకు మొన్నటి జనవరి 5న దానం చేసింది. మదురై చీఫ్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌కు పట్టా అప్పజెప్పింది. దాంతో ఆమెకు రాష్ట్రవ్యాప్తంగా చాలా ప్రశంసలు దక్కాయి. ముఖ్యమంత్రి స్టాలిన్ మొన్నటి రిపబ్లిక్ డే రోజున ఆమెను సన్మానించాడు. అయితే రెండు రోజుల క్రితం పూరణం తనకున్న మరో 91 సెంట్ల భూమిని కూడా మరో స్కూల్ భవంతి నిర్మించేందుకు అప్పజెప్పింది. ఈ రెండు స్థలాల విలువ నేడు మార్కెట్‌లో పది కోట్లు ఉంటాయి. 'బదులుగా నాకేమి వద్దు. ఆ స్కూల్ భవంతులకు నా కుమార్తె పేరు పెట్టండి చాలు' అని కోరిందామె. 'పల్లెటూరి పిల్లల చదువుల్లో వెలుగు రావాలంటే వారు బాగా చదువుకోవడమే మార్గం. పల్లెల్లో హైస్కూళ్లు చాలా అవసరం' అందామె.

సత్య నిష్ఠతో...

వివక్ష అనేది ఎక్కడో ఉండదు. మన చుట్టూనే పొంచి ఉంటుంది. అలాంటి వివక్షను సూక్ష్మస్థాయిలో విశ్లేషిస్తోంది నిష్ఠా సత్యం. స్త్రీ సాధికారతకు సంబంధించిన కార్యక్రమాలపై నిష్ఠగా పనిచేస్తోంది...

ఉమెన్ పవర్



పిల్లలతో నిష్ఠా సత్యం

బాలీవుడ్ సినిమా 'మొహ్రా'లోని 'తూ చీజ్ బడీ హై మస్త్ మస్త్' పాట యువ గళాల్లో ఎక్కువగా వినిపిస్తున్న కాలం అది. అందరిలాగే తాను కూడా ఆ పాట హమ్ చేస్తోంది నిష్ఠ. ఆమె తండ్రికి విపరీతమైన కోపం వచ్చి 'నువ్వు ఎలాంటి పాట పాడుతున్నావో తెలుసా' అంటు తిట్టాడు. చిన్నపాటి పనిష్మెంట్ కూడా ఇచ్చాడు.

'సరదాగా రెండు లైన్లు పాడినందుకు ఇంత రాద్ధాంతమా?' అనుకుంది నిష్ఠ. ఒకవేళ ఈ పాట అబ్బాయి పాడి ఉంటే ఇలాగే జరిగి ఉండేదా?

'జరగదు' అని బలంగా చెప్పవచ్చు. ఈ సంఘటన ఒక్కటే కాదు పెద్ద కంపెనీలలో పనిచేస్తున్న కాలంలోనూ లింగవివక్షను ఎదుర్కొంది నిష్ఠ.

మల్టీనేషనల్ కంపెనీ కేపీఎమ్‌జీ, అమెరికన్ ఎక్స్‌ప్రెస్‌లలో ఎకానమిస్ట్‌గా పనిచేసిన నిష్ఠా సత్యం ఐక్యరాజ్య సమితిలోకి అడుగు పెట్టింది. ఐక్యరాజ్యసమితిలో పార్ట్నర్‌షిప్ అడ్వైజర్‌గా ప్రయాణం మొదలు పెట్టిన నిష్ఠ డిప్యూటీ హెడ్ హోదాలో పనిచేసింది. ఆ తరువాత యూఎన్ ఉమెన్ మిషన్ హెడ్- తిమోర్-లెస్తే బాధ్యతలు చేపట్టింది.

'రెండు విధాలుగా మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని విశ్లేషించాలి. ఒకటి డిఫాల్ట్ సెట్టింగ్ రెండోది డిజైన్ సెట్టింగ్. డిజైన్ సెట్టింగ్ అనేది పురుషుల నుంచి వచ్చింది. వారికి అనుకూలమైనది' అంటుంది నిష్ఠ. స్మార్ట్ ఫోన్‌ల సైజ్ నుంచి పీపీయీ కిట్స్ వరకు మార్కెట్‌లో ఉన్న ఎన్నో వస్తువుల డిజైన్‌లు మహిళలకు అనుకూలంగా లేకపోవడంలోని వివక్షను ప్రశ్నిస్తుంది నిష్ఠ.

'సాంస్కృతిక సందర్భాలు వివిధ మార్గాలలో మహిళలను శక్తిమంతం చేస్తాయి. సాధికారతకు సంబంధించి మన ఆలోచనలను వారిపై బలవంతంగా రుద్దడంలో అర్థం లేదని తిమోర్-లెస్తే మహిళల నుంచి నేర్చుకున్నాను' అంటుంది నిష్ఠా సత్యం.

వంటిల్లు

చికెన్ సూప్ మీద మనసుపోతే రెస్టారెంట్‌కి వెళ్లాల్సిందేనా? ఫైవ్‌స్టార్ హోటల్ రేంజ్‌లో చికెన్ టిక్కా ఇంట్లో చేయలేమా? పిల్లలు సరదా పడే నూడుల్స్‌కి చికెన్‌ని జోడించలేమా? ఈ రోజు... వీటన్నింటినీ వండుతోంది మన 'వంటిల్లు'

చికు బుకు చికు బుకు... చికెనే!

చికెన్ టిక్కా మసాలా



కావలసినవి: చికెన్ – ముప్పావు కేజీ (బోన్‌లెస్ చికెన్ లేదా చికెన్ బ్రెస్ట్ తీసుకోవాలి);
మారినేషన్ కోసం... కశ్మీరీ కారం – టీ స్పూన్ (కశ్మీరీ కారం లేకపోతే మామూలు కారం); గరం మసాలా పొడి – టీ స్పూన్; జీలకర్ర పొడి – అర టీ స్పూన్; ధనియాల పొడి – టీ స్పూన్; పసుపు – పావు టీ స్పూన్; నిమ్మరసం – టేబుల్ స్పూన్; ఆవనూనె – టేబుల్ స్పూన్ (ఆవనూనె లేకపోతే వేరుశనగనూనె లేదా సన్‌ఫ్లవర్ ఆయిల్ తీసుకోవచ్చు); **అల్లం వెల్లుల్లి పేస్ట్** – టేబుల్ స్పూన్; **కసూరీ మేథీ** – టేబుల్ స్పూన్ (కసూరీ మేథీ లేకపోతే మెంతి ఆకులను ఎండబెట్టి పొడి చేసుకోవాలి); **నీరు లేని గట్టి పెరుగు** – అర కప్పు (నీటిని వడకట్టి గట్టిన తర్వాత వచ్చిన గట్టి పెరుగు మాత్రమే వాడాలి. నీరు ఎక్కువైతే చికెన్ ముక్కలకు మసాలా పొడులు పట్టవు); **ఉప్పు** – టీ స్పూన్.
పోపు కోసం.. నెయ్యి లేదా నూనె – 3 టేబుల్ స్పూన్‌లు; **ఉల్లిపాయ ముక్కలు** – ఒకటిన్నర కప్పులు (2 మీడియం సైజు ఉల్లిపాయలు); **ఉప్పు** – టీ స్పూన్; **పచ్చిమిర్చి తరుగు** – టేబుల్ స్పూన్; **అల్లం వెల్లుల్లి తరుగు లేదా పేస్ట్** – టేబుల్ స్పూన్; **కారం పొడి**– టీ స్పూన్; **ధనియాల పొడి** – టీ స్పూన్; **గరం మసాలా పొడి**– టీ స్పూన్; **జీలకర్ర పొడి**– టీ స్పూన్; **టొమాటో గుజ్జు** – ఒకటిన్నర కప్పు (గింజలు, తొక్క లేకుండా); **మీగడ** – టేబుల్ స్పూన్;
గార్నిషింగ్ కోసం... మీగడ – టేబుల్ స్పూన్ (మీగడ బదులు జీడిపప్పు పొడి కూడా తీసుకోవచ్చు); **కొత్తిమీర తరుగు** – టేబుల్ స్పూన్.

తయారీ:
- చికెన్‌ను అంగుళం నుంచి ఒకటిన్నర అంగుళం ముక్కలుగా కట్ చేసి శుభ్రం చేసి చిల్లుల పాత్రలో వేసి నీరు పోయేవరకు పక్కన ఉంచాలి. నీరు పోయిన తరవాత చికెన్ ముక్కలను పెద్ద పాత్రలో వేసి అందులో మారినేషన్ కోసం తీసుకున్న దినుసులన్నీ వేసి, చికెన్ ముక్కలకు మసాలా సమంగా కలిసే వరకు కలపాలి. ఈ పాత్ర మీద గట్టిగా మూత పెట్టి నలభై గంటల పాటు ఫ్రిజ్‌లో పెట్టాలి. అంత ముందుగా సిద్ధం చేసుకోవడం సాధ్యం కానప్పుడు కనీసం ఎనిమిది గంటలైనా ఉంచాలి.
- మందపాటి పాత్రను స్టవ్ మీద పెట్టి నెయ్యి వేసి కాగిన తర్వాత ఉల్లిపాయ ముక్కలు, ఉప్పు వేసి వేయించాలి. ఉల్లిపాయ ముక్కలు మెత్తబడి రంగు మారే వరకు వేగిన తర్వాత అల్లం వెల్లుల్లి తరుగు లేదా పేస్ట్ వేసి అర నిమిషం పాటు వేయించి... ఇప్పుడు కారం పొడి, ధనియాల పొడి, గరం మసాలా, జీలకర్ర వేసి వేయించాలి (పొడులు దోరగా వేగాలి తప్ప మాడిపోకూడదు). మసాలాలు వేగిన వెంటనే అందులో టొమాటో ప్యూరీ వేసి వేయించాలి. ఈ లోపు మరొక స్టవ్ మీద పాత్రలో రెండు కప్పుల నీటిని పోసి వేడి చేయాలి. మసాలా మిశ్రమం దగ్గరైన తర్వాత నీటిని పోసి కలిపి మరిగించాలి. ఈ మిశ్రమం చిక్కబడే వరకు ఉడికించాలి.
- మసాలా మిశ్రమం ఉడికేలోపు టిక్కాలను కాల్చి సిద్ధం చేసుకోవాలి. ఒవెన్‌లో పెట్టే బేకింగ్ ట్రేలో అల్యూమినియం ఫాయిల్ అమర్చాలి. మారినేట్ చేసిన చికెన్ ముక్కలను ఉడెన్ స్టిక్స్‌కి గుచ్చి ట్రేలో అమర్చి 240 సెంటీగ్రేడ్ డిగ్రీల దగ్గర పది నిమిషాల సేపు ఉంచాలి. ఒవెన్‌కు బదులు ఎయిర్ ఫ్రై బాస్కెట్‌లో వేయించాలనుకుంటే... 200 సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలో ఆరు నిమిషాల పాటు ఫ్రై చేయాలి. ఇవేవీ లేకపోతే మందపాటి బాణలిలో టేబుల్ స్పూన్ నూనె వేడిచేసి చికెన్ ముక్కలను ఒకదాని పక్కన ఒకటిగా అమర్చి మీడియం మంట మీద వేగనివ్వాలి. రెండు నిమిషాల తర్వాత తిరగేసి మరో రెండు నిమిషాల సేపు వేగనివ్వాలి.
- మసాలా మిశ్రమంలో టేబుల్ స్పూన్ మీగడ వేసి కలిపి మంట తగ్గించి గ్రిల్ చేసిన చికెన్ ముక్కలు, కసూరి మేథీ వేసి కలిపి మూడు నిమిషాల సేపు ఉడికించాలి. దించేముందు మరో టేబుల్ స్పూన్ మీగడ, తరిగిన కొత్తిమీరతో అలంకరిస్తే చికెన్ టిక్కా మసాలా రెడీ. ఇది రోటీలోకి, అన్నం, బిర్యానీలోకి బాగుంటుంది.

చికెన్ నూడుల్స్



కావలసినవి: చికెన్ – 200 గ్రాములు (బోన్‌లెస్); నూడుల్స్ – 150 గ్రాములు; నూనె – 2 టీ స్పూన్లు; ఉప్పు – అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి;
మారినేట్ వేయడానికి .... మిరియాల పొడి– అర టీ స్పూన్; **ఉప్పు** – పావు టీ స్పూన్; **సోయా సాస్** – టీ స్పూన్; **గరం మసాలా పౌడర్** – టీ స్పూన్;
పోపు కోసం .... వెల్లుల్లి – 2 రేకలు (సన్నగా తరగాలి); **ఉల్లిపాయ ముక్కలు** – 2 టేబుల్ స్పూన్‌లు; **క్యాప్సికమ్ ముక్కలు** – పావు కప్పు; **క్యారట్ ముక్కలు** – పావు కప్పు; **క్యాబేజ్ తరుగు** – పావు కప్పు; **ఉల్లికాడల ముక్కలు** – పావు కప్పు; **చిల్లీ సాస్**– టేబుల్ స్పూన్; **సోయా సాస్** – టేబుల్ స్పూన్; **ఉప్పు** – రుచికి తగినంత.

తయారీ:
- చికెన్‌ను సన్నని పొడవు ముక్కలుగా కట్ చేసి శుభ్రం చేసి ఒక పాత్రలో వేసి అందులో మిరియాల పొడి, ఉప్పు, సోయాసాస్, గరం మసాలా పొడి కలిపి మూత పెట్టి పక్కన ఉంచాలి.
- ఒక పెద్ద పాత్రలో రెండు లీటర్ల నీటిని మరిగించి అందులో నూడుల్స్ వేసి ఉడికించాలి. నూడుల్స్ ఉడుకుతున్నప్పుడే ఆ నీటిలో టీ స్పూన్ నూనె కలపాలి. నూనె కలిపితే నూడుల్స్ తీగలు ఒకదానితో మరొకటి అతుక్కోకుండా విడివడుతుంటాయి. నూడుల్స్ ఉడికిన తరవాత నీటిని వడపోసి నూడుల్స్‌లో మరో టీ స్పూన్ నూనె వేసి కలిపి పక్కన ఉంచాలి.
- క్యాప్సికమ్, క్యారట్, క్యాబేజ్, ఉల్లిపాయ ముక్కలను ఉడికించి పక్కన పెట్టాలి.
- ఇప్పుడు స్టవ్ మీద వెడల్పాటి బాణలి పెట్టి టేబుల్ స్పూన్ నూనె వేసి వేడి చేయాలి. అందులో వెల్లుల్లి తరుగు, మారినేట్ చేసి సిద్ధంగా ఉంచిన చికెన్ ముక్కలు వేసి మీడియం మంట మీద వేయించాలి. చికెన్ ఉడికేలోపు నూనె తగ్గిపోయినట్లయితే అరకప్పు నీటిని పక్కన వేడి చేసి చికెన్‌లో కలపాలి. చికెన్ ఉడికిన తరవాత ఆ పాత్రను పక్కన ఉంచాలి.
- ఇప్పుడు స్టవ్ మీద మరో బాణలి పెట్టి మిగిలిన నూనె వేడి చేసి ఉల్లికాడల ముక్కలు వేసి వేయించాలి. అవి వేగిన తరవాత ఉడికించి పక్కన పెట్టిన కూరగాయల ముక్కలన్నీ వేసి నిమిషం పాటు వేయించి నూడుల్స్, చికెన్ ముక్కలు, చిల్లీసాస్, సోయాసాస్, ఉప్పు వేసి కలిపి వేడెక్కిన తర్వాత స్టవ్ ఆపేయాలి. చికెన్ నూడుల్స్‌ని వేడిగా వడ్డించాలి.

స్వీట్ కార్న్ చికెన్ సూప్




కావలసినవి: స్వీట్ కార్న్ – 100 గ్రాములు; **చికెన్** – పావు కేజీ (సన్నగా తరగాలి); **చికెన్ స్టాక్** – లీటరు (చికెన్ ఉడికించిన నీరు); **ఉల్లిపాయ ముక్కలు** – 2 టేబుల్ స్పూన్‌లు; **అల్లం తరుగు** – అర టీ స్పూన్; **ఉల్లికాడల తరుగు** – 2 కప్పులు; **కార్న్‌ఫ్లోర్ (మొక్కజొన్న పిండి)** – 3 టేబుల్ స్పూన్‌లు; **సోయా సాస్** – టీ స్పూన్; **కోడిగుడ్డు** – ఒకటి; **చక్కెర** – అర టేబుల్ స్పూన్; **ఉప్పు** – టీ స్పూన్ లేదా రుచిని బట్టి; **నువ్వుల నూనె** – టీ స్పూన్; **మిరియాల పొడి**– టీ స్పూన్ లేదా రుచిని బట్టి;

తయారీ:
- చికెన్‌ను శుభ్రం చేసి లీటరుకు పైగా నీటిని పోసి ఉడికించి పక్కన పెట్టాలి. చల్లారిన తర్వాత నీటిని వేరు చేసి ముక్కలను ఒక పాత్రలోకి తీసుకోవాలి
- మొక్కజొన్న పిండిలో కప్పు నీటిని పోసి పక్కన ఉంచాలి
- స్వీట్ కార్న్ గింజలను శుభ్రం చేసి పక్కన ఉంచాలి
- కోడిగుడ్డును పగలగొట్టి తెల్లసొన మాత్రమే ఒక కప్పులో వేసుకుని పక్కన ఉంచాలి.
- మందపాటి పాత్రలో నూనె వేడి చేసి ఉల్లిపాయ ముక్కలు, అల్లం తరుగు వేసి వేయించాలి. అవి వేగిన తర్వాత చికెన్ ముక్కలు (ఉడికించినవి) వేసి ఓ నిమిషం పాటు మగ్గనివ్వాలి. ఇప్పుడు నీటితో తడిపిన మొక్కజొన్న పిండి, చికెన్ స్టాక్ వేసి కలిపి ఓ నిమిషం పాటు మరిగించాలి. మరుగుతున్న మిశ్రమంలో చక్కెర, ఉప్పు వేసి కలిపి మంట తగ్గించి మూడు– నాలుగు నిమిషాల సేపు ఉడికించాలి.
- చివరగా స్వీట్‌కార్న్ గింజలు వేసి కలిపి సూప్ చిక్కబడుతున్న సమయంలో కోడిగుడ్డు తెల్లసొన వేసి గరిటతో ఒకే డైరెక్షన్‌లో వేగంగా అర నిమిషం పాటు కలపాలి. ఇలా కలపడం వల్ల గుడ్డు సొన ఉడుకుతూ సన్నగా తీగలుగా వస్తుంది. ఇప్పుడు సోయాసాస్, తరిగిన ఉల్లికాడల్లో సగం వేసి కలిపితే స్వీట్ కార్న్ చికెన్ సూప్ రెడీ.
- వేడిగా ఉన్నప్పుడే కప్పుల్లో పోసి పైన మిరియాల పొడి, కొద్దిగా ఉల్లికాడలతో గార్నిష్ చేసి సర్వ్ చేయాలి. రుచిని బట్టి ఉప్పు, మిరియాల పొడి మరింతగా కలుపుకోవచ్చు.


అమన్, అనురాగ్, రోహిత్, అమల్

ఇన్నోవేషన్



శక్తిమంతులు

‘తిండి కలిగితే కండగలదోయ్’ వాక్యానికే పరిమితం కాలేదు ఈ నలుగురు మిత్రులు. ‘కండకు జిమ్ కూడా కావాలోయి’ అంటున్నారు. ‘రోజూ జిమ్‌కు వెళ్లడానికి తిరిగి అక్కడి నుంచి రావడానికి బోలెడు సమయం తీసుకుంటుంది. అలా అని ఇంట్లోనే జిమ్ సెట్ చేసుకుందామా అంటే స్పేస్ ప్రాబ్లం’ అనుకునేవాళ్లకు ‘అరోలీప్ ఎక్స్’ రూపంలో పరిష్కారం చూపారు దిల్లీ, ఐఐటీ గ్రాడ్యుయేట్స్ అమన్‌రాయ్, అనురాగ్ దానీ, రోహిత్ పటేల్, అమల్ జార్జ్. చిన్న స్థలాలలోనే ఏర్పాటు చేసుకునే స్మార్ట్ హోమ్ జిమ్‌ను తయారుచేసి, ఈ టెక్నాలజీపై పేటెంట్ పొందారు. ‘అరోలీప్ ఎక్స్ ప్రైవేట్ లిమిటెడ్’ పేరుతో కంపెనీ మొదలు పెట్టి విజయం సాధించారు. అంతర్జాతీయ విపణిలోకి అడుగు పెట్టనున్నారు...

కెమికల్ ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్(ఐఐటీ, దిల్లీ) అయిన అమన్ రాయ్ అల్ట్రా మారథాన్లు నిర్వహించడంలో దిట్ట. అయితే కెరీర్ ప్రారంభించిన తరువాత ఉద్యోగ బాధ్యతలు, జిమ్‌కు వెళ్లడం మధ్య సమన్వయం కుదరడానికి కష్టపడాల్సి వచ్చేది. బెంగుళూరులోని అద్దె ఇంట్లో స్థల సమస్య వల్ల ఎక్సర్‌సైజ్‌కు సంబంధించి లిమిటెడ్ ఎక్విప్‌మెంట్ మాత్రమే ఉండేది.

ఇక అనురాగ్ డానీకి ఆఫీసు పనిభారం వల్ల జిమ్‌కు వెళ్లడం అనేది కుదిరేది కాదు. రోబోటిక్ గ్రాడ్యుయెట్స్ అయిన రోహిత్ పటేల్, అమల్ జార్జ్‌ల పరిస్థితి కూడా అంతే. రకరకాల సమస్యలకు పరిష్కారాలు వెదకడానికి రకరకాల ప్రయోగాలు చేసేవారు. ఛత్తీస్‌గఢ్‌లోని భిలాయ్ ప్రాంతానికి చెందిన అమన్, అనురాగ్, రోహిత్, అమల్‌లు జిమ్‌కు వెళ్లడానికి తాము ఎదుర్కొంటున్న సమస్యపై దృష్టి పెట్టారు.

హోమ్ జిమ్ ఎక్విప్‌మెంట్‌లు పెద్దవిగా ఉంటాయి. ఖరీదైనవి. తగినంత స్థలం కావాలి.

‘ఇంట్లో వ్యాయామాలు చేయడానికి వేర్వేరు బరువులు ఉన్న ఎక్విప్‌మెంట్ కొనుగోలు చేస్తూ ఉండాలి. ఇవి చాలా స్థలాన్ని ఆక్రమిస్తాయి. అద్దె ఇండ్లలో, చిన్న అపార్ట్‌మెంట్‌లలో ఇది కష్టం. ఈ సమస్యకు పరిష్కారం కనుక్కోవాలనుకున్నాం’ అంటారు నలుగురు మిత్రులు.


అరోలీప్ ఎక్స్

కొత్తగా డిజిటల్-వెయిట్స్ టెక్నాలజీ ఊపందుకుంటున్న టైమ్ అది. ఫిజికల్ వెయిట్స్‌ను రిప్లేస్ చేసే డిజిటల్ టెక్నాలజీ కోసం ప్రయోగాలు ప్రారంభించారు. రకరకాల ప్రోటోటైప్‌లు బిల్డ్ చేయడం కోసం పాతిక లక్షల వరకు వెచ్చించారు. మూడు సంవత్సరాలు కష్టపడి ఈ నలుగురు మిత్రులు లిమిటెడ్ స్పేస్‌లో ఉపయోగించుకోగలిగే హోమ్ జిమ్ మెషిన్‌ను రూపొందించారు. పదిహేను ప్రోటోటైప్‌ల తరువాత వారి కృషి ఫలించింది, ఈ స్మార్ట్, వాల్-మౌంటెడ్ జిమ్ ఎక్విప్‌మెంట్ ‘అరోలీప్ ఎక్స్’లో వందగంటల ఫిట్‌నెస్ కంటెంట్ ఉంటుంది. మూమెంట్స్‌ను ట్రాక్ చేస్తుంది. సంబంధిత డాటాను మ్యాపింగ్ చేస్తుంది. డాటా-డ్రైవెన్ వర్కవుట్స్ కోసం ఈ స్మార్ట్ ఎక్సర్‌సైజ్ మెషిన్ మోటర్-పవర్డ్ ఎలక్ట్రోమాగ్నటిక్ రెసిస్టెన్స్‌ను ఉపయోగిస్తుంది. జిమ్‌లో చేసే ప్రతి వర్కవుట్‌కు ఈ మెషిన్‌ను ఉపయోగించవచ్చు. ప్రొఫెషనల్ ఫిట్‌నెస్ ట్రైనర్స్ డిజైన్ చేసిన గోల్-బేస్డ్ వర్కవుట్ ప్రోగ్రామ్స్‌ను ఈ మెషిన్ అందిస్తుంది.

‘అరోలీప్ ఫిట్‌నెస్ ప్రైవేట్ లిమిటెడ్’ పేరుతో కంపెనీ మొదలుపెట్టారు. ఫ్రెండ్స్‌ను ఆహ్వానించి ట్రయల్స్ మొదలుపెట్టారు. తమ ప్రాడక్ట్ తాలూకు వీడియోలను ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లాంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో షేర్ చేయడం ప్రారంభించారు. ఈ వీడియోలకు మంచి స్పందన లభించడంతో వ్యాయామ ప్రేమికులను దృష్టిలో పెట్టుకొని మంత్లీ సబ్‌స్క్రిప్షన్‌లు మొదలుపెట్టారు. కొన్ని నెలల తరువాత ఫస్ట్ కస్టమర్స్ తమ ఫీడ్‌బ్యాక్‌ను కంపెనీ ఫౌండర్‌లకు ఇచ్చారు. తమ ప్రాడక్ట్‌లో మార్పులు, చేర్పులు చేయడానికి, మరింత మెరుగ్గా తీర్చిదిద్దడానికి ఫీడ్‌బ్యాక్ వారికి ఉపయోగపడింది.

ప్రాడక్ట్‌కు పాజిటివ్ టాక్ రావడం మాట ఎలా ఉన్నా ఇన్వెస్టర్‌లు దొరకడం పెద్ద సవాలుగా మారింది. ఈ నేపథ్యంలో రోహిత్ ‘జెరోదా’ సీయివో నిఖిల్ కామత్‌కు మెసేజ్ పెట్టాడు. వీరు ఉంటున్న అపార్ట్‌మెంట్‌కు వచ్చి ప్రోటోటైప్‌లను పరిశీలించి ఇంప్రెస్ అయ్యాడు నిఖిల్ కామత్. ఫస్ట్ ఏంజెల్ ఇన్వెస్టర్ అయ్యాడు. ఆ తరువాత మరో ముగ్గురు ఇన్వెస్టర్‌లు వచ్చారు. మాన్యుఫాక్చరింగ్ కోసం బెంగుళూరులో చిన్న స్థలం ఏర్పాటు చేసుకొని ‘అరోలీప్ ఎక్స్’లను అమ్మడం మొదలుపెట్టారు.

దేశీయంగా విజయం సాధించిన ‘అరోలీప్ ఎక్స్’ ఇప్పుడు అంతర్జాతీయ విపణిలో అడుగు పెట్టనుంది.

‘ఫిట్‌నెస్ సింపుల్ అండ్ యాక్సెసబుల్ అనేది మా నినాదం. లక్ష్యం’ అంటున్నారు నలుగురు మిత్రులు.

యువర్స్

● టెక్.. టాక్

వివో వి30



సైజ్: 6.78 అంగుళాలు; **రిజల్యూషన్:** 1,260×2,800 పిక్సెల్స్; **రిఫ్రెష్ రేట్:** 120 హెచ్‌జడ్; **బ్యాటరీ:** 5,000 ఎంఏహెచ్; **ర్యామ్:** 8జీబీ/12జీబి;
● ఇన్-డిస్‌ప్లే ఫింగర్ ప్రింట్

డ్రాయింగ్ ట్రేసింగ్ బోర్డ్



బ్రాండ్: సైగ
మెటీరియల్: ప్లాస్టిక్;
బరువు: 355 గ్రా.
పవర్ సోర్స్: కోడెడ్ ఎలక్ట్రిక్, యూఎస్‌బీ కేబుల్
యూసేజ్: యానిమేషన్, కార్టూన్, టాటు, ట్రేసింగ్, క్రాఫ్ట్ ప్రాజెక్ట్స్, ఫ్యాబ్రిక్ డిజైన్, ఎక్స్-రే వ్యూయర్

● గేమింగ్



సత్తా చాటే వీరులకు స్వాగతం

ఉన్నట్టుండి సముద్రమే యుద్ధక్షేత్రమైతే ఎలా ఉంటుంది? సముద్రపు దొంగలు తోక ముడిచేలా చేయగల సత్తా మీలో ఉందా?

‘యస్’ అని మీరు అంటే హిందూ మహాసముద్రాన్ని జయించి సముద్రపు దొంగలతో పోరాడే సత్తాకు ఈ గేమ్ స్వాగతం పలుకుతుంది. యాక్షన్-అడ్వెంచర్ గేమ్ ‘స్కల్ అండ్ బోన్స్’ ఈనెల 16న విడుదల కానుంది. సముద్రపు దొంగలకు స్వర్ణయుగం అని చెప్పుకునే 1730నాటి కథల ఆధారంగా ఈ గేమ్‌ను రూపొందించారు. ఈ టాక్టికల్ యాక్షన్ గేమ్‌ను థర్డ్-పర్సన్ పర్‌స్పెక్టివ్‌లో ఆడాల్సి ఉంటుంది. విండ్ పోజిషనింగ్ అనేది ఈ సముద్ర యుద్ధ గేమ్‌లో కీలక పాత్ర పోషిస్తుంది. గేమ్‌లో అదనపు షిప్స్‌ను ప్లేయర్స్ కలెక్ట్ చేసుకోవచ్చు. ‘అందమైనప్పటికీ ప్రమాదకరమైనది’ అని గేమ్ గురించి చెబుతోంది నిర్మాణ సంస్థ.

ప్లాట్‌ఫామ్స్: మైక్రోసాఫ్ట్ విండోస్, ప్లే స్టేషన్ 5, ఎక్స్ బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్ **జానర్:** యాక్షన్-అడ్వెంచర్; **మోడ్స్:** సింగిల్ ప్లేయర్, మల్టీప్లేయర్

గూగుల్ కలెక్షన్



చాలా ఆండ్రాయిడ్ డివైజ్‌లలో ప్రి-ఇన్‌స్టాల్ చేయబడిన గూగుల్ యాప్ రకరకాల ఫీచర్‌లను అందిస్తుంది. ఇందులో అత్యంత ఉపయోగకరమైన వాటిలో గూగుల్ కలెక్షన్స్ ఒకటి. ఈ ఫంక్షనాలిటీ ద్వారా ఇమేజ్‌లు, షోలు, మూవీస్, వెబ్ పేజీలను సింగిల్ ప్లేస్‌లో యాడ్ చేసుకోవచ్చు. ఇది ఆండ్రాయిడ్ మరియు ఐవోఎస్ రెండింటిలోనూ అందుబాటులో ఉంది. గూగుల్ సర్వీసులు, యూట్యూబ్, క్రోమ్, సెర్చ్ థర్డ్ పార్టీ యాప్‌లతో పనిచేస్తుంది.

గూగుల్ కలెక్షన్‌లో ఐటమ్స్ యాడ్ చేయడానికి... ● గూగుల్ యాప్‌ను ఓపెన్ చేసి బాటమ్ బార్‌లోని ‘సెర్చ్’ బటన్ నొక్కాలి ● యాడ్ చేయాలనుకున్న వెబ్‌పేజీ లింకును ఎంటర్ చేయాలి ● పేజీ లోడ్ అయిన తరువాత స్క్రీన్ అప్పర్ రైట్ కార్నర్‌లోని ‘బుక్ మార్క్’ ఐకాన్‌ను ట్యాప్ చేయాలి. యాడ్ అయినట్లు స్క్రీన్ బాటమ్‌లో మెసేజ్ కనిపిస్తుంది. ● గూగుల్ యాప్‌లోని ‘సేవ్‌డ్’ ట్యాబ్ ద్వారా లింక్‌లు, ఇమేజ్‌లు,,,మొదలైనవి యాడ్ చేయవచ్చు.

ఓపెన్ ఏఐ వాటర్ మార్క్



డాల్-ఇ 3 ఉపయోగించి జెనరేట్ చేయబడిన చిత్రాలకు త్వరలో వాటర్ మార్క్ జోడించనున్నట్లు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) రిసెర్చి ఆర్గనైజేషన్ ‘ఓపెన్ ఏఐ’ ప్రకటించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఉపయోగించి చిత్రాన్ని సృష్టించారా, వ్యక్తుల ద్వారా సృష్టించబడిందా? అనేది త్వరగా గుర్తించడానికి ఈ వాటర్‌మార్క్ యూజర్‌లకు ఉపయోగపడుతుంది.

● మ్యూజిక్ వరల్డ్

అమృతరాగ


అమృతా తంగిచ్చి

మలయాళీ అయిన అమృతా తంగచ్చి పెరిగింది మాత్రం చెన్నైలో. సంగీత ఓనమాలు అక్కడే నేర్చుకుంది. ‘చెన్నై అంటే నేను పెరిగిన ప్రాంతమే కాదు సంగీత శిక్షణకు సంబంధించి ప్రతి తీయటి జ్ఞాపకాన్ని గుర్తు తెచ్చే ప్రాంతం’ అంటోంది అమృత. లండన్‌లో ఉంటున్న అమృత క్లాసికల్ కంపోజిషన్‌లతో లైవ్‌పర్‌ఫార్‌మెన్స్ ఇవ్వడానికి గత నెల చెన్నైకి వచ్చింది. ‘బాల్య జ్ఞాపకాలు, జీవిత అనుభవాల నుంచి అవి వచ్చాయి’ అంటుంది తన కంపోజిషన్‌ల గురించి. అయిదు సంవత్సరాల వయసు నుంచి శాస్త్రీయ సంగీతం నేర్చుకోవడం మొదలుపెట్టిన అమృత కేఎస్ కాలేజ్ ఆఫ్ మ్యూజిక్‌లో చదువుకుంది. లండన్‌లోని అత్యుత్తమ ఒపేరా కోచ్‌ల దగ్గర శిక్షణ తీసుకుంది. భారతీయార్ కవితల ఆధారంగా తాను రూపొందించిన పాటలను విడుదల చేసే పనిలో ఉంది అమృతా తంగిచ్చి.


సినిమా

రామ్‌చరణ్‌కు జోడీ?


● జాన్వీ కపూర్

హిందీలో నటిగా నిరూపించుకున్న జాన్వీ కపూర్ ఇప్పుడు తెలుగులోనూ సత్తా చాటాలనుకుంటున్నారు. ఎన్టీఆర్ హీరోగా నటిస్తున్న ‘దేవర’ సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్నారు జాన్వీ కపూర్. కొరటాల శివ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా షూటింగ్‌లో ఆల్రెడీ పాల్గొన్నారు జాన్వీ. రెండు భాగాలుగా రూపొందుతున్న ఈ సినిమా తొలి భాగం ఈ ఏడాదిలోనే రిలీజ్ కానుంది. కాగా ‘దేవర’ చిత్రం తొలి భాగం విడుదల కాకముందే తెలుగులో మరో పెద్ద సినిమాకు జాన్వీ కపూర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని సమాచారం. రామ్‌చరణ్ హీరోగా ‘ఉప్పెన’ ఫేమ్ బుచ్చి బాబు సన దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. సుకుమార్ రైటింగ్స్, మైత్రీ మూవీ మేకర్స్‌తో కలిసి వెంకట సతీష్ కిలారు ఈ సినిమాను నిర్మించనున్నారు. ఈ వేసవిలో ఈ సినిమా షూటింగ్ ప్రారంభించాలనుకుంటున్నారు. ఈ సినిమాలోని హీరోయిన్ పాత్రకు జాన్వీ కపూర్ ఫైనలైజ్ అయ్యారని తాజా సమాచారం. త్వరలోనే అధికారిక ప్రకటన వెల్లడి కానుందని ఫిల్మ్‌నగర్ టాక్. అలాగే అఖిల్ హీరోగా నటించనున్న కొత్త సినిమాలో హీరోయిన్‌గా జాన్వీ పేరు వినిపిస్తోంది. ఇలా వరుస సినిమాలతో జాన్వీ తెలుగులో బిజీ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

రాముడి కోసం శిక్షణ


● రణ్‌బీర్ కపూర్

భారతీయ ఇతిహాసం రామాయణం ఆధారంగా హిందీలో ‘రామాయణ’ అనే సినిమా రూపొందనున్నట్లు వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. మూడు భాగాలుగా రానున్న ఈ చిత్రంలో రాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్, సీత పాత్రలో సాయిపల్లవి, హనుమంతుడి పాత్రలో సన్నీ డియోల్, రావణుడి పాత్రలో యశ్ నటిస్తారనే ప్రచారం సాగుతోంది. ఈ సినిమా చిత్రీకరణను ఈ ఏడాది వేసవిలో ప్రారంభించాలనుకుంటున్నారట. ఈ సినిమాలో తాను పోషించనున్న రాముడి పాత్ర ఆహార్యం కోసం రణ్‌బీర్ కపూర్ స్పెషల్ ట్రైనింగ్ తీసుకోనున్నారని బాలీవుడ్ సమాచారం. డైలాగ్స్ స్పష్టంగా పలికేందుకు కూడా డైలాగ్ డిక్షన్‌లో రణ్‌బీర్ ప్రత్యేక శిక్షణ తీసుకోనున్నారట. ఇక ఈ సినిమాను నమిత్ మల్హోత్రా, మధు మంతెన, అల్లు అరవింద్‌లు భారీ బడ్జెట్‌తో నిర్మిస్తారనే ప్రచారం సాగుతోంది. మరోవైపు హిందీలో ‘లవ్ అండ్ వార్’, ‘బ్రహ్మాస్త్రం’, ‘యానిమల్’ ఫ్రాంచైజీలు కమిటయ్యారు రణ్‌బీర్ కపూర్.

ఈగల్ కథ వినగానే చేసేద్దాం అన్నారు

- డైరెక్టర్ కార్తీక్ ఘట్టమనేని



“ఈగల్ కాన్సెప్ట్‌లోనే విధ్వంసం ఉంది. అయితే హీరో చేసే విధ్వంసం సమాజం కోసమే. అది ఏంటి? అనేది ప్రేక్షకులకు ఇవాళ తెలిసిపోతుంది. ఈ సినిమాలో పత్తి రైతు పాత్ర చేశారు రవితేజగారు. అయితే ఆయన పోరాడే సమస్య అంతర్జాతీయ స్థాయిలో ఉంటుంది. మనకి కూడా దగ్గరగా ఉంటుంది. ‘రాంబో, టెర్మినేటర్’ లాంటి హాలీవుడ్ సినిమాలని చాలా ఎంజాయ్ చేస్తాం. అలాంటి సినిమాలు తీసుకు రావాలనే ప్రయత్నమే ‘ఈగల్’. అద్భుతమైన యాక్షన్, డ్రామా, ఎంటర్‌టైన్‌మెంట్ ఉన్న ఈ చిత్రాన్ని ప్రేక్షకులు చాలా ఎంజాయ్ చేస్తారు” అని డైరెక్టర్ కార్తీక్ ఘట్టమనేని అన్నారు. రవితేజ హీరోగా, కావ్యా థాపర్, అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్లుగా నటించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వ ప్రసాద్ నిర్మించారు. వివేక్ కూచిభొట్ల సహ నిర్మాతగా వ్యవహరించిన ‘ఈగల్’ నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని విలేకరులతో పంచుకున్న విశేషాలు.

● దర్శకునిగా నా తొలి సినిమా నిఖిల్‌తో ‘సూర్య వర్సెస్ సూర్య’ చేశాను. ఆ తర్వాత మళ్లీ కెమెరామేన్‌గా బిజీ అయిపోవడంతో దర్శకునిగా వెంట వెంటనే సినిమాలు చేయలేకపోయాను. రవితేజ గారి ‘ధమాకా’ సినిమాకి కెమెరామేన్‌గా చేశాను. ఆ సమయంలో ‘ఈగల్’ కథ ఆయనకి చెప్పాను. వినగానే.. ‘ఇది మంచి కమర్షియల్ సినిమా.. చేసేద్దాం’ అన్నారు రవితేజగారు. దర్శకునిగా ‘ఈగల్’ నా రెండో సినిమా. ముందు నుంచీ యాక్షన్ సినిమాలు చేయడం నాకు ఇష్టం. అయితే కెరీర్ బిగినింగ్‌లో కొన్ని పరిమితులుంటాయి. ఇప్పుడు ‘ఈగల్’తో పూర్తి స్థాయి యాక్షన్ సినిమా చేసే అవకాశం రావడం ఆనందంగా ఉంది. ● రవితేజ గారు అద్భుతమైన నటుడని అందరికీ తెలుసు. కానీ, కొన్నిసార్లు వాణిజ్య అంశాల కారణంగా ఒకే సినిమాలో కామెడీ, డ్యాన్స్, యాక్షన్.. ఇలా చాలా రకాలు చేయాల్సి వస్తుంది. ‘ఈగల్’లో మాత్రం ఆయన ఒక పాత్రగానే కనిపిస్తారు. ఆ తేడా సినిమా చూసే ప్రేక్షకులకు అర్థం అవుతుంది. ఇంటెన్స్‌గా ఉంటూ కూల్‌గా ఉండటం ఆయనలో డిఫరెంట్ క్వాలిటీ. ‘ఈగల్’లో నన్ను నేను చూసుకునే పాత్ర చేశాను’ అని రవితేజ గారు అనడం సంతోషం. చాలా క్రమశిక్షణ కలిగిన నటుడు. ఆయన ఆహారపు అలవాట్లు, నిద్రపోయే వేళలు పర్ఫెక్ట్‌గా ఉంటాయి.. సెల్ఫ్ కంట్రోల్ ఎక్కువ. చాలా ఆనందమైన జీవితం గడుపుతారు. ● పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నాకు హోమ్ బ్యానర్‌లా అయిపోయింది. సినిమాకి కావాల్సిన ప్రతిదీ ఒక్క ఫోన్ కాల్‌తో సమకూర్చుతారు. విశ్వప్రసాద్, వివేక్‌గార్లకు కృతజ్ఞతలు. ఈ మూవీలో అనుపమ జర్నలిస్ట్ పాత్ర చేశారు. కావ్యా థాపర్, నవదీప్ పాత్రలకి చాలా ప్రాధాన్యత ఉంది. మరో చిన్న పాప పాత్ర కూడా కీలకంగా ఉంటుంది. ఇక హిందీలో ‘ఈగల్’ పేరుతో ఓ సినిమా ఉంది. దీంతో ‘సహదేవ్ వర్మ’ టైటిల్‌తో అక్కడ రిలీజ్ చేస్తున్నాం. ప్రస్తుతం తేజ సజ్జా హీరోగా ఓ సినిమా చేస్తున్నాను.

చారి.. గూఢచారి


● ‘వెన్నెల’ కిశోర్, సంయుక్తా విశ్వనాథన్

కన్‌ఫ్యూజ్ అయ్యే గూఢచారిగా చారి పాత్రలో నటించారు ‘వెన్నెల’ కిశోర్. ఆయన హీరోగా నటించిన ‘చారి 111’ స్పై థ్రిల్లర్ మూవీకి టీజీ కీర్తి కుమార్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో సంయుక్తా విశ్వనాథన్ హీరోయిన్‌గా నటించగా, మురళీ శర్మ ఓ ప్రధాన పాత్రలో నటించారు. బర్కత్ స్టూడియోస్ పతాకంపై అదితీ సోనీ నిర్మించారు. ఈ సినిమాను మార్చి 1న విడుదల చేయనున్నట్లుగా చిత్ర యూనిట్ గురువారం వెల్లడించింది. ‘‘ఇదొక స్పై యాక్షన్ కామెడీ ఫిల్మ్. సిల్లీ మిస్టేక్స్ చేసే ఓ స్పై ఒక పెద్ద కేసును ఎలా పరిష్కరించాడన్నదే ఈ చిత్రకథ. ‘వెన్నెల’ కిశోర్, సంయుక్తా స్పై రోల్స్ చేయగా, వీరి బాస్ పాత్రలో మురళీ శర్మ నటించారు’’ అన్నారు టీజీ కీర్తి కుమార్. ‘‘చారి 111’ చిత్రం కొత్తగా ఉంటుంది’’ అన్నారు అదితీ సోనీ. ఈ చిత్రానికి సంగీతం: సైమన్ కె. కింగ్.



● శార్వరీ వాఘ్, జాన్ అబ్రహాం

యాక్షన్ డేట్ ఫిక్స్

బాలీవుడ్ నటుడు జాన్ అబ్రహాం నటించిన తాజా యాక్షన్ మూవీ ‘వేదా’. ‘సలామ్ ఏ ఇష్క్’ (2007) వంటి హిట్ మూవీ తర్వాత హీరో జాన్ అబ్రహాం, డైరెక్టర్ నిఖిల్ అద్వానీ కాంబినేషన్‌లో ఈ మూవీ రూపొందింది. ఈ చిత్రంలో శార్వరీ వాఘ్ హీరోయిన్‌గా నటించారు. మోనీషా అద్వానీ, మధు భోజ్వాని, జాన్ అబ్రహాం నిర్మించారు. పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని జూలై 12న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు మేకర్స్. ఈ సందర్భంగా జాన్ అబ్రహాం, శార్వరీ వాఘ్‌ల ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ‘‘యాక్షన్ డ్రామాగా ‘వేదా’ రూపొందింది. వాస్తవ ఘటనల స్ఫూర్తితో ఈ చిత్రం తీశాను. ఈ మూవీ మన సమాజంలోని పరిస్థితులను ప్రతిబింబిస్తుంది’’ అని నిఖిల్ అద్వానీ పేర్కొన్నారు.

ఆ సీక్వెల్స్‌కి నేను డైరెక్షన్ చేయకపోవచ్చు!

- జేమ్స్ కామెరూన్



హాలీవుడ్ దర్శకుడు జేమ్స్ కామెరూన్ అనగానే గుర్తొచ్చే చిత్రం ‘అవతార్’. 2009లో రిలీజైన ఈ సినిమా ప్రేక్షకులను పండోరా ప్రపంచంలో విహారం చేలా చేసింది. కలెక్షన్స్‌లో సరికొత్త బాక్సాఫీస్ రికార్డులను సృష్టించింది. దీంతో ‘అవతార్’కు సీక్వెల్స్‌గా ‘అవతార్ 2’, ‘అవతార్ 3’, ‘అవతార్ 4’, ‘అవతార్ 5’లను ప్రకటించారు జేమ్స్ కామెరూన్. ‘అవతార్’ సీక్వెల్‌గా వచ్చిన ‘అవతార్ 2: ద వే ఆఫ్ వాటర్’ (2022) బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. ప్రస్తుతం ‘అవతార్ 3’, ‘అవతార్ 4’ సినిమాల చిత్రీకరణలు ఒకేసారి జరుగుతున్నాయి. ‘అవతార్ 3’ ఈ ఏడాదిలో విడుదల కావాల్సింది. కానీ 2025కి వాయిదా వేశారు. 2025 డిసెంబరు 19న‘అవతార్ 3’, 2029లో ‘అవతార్ 4’, 2031లో ‘అవతార్ 5’ సినిమాలు విడుదలకు రెడీ అవుతున్నాయి. కాగా ‘అవతార్’ ఫ్రాంచైజీలో ‘అవతార్ 6’, ‘అవతార్ 7’లకు కూడా చాన్స్ ఉందని జేమ్స్ కామెరూన్ చెబుతున్నారు. ఇటీవల ఓ అవార్డు ఫంక్షన్‌లో పాల్గొన్న ఆయన ‘అవతార్’ సినిమా ఫ్రాంచైజీ గురించి మాట్లాడుతూ– ‘‘అవతార్’ ఫ్రాంచైజీలోని ఐదు సినిమాలకు కథలు రెడీగా ఉన్నాయి. ‘అవతార్ 6’, ‘అవతార్ 7’ల గురించిన ఆలోచనలు కూడా ఉన్నాయి. కానీ ‘అవతార్ 6’, ‘అవతార్ 7’లకు నేను దర్శకత్వం వహించకపోవచ్చు’’ అని చెప్పుకొచ్చారు. హాలీవుడ్‌లో ‘టైటానిక్’, ‘ది టెర్మినేటర్’ వంటి అద్భుత చిత్రాలను కూడా తీసిన జేమ్స్ కామెరూన్ కెరీర్‌ను ‘అవతార్’ ఫ్రాంచైజీ ఒక్కటీ డామినేట్ చేయడం ఆయన ఫ్యాన్స్‌కు రుచించడం లేదని హాలీవుడ్‌లో కథనాలు వస్తున్నాయి. ఇక కామెరూన్ అన్నట్లు భవిష్యత్‌లో ‘అవతార్ 6’, ‘అవతార్ 7’లు సెట్స్‌పైకి వెళితే.. కనీసం ఇద్దరు, ముగ్గురు దర్శకులు కలిసి ఈ సినిమాలను తీయాల్సి ఉంటుందన్నట్లు హాలీవుడ్ సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారట.

లవ్ డ్రిల్


● హరనాథ్, కారుణ్య

‘‘నాకు చిన్నప్పటి నుంచి సినిమా లంటే ఇష్టం. అమెరికాలో డాక్టర్‌గా బిజీగా ఉన్నా సినిమాలపై ఇష్టంతో ‘కెప్టెన్ రాణా ప్రతాప్, టిక్ టిక్, చంద్ర హాస్’ వంటి 8 సినిమాలు తీయడంతో పాటు నటించాను. అయితే తెలుగులో ఇప్పటివరకూ లవ్ జిహాదీపై ఒక్క సినిమా కూడా రాలేదు. అందుకే ఆ కథాంశం ఎంచుకుని ‘డ్రిల్’ తీశా’’ అని హరనాథ్ పొలిచెర్ల అన్నారు. ఆయన లీడ్ రోల్‌లో నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం ‘డ్రిల్’. కారుణ్య చౌదరి హీరోయిన్. డ్రీమ్ టీమ్ బ్యానర్‌పై రూపొందిన ఈ సినిమా ఈ నెల 16న రిలీజవుతోంది. ఈ చిత్రం టీజర్ రిలీజ్ వేడుకలో అతిథిగా పాల్గొన్న సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్... ‘‘అమెరికాలో డాక్టర్‌గా స్థిరపడ్డ హరనాథ్‌గారు ఇండియా వచ్చి తెలుగు సినిమాలు తీయడం హ్యాపీ’’ అన్నారు.

సాక్షి బిజినెస్
శుక్రవారం
9-2-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
724	213
71,428	21,718

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	15,805	△	47
డోజోన్స్	38,602	▽	76
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,595	▽	33
డాక్స్	16,964	△	42
షాంఘై	2,865	△	36
నికాయ్	36,863	△	743

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)		
62,612	▽	34
బంగారం (99.5 స్వచ్ఛత)		
62,361	▽	34
వెండి (కిలో)		
69,950	△	84

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.56	83.58
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	103.69	106.25
€	యూరో	ఒకటి	88.42	90.77
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	55.39	56.64
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	53.28	55.20
S$	సింగపూర్ డాలర్	ఒకటి	59.28	63.97
SAR	సౌదీ రియాల్	ఒకటి	21.17	22.79
UAE D	యూఏఈ దిర్హామ్	ఒకటి	21.69	23.48
¥	చైనా యువాన్	ఒకటి	10.41	12.48

టెలికం స్పెక్ట్రమ్ వేలం బేస్ ధరపైనే: కేబినెట్ నిర్ణయం




న్యూఢిల్లీ: మొబైల్ ఫోన్ సేవల కోసం ఉద్దేశించిన ఎనిమిది బ్యాండ్లలో స్పెక్ట్రమ్ వేలాన్ని బేస్ ధర రూ.96,318 కోట్లపై నిర్వహించేందుకు కేంద్ర కేబినెట్ నిర్ణయించింది. 800, 900, 1800, 2100, 2300, 2500, 3300 మెగాహెర్జ్, 26 గిగాహెర్జ్ బ్యాండ్లలో స్పెక్ట్రమ్‌ను ప్రభుత్వం వేలం వేయనుంది. దివాలా పరిష్కార చర్యల పరిధిలోకి వచ్చిన కంపెనీలకు సంబంధించి స్పెక్ట్రమ్ ఈ ఏడాదితో గడువు తీరిపోనుండగా, దీన్నీ వేలం వేస్తుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

9-2-2024	
విశాఖ	555-00
చిత్తూరు	583-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	546-00
విజయవాడ	546-00
రిటైల్ ధర (డజను)	72.00
8-2-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	545-00
వరంగల్	547-00
రిటైల్ ధర	6.05

ఆరో'సారీ'.. తగ్గించేదేలే..!

- 6.5 శాతంగా రెపోరేటు కొనసాగింపు
- 4 శాతానికి రిటైల్ ద్రవ్యోల్బణం దిగిరావాల్సిన ఆవశ్యకత నేపథ్యం
- అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితి కూడా కారణమే
- దీంతో బ్యాంకింగ్ రుణరేట్లలో యథాతథ పరిస్థితి



ముంబై: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) రెపో రేటును యథాతథంగా 6.5 శాతం వద్ద కొనసాగించాలని నిర్ణయించింది. ముంబైలో ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ నేతృత్వంలో మూడు రోజుల పాటు జరిగిన ఆరుగురు సభ్యుల ఆర్‌బీఐ ఎంపీసీ ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్ష గురువారం ముగిసింది. సమావేశ వివరాలను గవర్నర్ వివరిస్తూ, అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితి పరిస్థితుల నేపథ్యం, దేశంలో వినియోగ ధరల సూచీ ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం ప్రభుత్వం నిర్దేశిస్తున్న విధంగా 4 శాతానికి దిగిరావాలన్న లక్ష్యం వంటి అంశాల నేపథ్యంలో రెపో రేటును ప్రస్తుతమున్నట్టుగానే కొనసాగించాలని నిర్ణయించినట్లు తెలిపారు. దీంతో బ్యాంకులకు తానిచ్చే రుణాలపై ఆర్‌బీఐ వసూలు చేసే వడ్డీరేటు (రెపో) 6.5 శాతంగా కొనసాగనుంది. ఫలితంగా బ్యాంకింగ్ రుణ రేట్లలో కూడా దాదాపు ఎటువంటి మార్పులూ జరగబోవని నిపుణులు అంచనావేస్తున్నారు.

వరుసగా ఆరవసారి 'యథాతథం'..

ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం, అంతర్జాతీయంగా పెరిగిన క్రూడ్ ధరలు, దీనితో ప్రపంచ వ్యాప్తంగా ద్రవ్యోల్బణం భయాల నేపథ్యంలో ఈ సవాలును అధిగమించడానికి ఆర్‌బీఐ 2022 మే నుంచి 2023 ఫిబ్రవరి నాటికి రెపో రేటును 250 బేసిస్ పాయింట్లు పెంచింది. దీనితో ఈ రేటు 6.5 శాతానికి చేరింది. అయితే ద్రవ్యోల్బణం కొద్దిగా అదుపులోకి వస్తుందన్న సంకేతాల నేపథ్యంలో తాజా సమీక్ష సహా గడచిన ఐదు సమావేశాల్లో యథాతథ రేటు కొనసాగింపునకే ఆర్‌బీఐ పెద్దపీట వేసింది.

వచ్చే పాలసీలో రేటు తగ్గొచ్చు



"దేశంలో హౌసింగ్ డిమాండ్ పెంచడానికి వచ్చే ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన సమీక్షలో రెపో రేటు తగ్గింపు నిర్ణయం ఉంటుందని భావిస్తున్నాం. ప్రస్తుతానికి వడ్డీరేట్ల స్థిరత్వం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నాం. దీనివల్ల డిమాండ్ ప్రస్తుత పటిష్ట స్థాయిలోనే కొనసాగుతుందని పరిశ్రమ భావిస్తోంది. దేశ ఎకానమీ స్థిరంగా ఉండడం పరిశ్రమకు కలిసివచ్చే అంశం.

– బొమన్ ఇరానీ, క్రెడాయ్ ప్రెసిడెంట్

వృద్ధికి బూస్ట్



"రేటు యథాతథ విధానాన్ని కొనసాగిస్తూ తీసుకున్న నిర్ణయం ప్రగతిశీలమైంది. సుస్థిర ఆర్థిక వృద్ధికి దోహదపడుతుంది. అంతర్జాతీయ, దేశీయ సవాళ్లు- ఆహార రంగానికి సంబంధించి ధరల సమస్యల వంటి అన్ని అంశాలనూ పరిగణనలోకి తీసుకుంటూ... వినియోగదారు ప్రయోజనాలే లక్ష్యంగా జరిగిన నిర్ణయాలు హర్షణీయం. జాగరూకతతో కూడిన విధానమిది.

– దీపక్ సూద్, అసోచామ్ సెక్రటరీ జనరల్

పాలసీలో కీలకాంశాలు...

- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2023–24లో వృద్ధి రేటు 7.3 శాతంగా అంచనా.
- ఇదే కాలంలో రిటైల్ ద్రవ్యోల్బణం 5.4% నుంచి 4.5 శాతానికి డౌన్. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 4వ త్రైమాసికంలో 5 శాతం ద్రవ్యోల్బణం నమోదవుతుందని అంచనా.
- నియంత్రణా పరమైన మార్గదర్శకాలను ఎంతోకాలంగా పాటించకపోవడమే పేటీఎంపై చర్యకు దారితీసినట్లు గవర్నర్ దాస్ పేర్కొన్నారు. ఈ చర్యలు వ్యవస్థకు ముప్పు కలిగించేవిగా భావించరాదని కూడా స్పష్టం చేశారు.
- డిజిటల్ రూపాయి వినియోగదారులు ఇకపై పరిమిత ఇంటర్నెట్ కనెక్టివిటీ ఉన్న ప్రాంతాల్లోనూ లావాదేవీలను త్వరలో నిర్వహించగలుగుతారు. తక్కువ లేదా పరిమిత ఇంటర్నెట్ కనెక్టివిటీ ఉన్న ప్రాంతాల్లో లావాదేవీల కోసం సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ-రిటైల్(సీబీడీసీ-ఆర్) ఆఫ్‌లైన్ కార్యాచరణను ఆర్‌బీఐ త్వరలో ఆవిష్కరించనుంది.
- రుణ ఒప్పంద నిబంధనల గురించి కీలక వాస్తవ ప్రకటన (కేఎఫ్ఎస్)ను కస్టమర్లకు అందించవలసి ఉంటుందని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. దీని ప్రకారం బ్యాంకింగ్ ఇకపై రిటైల్‌తోపాటు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) రుణగ్రహీతలకు కూడా కేఎఫ్ఎస్‌ను అందించాల్సి ఉంటుంది.
- తదుపరి పాలసీ సమీక్ష ఏప్రిల్ 3 నుంచి 5వ తేదీ వరకు జరుగుతుంది.

భారత్‌లో మైక్రోసాఫ్ట్ సీడబ్ల్యూబీ ప్రోగ్రాం..

75 వేల మహిళా డెవలపర్లకు శిక్షణ



బెంగళూరు: మైక్రోసాఫ్ట్ తమ 'కోడ్ వితౌట్ బ్యారియర్స్' (సీడబ్ల్యూబీ) ప్రోగ్రాంను భారత్‌లోనూ ప్రవేశపెట్టింది. దీని కింద ఈ ఏడాది 75,000 మంది మహిళా డెవలపర్లకు శిక్షణ కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సంస్థ చీఫ్ సత్య నాదెళ్ల తెలిపారు. క్లౌడ్, కృత్రిమ మేధ, డిజిటల్ టెక్నాలజీ రంగాల్లో లింగ అసమానతలను తొలగించడంలో తోడ్పడే ఉద్దేశంతో ఆసియా పసిఫిక్ ప్రాంతంలోని తొమ్మిది దేశాల్లో 2021లో ఈ ప్రోగ్రాంను ఆవిష్కరించినట్లు ఆయన చెప్పారు. దీని కింద మహిళా డెవలపర్లు, కోడర్స్‌కు శిక్షణ, నెట్‌వర్కింగ్ అవకాశాలు కల్పిస్తున్నట్లు సత్య నాదెళ్ల వివరించారు. మైక్రోసాఫ్ట్ ఏఐ టూర్‌లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఈ విషయాలు చెప్పారు. మరోవైపు శిక్షణ ఫౌండేషన్, మైక్రోసాఫ్ట్ రీసెర్చ్ ఇండియా సంయుక్తంగా నిర్వహిస్తున్న శిక్షా కోపైలట్ ప్రోగ్రాం.. ప్రధానంగా ఉపాధ్యాయులకు సాధికారత కల్పించేందుకు ఉద్దేశించినదని సత్య నాదెళ్ల తెలిపారు. అజూర్ ఓపెన్‌ఏఐ మోడల్ తోడ్పాటుతో పాఠ్యాంశాలను విద్యార్థులు మరింత సులభంగా అర్థం చేసుకునేలా పాఠ్యప్రణాళికలను రూపొందించేందుకు శిక్షా కోపైలట్ ప్రోగ్రాం ఉపయోగపడుతుందని చెప్పారు. ప్రస్తుతం బెంగళూరులోని 30 గ్రామీణ, పట్టణ పాఠశాలల్లో ఉపయోగిస్తున్న ఈ విధానాన్ని దేశవ్యాప్తంగా విస్తరించేందుకు కృషి చేస్తున్నట్లు సత్య నాదెళ్ల వివరించారు.

మెప్పించని ఆర్‌బీఐ పాలసీ

- వడ్డీ రేట్ల తగ్గింపుపై కొరవడిన స్పష్టత
- ఫైనాన్స్, బ్యాంకింగ్, రియల్టీ షేర్లు డీలా
- సెన్సెక్స్ 724 పాయింట్లు పతనం

ముంబై: ఆర్‌బీఐ నుంచి కీలక వడ్డీ రేట్ల తగ్గింపుపై స్పష్టత కొరవడంతో రేట్ల ఆధారిత రంగాలైన బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఆటో, రియల్టీ, కమోడిటీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బలహీన డిసెంబర్ క్వార్టర్ ఫలితాల నమోదుతో ఎఫ్‌ఎంసీజీ షేర్లూ డీలా పడ్డాయి. ఫలితంగా గురువారం సెన్సెక్స్ 724 పాయింట్లు నష్టపోయి 71,428 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 213 పాయింట్లు పతనమై 21,718 వద్ద నిలిచింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని సానుకూల సంకేతాలతో ఉదయం సూచీలు లాభాలతో మొదలయ్యాయి. ఆర్‌బీఐ పాలసీ ప్రకటన వెల్లడి ఐటీ, ఇంధన షేర్లు మినహా అన్ని రంగాల షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తాయి. ఒక దశలో సెన్సెక్స్ 921 పాయింట్లు పతనమై 71,231 వద్ద, నిఫ్టీ 266 పాయింట్లు క్షీణించి 21,665 వద్ద ఇంట్రాడే కనిష్టాలకు దిగివచ్చాయి.

వడ్డీ రేట్ల ప్రభావిత షేర్లు డీలా

ఆర్‌బీఐ నుంచి వడ్డీ రేట్ల తగ్గింపుపై స్పష్టత రాకపోవడంతో బ్యాంకింగ్, ఆటో, రియల్టీ షేర్లు నష్టాలు చవిచూశాయి. బ్యాంకింగ్ రంగ షేర్లు ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ 4%, కోటక్ మహీంద్రా బ్యాంక్ 3.50%, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఐడీఎఫ్‌సీ బ్యాంక్, ఇండస్ ఇండ్ బ్యాంక్ 3%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఫెడరల్ బ్యాంక్ 2% చొప్పున నష్టపోయాయి. ఆటో రంగ షేర్లూ నష్టాల బాటపట్టాయి. ఐషర్ మోటార్స్ 3%, అపోలో టైర్స్ 2.50%, మారుతీ, ఎంఅండ్‌ఎం, సంవర్ధన మదర్సన్ షేర్లు 2%, టీవీఎస్, అశోక్ లేలాండ్, టాటా మోటార్స్ షేర్లు 1%, ఎంఆర్‌ఎఫ్ 0.10% చొప్పున నష్టపోయాయి. బీఎస్ఈ ఆటో ఇండెక్స్ 1% పతనమైంది. అలాగే రియల్టీ రంగ షేర్లైన గోద్రేజ్ ప్రాపర్టీస్ 3.50%, శోభ, లోథా 3%, ప్రెస్టేజ్ ఎస్టేట్స్ 1% మేర నష్టపోయాయి. నిబంధనల అతిక్రమణ కారణంగానే పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌పై చర్యలు తీసుకున్నట్లు ఆర్‌బీఐ అధికారులు తెలపడంతో పేటీఎం షేరు 10% పతనమై రూ.447 వద్ద లోయర్ సర్క్యూట్ తాకింది.



ఎల్‌ఐసీ లాభం జూమ్

- 49 శాతం వృద్ధితో రూ.9,444 కోట్లు
- షేరుకు రూ.4 చొప్పున డివిడెండ్



న్యూఢిల్లీ: జీవిత బీమా దిగ్గజం ఎల్‌ఐసీ మరోసారి పటిష్ట పనితీరు ప్రదర్శించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికానికి రూ.9,444 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.6,334 కోట్లతో పోలిస్తే 49 శాతం పెరిగింది. నికర ప్రీమియం ఆదాయం రూ.1,11,788 కోట్ల నుంచి రూ.1,17,017 కోట్లకు వృద్ధి చెందింది. ఎల్‌ఐసీ మొత్తం ఆదాయం రూ.1,96,891 కోట్ల నుంచి రూ.2,12,447 కోట్లకు చేరింది. ఒక్కో షేరుకు రూ.4 చొప్పున మధ్యంతర డివిడెండ్ పంపిణీ చేయాలని బోర్డు నిర్ణయం తీసుకుంది. ఇందుకు ఫిబ్రవరి 21 రికార్డు తేదీగా ప్రకటించింది. 30 రోజుల్లోపు డివిడెండ్ పంపిణీ చేస్తామని తెలిపింది. మొదటి ఏడాది ప్రీమియం ఆదాయం (కొత్త పాలసీల నుంచి)లో ఎల్‌ఐసీ ఇప్పటికీ జీవిత బీమా మార్కెట్లో 58.90 శాతం వాటాతో దిగ్గజ సంస్థగా కొనసాగుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్ వరకు తొమ్మిది నెలల్లో ఎల్‌ఐసీ నికర లాభం అంతకుముందు ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఉన్న రూ.22,969 కోట్ల నుంచి రూ.26,913 కోట్లకు వృద్ధి చెందింది.

ఫలితాల నేపథ్యంలో ఎల్‌ఐసీ షేరు ధర 6.50% ఎగసి రూ.1,112 వద్ద ముగిసింది.

సాక్షి స్పోర్ట్స్



రిత్విక్-నిక్కీ పునాచా జోడీ ముందంజ

చెన్నై ఓపెన్ ఏటీపీ చాలెంజర్-100 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో హైదరాబాద్ ప్లేయర్ బొల్లిపల్లి రిత్విక్ చౌదరి-నిక్కీ పునాచా (భారత్) జోడీ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో రిత్విక్-నిక్కీ జంట 5-7, 6-1, 10-7తో పరీక్షిత్ సోమాని-మనీశ్ సురేశ్ కుమార్ (భారత్) ద్వయంపై విజయం సాధించింది. భారత డేవిస్‌కప్ జట్టు సభ్యుడు, ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ సాకేత్ మైనేని-రామ్‌కుమార్ రామనాథన్ (భారత్) జోడీ కూడా సెమీఫైనల్ చేరింది. క్వార్టర్ ఫైనల్లో సాకేత్-రామ్‌కుమార్ ద్వయం 4-6, 6-4, 10-6తో డాన్ యాడెడ్-ఉగో బ్లాంచెట్ (ఫ్రాన్స్) జోడీపై గెలుపొందింది. నేడు జరిగే సెమీఫైనల్స్‌లో తొషిహిదె మత్సుయ్-కైటో యునుగి (జపాన్)లతో సాకేత్-రామ్‌కుమార్; జేకబ్-మార్క్ వాల్నెర్ (జర్మనీ)లతో రిత్విక్-నిక్కీ తలపడతారు.



పోరాడి ఓడిన సహజ

సాక్షి, హైదరాబాద్: ముంబై ఓపెన్ డబ్ల్యూటీఏ-125 టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్ క్రీడాకారిణి, భారత రెండో ర్యాంకర్ సహజ యామలపల్లి పోరాటం ముగిసింది. ముంబైలో గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 336వ ర్యాంకర్ సహజ 6-1, 3-6, 5-7తో ప్రపంచ 162వ ర్యాంకర్ పొలీనా కుదెర్‌మెతోవా (రష్యా) చేతిలో ఓడిపోయింది. గంటా 58 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సహజ ఐదు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. మరో ప్రిక్వార్టర్ ఫైనల్లో భారత్‌కే చెందిన రుతుజా 6-7 (6/8), 6-2, 1-6తో కేటీ వోలినెట్స్ (అమెరికా) చేతిలో పరాజయం పాలైంది.

సెమీస్‌లో నిఖత్



సోఫియా (బల్గేరియా): రెండుసార్లు ప్రపంచ చాంపియన్, తెలంగాణ స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్ స్ట్రాంజా స్మారక అంతర్జాతీయ బాక్సింగ్ టోర్నీలో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. మహిళల 50 కేజీల క్వార్టర్ ఫైనల్లో ఆమె 5-0తో ఖదిరి వాసిల (ఫ్రాన్స్)పై గెలిచి కనీసం కాంస్య పతకాన్ని ఖాయం చేసుకుంది. 66 కేజీల క్వార్టర్స్‌లో అరుంధతి 5-0తో సెర్బియాకు చెందిన మిలెనాపై గెలుపొందింది. 57 కేజీల క్వార్టర్స్‌లో సాక్షి 2-3 తో మమజొనొవా (ఉజ్బెకిస్తాన్) చేతిలో ఓడిపోయింది. పురుషుల కేటగిరీలో దీపక్ (75 కేజీలు), నవీన్ (92 కేజీలు) క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. దీపక్ 5-0తో సుల్తాన్ (కిర్గిజిస్తాన్)పై, నవీన్ 5-0తో వొయిస్నరొవిక్ (లిథువేనియా)పై గెలుపొందారు.

భారత్ ప్రత్యర్థి స్వీడన్


న్యూఢిల్లీ: డేవిస్‌కప్ పురుషుల టీమ్ టెన్నిస్ చాంపియన్‌షిప్ వరల్డ్ గ్రూప్-1 పోటీల 'డ్రా'ను గురువారం విడుదల చేశారు. ఈ ఏడాది సెప్టెంబర్ 13 నుంచి 15 మధ్య వివిధ దేశాల్లో ఈ మ్యాచ్‌లు జరుగుతాయి. భారత జట్టుకు స్వీడన్ జట్టు రూపంలో క్లిష్టమైన ప్రత్యర్థి ఎదురైంది. స్వీడన్ వేదికగా ఈ రెండు జట్ల మధ్య మ్యాచ్ జరుగుతుంది. ఇప్పటి వరకు స్వీడన్‌తో ఐదుసార్లు తలపడిన భారత్ ఒక్కసారి కూడా గెలవలేకపోయింది.

కొత్త సవాళ్లకు సిద్ధం

- పారిస్ ఒలింపిక్స్ సన్నాహాలపై భారత స్టార్ షట్లర్ సింధు వ్యాఖ్య
- మళ్లీ పూర్వ వైభవం అందుకుంటానని ఆత్మవిశ్వాసం

న్యూఢిల్లీ: భారత స్టార్ షట్లర్, రెండు ఒలింపిక్ పతకాల విజేత పూసర్ల వెంకట (పీవీ) సింధు ప్రస్తుతం ఫామ్ కోల్పోయి తీవ్రంగా ఇబ్బంది పడుతోంది. గత 18 నెలలుగా ఆటు టోర్నీల్లో వైఫల్యంతోపాటు గాయాలు కూడా ఆమెను వెంటాడాయి. 2023లో ఆమె ఒక్క టోర్నీ కూడా గెలవలేకపోయింది. ఈ నేపథ్యంలో కొంత విరామం తర్వాత సింధు మళ్లీ బరిలోకి దిగుతోంది. పారిస్ ఒలింపిక్స్ సన్నద్ధత కోణంలో చూస్తే ఈ ఏడాది సింధుకు కీలక ఏడాది కానుంది. ఈ నెల 13 నుంచి మలేసియాలో జరిగే ఆసియా బ్యాడ్మింటన్ టీమ్ చాంపియన్‌షిప్‌లో సింధు పాల్గొంటోంది. ప్రస్తుతం పారిస్ ఒలింపిక్స్‌కు తనకు పెద్ద సవాల్‌గా కనిపిస్తున్నాయని, ఈసారి మరింత జాగ్రత్తగా ఆడాల్సి ఉంటుందని సింధు అభిప్రాయపడింది. గత కొంత కాలంగా సింధు బెంగళూరులో దిగ్గజ ఆటగాడు ప్రకాశ్ పదుకోన్, ఇండోనేసియా కోచ్ అగుస్ ద్వి సాంతోసో వద్ద శిక్షణ తీసుకుంటోంది. ప్రకాశ్‌తో పాటు ఆమె ఇతర కోచింగ్ బృందంలో కూడా మార్పులు జరిగాయి. దీంతో మంచి ఫలితాలు రాబట్టగలనని ఆమె విశ్వాసంతో ఉంది. పలు అంశాలపై సింధు అభిప్రాయాలు ఆమె మాటల్లోనే...

- గత రెండు ఒలింపిక్స్‌లతో పోలిస్తే ఈసారి జరగబోయే పోటీలు నాకు భిన్నమైన అనుభవాన్ని ఇవ్వబోతున్నాయి. 2016, 2020 ఒలింపిక్స్‌లతో పోలిస్తే నాకు పారిస్‌లో పెద్ద సవాల్ ఎదురు కానుంది. అయితే నాకు అనుభవం కూడా పెరిగింది. మరింత జాగ్రత్తగా, తెలివిగా ఆడాల్సి ఉంటుంది.



- మహిళల సర్క్యూట్‌లో టాప్ 10–15 షట్లర్లు బాగా బలమైనవారు. వారిని ఎదుర్కొనేందుకు భిన్న వ్యూహాలు అనుసరించాలి. ప్లాన్ 'ఎ' పని చేయకపోతే ప్లాన్ 'బి' కోసం సిద్ధంగా ఉండాలి. ఒత్తిడికి లోను కాకుండా ప్రశాంతంగా ఉండే మానసిక దృఢత్వం కూడా అవసరం.
- ప్రకాశ్ సర్ లాంటి గొప్ప ఆటగాడితో కలిసి పని చేసే అవకాశం రావడం నా అదృష్టం. ఆయన ఆలోచనలు, శిక్షణా పద్ధతులు నాకు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయి. కొత్త ట్రెయినర్, ఫిజియో, న్యూట్రిషనిస్ట్, కోచ్, మెంటార్... ఇలా అందరూ మారారు. వీరంతా నాకు ఎంతో సహకరిస్తున్నారు. దీని వల్ల నా ఆటలో వచ్చిన మార్పులు ముందు కనిపిస్తాయి. పూర్తి ఫిట్‌గా నేను ఆసియా టీమ్ చాంపియన్‌షిప్ కోసం సిద్ధమయ్యాను.



తన కొత్త కోచింగ్ బృందంతో సింధు

- గాయం నుంచి కోలుకున్న తర్వాత పూర్తి స్థాయిలో ఆటలో వేగం అందుకునేందుకు కొంత సమయం పడుతుంది. ప్రస్తుతం నేను అదే స్థితిలో ఉన్నాను. గతంలో ఇలాంటి కఠిన పరిస్థితులను అధిగమించాను. 2015లో కూడా నేను గాయాలతో బాధపడుతూనే ఆరు నెలల పాటు ఆడాను. అయితే కోలుకొని రియో ఒలింపిక్స్‌కు అర్హత సాధించగలిగాను. నా మీద నాకున్న నమ్మకంతో పోరాడి రజతం గెలిచాను. నాలుగేళ్ల తర్వాత మరిన్ని అంచనాలతో టోక్యో ఒలింపిక్స్ బరిలోకి దిగి సెమీస్‌లో ఓడటం చాలా బాధించింది. ఫైనల్ చేరకపోవడంతో ఏడ్చేశాను. కానీ నాలుగో స్థానానికి, కాంస్య పతకానికి తేడా చాలా ఉంటుందని నా కోచ్ ప్రోత్సహించడంతో మూడో స్థానం కోసం మ్యాచ్‌లో సత్తా చాటి గెలిచాను. ఈ కాంస్యం కోసం నేను ఎంతో కష్టపడ్డానని అనిపించింది.





'పారిస్' పతకాల్లో ఈఫిల్ టవర్!

2024 ఒలింపిక్స్ మెడల్స్ ఆవిష్కరణ

పారిస్: ఈ ఒలింపిక్స్ పతకాలు మిగతా పతకాల కంటే అతి భిన్నమైనవి... అమూల్యమైనవి! ఎందుకంటే ఈ పతకాల్లో బంగారం, వెండి, ఇత్తడి లోహాలే కాదు అంతకుమించి అపురూపమైంది ఇందులో ఇమిడి ఉంది. ఫ్రాన్స్‌కే తలమానికమైన 'ఈఫిల్ టవర్' ప్రతి పతకంలోనూ దాగి ఉంది. అదేలా అంటే... ఈ వివరాల్లోకి వెళ్దాం! ఈ ఏడాది జూలై 26 నుంచి ఆగస్టు 11 వరకు పారిస్ నగరంలో విశ్వక్రీడలు జరుగుతాయి. ఈ పోటీల్లో పతక విజేతలకు బహూకరించే పతకాల్ని గురువారం అధికారికంగా ఆవిష్కరించారు. ప్రతి పతకం బరువు 18 గ్రాములైతే... ప్రతి పతకంలోనూ ఈఫిల్ టవర్ లోహం నిక్షిప్తమై ఉంది. పూర్తిగా ఇనుముతో నిర్మించిన ఈఫిల్ టవర్ ప్రపంచంలోనే ఓ ప్రత్యేకతను సంతరించుకుంది. ఈఫిల్ టవర్‌ను కళ్లారా చూసేందుకు యావత్ ప్రపంచ పర్యాటకులు పారిస్‌కు పోటెత్తుతారు. ఇనుముతో తయారైన ఈ టవర్‌ను నవీకరణ చేసిన సందర్భాలెన్నో ఉన్నాయి. అప్పుడు టవర్‌లో అక్కడక్కడ తీసివేసిన తుక్కు ఇనుప ముక్కల్ని ఓ రహస్య గదిలో జాగ్రత్త పరిచారు. ఈసారి ఒలింపిక్స్ పారిస్‌లో జరుగనున్నాయి. కాబట్టి తమ పతకాలతో మరో విశిష్టత కల్పించాలని ఒలింపిక్ నిర్వాహక కమిటీ, ఫ్రాన్స్ ప్రభుత్వం భావించాయి. అందుకే పతకాల తయారీలో అసలైన ఈఫిల్ టవర్ అవశేషాల్ని (భద్రపరిచిన ఇనుప ముక్కలు) వినియోగించారు. ఈసారి విజేతలంతా అదృష్టవంతులే! ఎందుకంటే వాళ్లంతా పతకాల్నే కాదు... 'సింబల్ ఆఫ్ పారిస్' గుర్తుల్ని తమతమ దేశాలకు మోసుకెళ్తారు. దీనిపై పారిస్ ఒలింపిక్స్ క్రియేటివ్ డైరెక్టర్ థీయెరి రిబోల్ మాట్లాడుతూ 'కచ్చితంగా అథ్లెట్లకు ఇది సువర్ణావకాశం. పారిస్ జగద్విఖ్యాత చిహ్నం అవశేషాల్ని ఒలింపిక్స్ విజేతలు తమతో తీసుకెళ్లొచ్చు' అని అన్నారు. విశ్వక్రీడల చరిత్రలోనే చెరగని ముద్ర వేసేందుకు విశేషమైన వినూత్నమైన ఆలోచనతో ఈ పతకాల్ని డిజైన్ చేశామని చెప్పారు. విజేతలకు అందించేందుకు మొత్తం 5,084 స్వర్ణ, రజత, కాంస్య పతకాలు తయారు చేశారు.

సంయుక్త విజేతలుగా భారత్, బంగ్లాదేశ్



ఢాకా: నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్న దక్షిణాసియా అండర్-19 మహిళల ఫుట్‌బాల్ టోర్నమెంట్ ఫైనల్లో భారత్, బంగ్లాదేశ్ జట్లను సంయుక్త విజేతలుగా ప్రకటించారు. నిర్ణీత సమయం ముగిసేసరికి రెండు జట్లు 1-1తో సమంగా ముగిశాయి. అనంతరం విజేతను నిర్ణయించడానికి 'షూటౌట్' నిర్వహించారు. 'షూటౌట్'లో రెండు జట్ల నుంచి గోల్‌కీపర్లతో సహా 11 మంది చొప్పున గోల్స్ చేయడంతో 11-11తో సమమైంది. ఈ దశలో ఫలితం తేలేవరకు 'షూటౌట్'ను కొనసాగించాల్సి ఉండగా... టోర్నీ కమిషనర్ అనూహ్యంగా రెండు జట్ల కెప్టెన్‌లను పిలిచి, రిఫరీ సమక్షంలో 'టాస్' ద్వారా విజేతను నిర్ణయించారు. 'టాస్' నెగ్గడంతో టీమిండియా సంబరాలు చేసుకోగా... బంగ్లాదేశ్ బృందం మాత్రం ఈ ఫలితాన్ని నిరసిస్తూ మైదానంలోనే ఉండిపోయింది. గంటన్నర దాటినా వివాదం సద్దుమణగకపోవడంతో నిర్వాహకులు తమ నిర్ణయాన్ని మార్చుకొని చివరకు రెండు జట్లను సంయుక్త విజేతలుగా ప్రకటించారు.

ఒక వికెట్ తేడాతో...

- పాకిస్తాన్‌పై ఆస్ట్రేలియా విజయం
- అండర్-19 ప్రపంచకప్ ఫైనల్లో ఆసీస్
- ఆదివారం భారత్‌తో తుది పోరు

బెనోని (దక్షిణాఫ్రికా): అండర్-19 ప్రపంచకప్ రెండో సెమీఫైనల్ మ్యాచ్ కూడా తొలి సెమీస్‌లాగే ఉత్కంఠభరితంగా ముగిసింది. గురువారం జరిగిన ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఒక వికెట్ తేడాతో పాకిస్తాన్‌పై నెగ్గి ఈ టోర్నీ చరిత్రలో ఆరోసారి ఫైనల్‌కు చేరుకుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాక్ 48.5 ఓవర్లలో 179 పరుగులకు ఆలౌటైంది. అరాఫత్ (52; 9 ఫోర్లు), అజాన్ (52; 3 ఫోర్లు) అర్ధసెంచరీలు చేశారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' టామ్ స్ట్రాకర్ (6/24) పాక్‌ను దెబ్బ తీశాడు. అనంతరం ఆస్ట్రేలియా 49.1 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 181 పరుగులు సాధించి గెలిచింది. డిక్సన్ (50; 5 ఫోర్లు), ఒలీవర్ పీక్ (49; 3 ఫోర్లు) కీలక ఇన్నింగ్స్ ఆడారు. 9వ వికెట్ కోల్పోయిన తర్వాత ఆసీస్ చివరి 4 ఓవర్లలో విజయానికి 16 పరుగులు చేయాల్సి ఉంది. తొలి 3 ఓవర్లలో 13 పరుగులు వచ్చాయి. స్లో ఓవర్ రేట్ కారణంగా పెనాల్టీ విధించడంతో ఆఖరి ఓవర్ కోసం ఫైన్ లెగ్ వద్ద ఉన్న ఫీల్డర్‌ను పాక్ రింగ్ లోపలికి తీసుకురావాల్సి వచ్చింది. జీషాన్ వేసిన బంతిని బ్యాటర్ మెక్‌మిలన్ ఆడగా బంతి బ్యాట్ అంచుకు తాకి అదే ఫైన్ లెగ్ వైపు నుంచే బౌండరీ దాటింది. దాంతో ఆసీస్ కుర్రాళ్లు సంబరాలు చేసుకోగా, పాక్ బృందం నిరాశలో మునిగింది. ఆదివారం జరిగే తుది పోరులో భారత్‌తో ఆస్ట్రేలియా తలపడుతుంది.



స్ట్రాకర్

క్లుప్తంగా...

అడిక్షన్ ఫెసిలిటీ సెంటర్ ప్రారంభం

రాష్ట్రంలోనే ఏకైక కేంద్రం వరంగల్‌లో ఏర్పాటు

ఎంజీఎం: దేశవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 41 మద్యం మాదక ద్రవ్యాల బాధితుల చికిత్స కేంద్రాల (అడిక్షన్ ఫెసిలిటీ సెంటర్)ను కేంద్ర మంత్రి డాక్టర్ వీరేంద్రకుమార్ గురువారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో ఏకైక కేంద్రాన్ని వరంగల్ ఎంజీఎంలో 50 పడకలతో ఏర్పాటు చేశారు. ప్రారంభోత్సవానికి సీపీ అంబటి కిశోర్ ఝా, వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య, ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ ప్రత్యేక సందేశాన్ని పంపగా సూపరింటెండెంట్ చదివి వినిపించారు. అసెంబ్లీ సమావేశాల కారణంగా కేంద్ర ప్రారంభోత్సవానికి రాలేకపోయామని ఆమె పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీకి కట్టుబడి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి అడిక్షన్ ట్రీట్‌మెంట్ ఫెసిలిటీ సెంటర్ తెచ్చామని తెలిపారు. లక్షలాది మంది పేదలకు ఉచితంగా వైద్యసేవలందించేందుకు ఎంజీఎం ఆస్పత్రి తనకు ఎప్పుడూ ప్రత్యేకమేనని పేర్కొన్నారు. కేఎంసీలో మానసిక ఆరోగ్య విభాగం ఏర్పాటుకు రూ.12 కోట్లు విడుదల చేసేలా చర్యలు తీసుకుంటానని మంత్రి సురేఖ హామీ ఇచ్చారు.

జాతీయ స్థాయిలో ఉత్తమషెడ్‌గా కాజీపేట డీజిల్ లోకోషెడ్

అభినందించిన దక్షిణ మధ్య రైల్వే జీఎం



కాజీపేటరూరల్ : భారతీయ రైల్వేలో కాజీపేట డీజిల్ లోకోషెడ్ ఉత్తమ షెడ్‌గా ఎంపికైంది. లోకోల నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబరిచినందుకు, తక్కువ వైఫల్యాలను కలిగి జాతీయస్థాయి గుర్తింపు పొందినట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. భారతీయ రైల్వేలో కాజీపేట డీజిల్ లోకోషెడ్, ఏపీలోని గుత్తి డీజిల్ లోకోషెడ్‌లు ఉత్తమ షెడ్లుగా ఎంపికైనట్లు తెలిపారు. భారతీయ రైల్వేలో మొత్తం 50 డీజిల్ షెడ్లు ఉండగా కాజీపేటకు ప్రత్యేక గుర్తింపు రావడంతో అధికారులు, కార్మికులు ఎంతో సంతోషంగా ఉన్నారు. సిబ్బందిని దక్షిణమధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ ప్రత్యేకంగా అభినందించారు.

విశ్వకర్మ నోడల్ అథారిటీగా పంచాయతీ కార్యదర్శులు

ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన అమలుకు సంబంధించి గ్రామపంచాయతీల్లో నోడల్ /డిజిగ్నేటెడ్ అథారిటీగా పంచాయతీ కార్యదర్శులను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. కేంద్ర ఎంఎస్‌ఎంఈ డెవలప్‌మెంట్ కమిషనర్ ఈ పథకం మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వ స్టేట్ మానిటరింగ్ కమిటీ (ఎస్ఎంసీ), డిస్ట్రిక్ట్ ఇంప్లిమెంటేషన్ కమిటీ (డీఐసీ)లను ఏర్పాటుచేసి ఈ పథకం అమలయ్యేలా చూడాలని గురువారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ అనితా రామచంద్రన్ ఉత్తర్వులు జారీచేశారు. ఈనెల 1వ తేదీతో సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిన నేపథ్యంలో ఈ పథకం కింద అందిన దరఖాస్తులు,పెండింగ్ అప్లికేషన్ల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేసేందుకు పంచాయతీ కార్యదర్శులకు బాధ్యతలు కట్టబెట్టేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు అనుమతి ఇవ్వాల్సిందిగా కేంద్ర ఎంఎస్‌ఎంఈ శాఖకు రాష్ట్ర ప్రభుత్వం ఇదివరకే విజ్ఞప్తి చేసింది. ఈ నేపథ్యంలో ఈ పథకం అమలు బాధ్యతను పంచాయతీ కార్యదర్శులకు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

శివ బాలకృష్ణపై ఈడీ.. ఐటీ?

హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ అవినీతి వ్యవహారంపై ఆరా తీస్తున్న రెండు దర్యాప్తు సంస్థలు

రూ.250 కోట్ల మేర ఆస్తులు కూడబెట్టినట్టు గుర్తించిన ఏసీబీ

ఏసీబీని వివరాలు కోరనున్న ఈడీ, ఐటీ అధికారులు



శివ బాలకృష్ణ

సాక్షి, హైదరాబాద్: హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివ బాలకృష్ణ అవినీతి భాగోతంపై త్వరలోనే ఇన్‌కమ్‌ట్యాక్స్ (ఐటీ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)అధికారులు రంగంలోకి దిగనున్నట్టు తెలిసింది. అధికార దుర్వినియోగం, అడ్డగోలు అనుమతుల జారీతో దాదాపు రూ.250 కోట్ల మేర ఆస్తులను శివబాలకృష్ణ కూడబెట్టినట్టు ఏసీబీ అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ మొత్తం వ్యవహారంలో మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేసేందుకు ఈడీ అధికారులు సిద్ధమవుతున్నట్టు తెలిసింది. అదేవిధంగా ఐటీ అధికారులు సైతం ఏసీబీ నుంచి ఈ కేసు వివరాలు తీసుకోనున్నట్టు సమాచారం. అతనిపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్ కాపీ, కేసు దర్యాప్తులో గుర్తించిన అక్రమాస్తుల వివరాలను ఈ రెండు దర్యాప్తు సంస్థలు ఏసీబీ నుంచి తీసుకోనున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే ఏసీబీ దర్యాప్తులో కీలక అంశాలు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో ఇప్పుడు ఈడీ, ఐటీ రంగంలోకి దిగితే మరిన్ని కొత్త విషయాలు తెలిసే అవకాశం ఉన్నట్టు చర్చ జరుగుతోంది.

మరో ఇద్దరు బినామీల అరెస్టుకు రెడీ!

శివబాలకృష్ణ తన అక్రమార్జనలో ఎక్కువ భాగం తన కుటుంబ సభ్యులు, ఇతర బినామీల పేరిట ఉంచినట్టు ఏసీబీ అధికారులు ఇప్పటికే కీలక ఆధారాలు సేకరించారు. శివబాలకృష్ణకు ప్రధాన బినామీగా ఉన్న ఆయన సోదరుడు శివనవీన్ కుమార్‌ను ఏసీబీ మంగళవారం రాత్రి అరెస్టు చేసిన విషయం తెలిసిందే. శివబాలకృష్ణ బినామీలుగా ఉన్న మరో ఇద్దరిని అరెస్టుకు రంగం సిద్ధం చేశారు. మరోవైపు శివ నవీన్‌కుమార్ కస్టడీ కోసం ఏసీబీ అధికారులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

హెచ్ఎండీఏలో ముగిసిన ఏసీబీ సోదాలు

హెచ్ఎండీఏలో ఏసీబీ సోదాలు ముగిశాయి. మూడు రోజుల పాటు వివిధ జోన్‌లకు చెందిన ఫైళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేసిన ఏసీబీ అధికారులు 4వ రోజు గురువారం పంచనామా నిర్వహించారు. ఈ నాలుగు రోజుల్లో శంకర్‌పల్లి, శంషాబాద్, ఘట్కేసర్ జోన్‌ల పరిధిలోని సుమారు 120 ఫైళ్లను పరిశీలించారు. వాటిలో కీలకమైన వాటిని తమ వెంట తీసుకెళ్లినట్లు తెలిసింది. ముఖ్యంగా శివబాలకృష్ణ హెచ్ఎండీఏ నుంచి రెరాకు బదిలీ అయిన తరువాత కూడా పాత తేదీలతో పెద్ద ఎత్తున భూమార్పిడి అనుమతులను ఇవ్వడాన్ని ఏసీబీ సీరియస్‌గా పరిగణిస్తోంది. జీవో 111 పరిధిలో కన్జర్వేషన్ జోన్‌లో ఉన్న భూములను రెసిడెన్షియల్, కమర్షియల్ జోన్‌లకు మారుస్తూ అనుమతులను ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. పుప్పాలగూడ నుంచి వట్టినాగులపల్లి వరకు వివిధ ప్రాంతాల్లో వందల ఎకరాలను ఇలా అడ్డగోలుగా మార్చేసినట్లు తెలిసింది. అలాగే ఘట్‌కేసర్, శంషాబాద్ జోన్‌లలో ఇచ్చిన మరి కొన్ని అనుమతులపైన కూడా ఏసీబీ అధికారులు దృష్టి సారించారు.

అలా ఎలా అనుమతులిచ్చారని నిలదీసిన ఏసీబీ

నీటివనరులు ఉన్న ప్రాంతాల్లో భవన నిర్మాణాలకు, లే అవుట్‌లకు అనుమతులను ఇచ్చేందుకు కొందరు ప్లానింగ్ అధికారులు మొదట నిరాకరించినా ఆ తరువాత ఆ అధికారులే తిరిగి అనుమతులను ఎందుకిచ్చారని ఏసీబీ వర్గాలు ప్రశ్నించినట్లు తెలిసింది. 'వాళ్లకు అనుమానం వచ్చిన ప్రతి ఫైల్‌ను పోస్టుమార్టం చేశారు. అనేక రకాల సందేహాలను వ్యక్తం చేశారు. అన్నింటికీ మా వైపు నుంచి సమాధానాలు చెప్పాం.'అని ఒక ప్లానింగ్ అధికారి తెలిపారు.'ప్రతి ఫైల్ పరిష్కారంలో పై అధికారుల సూచనలు, సలహాలు, దిశా నిర్దేశం మేరకే పని చేశాం.'అని మరో ప్లానింగ్ అధికారి వివరించారు. డైరెక్టర్ స్థాయిలో ఉన్న బాలకృష్ణ ఆదేశాలను తప్పకుండా పాటించవలసి వచ్చిందని చెప్పుకొచ్చారు.

ఆ ఏపీఓలపై ఏసీబీ కన్ను

ఏసీబీ అధికారులు తమ వెంట తీసుకెళ్లిన ఫైళ్ల కారణంగా ఎలాంటి ఉపద్రవం ముంచుకొస్తుందోనని కొందరు ప్లానింగ్ అధికారులు, ఏపీఓలు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే ఒకరిద్దరు ఏపీఓలు బాలకృష్ణకు అన్నివిధాలుగా సహకరించి అక్రమార్జనలో శివబాలకృష్ణకు పోటీపడినట్లు ఏసీబీ అధికారులు గుర్తించినట్లు తెలిసింది.

తెర వెనుక సూత్రధారులెవరు?

అసలు శివ బాలకృష్ణ తెరవెనుక ఉండి.. ఆయనను నడిపించిందెవరు అనేది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఒక డైరెక్టర్ స్థాయిలో ఇష్టారాజ్యంగా అనుమతులనివ్వడం అసాధ్యం. భూమి జోన్ మార్పునకు సంబంధించిన అనుమతులకు కమిటీ ఆమోదం తప్పనిసరి. ఈ కమిటీలో ఐఏఎస్ అధికారులతో పాటు మున్సిపల్‌శాఖ మంత్రి కూడా ఉంటారు. రూ.వందల కోట్ల విలువైన భూములను కన్జర్వేషన్ జోన్ నుంచి రెసిడెన్షియల్ జోన్‌లోకి మార్చేందుకు సదరు కమిటీ సమావేశంలోనే నిర్ణయం తీసుకుంటారు. కానీ ఇలాంటి ఫైళ్లు పదుల కొద్దీ ఎలాంటి సమావేశాలు లేకుండానే ఎడాపెడా ఇచ్చేశారు. ఈ క్రమంలో కింది నుంచి పై వరకు భారీ మొత్తంలో చేతులు మారాయి. కానీ చివరకు బాలకృష్ణ మాత్రం మూల్యం చెల్లించుకోవలసి వచ్చిందని హెచ్ఎండీఏ అధికారి ఒకరు అభిప్రాయపడ్డారు. ఈ అక్రమ అనుమతులను మరింత లోతుగా, సమగ్రంగా అధ్యయనం చేస్తే తెరవెనుక ఉన్న కీలకమైన వ్యక్తులు కూడా బయటకు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. 'ప్రతి చేంజ్ ఆఫ్ లాండ్ యూజ్ వెనుక వాళ్లు ఉన్నారు. వారిచ్చే ఆదేశాల మేరకే బాలకృష్ణ పని చేసి తన వాటా తాను పొందాడు. 'అని హెచ్ఎండీఏ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఈ క్రమంలో 'వాళ్లు'ఎవరనేది ఇప్పుడు చర్చనీయాంశమైంది.

'గురుకుల'కు ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల

నేటి నుంచి ధ్రువపత్రాల పరిశీలన

- ఈనెల 10 నుంచి 13 వరకు డెమో పరీక్షల నిర్వహణకు టీఆర్ఈఐఆర్‌బీ నిర్ణయం
- ఈనెల 14న వివిధ కేటగిరీల్లో ఎంపికైన అభ్యర్థులకు నియామకపత్రాలు జారీ
- పాఠశాలలు, కాలేజీల్లో లైబ్రేరియన్, ఫిజికల్ డైరెక్టర్, పీజీటీ పోస్టుల ప్రాథమిక జాబితాలు విడుదల
- 1:2 నిష్పత్తిలో అభ్యర్థుల ఎంపిక... అర్హతల ఆధారంగా నిర్ధారణ

సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యా సంస్థల్లో వివిధ కేటగిరీల్లో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల ప్రాథమిక జాబితాను తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు విడుదల చేసింది. గురువారం తెల్లవారుజామున 3గంటల సమయంలో సంక్షేమ గురుకుల డిగ్రీ కాలేజీల్లోని ఫిజికల్ డైరెక్టర్లు(పీడీ), లైబ్రేరియన్ ఉద్యోగాలకు, సంక్షేమ గురుకుల జూనియర్ కాలేజీల్లో ఫిజికల్ డైరెక్టర్లు(పీడీ), లైబ్రేరియన్ ఉద్యోగాలకు సంబంధించి 1:2 నిష్పత్తిలో ప్రాథమిక జాబితాలను టీఆర్ఈఐఆర్‌బీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. అదేవిధంగా గురువారం రాత్రి గురుకుల పాఠశాలల్లోని ఫిజికల్ డైరెక్టర్లు(పీడీ), లైబ్రేరియన్, పోస్టుగ్రాడ్యుయేట్ టీచర్(పీజీటీ) ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను విడుదల చేసిన టీఆర్ఈఐఆర్‌బీ.... వాటిని బోర్డు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. 1:2 నిష్పత్తిలో అర్హత సాధించిన అభ్యర్థులకు గురుకుల బోర్డు ఫోన్‌లలో సంక్షిప్త సమాచారం(ఎస్ఎంఎస్) ద్వారా సమాచారంఇచ్చింది. సాంకేతిక కారణాలతో టీఆర్ఈఐఆర్‌బీ వెబ్‌సైట్ మొరాయించడంతో అభ్యర్థులు జాబితాలను పరిశీలించుకునేందుకు ఇబ్బందులు పడ్డారు. గురువారం సాయంత్రం తర్వాత వెబ్‌సైట్‌లో సాంకేతిక సమస్యలు అధిగమించడంతో వెబ్‌సైట్ తిరిగి తెరుచుకుంది.

నేటి నుంచి ధ్రువపత్రాల పరిశీలన...

ఫిజికల్ డైరెక్టర్, లైబ్రేరియన్ ఉద్యోగాలకు సంబంధించి టీఆర్ఈఐఆర్‌బీ 1:2 నిష్పత్తిలో విడుదల చేసిన ప్రాథమిక జాబితాలో ఉన్న అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియను శుక్రవారం నుంచి ప్రారంభించనుంది. వివిధ కేటగిరీల్లో ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 9వ తేదీన ఉదయం 9గంటల నుంచి చైతన్యపురి లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల న్యాయ కళాశాల(ఉమెన్)లో ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభం కానుంది. అభ్యర్థులు అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాటు రెండు సెట్ల జిరాక్సుపత్రాలు, సెల్ఫ్ అటెస్టేషన్ పత్రంతో హాజరు కావాల్సి ఉంటుంది. చెక్‌లిస్టును బోర్డు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని గురుకుల బోర్డు కన్వీనర్ అభ్యర్థులకు సూచించారు.

10 నుంచి డెమో పరీక్షలు...

ప్రస్తుతం విడుదల చేసిన 1:2 జాబితాల్లో ఎంపికైన అభ్యర్థులకు డెమో పరీక్షలను గురుకుల బోర్డు నిర్వహించేందుకు కసరత్తు వేగవంతం చేసింది. గురుకుల జూనియర్ కాలేజీలు, డిగ్రీ కాలేజీలకు సంబంధించి ఫిజికల్ డైరెక్టర్, లైబ్రేరియన్ ఉద్యోగాలకు అదేవిధంగా పాఠశాలల్లో ఫిజికల్ డైరెక్టర్ ఉద్యోగాలకు ప్రాథమికంగా అర్హత సాధించిన అభ్యర్థులకు ఈనెల 10వ తేదీ నుంచి డెమో పరీక్షలు నిర్వహిస్తారు. తుది జాబితాలో అర్హత సాధించిన వారికి ఈనెల 14వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక ఉత్తర్వులు ఇచ్చేందుకు సంక్షేమ శాఖల అధికారులు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం.

తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి సిద్ధం

సెంటర్ ఫర్ స్ట్రాటజీస్ ఛైర్మన్ రిచర్డ్ రసో

డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి ఉత్తమ్‌తో భేటీ



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి ఆసక్తిగా ఉన్నట్టు ఉన్నట్టు అమెరికాలోని వాషింగ్టన్ డీసీ కేంద్రంగా పనిచేస్తున్న సెంటర్ ఫర్ స్ట్రాటజీస్ ఛైర్మన్ రిచర్డ్ రసో తెలిపారు. భారత్‌లోని అనేక రాష్ట్రాల్లో తమ సంస్థ విద్యుత్ రంగంలో పలు కార్యకలాపాలు నిర్వహిస్తోందని చెప్పారు. ఆయన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమారరెడ్డిని గురువారం సచివాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిస్కమ్‌లలో సంస్కరణలు, ప్రైవేట్ డిస్కంలు, ఎనర్జీ స్టోరేజ్, విద్యుత్ సామర్థ్యం పెంపు తదితర అంశాల్లో తమకున్న అనుభవాన్ని తెలిపారు. రాష్ట్రంలోని నిరుపేదలకు ఉచితంగా లేదా అత్యంత తక్కువ ధరకు సౌర విద్యుత్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు సెంటర్ ఫర్ స్ట్రాటజీస్ సంస్థ లేదా అమెరికాలోని ఎన్జీవోలు ఏ మేరకు ఆసక్తిగా ఉన్నాయని రిచర్డ్‌ను అడిగి మంత్రులు తెలుసుకున్నారు. సౌర, పవన విద్యుత్ లాంటి ప్రత్యామ్నాయ విద్యుదుత్పత్తి రంగాల్లో కలిసి పనిచేయడానికి ఆసక్తితో ఉన్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని విద్యుత్ సంస్థలు గత ప్రభుత్వ హయాంలో ఎక్కువ వడ్డీ రేటుకు రుణాలు తీసుకున్నాయని, ఈ రంగంలో అది తక్కువ వడ్డీ రేటుకు పెట్టుబడి సాయం అందించగలిగితే రాష్ట్ర ప్రభుత్వం గ్యారంటీ ఇస్తుందని రిచర్డ్‌కు మంత్రి ఉత్తమ్ వివరించారు.



ఫొటోలోని సీన్‌ను గుర్తుపట్టారా.. అవును.. మీరు సరిగానే గుర్తుపట్టారు.. కాంతారా.. ఈ చిత్రాన్ని యూఏఈకి చెందిన భారతీయ సంతతి ఫొటోగ్రాఫర్ వినయ్ మోహన్ కర్ణాటకలో తీశారు. ప్రతిష్టాత్మక సోనీ వరల్డ్ ఫొటోగ్రఫీ పురస్కారాలు–2024లో దేశాలవారీగా విజేతలను తాజాగా ప్రకటించారు. యూఏఈకి సంబంధించి ఇది నేషనల్ విన్నర్‌గా ఎంపికైంది. ఈ పోటీకి 220 దేశాల నుంచి 3,95,000 ఎంట్రీలు రాగా.. ఇప్పుడు నేషనల్ విన్నర్స్ జాబితాను ప్రకటించారు. **ఓవరాల్ విన్నర్స్‌ను ఏప్రిల్ 18న ప్రకటిస్తారు.**



గిన్నిస్ రికార్డు లక్ష్యంగా ఏకంగా 8 ఏళ్ల కష్టపడి.. 7,06,900 అగ్గిపుల్లలు ఉపయోగించి 23.6 అడుగుల ఐఫిల్ టవర్ మోడల్ తయారుచేశాడు పశ్చిమ ఫ్రాన్స్‌కు చెందిన రిచర్డ్ ప్లాడ్. గిన్నిస్ బుక్ వాళ్లకు కబురెట్టాడు.. అంతలో.. ఈ మోడల్‌ను ఎగ్జిబిషన్‌కు పెట్టాడు.. చూసినోళ్లంతా సూపర్ అన్నారు. రికార్డు పక్కా అన్నారు.. ఇంతలో గిన్నిస్ వాళ్లొచ్చారు.. అగ్గిపుల్లల ఐఫిల్‌ను చూశారు.. 'అగ్గి' లేదన్నారు.. పూచిక పుల్లలా తీసిపారేశారు. గిన్నిస్ రికార్డు ఇవ్వమనేశారు. ఎందుకో తెలుసా?

గిన్నిస్ బుక్ రూల్స్ ప్రకారం.. రికార్డు కోసం వాడే అగ్గిపుల్లలు తప్పనిసరిగా మార్కెట్లో దొరికేలా ఉండాలట. ఇక్కడ రిచర్డ్ ఏంచేశాడంటే.. ఐఫిల్ టవర్ రూపొందించేముందు.. ప్రతి అగ్గిపుల్ల మొనన ఉండే సల్ఫర్ మిశ్రమాన్ని తీయడమే తనకు పెద్ద పని అని ఆలోచించి.. అగ్గిపెట్టెల కంపెనీతో మాట్లాడుకుని.. అవి లేని పుల్లలను సరఫరా చేయమన్నాడు. వాటినే వాడాడు. గిన్నిస్ వాళ్లు కూడా రూల్స్ పుస్తకం వాడారు.

రికార్డుకు ఇది పనికిరాదని తేల్చారు. పాపం.. రిచర్డ్..

17 సీట్లలో ఒంటరిగా పోటీ

- తెలంగాణలో ఎవరితోనూ పొత్తులుండవు: కిషన్‌రెడ్డి స్పష్టీకరణ



సాక్షి, న్యూఢిల్లీ: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా తెలంగాణలోని 17 ఎంపీ స్థానాల్లో ఒంటరిగా పోటీ చేస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చెప్పారు ఎవరితోనూ పొత్తులు ఉండబోవని స్పష్టం చేశారు. పార్లమెంట్ ఎన్నికలపై బీజేపీ కేంద్ర నాయకత్వంతో ప్రాథమిక చర్చలు పూర్తయ్యాయని, అభ్యర్థుల ఎంపికపై ఇప్పటికే కసరత్తు మొదలుపెట్టామని తెలిపారు. అందులో భాగంగా శుక్రవారం ఢిల్లీలో బీజేపీ రాష్ట్ర ఎన్నికల కమిటీ సమావేశం ఏర్పాటు చేశామని చెప్పారు. గురువారం ఢిల్లీలోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో వాతావరణం బీజేపీకి చాలా అనుకూలంగా ఉందని, అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ఓటేసిన వారు సైతం ఇప్పుడు బీజేపీకి అనుకూలంగా ఉన్నారని కిషన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్‌కు ఓటేసినా, బీఆర్ఎస్‌కు ఓటేసినా ఒకటే అని.. ఈ రెండు పార్టీలు డూప్ ఫైట్ చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నాయని విమర్శించారు. ప్రస్తుతం దేశంలో తెలంగాణ సహా చాలా కొద్ది రాష్ట్రాల్లో మాత్రమే కాంగ్రెస్ పోటీలో ఉందని, బీఆర్ఎస్ అరకొరగా ఒక సీటు గెలిచినా ఉపయోగం లేదని ఎద్దేవా చేశారు. హైదరాబాద్ సీటు కూడా బీజేపీ గెలుచుకునేలా క్షేత్రస్థాయిలో గట్టిగా పనిచేస్తామని స్పష్టం చేశారు.

ప్రజాసేవ చేయాలనుకునేవారు రావొచ్చు..

ప్రజలకు సేవ చేయాలనుకునే నేతలందరినీ బీజేపీలోకి సగౌరవంగా ఆహ్వానిస్తున్నామని కిషన్‌రెడ్డి చెప్పారు. అన్ని వర్గాల నుంచి బీజేపీలో చేరేందుకు ఉత్సాహంగా వస్తున్నారని తెలిపారు. అధికారంలోకి వస్తే బీఆర్ఎస్ అవినీతిపై సీబీఐ దర్యాప్తు జరిపిస్తామని ఎన్నికలకు ముందు చెప్పిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు ఎందుకు మిన్నకుండి పోయిందని ప్రశ్నించారు.

నేటి నుంచి పుస్తకాల పండుగ

- ప్రారంభించనున్న మంత్రి జూపల్లి కృష్ణారావు
- 9 నుంచి 19 వరకు జరగనున్న బుక్ ఎగ్జిబిషన్



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ 36వ జాతీయ పుస్తక ప్రదర్శన శుక్రవారం ఎన్టీఆర్ స్టేడియంలో ప్రారంభం కానుంది. 9వ తేదీ నుంచి 19 వరకు 10 రోజుల పాటు జరిగే ఈ పుస్తక ప్రదర్శనలో పలు జాతీయ, అంతర్జాతీయ ప్రచురణ సంస్థలు పాల్గొననున్నాయి. ఈ ఏడాది 365 స్టాళ్లను ఏర్పాటు చేసినట్లు హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షుడు జూలూరి గౌరీశంకర్ తెలిపారు. ఈ మేరకు ఎన్టీఆర్ స్టేడియంలోని పుస్తక ప్రదర్శన ప్రాంగణంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పుస్తక ప్రదర్శనకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. శుక్రవారం సాయంత్రం 5 గంటలకు సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ పుస్తక ప్రదర్శనను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ ప్రదర్శనలో భాగంగా 10వ తేదీ నుంచి 18 వరకు సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. పుస్తక ప్రదర్శన ప్రాంగణానికి ప్రజాయుద్ధ నౌక గద్దర్, సాహిత్య వేదికకు రవ్వా శ్రీహరి, ప్రవేశ ద్వారానికి ఉర్దూ దినపత్రిక సియాసత్ మాజీ ఎండీ జహీరొద్దీన్ అలీ ఖాన్ పేర్లు పెట్టినట్లు ఆయన వివరించారు. అదేవిధంగా పుస్తక ప్రదర్శన ప్రాంగణంలో తెలంగాణ అమర వీరుల స్మారక స్తూపాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్ కార్యదర్శి ఆర్.వాసు మాట్లాడుతూ...పిల్లలకు, ఉపాధ్యాయులకు, జర్నలిస్టులకు ప్రవేశం ఉచితమని చెప్పారు.

గురుకులంలో కొట్లాట.. విద్యార్థి మృతి

- చించోలి(బి) మైనార్టీ రెసిడెన్షియల్‌లో ఘటన
- కుటుంబసభ్యుల ఆందోళనతో ఉద్రిక్తత



మృతిచెందిన అర్బాజ్ అహ్మద్

సారంగపూర్: గురుకులంలో ఇద్దరు విద్యార్థుల మధ్య జరిగిన కొట్లాట ఒక నిండు ప్రాణాన్ని తీసింది. పోలీసులు, సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా సారంగపూర్ మండలం చించోలి(బి) శివారులోని తెలంగాణ మైనార్టీ గురుకులంలో గురువారం రాత్రి విద్యార్థుల మధ్య గొడవ మొదలైంది. ఈ ఘటనలో పదో తరగతి విద్యార్థి అర్బాజ్ అహ్మద్(15) మృతిచెందాడు. ఇందుకు నిర్మల్‌లోని గాజుల్‌పేటకు చెందిన అదే తరగతి విద్యార్థి(15) కారణంగా చెబుతున్నారు. మృతిచెందిన అహ్మద్‌ది ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం మల్యాల. కాగా, మృతి ఘటనకు బాధ్యుడిగా భావిస్తున్న బాలుడిని పోలీసులు తరలిస్తుండగా మృతిచెందిన విద్యార్థి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో ఒక్కసారిగా అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సారంగపూర్ పోలీసులు వెంటనే అదుపుచేశారు.

హైదరాబాద్‌లో ఎన్ఐఏ సోదాలు

- వీక్షణం ఎడిటర్ ఎన్.వేణుగోపాల్ ఇంట్లో తనిఖీలు
- పౌరహక్కుల నేత రవిశర్మ ఇంట్లోనూ సోదాలు
- మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయన్న ఆరోపణలతోనే..
- పలు పత్రాలు, ఫోన్లు స్వాధీనం
- 10న విచారణకు హాజరు కావాలని ఆదేశం



పౌరహక్కుల నేత రవిశర్మ నివాసంలో సోదాలు నిర్వహించి బయటకు వస్తున్న ఎన్ఐఏ అధికారులు

సాక్షి, హైదరాబాద్: మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలతో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అధికారులు గురువారం హైదరాబాద్‌లో వీక్షణం పత్రిక ఎడిటర్, వరవరరావు అల్లుడు ఎన్. వేణుగోపాల్‌తోపాటు రచయిత, పౌరహక్కుల నేత రవిశర్మ నివాసాల్లో సోదాలు జరిపారు. తెల్లవారుజామున 4 గంటలకే హిమాయత్‌నగర్‌లోని ఎన్. వేణుగోపాల్ ఇంటితోపాటు ఎల్బీ నగర్ శ్రీనివాసనగర్ కాలనీలోని రవిశర్మ ఇంట్లో సోదాలు నిర్వహించారు. పలు పుస్తకాలు, కొన్ని అనుమానాస్పద డాక్యుమెంట్లు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 10న గచ్చిబౌలిలోని ఎన్ఐఏ కార్యాలయానికి విచారణ కోసం హాజరుకావాలని నోటీసులు ఇచ్చారు.

ఆ కేసు ఆధారంగా దర్యాప్తు...

మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడు సంజయ్ దీపక్‌రావును గతేడాది సెప్టెంబర్ 15న కూకట్‌పల్లి పీఎస్ పరిధిలోని మలేసియా టౌన్‌షిప్‌లో సైబరాబాద్ పోలీసులు, తెలంగాణ ఇంటెలిజెన్స్ సిబ్బంది అరెస్ట్ చేశారు. ఆ ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈ ఏడాది జనవరి 3న ఎన్ఐఏ అధికారులు మరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. సంజయ్ దీపక్‌రావుతో ఎన్. వేణుగోపాల్, రవిశర్మకు సంబంధాలు ఉన్నాయనే ఆరోపణల దృష్ట్యానే ఈ సోదాలు జరిగినట్లు సమాచారం. ఈ కేసులో వేణుగోపాల్‌ను 22వ నిందితుడిగా పేర్కొన్న ఎన్ఐఏ... రవిశర్మతోపాటు కేరళకు చెందిన మరో ముగ్గురిని సైతం నిందితులుగా చేర్చింది. కబలి దళం పేరిట సమావేశాలు నిర్వహించి ప్రభుత్వాన్ని కూలగొట్టడానికి ప్రయత్నించినట్లు ఎఫ్ఐఆర్‌లో ఆరోపించింది. ఇదే కేసు దర్యాప్తులో భాగంగా గురువారం తెలంగాణతో పాటు మహారాష్ట్ర, తమిళనాడు, కేరళలోనూ సోదాలు నిర్వహించినట్టు ఎన్ఐఏ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ సోదాల్లో మావోయిస్టు సాహిత్యంతో పాటు ఆరు సెల్‌ఫోన్లు, రూ. 1,37,210 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎన్ఐఏ అధికారులు పేర్కొన్నారు.

పౌరహక్కుల సంఘాల ఖండన

వేణుగోపాల్, రవిశర్మ ఇళ్లపై ఎన్ఐఏ దాడులను పౌరహక్కుల సంఘాల నాయకులు ఖండించారు. కేంద్ర దర్యాప్తు సంస్థలు ఇష్టానుసారంగా దాడులు చేయకుండా సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు ఇవ్వాలని ప్రొఫెసర్ హరగోపాల్ డిమాండ్ చేయగా అక్రమ కేసులు ఎత్తివేయాలని, ఉపా చట్టాన్ని రద్దు చేయాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి ఎన్ నారాయణరావు డిమాండ్ చేశారు. నిర్బంధ వ్యతిరేక వేదిక తెలంగాణ సైతం ఈ అరెస్టులను ఖండించింది.

విచారణకు హాజరవ్వాలన్నారు: రవిశర్మ



మన్సూరాబాద్: రవిశర్మ మీడియాతో మాట్లాడుతూ 10న విచారణకు హాజరుకావాలని ఎన్ఐఏ అధికారులు ఆదేశించారని చెప్పారు. 2016లో జనజీవన స్రవంతిలో కలిసినప్పటి నుంచి తాను ఎలాంటి మావోయిస్టు కార్యకలాపాల్లో పాల్గొనడం లేదని స్పష్టం చేశారు. 2019లో స్థానిక పోలీసులు, 2021లో ఎన్ఐఏ అధికారులు తన ఇంట్లో సోదాలు చేసినా ఎలాంటి ఆధారాలు లభించలేదని గుర్తుచేశారు.

ఇది పూర్తిగా అబద్ధపు కేసు: ఎన్.వేణుగోపాల్



ఎన్ఐఏ అధికారులు తనపై నమోదు చేసినది పూర్తిగా అబద్ధపు కేసని వీక్షణం పత్రిక ఎడిటర్ ఎన్. వేణుగోపాల్ ఆరోపించారు. 'నేను ఒక మాస పత్రిక నడుపుతున్నాను. నేను ప్రస్తుతం విరసంలో లేను'అని మీడియాకు విడుదల చేసిన ఓ వీడియోలో ఆయన పేర్కొన్నారు. 2013లో నయీం బెదిరింపు లేఖలపై తాను రాసిన పుస్తకాలను ఎన్ఐఏ అధికారులు స్వాధీనం చేసుకున్నారన్నారు. తన మొబైల్ ఫోన్‌ను సీజ్ చేశారని, ఈ నెల 10న విచారణకు హాజరుకావల్సిందిగా నోటీసులు ఇచ్చారని వేణుగోపాల్ పేర్కొన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.